సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 262
శనివారం 13-12-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్

● ముగ్గు-ముచ్చట

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దాల్సిన అందమైన రంగవల్లులను... తమకు వచ్చిన ముగ్గులను ఆడపడచులందరూ ఒకరితో ఒకరు పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● సంరక్షణ

మతిమరుపు, అల్జైమర్స్, మనస్తాపం, ప్రమాదాలు... ఇంట్లో పెద్దవాళ్లు కనపడకుండా పోవడానికి ఎన్నో కారణాలు. వారిని పట్టుకోవడం ఎలా? రెండు రోజుల క్రితం ముంబైలో 79 ఏళ్ల వృద్ధురాలు కనపడకుండా పోతే మనవడు ఆమె మెడ గొలుసులో బిగించిన జి.పి.ఎస్.ను యాక్టివేట్ చేసి ఆమె ఆ దాపున ఉన్న ఆస్పత్రిలో స్పృహ లేకుండా పడి ఉందని తెలుసుకున్నాడు. వయో వృద్ధులు తప్పి పోతే వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి మార్కెట్లో జి.పి.ఎస్. ట్రాకర్లు ఉన్నాయి. రోజులు బాగలేని ఈ కాలంలో వీటి అవసరం ఎక్కువగా ఉంది.

పెద్దవారికీ కావాలి జి.పి.ఎస్.

ముంబయికి చెందిన 79 ఏళ్ల సైరాబీ ఇటీవల ఒక రోజు ఈవెనింగ్ వాక్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అలా వెళ్లిన మనిషి తిరిగి రాలేదు. ఏమయ్యారో తెలీదు. చుట్టుపక్కల ప్రాంతాలు వెతికినా కనిపించలేదు. సైరాబీని ఓ బైక్ గుద్దేయడంతో ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఒంటరిగా బయటకు వచ్చిన ఆమె వివరాలు అక్కడున్న ఎవరికీ తెలియలేదు. అయితే ఆమె ఆచూకీ ఎక్కడుందో ఇంటి వారిని పట్టిచ్చింది ఆమె మెడలో ధరించిన నెక్లెస్‌లోని జీపీఎస్.

మనవడి ముందు చూపు

వయసులో పెద్దవారు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోతే ఆందోళనగానే ఉంటుంది. మార్గమధ్యంలో వారికేమైందని కలవరం మొదలవుతుంది. సైరాబీ ఇంట్లో అదే పరిస్థితి నెలకొంది. అయితే ఆమె మనవడు మహమ్మద్ వసీం ఆమె వేసుకున్న నెక్లెస్‌లో రహస్యంగా జీపీఎస్ ట్రాకర్ ఇన్‌స్టాల్ చేశాడన్న విషయం ఎవరికీ తెలియదు. వృద్ధులు రకరకాల కారణాల వల్ల ఇల్లు విడిచి పెట్టి వెళుతుంటారు. లేదా దారి తప్పుతుంటారు. అందుకే మనవడు ముందు చూపుతో ట్రాకర్ అమర్చాడు. ఆ పని మేలు చేసింది. మనవడు వెంటనే ట్రాకర్ స్విచ్ ఆన్ చేయగా, వారింటికి 5 కి.మీల దూరంలో ఉన్న కేఈఎమ్ ఆసుపత్రిని చూపించింది. దీంతో వెంటనే కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమె తలకు గాయమైందని, ఆరోగ్యం కుదురుగా ఉందని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఇలా నిత్యం అనేక మంది వృద్ధులు తప్పిపోయి ఆచూకీకి దూరమవుతున్నారు. అటువంటి వారికి జీపీఎస్ ట్రాకర్ మేలు చేస్తోంది.

ధరలు అందుబాటులోనే..

జీపీఎస్ ట్రాకర్ నెక్లెస్ ధరలు అందుబాటులోనే ఉంటాయి. బేసిక్ ట్రాకింగ్ నెక్లెస్ కనీస ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల దాకా ఉంటుంది. మధ్యస్థ స్థాయిలో రూ.6 వేల నుంచి రూ.10 వేల దాకా ఉంటుంది. ఎక్కువ ఆప్షన్స్ ఉన్న హైఎండ్ ట్రాకర్ కావాలంటే రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

నెక్లెస్ జీపీఎస్ ట్రాకర్

'నెక్లెస్ జీపీఎస్ ట్రాకర్' ఇటీవల కాలంలో అనేకమందికి చేరువైంది. నగలకుండే లాకెట్‌ల లోపల ఇమడ్చగలిగే ఈ చిన్న పరికరం మనం ఎక్కడున్నది, ఎక్కడికి వెళ్తున్నది స్మార్ట్ ఫోన్ ద్వారా ట్రాక్ చేస్తుంది. పైకి మామూలు నగలలాగే కనిపిస్తూ ఉండటం వల్ల అలంకరణకూ లోటూ ఉండదు. ఒంటరిగా బయటకు వెళ్లే మహిళలు, చిన్నారులు, వృద్ధులు, మతిమరుపు కలిగిన వారు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలున్న వారికి ఇది చాలా ఉపకరించే పరికరం. వాళ్లు ఎక్కడైనా తప్పిపోయినా, జరగరానిది జరిగినా, అపహరణకు గురైనా వెంటనే ఆచూకీ తెలుసుకోవచ్చు. ఒంటరిగా దూరప్రయాణాలు చేసేవారు, అడవి, కొండలు, ఎడారులు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పిపోకుండా వీటిని వినియోగించొచ్చు. ఏదైనా నేరాలు జరిగినా, అనుకోని ఘటనలు జరిగినప్పుడు సాక్ష్యాలుగా ఇవి పోలీసుశాఖకు మేలు చేయనున్నాయి. ●

స్టఫ్ చేద్దాం.. గ్రిల్ చేద్దాం..

తరచూ ఒకే రకమైన స్నాక్స్ తినాలంటే బోర్ కొడుతుంటుంది. అందుకే, ఇటాలియన్, థాయ్ అంటూ ఇతర స్నాక్ ఐటమ్స్ వైపు మొగ్గుచూపుతుంటారు. ఇంట్లోనే విభిన్న రుచులను తయారుచేయాలని ఆరాటపడేవారి కోసం పిల్లలు, పెద్దలు ఇష్టపడే వంటకాలను చెఫ్ గోవర్ధన్ మన ముందుకు తీసుకువచ్చారు.

వంటిల్లు

రావియోలీ

ఇది ఇటలీ వంటకం. పాస్తా పిండితో దీనిని తయారుచేస్తారు. సాధారణంగా మిషన్లతో తయారు చేసే ఈ వంటకాన్ని ఇంట్లోనూ సిద్ధం చేసుకోవచ్చు. పిల్లలు, పెద్దలు ఈ వంటకాన్ని బాగా ఇష్టపడతారు. ఇది స్టఫ్ వంటకాల జాబితాలో చేరుతుంది.

రావియోలీకి... కావాల్సినవి: **డ్యురమ్ ఫ్లోర్ /సిమోలినా (గోధుమలతో తయారు చేసిన పాస్తా పిండి)** – 300 గ్రా.లు; **గుడ్లు** – 3; **ఉప్పు** – 1 టీస్పూన్.

తయారీ: ● వెడల్పాటి గిన్నెలో పిండి పోసి, మధ్యలో ఒక గుంతలా చేయాలి. దాంట్లో గుడ్లులోని సొన, ఆ తర్వాత ఉప్పు వేయాలి. ● ఫోర్క్‌తో గుడ్డులోని పచ్చసొనని మెల్లగా బీట్ చేయాలి. ● ఆ తర్వాత చుట్టూ ఉన్న పిండిని గుడ్డు సొన ఉన్న భాగంలోకి తీసుకుంటూ, కలపాలి. ● 10–15 నిమిషాల పాటు మిశ్రమం మృదువుగా అయ్యేలా కలుపుతూ, ముద్ద చేయాలి. ● పిండి ముద్దపైన క్లాత్ లేదా మరో పాత్రను కప్పి, 30 నిమిషాలు పక్కన ఉంచాలి.

లోపలి పూర్ణం కోసం...

కావాల్సినవి: **చికెన్ (బోన్‌లెస్)** – 250 గ్రా.లు; **ఆలివ్ ఆయిల్** – 50 ఎం.ఎల్; **వెన్న** – 50 గ్రా.లు; **వెల్లుల్లి** – టేబుల్ స్పూన్ (సన్నగా తరగాలి); **ఉల్లిపాయ** – 100 గ్రా.లు (సన్నగా తరిగినవి); **పాలకూర** – 2 టేబుల్ స్పూన్లు; **ఉప్పు** – తగినంత; **నల్ల మిరియాల పొడి** – 1/4 టీస్పూన్; **పర్మేసన్ చీజ్** – 50గ్రా.లు (తరిగినది);

తయారీ: ● పాన్‌లో నూనె, వెన్న వేడి చేయాలి. ● దాంట్లో వెల్లుల్లి, ఉల్లిపాయ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చికెన్ వేసి మెత్తగా అయ్యే వరకు వండాలి ● ఉప్పు, మిరియాలపొడి, పాలకూర తరుగు వేసి కలపాలి ● పై మిశ్రమాలు బాగా ఉడికిన తర్వాత పర్మేసన్ చీజ్ వేసి కలిపి, మంట తీసేయాలి ● స్టఫింగ్ మిశ్రమం చల్లారనివ్వాలి.

రావియోలీ తయారీ: ● పిండి ముద్దను సమ భాగాలుగా తీసుకొని, పెద్ద చపాతీలా రోల్ చేయాలి ● చపాతీ పైన టీ స్పూన్‌తో ఒకే వరసలో కొద్ది కొద్దిగా స్పేస్ ఇస్తూ, చికెన్ మిశ్రమాన్ని పెట్టాలి. (సరిగా రాదు అనుకునేవారు వీటి తయారీకి అచ్చు పరికరాన్ని ఉపయోగించవచ్చు) ●పై నుండి రోల్ చేసిన మరో చపాతీ షీట్‌ను జాగ్రత్తగా పరచాలి ● స్టఫ్ చేసినది కాకుండా ఖాళీ ఉన్న భాగంలో చుట్టూ వేళ్లతో అదుముతూ సీల్ చేయాలి ● అవసరమైతే ఫోర్క్‌తో అంచులు నొక్కి, అదమాలి. ఆ తర్వాత ఒక్కోదానిని విడదీసి, పక్కన ఉంచాలి. కజ్జికాయల చుట్టూ కట్ చేసే, కటర్ పరికరాన్నీ ఉపయోగించవచ్చు. అన్నీ సిద్ధం అయ్యాక, ఒక పాత్రలో ఉప్పు వేసిన నీటిని మరిగించాలి ● దాంట్లో సిద్ధం చేసుకున్న స్టఫ్ రవియోలీలను వేసి, 2–3 నిమిషాలు ఉడికించి, జల్లి గరిటెతో వాటిని నెమ్మదిగా ప్లేట్‌లోకి తీసుకోవాలి. వెజ్ రావియోలి కోసం మష్రూమ్స్, టొమాటో ఉపయోగించవచ్చు.

చెఫ్ గోవర్ధన్

ఫిష్ టిక్కా

కావాల్సినవి: **ముల్లు లేని చేప ముక్కలు** – అర కేజీ; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు; **ఆవాల నూనె** – టేబుల్ స్పూన్: **అల్లం–వెల్లుల్లి పేస్ట్** – టీస్పూన్: **నిమ్మరసం** – టేబుల్ స్పూన్: **పసుపు** – టీస్పూన్: **ధనియాల పొడి** – టీస్పూన్: **జీలకర్ర పొడి** – టీస్పూన్: **కారం** – టీస్పూన్: **ఉప్పు** – తగినంత: **కొత్తిమీర తరుగు** – టేబుల్ స్పూన్: **నీళ్లు వడకట్టిన గట్టి పెరుగు** – 50 గ్రా.లు: **గరం మసాలా** – టీస్పూన్; **జాజికాయ పొడి** – చిటికెడు.

తయారీ: ● ఒక వెడల్పాటి గిన్నెలో నూనె, ఆవాల నూనె, అల్లం–వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం వేసి కలపాలి ● దాంట్లోనే పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, ఉప్పు, కొత్తిమీర, పెరుగు, గరం మసాలా, జాజికాయ పొడి వేసి బాగా మిక్స్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమంలో చేప ముక్కలు వేసి, బాగా కలపాలి ● కనీసం అర గంట సేపు పక్కనుంచాలి ● గ్రిల్ పాన్ వేడి చేసి, వెన్న/నూనె రాయాలి ● చేప ముక్కలను తక్కువ మంటపై రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకు ఉంచాలి ● ప్లేట్‌లోకి తీసుకొని నిమ్మముక్కలతో, ఉల్లిపాయ రింగ్స్‌తో సర్వ్ చేయాలి. పుదీనా చట్నీతోనూ రుచిగా ఉంటుంది.

సాక్షి సినిమా

డ్రాగన్ రిటర్న్స్

● ఎన్టీఆర్

కొంత గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ 'డ్రాగన్' సెట్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారని తెలిసింది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఇటీవల జరిగిన ఓ యాడ్ షూట్‌లో ఎన్టీఆర్ గాయపడటం, ఎన్టీఆర్ న్యూ మేకోవర్ కోసం కొంత టైమ్ పట్టడం వంటి కారణాల వల్ల ఈ సినిమా చిత్రీకరణకు బ్రేక్ పడింది. కొంత గ్యాప్ తర్వాత ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలో ప్రారంభం కానునున్నట్లు తెలిసింది. దాదాపు 25 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ముఖ్యంగా రాత్రివేళ సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

జైలర్ యాక్షన్

● రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'జైలర్'కి సీక్వెల్‌గా 'జైలర్ 2' రూపొందుతోంది. 2023 ఆగస్టు 10న విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'జైలర్ 2' షూట్‌తో బిజీగా ఉన్నారు రజనీ. కాగా డిసెంబరు 12న రజనీకాంత్ పుట్టినరోజు. 75 ఏళ్లు పూర్తి చేసుకున్నారాయన. ఏడు పదుల వయసులోనూ యాక్షన్ సినిమాలకు సై అంటున్నారు రజనీ. ప్రస్తుతం 'జైలర్ 2' కోసం ఓ ఫైట్ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నారాయన. ఇందులో భాగంగా ఓ సన్నివేశంలో ఆయన బరువైన వస్తువుని పైకి ఎత్తి తలకిందులుగా పెట్టాల్సి ఉందట. ఈ కష్టమైన సీన్‌ని డూప్‌తో చేయిద్దామని నెల్సన్ చెప్పినప్పటికీ... వద్దంటూ తనే ఆ సన్నివేశంలో పాల్గొన్నారట రజనీకాంత్. ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.

ఆర్య సిరీస్‌లో...

● కాజల్ అగర్వాల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ 'ఆర్య' అనే వెబ్ సిరీస్‌లో నటించనున్నారని టాక్. తొలిసారి ఆమె నటించిన 'లైవ్ టెలికాస్ట్' అనే హారర్ వెబ్ సిరీస్ 2021లో విడుదలైంది. ఆ సిరీస్ ఆమె కెరీర్‌కి ఆశించినంత ప్లస్ కాలేదు. దీంతో కొన్నాళ్లు వెబ్ సిరీస్‌లకు విరామం ఇచ్చిన ఈ బ్యూటీ ఇప్పుడు చాలా గ్యాప్ తర్వాత 'ఆర్య' అనే వెబ్ సిరీస్ చేయనున్నారట. సుస్మితా సేన్ లీడ్ రోల్‌లో నటించిన 'ఆర్య' అనే హిందీ వెబ్ సిరీస్ మూడు సీజన్లు వచ్చాయి. ఈ సిరీస్‌లోని థ్రిల్లింగ్ అంశాలు వీక్షకులను అలరించాయి. ఈ సిరీస్‌ని తెలుగులో జియో హాట్‌స్టార్ నిర్మించనుంది. ఈ సిరీస్‌లో లీడ్ రోల్ కోసం కాజల్ అగర్వాల్‌ని సంప్రదించగా, ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమతో పాటు దక్షిణాదిలో కాజల్‌కి ఉన్న క్రేజ్‌ని దృష్టిలో ఉంచుకుని ఈ సిరీస్‌ని తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఆమెతోనే రీమేక్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. 'ఆర్య' సిరీస్‌లో సుస్మితా సేన్ నడివయస్కురాలి పాత్ర చేశారు. ఆమెకు పిల్లలూ ఉంటారు. ఇది చాలెంజింగ్ రోల్ కావడంతో కాజల్ అగర్వాల్ ఒప్పుకున్నారని టాక్. అయితే ఈ సిరీస్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు

''అఖండ 2'కి బ్రహ్మాండమైన స్పందన వస్తోంది. బుకింగ్స్ చాలా బాగున్నాయి. మా చిత్రానికి అద్భుతమైన స్పందన ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట తెలిపారు. బాలకృష్ణ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా కీలక పాత్రలు పోషించారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో గోపీ ఆచంట మాట్లాడుతూ– ''కొన్ని అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' వారం పాటు వాయిదా పడింది. ఈ సమస్యని పరిష్కరించడానికి సపోర్ట్ చేసిన మ్యాంగో మీడియా రామ్‌గారు, నిర్మాత 'దిల్' రాజుగార్లకు థ్యాంక్స్. ప్రీమియర్స్‌కి బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. మేం ఓ థియేటర్‌లో సినిమా చూశాం. బాలకృష్ణ ఫ్యాన్స్ నిలబడి చప్పట్లు కొడుతూ, విజిల్స్ వేస్తూ అద్భుతమైన స్పందన ఇచ్చారు. నార్త్‌లో జి సినిమాస్ ద్వారా దాదాపు 800 స్క్రీన్స్‌లో రిలీజ్ చేశాం'' అని తెలిపారు. రామ్ ఆచంట మాట్లాడుతూ– ''గురువారం రాత్రి జరిగిన ప్రీమియర్స్‌కి నైజాం, సీడెడ్, ఆంధ్ర కలిపి రూ. 10 కోట్ల గ్రాస్ వచ్చింది. కర్ణాటకలో కూడా దాదాపు కోటి రూపాయలు కలెక్ట్ చేసింది. డిస్ట్రిబ్యూటర్స్ నుంచి అద్భుతమైన రిపోర్ట్స్ వస్తున్నాయి. ఓవర్సీస్ రెస్పాన్స్ కూడా బాగుంది. ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు'' అని చెప్పారు.

● గోపీ ఆచంట, రామ్ ఆచంట

మంచి కామెడీ రైడ్‌లా ఉంటుంది

● జయకాంత్, అమర్ బురా

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో జయకాంత్ మాట్లాడుతూ– ''కొత్త నిర్మాతలంటే ఏదైనా లవ్‌స్టోరీ, యూత్‌ఫుల్ కంటెంట్‌తో తొలి సినిమా చేస్తుంటారు. కానీ మేం డార్క్ కామెడీ జానర్‌లో 'గుర్రం పాపిరెడ్డి' సినిమా చేశాం. ఈ కథ విని, తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ చేస్తానని అన్నారు. కానీ ఆయన ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల కుదరలేదు. ఆ తర్వాత మరో యంగ్ హీరో కథ విని, ఓకే చెప్పారు. కానీ ఆ హీరో ఈ సినిమా చేయలేదు. ఈ క్రమంలో నరేశ్ అగస్త్యకు ఈ సినిమా కథ వినిపించగా, ఓకే అన్నారు. 'గుర్రం పాపిరెడ్డి' పాత్రలో నరేశ్ బాగా నటించారు. ఈ చిత్రంలో సౌదామిని పాత్రలో ఫరియా అబ్దుల్లా మంచి రోల్ చేశారు. 'జాతి రత్నాలు' సినిమాలో ఉన్నట్లుగా బ్రహ్మానందంగారు–ఫరియాల మధ్య మంచి కామెడీ ట్రాక్ ఉంది. రీసెంట్ టైమ్స్‌లో బ్రహ్మానందంగారు ఓ ఫుల్ లెంగ్త్ రోల్ చేసిన సినిమా ఇదే. దర్శకుడు మురళీ మనోహర్ బాగా తెరకెక్కించారు. ఓ ఫన్ రైడ్ మూవీలా మా 'గుర్రం పాపిరెడ్డి' ప్రేక్షకులను నవ్విస్తుంది'' అని చెప్పారు. అమర్ బురా మాట్లాడుతూ– ''తెలివిలేని వాళ్లు తెలివైనవాడిని ఎలా ఎదుర్కొన్నారు? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. సందేశాల కోసం ప్రేక్షకులు థియేటర్స్‌కు రారు. ప్రేక్షకులు ఎంటర్‌టైన్ అయ్యే ఫన్, కామెడీ మా సినిమాలో ఉన్నాయి. మా 'గుర్రం పాపిరెడ్డి' సినిమాను 140 స్క్రీన్స్‌లో ఓన్‌గా రిలీజ్ చేస్తున్నాం. టికెట్ ధరలను కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు.

ఛూ మంతర్!

● శ్రీలీల

హీరోయిన్ శ్రీలీల వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ప్రస్తుతం ఆమె తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో నటిస్తున్నారు. ఇప్పటికే తెలుగు, కన్నడ ప్రేక్షకులను అలరించిన ఈ బ్యూటీ 'ఆషికీ 3' సినిమాతో బాలీవుడ్‌లో, 'పరాశక్తి' చిత్రంతో తమిళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇక హిందీలో ఫస్ట్ మూవీ రిలీజ్ కాకుండానే రెండో సినిమా 'ఛూ మంతర్'లో నటించే చాన్స్ అందుకున్నారట శ్రీలీల. తరుణ్ దుడేజా దర్శకత్వంలో మాడాక్ ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మించనుంది. 'ముంజ్య' ఫేమ్ అభయ్ వర్మ హీరోగా నటించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా తొలుత అనన్యా పాండేను సంప్రదించారు మేకర్స్. ఆమె సరే అన్నప్పటికీ... తన బ్లాక్‌బస్టర్ వెబ్ సిరీస్ 'కాల్ మీ బే' రెండో సీజన్‌తో డేట్స్ క్లాష్ కావడంతో 'ఛూ మంతర్' నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఆమె స్థానంలో శ్రీలీలను తీసుకోనున్నారట. ఇప్పటికే మేకర్స్ సంప్రదించగా.. 'ఛూ మంతర్'లో నటించేందుకు శ్రీలీల సుముఖంగా ఉన్నారని టాక్.

వినూత్న కథతో...

● ధనుష్, శ్వేత

భానుచందర్, ధనుష్ దేవర పాలి, శ్వేత, సత్యప్రియ నటించిన చిత్రం 'నడికట్టు'. ఎస్.వి. దిలీప్ కుమార్ దర్శకత్వంలో మంచూరి సోమశేఖర్ రావు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని నటుడు రాజా రవీంద్ర విడుదల చేసి, మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు ఓ మంచి సినిమాను అందిస్తున్న 'నడికట్టు' యూనిట్‌కు శుభాకాంక్షలు. ఈ చిత్రం మంచి విజయం అందుకోవాలి'' అన్నారు. మంచూరి సోమశేఖర్ రావు మాట్లాడుతూ– ''సినీరంగంపై ఉన్న ఆసక్తితో సహస్ర శ్రీ క్రియేషన్స్ బ్యానర్ స్థాపించాను. మా బ్యానర్‌పై వస్తున్న తొలి చిత్రం 'నడికట్టు'. మా సినిమాలో భానుచందర్‌గారు భాగమవడం మాకు గౌరవం మాత్రమే కాదు... బలం కూడా'' అని చెప్పారు. ''వినూత్న కథాంశంతో రూపొందిన మా సినిమా ఆసక్తిగా ఉంటుంది'' అని ధనుష్ దేవర పేర్కొన్నారు.

మోగ్లీ అందరికీ కనెక్ట్ అవుతుంది

– హీరో రోషన్ కనకాల

''ఫలానా జానర్‌లోనే సినిమాలు చేయాలని అనుకోవడం లేదు. నటుడిగా అన్ని రకాల జానర్ సినిమాలూ చేయాలనుకుంటున్నాను'' అని రోషన్ కనకాల చెప్పారు. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మోగ్లీ 2025'. హర్ష చెముడు, బండి సరోజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రోషన్ కనకాల మాట్లాడుతూ– ''మోగ్లీ 2025' హానెస్ట్ లవ్‌స్టోరీ ఫిల్మ్. ప్రేక్షకులు ఏ మాత్రం బోర్ ఫీల్ కాకుండా సందీప్ రాజ్ రేసీ స్క్రీన్‌ప్లే డిజైన్ చేశారు. తన ప్రేమకోసం మోగ్లీ ఏం చేయడానికైనా రెడీగా ఉంటాడు. మరి... మోగ్లీ ప్రేమ కథకు వచ్చిన అడ్డంకులు ఏంటి? క్రిస్టోఫర్ నోలన్ (ఈ సినిమాలో బండి సరోజ్ కుమార్ పాత్ర పేరు) నుంచి మోగ్లీకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? అనే అంశాలతో ఈ సినిమా కథ ముందుకు వెళుతుంది. మోగ్లీ క్యారెక్టర్, ఈ సినిమా ప్రేక్షకులందరికీ కనెక్ట్ అవుతుంది. ఈ కథలో కామెడీ, యాక్షన్... ఇలా అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. ఇంటర్వెల్, ప్రీ ఇంటర్వెల్ ఎంగేజింగ్‌గా ఉంటాయి. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ కూడా అద్భుతంగా ఉంటాయి. ప్రస్తుతం ఒక రొమాంటిక్ లవ్‌స్టోరీ, ఒక ఇంటెన్స్ లవ్‌స్టోరీ సినిమాలు కమిట్ అయ్యాను'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నటన పరంగా మా అమ్మ (వ్యాఖ్యాత–నటి సుమ కనకాల), నాన్న (నటుడు రాజీవ్ కనకాల)ల సలహాలను అవసరమైనప్పుడు తీసుకుంటుంటాను'' అని తెలిపారు.

'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 262

శనివారం 13-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హైదరాబాద్‌కు మెస్సీ 'కిక్'

అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ నేడు హైదరాబాద్‌కు రానున్నాడు. రాత్రి 7 గంటలకు ఉప్పల్ స్టేడియంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జట్టుతో మెస్సీ జట్టు ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో రూ. 10 లక్షలు చెల్లించిన అభిమానులతో మెస్సీ ఫొటో సెషన్ ఉంటుంది.

- వివరాలు స్పోర్ట్స్‌లో

చైనీయులకు బిజినెస్ వీసాలు

భారత్‌ను సందర్శించే చైనా వృత్తి నిపుణులకు సులువుగా బిజినెస్ వీసాలు జారీ చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



శివరాజ్ పాటిల్ కన్నుమూత

కాంగ్రెస్ కురువృద్ధ నేత శివరాజ్ పాటిల్ (90) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మహారాష్ట్రలోని లాతూర్‌లో కన్నుమూశారు.

వివరాలు 6లో ▸

మృత్యువు అంచు నుంచి..

ఓ స్కైడైవర్ పారాచూట్ విమానం తోకలో చిక్కుకుంది. ఈ జీవన్మరణ పోరాటంలో అతడు అద్భుత విజయం సాధించాడు.

వివరాలు 6లో ▸

ఐదుగురు అణగారిన వర్గాల వారే

సమాచార కమిషన్‌లో నియామకాలకు ప్రతిపాదించిన 8 పేర్లలో ఐదుగురు అణగారిన వర్గాల వారేనని కేంద్రం తెలిపింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 తేదీల మధ్య 12 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం జరపనుంది. ఈ మేరకు రాష్ట్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 7లో ▸

24న కేబినెట్ సమావేశం

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం నిర్వహిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం వెల్లడించారు.

వివరాలు 7లో ▸

ముందస్తు కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయి?

పదవీకాలం ముగుస్తున్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన ముందస్తు కార్యక్రమాల తీరుతెన్నులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఆరా తీశారు.

వివరాలు 8లో ▸

పొందూరు ఖాదీకి జీఐ గుర్తింపు

ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ పరిశ్రమకు విశేష గుర్తింపు లభించింది. పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) ప్రకటిస్తూ వాణిజ్య, పరిశ్రమలశాఖ పరిధిలోని భౌగోళిక సూచికల రిజిస్ట్రీ శుక్రవారం అధికారిక పత్రాన్ని జారీ చేసింది.

వివరాలు 5లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	125 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	220 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	152 కిలో	స్కిన్ లెస్	251 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇంటింటా...

...మైక్ వద్దని అలానే మాట్లాడుతున్నారు!

• ఆగని అప్పుల పరుగు

బాబు గారి లిక్కర్ బాండ్లు

ఎక్సైజ్ బాండ్ల రూపంలో రూ.5,490 కోట్ల రుణం

రాబోయే మద్యం ఆదాయం తాకట్టు పెట్టి అప్పు

బాండ్ల జారీపై జీవో లేదు.. గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం

ఏకంగా 9.15 శాతం అత్యధిక వడ్డీ రేటు

నాడు తక్కువ వడ్డీతో తక్కువ అప్పులు చేసినా శ్రీలంక అయిపోతుందని యాగీ.. సంపద సృష్టిస్తానని చెప్పి ఎక్కువ వడ్డీతో ఎక్కువ అప్పులు చేస్తున్న చంద్రబాబు

18 నెలల్లోనే బాబుగారి అప్పులు రూ.2,66,175 కోట్లు

ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన అప్పులలో 80 శాతం 18నెలల్లోనే దాటేసిన బాబు.. ఎక్కువ అప్పులే కాదు వేగంగా అప్పులు చేయడంలోనూ బాబుగారే టాప్

2014-19లో అప్పుల కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) 22.63 శాతం

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇది 13.57శాతం మాత్రమే..

ఎఫ్ఆర్‌బీఎం పరిమితినీ ఎప్పుడో దాటేసిన బాబు ప్రభుత్వం..

ఇలాగైతే ఏపీ పరిస్థితి శ్రీలంక కాదు సౌత్ సూడానే అంటున్న ఆర్థిక నిపుణులు

2 లో



అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో బోల్తాపడిన బస్సు

మృత్యులోయ

మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా

తులసిపాక వద్ద ఘోర ప్రమాదం

9 మంది మృతి

22 మందికి తీవ్ర గాయాలు

మరో ఆరుగురికి స్వల్ప గాయాలు

డ్రైవర్ అతివేగం, దట్టమైన పొగమంచు కారణంగా కనిపించని రోడ్డు

నిద్రలోనే మృత్యు ఒడికి చేరుకున్న యాత్రికులు

మృతుల్లో 8 మంది చిత్తూరు జిల్లా వాసులే

కొబ్బరి బొండాల ఆటో బోల్తా

బాపట్ల జిల్లాలో ముగ్గురి మృతి

12 లో

నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కి ఆందోళనలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

2 లో

- పలుచోట్ల ముట్టడికి ప్రయత్నం, అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత
- చంద్రబాబు అధికారంలో ఉంటే ఒకలా.. లేకపోతే ఒకలా ఉంటారని మండిపాటు
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా పట్టించుకోవడంలేదని ఫైర్
- చంద్రబాబు ప్రభుత్వానికి ఇది మొదటి ప్రమాద హెచ్చరిక.. మా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం

కోర్–5 సూపర్ క్లబ్!

ఐదు దేశాల సరికొత్త పవర్ గ్రూప్

- ఇప్పటిదాకా అత్యంత బలోపేతమైన కూటమిగా ఉన్న 'జీ7' వైభవాన్ని తోసిరాజంటూ.. అతి శక్తిమంతమైన సరికొత్త కూటమి ఒకటి ఆవిర్భవించనుందా? ఆ కూటమిలో.. అన్ని రంగాల్లోనూ నిర్నిరోధంగా దూసుకుపోతున్న నయా భారత్‌ది కీలకపాత్ర కానుందా? అంటే, అవుననే అంటున్నారు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు.

6 లో

కిలోమీటర్‌కు రూ.180.35 కోట్లు

ఇదీ యాక్సిస్ రోడ్డును ఎన్‌హెచ్-16తో అనుసంధానించే పనుల కాంట్రాక్టు విలువ



ఎన్‌హెచ్ఏఐ నిర్మించిన బెజవాడ కనకదుర్గమ్మ ఫ్లైఓవర్‌కు కి.మీకు అయిన వ్యయం రూ.108 కోట్లే

బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్‌కు కిలోమీటర్‌కు అయిన వ్యయం రూ.69 కోట్లే

- రూ.511.84 కోట్లతో టెండర్ నోటిఫికేషన్ జారీ
- 4.05% ఎక్సెస్‌తో రూ.532.57 కోట్లకు కోట్ చేసి ఎల్-1గా నిలిచిన ఎన్‌సీసీ
- ఆ సంస్థకే పనులు అప్పగిస్తూ కేబినెట్ ఆమోద ముద్ర.. దాంతో ఖజానాపై అదనంగా రూ.20.73 కోట్ల భారం
- పన్నుల రూపంలో మరో రూ.98.66 కోట్లు రీయింబర్స్.. దాంతో కాంట్రాక్టు విలువ రూ.631.23 కోట్లు
- 3.5 కి.మీ. పొడవునా 6 వరుసలతో రోడ్డు నిర్మాణం.. ఇందులో 2.4 కి.మీ. మేర ఆర్వోబీ ఎలివేటెడ్ కారిడార్

8లో

ఖాకీలా.. కిడ్నాపర్లా!

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సొంతగూటికి చేరితే జీర్ణించుకోలేకపోయిన టీడీపీ నేతలు

పోలీసులను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలు

నెల్లూరు నుంచి తాడేపల్లికి వెళ్లిన ఓ కార్పొరేటర్, మరో కార్పొరేటర్ కుమారుడి కిడ్నాప్

రాత్రంతా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పోలీస్‌స్టేషన్లు తిప్పుతూ వేధింపులు

తీవ్రంగా కొట్టి, భయపెట్టి.. టీడీపీకి జై కొట్టించడంలో కీలక పాత్ర

పొరపాటుగా వెళ్లామని.. టీడీపీలోనే కొనసాగుతామని తెల్లారేసరికి వీడియో రిలీజ్

ఆ ఇద్దరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పి టీడీపీ నేతలకు అప్పగించిన వైనం

పోలీసుల బరితెగింపుపై సర్వత్రా విస్మయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఖాకీలు అధికారిక కిరాయి గూండాల్లా, కిడ్నాపర్లుగా వ్యవహరిస్తున్నారు. ఖాకీ చొక్కాలు వదిలేసి పసుపు చొక్కాలు తొడిగేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల ఆదేశాలనే చట్టాలుగా మార్చేసి నెల్లూరు నవాబుపేట పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ బీఫారంపై గెలిచిన కార్పొరేటర్లను టీడీపీ అధికారంలోకి రావడంతో బెదిరించి పచ్చ కండువా కప్పారు. అయితే

మిగతా 8వ పేజీలో ▸

నెల్లూరు 34వ వార్డు కార్పొరేటర్ తండ్రి కిడ్నాప్

8 లో

ఒకే నియంత్రణ వ్యవస్థలో

ఉన్నత విద్య

యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ స్థానంలో ఒకే రెగ్యులేటరీ

'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు

2027లో రెండు దశల్లో డిజిటల్ జన గణన

బీమాలో ఎఫ్‌డీఐలు 74% నుంచి 100 శాతానికి పెంపు

2026 సీజన్‌లో ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర పెంపు

కాలం చెల్లిన చట్టాల రద్దు బిల్లుకు ఆమోదం



6 లో

కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉన్నతవిద్యతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జన గణన, పంటలకు కనీస మద్దతు ధర, బీమాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సహా పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాల వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు.

విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ధర్నా చౌక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విజయనగరం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ఒంగోలు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల నినాదాలతో దద్దరిల్లిన అనంతపురం కలెక్టరేట్ ఆవరణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి నెట్‌వర్క్: తమకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు శుక్రవారం రోడ్డెక్కారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ముందు పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించారు. పలుచోట్ల కలెక్టరేట్లలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ల వద్ద కూడా పెద్దఎత్తున ధర్నాలు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ధర్నా చౌక్, విజయవాడ ధర్నా చౌక్, నెల్లూరు కలెక్టరేట్ ప్రాంతాలు ధర్నాలతో దద్దరిల్లాయి. మెమొరీ ఎక్కువగా ఉండే 5జీ ఫోన్లు ఇవ్వాలని, 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీచేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్చాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఒంగోలులోనూ మహాధర్నా నిర్వహించారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణం రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, యాప్‌ల పేరుతో పెంచిన పనిభారం

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తగ్గించాలని, ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం, కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా తమను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోనూ ఆందోళన చేశారు. రెండేళ్లకోసారి వేతనాలు పెంచాల్సి ఉండగా, ఐదేళ్లు దాటినా పెంచకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

భారీ ర్యాలీ.. మహా ధర్నా..

ఏలూరులో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. అంగన్‌వాడీలకు మే నెల పూర్తిగా వేసవి సెలవులు ఇవ్వాలని, రెండో శనివారం సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని నాయకులు కోరారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఇక తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మె చేసేందుకూ సిద్ధమని విశాఖలో ఆందోళనకారులు హెచ్చరించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోనూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

1,500 మందితో భారీ ర్యాలీ..

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 1,500 మంది భారీ ర్యాలీ చేశారు. అక్కడ అధికారి అందుబాటులో లేకపోవడంతో దాదాపు రెండు గంటల పాటు బైఠాయించారు. కలెక్టరేట్‌కు వెళ్లాలని ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇక లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, పెండింగ్‌లో ఉన్న 1,810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని వైఎస్సార్ జిల్లా కడపలో అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. హెల్పర్ల పదోన్నతులకు, గ్రాట్యుటీ అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. ప్రీ స్కూలు బలోపేతం చేయాలని, పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని కోరారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట కూడా అంగన్‌వాడీలు ధర్నాచేసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోనూ వీరు కదం తొక్కారు. గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం వర్కర్లను నాల్గవ తరగతి ఉద్యోగులుగా.. హెల్పర్లను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా కొత్త అంగన్‌వాడీ సెంటర్లు తీసుకురావాలన్నారు. ప్రతీనెలా 5 నుంచి 7 వరకు సమావేశాలకు పిలుస్తున్నారని.. టీఏ, డీఏలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ జీతాలు, బిల్లులు సకాలంలో ఇవ్వాలని కోరారు. మరోవైపు.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి కలెక్టరేట్లను కూడా అంగన్‌వాడీలు ముట్టడించారు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఒకలా, లేకపోతే ఒకలా ఉంటారని మండిపడ్డారు. ఇది చంద్రబాబు ప్రభుత్వానికి మొదటి ప్రమాద హెచ్చరిక అని, తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. వసతుల్లేని అద్దె భవనాల్లో పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉందన్నారు.

కోటి సంతకాల ఉద్యమానికి అనూహ్య స్పందన

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- 15న జిల్లా స్థాయిలో ర్యాలీలు హోరెత్తాలి
- 18న గవర్నర్‌కు సంతకాలు అందజేయనున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి అన్ని నియోజకవర్గాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నియోజక వర్గాల్లో సేకరించిన సంతకాలను ఈ నెల 10న జిల్లా పార్టీ కార్యాలయాలకు తరలించే ప్రక్రియతో ప్రజల మనోగతం మరోసారి స్పష్టమైందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులతో శుక్రవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే/కో–ఆర్డినేటర్లు, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్లు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు (కో ఆర్డినేషన్), ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్), జెడ్పీ చైర్‌పర్సన్‌లు, మేయర్లు, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు, విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్లు, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీ వైస్‌చైర్మన్లు , జెడ్పీటీసీలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లతోపాటు కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 15న జిల్లా స్థాయిలో నిర్వహించే ర్యాలీలతో రాష్ట్రం హోరెత్తాలని, తద్వారా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మరోసారి గళం విప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా సంతకాల సేకరణ చేపట్టిన పార్టీ శ్రేణులను పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారని చెప్పారు. చంద్రబాబు అప్రజాస్వామిక నిర్ణయాలకు ఇంతకుమించిన రెఫరెండం అక్కర్లేదన్నారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం వైఎస్ జగన్.. పార్టీ ముఖ్య నేతలతో కలిసి గవర్నర్‌కు సంతకాలను అందజేస్తారని వివరించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకునేలా మన పార్టీ ఒత్తిడి ఉండాలన్నారు.

● ఆగని అప్పల పరుగు

బాబుగారి లిక్కర్ బాండ్లు

ఎక్సైజ్ బాండ్ల రూపంలో రూ.5,490 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: ఎడాపెడా అప్పులు చేయడంలో ఎన్నో డిగ్రీలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొత్త అప్పుల కోసం కొత్త దారులు వెతుకుతున్నారు. రాష్ట్రంలో మద్యాన్ని ఏరులుగా పారిస్తున్న చంద్రబాబు సర్కార్ ఇపుడు రాబోయే మద్యం ఆదాయాన్ని హామీగా చూపిస్తూ మరో భారీ అప్పుకు రంగం సిద్ధం చేస్తోంది. మద్యం ఆదాయాన్ని తాకట్టు పెడుతూ ఎక్సైజ్ బాండ్ల ద్వారా ఏకంగా రూ.5,490 కోట్ల అప్పు సేకరించారు. బొంబాయి స్టాక్ ఎక్ఛేంజ్ ద్వారా ఈ బాండ్ల సేకరణ జరిగింది. అది కూడా 9.15శాతం భారీ వడ్డీకి ఈ అప్పు చేస్తుండడం గమనార్హం. ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఈ 18 నెలల్లో చేసిన అప్పులు రూ.2,66,175 కోట్లుకు (ఇప్పటికే ప్రభుత్వం చేసిన అప్పులు, కొత్తగా చేయడానికి అనుమతించిన అప్పులు) చేరుకున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీతో రాజధాని కోసం మరో రూ.7,387.70 కోట్లు అప్పు చేస్తున్నట్లు శుక్రవారం పొద్దుపోయిన తర్వాత వెల్లడించారు. ఇవన్నీ సరిపోవన్నట్లు మళ్లీ చంద్రబాబు పదేపదే అప్పులకు అర్రులు చాస్తుండడం చూసి అందరూ నివ్వెరపోతున్నారు. ఈ 18 నెలల్లోనే వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో 80శాతాన్ని చంద్రబాబు ప్రభుత్వం దాటేసిందంటే పరిస్థితి ఏ మేరకు దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. తక్కువ వడ్డీకి తక్కువ అప్పులు చేస్తేనే వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం దివాళా తీస్తోందని, శ్రీలంక అయిపోతోందని పెడబొబ్బలు పెట్టిన ఎల్లో మీడియా ఇపుడు అధిక వడ్డీలకు లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే తల ఎక్కడపెట్టుకుంటుందని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

అధికవడ్డీతో రూ.5,490 కోట్ల రుణం

రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా వచ్చే రాబడిని హామీగా చూపిస్తూ భారీ రుణ సేకరణకు చంద్రబాబు సిద్ధమయ్యారు. ఎక్సైజ్ శాఖ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.5,490 కోట్ల అప్పులు చేసేందుకు ఉపక్రమించారు. అది కూడా త్రైమాసికానికి అత్యధికంగా 9.15శాతం వడ్డీతో బాండ్లు జారీ చేయాలని నిర్ణయించారు. గుట్టుచప్పుడు కాకుండా ఈ భారీ రుణం సేకరిస్తున్నారు. 9.15శాతం వడ్డీ రేటుతో బాండ్లను జారీ చేసి రుణాన్ని సేకరిస్తున్నారన్న విషయం బయటకు పొక్కితే ఆర్థిక నిపుణులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తారన్న కారణంవల్లే దీనిని గోప్యంగా ఉంచారు.

ఎంత తాగిస్తే.. అన్ని అప్పులు..

'మద్యం అమ్మకాలు పెంచండి.. ఈ ఏడాది రూ.35వేల కోట్ల రాబడి తేవాలి'.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఊరూవాడా బెల్టు షాపులు పెరిగిపోతున్నా, ఎక్కడబడితే అక్కడ పర్మిట్ రూమ్‌లు కనిపిస్తున్నా రాష్ట్రప్రభుత్వం కిమ్మనడం లేదు. వీటి వెనక ఉన్న మర్మం ఇపుడు అందరికీ బోధపడింది. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ఎంతగా పెరిగితే తమకు అంత సంతోషం అన్నట్టుగా ఉంది ముఖ్యమంత్రి చంద్రబాబు విధానం. ఎందుకంటే మద్యం విక్రయాలపై పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్‌లో రాబోయే ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ. 5,490 కోట్ల రుణ సేకరణకు పూనుకున్నారు. దీనినిబట్టి రాబోయే రోజుల్లో అనివార్యంగా మద్యం ఆదాయాన్ని భారీగా పెంచాల్సి ఉంటుంది. 2024–25లో మద్యం విక్రయాల ద్వారా రూ.24వేల కోట్ల రాబడి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో మద్యం విక్రయాల ద్వారా పన్నుల ఆదాయం రూ.35 వేల కోట్లకు చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. తరువాత ఏడాది మరింతగా అంటే రూ.50వేల కోట్లకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. అంటే ప్రస్తుత మద్యం విక్రయాలను ఏకంగా 100శాతం పెంచాలన్నది ప్రభుత్వ విధానమని స్పష్టమవుతోంది. ఎంతగా మద్యం తాగిస్తే...తాము అంతగా అప్పులు చేయడానికి వీలౌతుంది అన్నట్లుగా ఉంది చంద్రబాబు ప్రభుత్వ తీరు.

నిబంధనలకు విరుద్ధంగా.. అధికవడ్డీకి...

ఎక్సైజ్ బాండ్ల ద్వారా రుణ సేకరణ కోసం చంద్రబాబు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ఎఫ్ఆర్ఎంబీ పరిమితి ఎప్పుడో దాటిపోయింది. అయినా సరే ఎక్సైజ్ బాండ్ల ద్వారా రూ.5,490 కోట్ల రుణ సేకరణకు ప్రభుత్వ సిద్ధపడుతుండటం గమనార్హం. ఇపుడు ప్రభుత్వం ఏకంగా 9.15శాతం చొప్పున అత్యధిక వడ్డీకి రుణ సేకరణకు సిద్ధపడడం ఆశ్చర్యం కలిగిస్తోందని నిపుణులంటున్నారు. ఎందుకంటే ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో ఎస్‌డీఎల్ (స్టేట్ డెవలప్‌మెంట్ లోన్స్) రూపంలో రుణసేకరణ జరిగితే అందుకు వర్తించే వడ్డీ భారం 6.5 శాతం లోపే ఉంటుంది. కానీ అత్యధిక వడ్డీ రేట్లతో ఏపీ ప్రభుత్వం అప్పులు చేస్తుండటం సందేహాస్పదంగా ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ అప్పుల ఊబిలో పూర్తిగా కూరుకుపోయి ఆర్థికంగా దివాలా తీస్తుందని అంటున్నారు. నాడు తక్కువ వడ్డీకి తక్కువ అప్పులు చేస్తున్నా శ్రీలంక అయిపోతుందని విమర్శించిన ఎల్లో మీడియా ఇపుడు చంద్రబాబు ఎక్కువ వడ్డీకి ఎక్కువ అప్పులు చేస్తుండడాన్ని ఎలా సమర్థించుకుంటారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

నాడు తీవ్ర స్థాయిలో దుష్ప్రచారం

నాడు జగన్ హయాంలో మద్యం ఆదాయంపై రుణాలు చేయడాన్ని టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వానికి రుణం ఇవ్వవద్దని జాతీయ బ్యాంకులు, స్టాక్ ఎక్ఛేంజ్‌లకు ఫిర్యాదు చేసింది. రాష్ట్రం శ్రీలంక అయిపోతోందని చంద్రబాబు తమ అనుకూల ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయించారు. భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టు పెట్టేస్తున్నారంటూ గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారాస్త్రంగానూ వాడుకున్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు శ్వేతపత్రాల విడుదల పేరుతో హైడ్రామా సృష్టించి అవే ఆరోపణలు చేశారు. ఇపుడు బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట ఇష్టాను సారం అప్పులు చేస్తున్నప్పటికీ సూపర్ సిక్స్, సూపర్ సెవన్‌లకు ఎగనామం పెట్టేశారు.

బాబుగారి అప్పులు చూస్తే.. శ్రీలంక కాదు సౌత్ సూడానే..

2019–24 మధ్య ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన అప్పులు రూ.3,32,671 కోట్లు కాగా చంద్రబాబు ప్రభుత్వం ఈ 18 నెలల కాలంలో చేసిన అప్పులు రూ.2,66,175 కోట్లు. అంటే జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేసిన అప్పుల్లో 80శాతం అప్పులు ఈ 18 నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వం చేసేసిందన్నమాట. రానున్న 42 నెలల్లో ఈలెక్కన అప్పులు చేసుకుంటూ పోతే... శ్రీలంక సంగతి దేవుడెరుగు.. ప్రపంచంలోనే అత్యంత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సౌత్ సూడాన్ కన్నా ఆంధ్రప్రదేశ్ దిగజారిపోవడం ఖాయమని ఆర్థిక నిపుణులంటున్నారు.

అప్పుల వేగంలో బాబుగారికి సరిలేరెవ్వరూ..

రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ అప్పులు, ప్రభుత్వ గ్యారెంటీ అప్పులు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులు అన్నీ కలుపుకుంటే రూ.1,40,717 కోట్లుగా ఉన్నాయి. ఆ అప్పులు కాస్తా 2019లో చంద్రబాబు దిగిపోయే నాటికి రూ. 3,90,247 కోట్లకు ఎగబాకాయి. దానర్థం చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు రూ. 2,49,350 కోట్లు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పుల కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) 22.63శాతంగా ఉంది. అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికి రూ. 3,90,247 కోట్లు ఉన్న అప్పులు ఐదేళ్ల కాలంలో రూ. 7,21,918 కోట్లకు చేరుకున్నాయి. అంటే ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం చేసిన అప్పులు రూ. 3,32,671 కోట్లు. అప్పుల సీఏజీఆర్ 13.57 శాతం మాత్రమే కావడం గమనార్హం. కానీ చంద్రబాబు సీఏజీఆర్ మాత్రం 22.63శాతంగాఉంది. 2014–19లో అధిక వడ్డీలకు అధిక అప్పులతో సంచలనం సృష్టించిన చంద్రబాబు ఇపుడు జగన్ ఐదేళ్లలో చేసిన అప్పులలో 80శాతం అప్పులను ఈ 18 నెలల కాలంలోనే అధిగమించి రాష్ట్రాన్ని సౌత్ సూడాన్ దిశగా నడిపిస్తుండడం ఆందోళనకరమని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్ర విభజన నాటి నుంచి 2024 మార్చి 31 వరకు అప్పుల వివరాలు ఇవీ...

Debt and Other Liabilities of the State Government (Rs Crs)

Particulars	As on State Bifurcation Date	As of 31st March, 2019	As of 31st March, 2024
Public Debt and Public Account (Direct Government Debt)	1,18,051	2,57,510	4,91,734
CAGR of Direct Government debt		17.51%	13.81%
Government guaranteed debt of public sector corporations (Contingent Liability)	14,028	55,508	1,54,797
CAGR of Government Guaranteed debt		32.92%	22.77%
Total State Government debt and State Government guaranteed debt	1,32,079	3,13,018	6,46,531
CAGR of Direct Debt & Other Contingent Liabilities		19.54%	15.61%
Non-guaranteed liability of State PSU (Power sector)	8,638	77,229	75,386
CAGR of Non-Guaranteed liabilities of State PSUs		54.98%	-0.48%
Grand Total of liabilities including guaranteed and non-guaranteed liabilities	1,40,717	3,90,247	7,21,918
Liabilities increase during periods of different regimes		2,49,350	3,32,671
CAGR of Govt. debt and guaranteed and non-guaranteed liabilities of PSUs		22.63%	13.57%

Source – CAG, annual reports of PSUs, State Government Budget documents

కాగ్, రాష్ట్ర బడ్జెట్ కాపీలు వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర విభజన నాటికి ఉన్న అప్పు 1,40,717 కోట్లు కాగా, 2014 నుంచి 2019 మార్చి 31వరకు ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం రూ.2,49,350 కోట్లు అప్పు చేసింది. ఆ ఐదేళ్లలో పెరిగిన అప్పులు 22.63 శాతం. అదే జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పు రూ.3,32,671 కోట్లు కాగా, పెరిగిన అప్పు కేవలం 13.57 శాతమే.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

Reliance
Growth is Life
SMART BAZAAR
ఉంది కదా, మరెక్కడికో ఎందుకు వెళ్ళడం?
బాడీ లోషన్ / క్రీమ్ 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹290 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹145 మొదలుకుని
ఏరియల్ మ్యాటిక్ లిక్విడ్ 2 L (టాప్ / ఫ్రంట్ లోడ్) (సెలెక్ట్ వేరియంట్స్)
₹65
ఎమ్ఆర్‌పి ₹335 మొదలుకుని | స్మార్ట్ ప్రైస్ ₹270 మొదలుకుని
హెరిటేజ్ అగ్‌మార్క్ గ్రేడ్ స్పెషల్ ఘీ 1 L
₹629
ఎమ్ఆర్‌పి ₹740 | ఆదా చేసుకోండి ₹111
లూజ్ చక్కెర స్మాల్ 1 kg
₹44
మార్కెట్ ధర ₹50
లూజ్ ఉరద్ వాష్డ్ గోటా 1 kg
₹101
మార్కెట్ ధర ₹105
లూజ్ హైదరాబాదీ బిర్యానీ బాస్మతి రైస్ 1 kg
₹83
మార్కెట్ ధర ₹90
గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
₹41.50 /kg
₹1079
ఎమ్ఆర్‌పి ₹1800 | ఆదా చేసుకోండి ₹721
₹40.34 /kg
KURNOOL
Popular
Sona Masoori
కర్నూలు సోనా మసూరి రైస్ 26 kg ఎమ్ఆర్‌పి ₹1650
₹1049
ఆదా చేసుకోండి ₹601
ఆధార్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 800 g
₹132
ఎమ్ఆర్‌పి ₹180 | ఆదా చేసుకోండి ₹48
ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ చిట్ ఆటా 5 kg
₹289
*ఏదైనా వంట నూనెపై ₹15 తగ్గింపు పొందండి
ఎమ్ఆర్‌పి ₹358 | ఆదా చేసుకోండి ₹69
ఆశీర్వాద్ / ఈస్టర్న్ / ఆచి స్పైసెస్ 50 g మొదలుకుని / బేసన్ / మైదా / సుజీ / గుడ్ లైఫ్ సోయా చంక్స్ 200 g మొదలుకుని (ఎంపిక శ్రేణి)
BUY ANY 1 GET ANY 1 FREE*
*ఎం ఎమ్ఆర్‌పి
గుడ్ లైఫ్ బాదం 500 g
₹425
ఎమ్ఆర్‌పి ₹620 | ఆదా చేసుకోండి ₹195
మామాఎర్త్ షాంపు 400 ml + కోల్గేట్ టోటల్ టూత్‌పేస్ట్ 280 g + పియర్స్ ప్యూర్ అండ్ జెంటిల్ సోప్ 125 g x 4 + 1 (సెలెక్ట్ వేరియంట్స్)
Combo @ ₹599
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1274 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹675 మొదలుకుని
కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ 500 g
₹90
ఎమ్ఆర్‌పి ₹310 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹220 మొదలుకుని
డవ్ / ఫియామా సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹398 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹267 మొదలుకుని
బేబీ కేర్ (ఎంపిక శ్రేణి)
కనీసం 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹222 మొదలుకుని
బిస్కెట్స్ ప్యాక్ 230 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹125 మొదలుకుని /యూనిట్
తాజ్ మహల్ టీ 500 g
₹71
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹309 మొదలుకుని
సఫోలా యాక్టివ్ హనీ 1 kg
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹550 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹275 మొదలుకుని
సన్‌ఫీస్ట్ యిప్పీ! మేజిక్ మసాలా నూడుల్స్ 700 g
₹75
ఎమ్ఆర్‌పి ₹180 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹105 మొదలుకుని
యూనిబిక్ / ఇలైట్ ప్లమ్ కేక్ 330 g (సెలెక్ట్ వేరియంట్స్)
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹240 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹120 మొదలుకుని
బూస్ట్ / హార్లిక్స్ 1 kg
₹120
ఎమ్ఆర్‌పి ₹534 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹414 మొదలుకుని
HAPPY LIVING Ulhaas TRIDENT
డబల్ బెడ్ షీట్ సెట్ (సెలెక్ట్ వేరియంట్స్)
₹499
ఎమ్ఆర్‌పి ₹1499 మొదలుకుని
cello LA OPALA LARAH
లూజ్ స్టీల్ / ఓవల్ వేర్ / మెలమైన్ డిన్నర్ సెట్ (ఎంపిక శ్రేణి)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹39 మొదలుకుని
కనీసం 5% తక్కువ ఎమ్ఆర్‌పి పై ప్రతిరోజు
చక్కెర 1kg ₹9* ప్రతిరోజు
పెద్ద కూడా లక్ష్యం
ఇప్పుడు తెరవబడింది
SMART SUPERSTORE
SMART BAZAAR
నియమ నిబంధనలు వర్తిస్తాయి. ఇతర ఆఫర్లన్నీ 14 డిసెంబరు 2025 వరకు చెల్లుతాయి.

మాటను నిలబెట్టుకోవటానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలి.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 13 డిసెంబర్ 2025

ట్రంప్ 'శాంతి'కి గ్రహణం

ఎనిమిది యుద్ధాలను ఆపానని స్వోత్కర్షకు పోతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరువు తీసేలా ప్రపంచంలో రెండుచోట్ల మళ్లీ కుంపట్లు రాజుకున్నాయి. సుంకాలు విధిస్తానంటూ బెదిరించి రెండునెలల క్రితం ఆయన ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్ – కంబోడియాల మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఆపి సఖ్యత కుదిర్చారు. ఆ రెండింటి మధ్యా సరిహద్దు సమస్యకు శాంతియుత పరిష్కారం కుదిరిందని ఆర్భాటంగా ప్రకటించారు. తీరా అయిదురోజుల నాడు కంబోడియా మందుపాతరకు తమ సైనికుడు తీవ్రంగా గాయపడటంతో థాయ్ వైమానిక దళం దాడులు ప్రారంభించింది. ఈసారి దాదాపు పదిమంది మరణించగా వేలాదిమంది జనం ప్రాణభయంతో గ్రామాలు విడిచి పెట్టి వెళ్లిపోవాల్సి వచ్చింది. కంబోడియా సైన్యం ప్రతీకార దాడులతో థాయ్ గ్రామాల ప్రజలు కూడా ఖాళీ చేయాల్సి వచ్చింది. మొత్తానికి అటూ, ఇటూ 5 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఆఫ్రికాలో పరస్పరం తలపడుతున్న కాంగో–రువాండాల మధ్య కేవలం వారం క్రితం ట్రంప్ శాంతి ఒప్పందం కుదిర్చారు. కానీ అది కూడా విఫలమైంది. పర్యవసానంగా కాంగోలోని సరిహద్దు గ్రామాలను 2 లక్షల మంది ఖాళీ చేయాల్సి వచ్చింది. రువాండా తిరుగుబాటు సంస్థ ఆ గ్రామాల్లోకి ప్రవేశించిందంటున్నారు.

సమస్య మూలమేమిటో తెలుసుకోకుండా, ఇరుపక్షాలూ ఎలాంటి పరిష్కారాన్ని కోరుకుంటున్నాయో గ్రహించకుండా, అందుకు ఏర్పడుతున్న అడ్డంకులేమిటో అర్థం చేసుకోకుండా... ఒక ఫోన్ కాల్‌తో, ఒకటి రెండు బెదిరింపులతో అంతా సమసిపోతుందనుకుంటే అవి మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ట్రంప్ దౌత్యం విఫలం కావటానికి కారణం ఇదే. ఇరుగు పొరుగు దేశాల మధ్య భూభాగం గురించే ప్రధానంగా ఘర్షణలుంటాయి. థాయ్‌లాండ్–కంబోడియాల సమస్య కూడా అదే! రెండు దేశాలకూ 817 కిలోమీటర్ల పొడవునా సరిహద్దు ఉంది. ఫ్రాన్స్ దురాక్రమణలో కంబోడియా ఉండగానే వందేళ్ల క్రితం థాయ్‌లాండ్‌తో పేచీ ఏర్పడింది. 1953లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దాన్ని పరిష్కరించుకుందామని కంబోడియా ప్రయత్నిస్తోంది. కానీ రెండువైపులా పుట్టు కొచ్చే జాతీయవాద ధోరణులు అందుకు అడ్డంకిగా మారాయి. 2008లో వివాదాస్పద భూభాగంలోని 11వ శతాబ్దం నాటి హిందూ దేవాలయాన్ని యునెస్కో ప్రపంచ వార సత్వ సంపదల జాబితాలో చేర్చినప్పుడు అది తమదేనని కంబోడియా ప్రకటించు కోవటంతో ఘర్షణలు తలెత్తాయి. వాస్తవానికి 1962లోనే ఆ భూభాగం కంబోడియా దేనని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. కానీ అందుకు థాయ్‌లాండ్ ససేమిరా అంటున్నది.

మొన్న జూలైలో ఇరువైపులా 50 మంది మరణానికి దారితీసిన ఘర్షణలు రాజుకున్నప్పుడు అప్పటి థాయ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా, కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలు లీక్ అయ్యి ఆమె పదవి పోగొట్టుకున్నారు. తమ సైన్యం కూడా సరిగా వ్యవహరించటం లేదని ఆమె అంగీకరించటం దేశంలో పెద్ద దుమారం లేపింది. నాలుగు దశాబ్దాలు దేశాన్నేలిన హున్ సేన్ ఇప్పటికీ ప్రస్తుత ప్రధాని, తన కుమారుడు హున్ మానెట్‌ను తెర వెనక ఉండి నడిపిస్తుంటారు. ఆయనతో మాట్లాడితే తప్ప సమస్య పరిష్కారం కాదని షినవత్రా అనుకోవటం కొంప ముంచింది. తాజా వివాదం పర్యవసానంగా కంబోడియా పౌరులను దేశంలోకి రానీయకుండా థాయ్‌లాండ్ సరిహద్దుల వద్ద అడ్డుకుంటుండగా, థాయ్ సినిమాల ప్రసారం, అక్కడి పండ్లు, కూరగాయలు, గ్యాస్, ఇంధనం రాకుండా కంబోడియా నిలిపేసింది.

థాయ్–కంబోడియా ఘర్షణలైనా, కాంగో–రువాండాల కొట్లాట అయినా ప్రత్యర్థి దేశాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించినప్పుడే పరిష్కారమవుతాయి. దాదాపు అన్ని దేశాల్లోనూ అధికారం కోసం జాతీయవాద ధోరణులు రెచ్చగొట్టడం వల్ల సమస్య లొచ్చిపడుతున్నాయి. థాయ్‌లాండ్‌లో వచ్చే ఫిబ్రవరి 6న ఎన్నికలు జరగబోతున్నాయి. గతంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, దేశాన్ని రక్షించేది తామేనని చెప్పటానికి కంబోడియాపై యుద్ధభేరి మోగించటంతో పాటు పాలకపక్షం శుక్రవారం పార్లమెంటును రద్దు చేసింది. మళ్లీ ఇరుపక్షాల మధ్యా రాజీ కుదురుస్తానని ట్రంప్ చెబుతున్నా ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.నవమి రా.7.25 వరకు తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.9.33 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.6.25 నుండి 8.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.24 నుండి 7.53 వరకు, **అమృత ఘడియలు:** తె.4.36 నుండి 6.20 వరకు (తెల్లవారితే ఆదివారం).

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

సరైనది

మా నాన్న (గుల్జార్) ఆలోచనలు సినిమాల్లో, నిజ జీవితంలో చాలా నిశితంగా, నిరాడంబరంగా ఉంటాయి. నా బాల్యంలో ఆయన దర్శకత్వం వహించిన 'ఇజాజత్' చిత్రంలో ఒక డైలాగ్ ఉంటుంది. "ఏది సరైనదో అదే చెయ్యి" అని! నేను అదే పాటిస్తున్నాను.

– మేఘనా గుల్జార్, రచయిత్రి – దర్శకురాలు

చేస్తాను

జీవితమంటే డబ్బు, పేరు మాత్రమే కాదు. అంతకు మించి! తలకు ఖరీదైన నూనె, షాంపూ, బ్రాండెడ్ దుస్తులు పైపై మార్పుల వరకు మాత్రమే తోడ్పడగలవు. అదీ కొన్నాళ్లే! మహిళల హక్కుల కోసం నిజంగా నాకు ఏదైనా చేయాలని ఉంది.

– స్వస్తికా ముఖర్జీ, నటి

ఘర్షణలు



మనం ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. యుద్ధం ఎవరికీ లబ్ధిని చేకూర్చదు. యుద్ధంలో విజయం సాధించినా సరే, విజయం కంటే కూడా యుద్ధగాయాలే ఎక్కువ కాలం మన మననంలో ఉండిపోతాయి. వ్యక్తిగత జీవితంలోని ఘర్షణలు కూడా అంతే!

– ఆండ్రూస్ తళత్, బిషప్

ప్రాక్టీస్

సినిమాల్లో సక్సెస్ అదృష్టాన్ని బట్టి ఉండదు. పాత్రకు ప్రాణం పెట్టటం కోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి. పల్లెటూరి అమ్మాయి మొదలు రాణిగారి పాత్ర వరకు అన్నీ చేశాను. అవన్నీ నాకు నేర్పించిన పాఠం ఒకటే... సాధన చేస్తేనే కలలు సాకారమవుతాయి.

– లక్ష్మి, నటి

తాత్సారం

గొప్ప పనిలో మూడు అంశాలు కలిసి ఉంటాయి. సామర్థ్యం, సాధన, కృషి. మీరు కేవలం రెండిటితో బాగా చేయగలరు. కానీ అత్యుత్తమంగా పని చేయటానికి ఈ మూడూ అవసరం. ముఖ్యమైన పనుల విషయంలో తాత్సారం వీడండి. సమయాన్ని సద్వినియోగం చేసుకోండి.

– పాల్ గ్రాహం, కంప్యూటర్ సైంటిస్ట్

ప్రాధాన్యం

నేను బౌలింగ్ చేసేటప్పుడు వికెట్‌లు పడగొట్టటం పైన కన్నా, పరుగులు ఇవ్వకుండా ఉండటం పైనే నా దృష్టి ఉంటుంది. ప్రత్యర్థి పరుగులు తీస్తూపోతుంటే, మనం ఎన్ని వికెట్‌లు పడగొట్టుకుంటూ పోయినా లాభం ఉండదు. అందుకే పరుగుల్ని కట్టడి చేస్తాను.

– సునీల్ నరైన్, వెస్టిండీస్ ఆఫ్–స్పిన్ బౌలర్

'ఆత్మనిర్భరత'కు రష్యాయే ఆలంబన

విశ్లేషణ

సి. ఉదయ భాస్కర్

ఉక్రెయిన్‌పై యుద్ధం 2022లో మొదలెట్టిన తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల న్యూఢిల్లీకి రెండు రోజుల పర్యటనపై వచ్చి వెళ్ళడం ఇదే మొదటి సారి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆతిథేయిగా వ్యవహరించిన ఈ శిఖరాగ్ర సమావేశం రెండు దేశాల మధ్య చెక్కు చెదరకుండా నిలిచిన వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని తెలియజేసింది. ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో శ్రీకారం చుట్టుకున్న సహకారాన్ని ఉభయ దేశాలు కొన్ని దశాబ్దాలుగా పెంపొందించుకుంటూ వస్తున్నాయి.

ఉక్రెయిన్‌పై యుద్ధానికిగాను రష్యా అధ్యక్షుడిని ఏకాకిని చేయాలని అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ)లు కోరుకోవడంతో ఈ సమావేశంపై ప్రపంచ వ్యాప్తంగా గణనీయమైన ఆసక్తి వ్యక్తమైంది. ఉక్రెయిన్‌పై యుద్ధ నేరాలకు సంబంధించి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పుతిన్‌కు అరెస్టు వారంట్లు జారీ చేసింది. అయినా ఘనంగా, సంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలకాలన్న భారత్ నిర్ణయంలో స్వీయ వ్యూహాత్మక ప్రాధాన్యముంది.

రష్యా నుంచి చమురు దిగుమతులను, రక్షణ సామగ్రి కొనుగోళ్ళను తగ్గించుకోవాలని అమెరికా నుంచి మనపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ పర్యటన చోటుచేసుకుంది. తమ సంబంధాలు 'బాహ్య ఒత్తిడులకు లోబడేవి కావు' అని రెండు పక్షాలూ పునరుద్ఘాటించాయి. ఉభయ సేనల మధ్య సాంకేతిక సహకారం ఒక ముఖ్య అంశంగా కొనసాగుతోందని సంయుక్త ప్రకటనలో నామమాత్రంగా ప్రస్తావించి వదిలేశారు. రష్యా నుంచి వచ్చిన ఆయుధాలు, ఇతర రక్షణ సామగ్రి నిర్వహణకు 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం కింద టెక్నాలజీ బదలీ ద్వారా భారతదేశంలోనే స్పేర్ పార్టులు, పరికరాలు, చిన్నాచితక వస్తువులు, ఇతర ఉత్పత్తులను సంయుక్తంగా తయారు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు. భారత సాయుధ దళాల అవసరాలు తీర్చేందుకు సంయుక్త సంస్థలను నెలకొల్పాలని నిర్ణయించారు.

భారత–రష్యా రక్షణ సంబంధాలు కొనుగోలుదారు–విక్రేతకు మధ్య ఉండే వాటికన్నా మించిన స్థాయిలో ఉన్నట్లు మోదీ–పుతిన్ శిఖరాగ్ర సమావేశం సంకేతాలు ఇచ్చింది. భారత్ 1960ల మధ్యలో సోవియట్ యూనియన్ నుంచి గణనీయంగా సైనిక హార్డ్ వేర్ (మొదటి మిగ్ పోరాట విమానం, పెత్యా/కమోర్త తరగతి నౌకలు, ట్యాంకులను) సమీకరించుకున్నప్పటికీ, తన సన్నిహిత మిత్రుని నుంచి డిజైన్ పరిజ్ఞానాన్ని ఎన్నడూ పొందలేకపోయింది.

◆ భారత–రష్యా రక్షణ సంబంధాలు కొనుగోలుదారు – విక్రేతకు మధ్య ఉండే వాటి కన్నా మించిన స్థాయిలో ఉన్నట్లు మోదీ–పుతిన్ శిఖరాగ్ర సమావేశం సంకేతాలు ఇచ్చింది. భారత్ 1960ల మధ్యలో సోవియట్ యూనియన్ నుంచి గణనీయంగా సైనిక హార్డ్‌వేర్ సమీకరించుకున్నప్పటికీ, తన సన్నిహిత మిత్రుని నుంచి డిజైన్ పరిజ్ఞానాన్ని ఎన్నడూ పొందలేకపోయింది.

ఆ విధంగా సోవియట్/రష్యా మూలాలున్న పరికరాలలో చాలా భాగం భారతదేశంలో 'తయారైనట్లు' పైకి కనిపించినప్పటికీ, అది చాలా వరకు దిగుమతి చేసుకున్న కిట్లు/కాంపొనెంట్ల కూర్పునకు మాత్రమే పరిమితమైంది. ఆయుధాల ఫ్యాక్టరీలలో, లేదా హిందూస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్.ఎ.ఎల్)లో సాగింది ప్రాథమికంగా విడి భాగాల అసెంబ్లింగ్ కలాపం మాత్రమే. రివర్స్–ఇంజనీరింగ్ లేదా దేశీయ డిజైన్ చేపట్టేందుకు జరిగిన కృషి అతి స్వల్పం లేదా అసలు ఏమీ లేదనే చెప్పాలి.

చైనాతో పోల్చుకుంటే, డిజైన్ డొమైన్‌లోకి దిగడంలో అశక్తత /విముఖత కనిపిస్తుంది. సోవియట్ హయాం నాటి సైనిక సామగ్రిని చైనా ఎంతో విజయవంతంగా రివర్స్–ఇంజనీరింగ్ చేసి విజయం సాధించింది. సుఖోయ్ ఎస్ యు–27 ఫ్లాంకర్ ను ఆధారం చేసుకుని అది షెన్యాంగ్ జె–11యుద్ధ జెట్ విమానాన్ని అభివృద్ధి చేసింది. లైసెన్సు పొందిన ఉత్పత్తి ఒప్పందం కింద పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ 1990లలో రష్యా నుంచి సు–27 ఎస్కే యుద్ధ విమానాలను సమీకరించింది. తర్వాత, రష్యా సరఫరా చేసిన కిట్లను ఉపయోగించుకుని, 2000ల మధ్య నాటికి ఆ విమాన రివర్స్–ఇంజనీరింగ్‌లో సఫలమై జె–11ఎ విమానాలుగా తయారు చేసింది.

సు–27 సోవియట్ యూనియన్‌లో 1970లలో డిజైన్ అయి, 1985లో సర్వీసులో ప్రవేశించింది. ఈ సోవియట్ టెక్నాలజీని మక్కికి మక్కి కాపీ కొట్టి చైనా జె–11 తయారు చేసుకుంది. డిజైన్‌లో సాధించిన ఈ పురోగతితో చైనా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుంది. స్వయం సమృద్ధిని సమీకరించుకుంది. తర్వాత, ఇదే యుద్ధ విమానాన్ని పాకిస్తాన్ (అదే పెద్ద కొనుగోలుదారు)కు విక్రయించింది.

భారత్ మొదటి సుఖోయ్ సు–30ని 1997లో సమీకరించుకుంది. కానీ, దేశంలో అప్పట్లో ఉన్న పరిస్థితుల రీత్యా, దిగుమతులపై ఆధారపడడం కొనసాగింది. యుద్ధ విమాన (రఫేల్) ప్రత్యామ్నాయ సరఫరాదారుగా ఫ్రాన్స్ ముందుకొచ్చింది. పుతిన్ పర్యటనతో ఐదవ తరం సు–57 యుద్ధ విమానాలపై మళ్ళీ ఆసక్తి రేగుతోంది. భారత్ సోర్స్ కోడ్ యాక్సెస్‌ను, స్టెల్త్ ఉన్నతీకరణలను కోరుతోంది. దీన్ని సమీకరించుకోవడం వల్ల దేశీయ 'తేజస్'కు ఏమైనా ఊతం చేకురుతుందా అనేది ఇప్పుడే చెప్పలేం.

వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన కొన్ని నవీన రంగాలలో అమూల్యమైన సాంకేతిక పరిజ్ఞాన సహాయాన్ని మాస్కో (సోవియట్ యూనియన్‌గా ఉన్నపుడు, ఆ తర్వాత కూడా) భారతదేశానికి సమకూర్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. క్షిపణులు, అణుశక్తి చోదిత జలాంతర్గత ప్రొపల్షన్ (ఐ.ఎన్.ఎస్. అరిహంత్) అందుకు నిదర్శనం. ఇక సంయుక్త రంగ బ్రహ్మోస్‌ది దిగ్విజయమైన గాథ. తేలిక రకం బ్రహ్మోస్‌ను తయారు చేయడం ప్రస్తుత సమావేశ చర్చనీయాంశాలలో చేరింది. ప్రధాన సైనిక సామగ్రి డిజైన్, తయారీ పరిజ్ఞానం ఒక దేశాని కుండే వజ్ర వైడూర్యాల లాంటివి. ఇది అలమారాలో పెట్టి అమ్మే పరిజ్ఞానం కాదు. అందుకనే, భారత–రష్యాల మధ్య సైనిక సరఫరాలలో ఎంత పటిష్ఠమైన బంధం ఉన్నా డిజైన్ పరిజ్ఞానాన్ని పంచుకోవడమన్నది లేదు.

ఆత్మనిర్భరతను వీలైనంత త్వరగా, పటిష్ఠంగా ముందుకు తీసుకెళ్ళే దృఢ నిశ్చయాన్ని భారత్ కనబరిస్తే పుతిన్ పర్యటన తదనంతర ఫలాలపై ఆశ పెట్టుకోవచ్చు. నిజంగానే, రెండు దేశాలు రక్షణ రంగ పరిశోధన–అభివృద్ధిలో, వస్తూత్పత్తిలో సహకారముంటే మరింత ప్రగతిని సాధించవచ్చు. కానీ, ఈ విషయంలో భారత్ తొలగించుకోవలసిన సాలెగూళ్ళు చాలానే ఉంటాయి.

మాస్కోకి కూడా ఢిల్లీతో గాఢమైన సైనిక సహకారం విషయంలో కొన్ని లక్ష్మణ రేఖలున్నాయి. అది బీజింగ్ సందేహాలను కూడా తీర్చవలసి ఉంటుంది. అదే మాదిరిగా, భారత్ కూడా రష్యాతో కలసి అడుగులేయడంలో అమెరికా పెడుతున్న తంపులను గుర్తెరిగి ప్రవర్తించవలసి ఉంటుంది. పుతిన్ పర్యటన ద్వైపాక్షిక స్నేహ సంబంధానికి మెరుగులు దిద్దింది. కానీ, రెండు దేశాలకూ కొత్త సవాళ్ళు కూడా ముందుకొచ్చి నిలుస్తున్నాయి.

వ్యాసకర్త రక్షణ వ్యవహారాల నిపుణుడు;
సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్

ఓపెన్ చెరసాల కాదు... అది ఉత్తమ కళాశాల!

నేను 1983లో నాగార్జున సాగర్‌లోని ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో సీటు దొరికిందని తెలిసి ఎంతో సంతోషించాను. రాష్ట్రంలో అప్పటికి అదొక్కటే ఆ తరహా కళాశాల. రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో ఎప్పుడూ నెంబర్ వన్. అందువల్ల ఒక వైపు ఆనందం. ఇంకోవైపు కించిత్ గర్వం. అలా ఆ మూల ఉత్తరాంధ్రలోని మారుమూల పల్లె సాలూరు నుండి పల్నాడు చివర నాగార్జునసాగర్‌కి పయనం సాగింది. అంతవరకూ తాడికొండ గురుకుల పాఠశాలలో గడిపిన మూడేళ్ల రోజుల్ని 'సెంట్రల్ జైలు'గా భావించిన నేను, 'ఇంతకు మించి ఏముంటుంది లే, బహుశా ఓపెన్ జైలులా ఉండొచ్చ'ని అనుకుంటూ కాలేజీలో అడుగుపెట్టాను.

అయితే వారంలోనే అది ఓపెన్ చెరసాల కాదు, ఉత్తమ భవిష్యత్ తయారీశాల అని అర్థమై గొప్ప ఊరట కలిగింది. ఆదివారంతో బాటు, పండగ సెలవొస్తే చాలు... విజయపురి సౌత్‌లో రామకృష్ణ థియేటర్, అందులోంచి ఆట మొదలవ్వడానికి ముందు వినిపించే 'నమో వేంకటేశా 'పాట తెచ్చిన ఉత్సాహం, భాను వీడియో అంటూ బస్టాండ్ దగ్గర ఉన్న వీడియో థియేటర్, డ్యామ్‌కి అటు చివర మూడు కిలోమీటర్ల దూరంలోని హిల్ కాలనీ వరకూ క్రమం తప్పని పాదయాత్ర... అన్నీ నిన్నమొన్నటి విషయాల్లాగానే ఉన్నాయి.

ఇక, మా సీనియర్లు ఎవ్వరూ ర్యాగింగ్ చెయ్యలేదు... కాకపోతే అందరినీ 'సర్' అని పిలవాలి. మా బోటనీ సర్ ఎప్పుడూ 'ఇలాగే చదువు, నువ్వు డాక్టర్ అయిపోయినట్టే' అంటూ ప్రోత్సహించేవారు. అభిమానం కనబడేది. రెండుసార్లు టీచర్స్ డేకి నేను బోటనీ క్లాస్ తీసుకున్నాను (పిల్లలతో ఆ రోజు చెప్పించేవారు). క్లాస్ లాస్ట్‌లో ఆయన్ని అనుకరిస్తూ గొంతు మార్చి కామెడీ చేస్తే ఒక్కడు కూడా నవ్వలేదు. ఏమిటా అని చూస్తే ఆయన ఎప్పుడు వచ్చి కూర్చున్నారో తెలియదు కానీ లాస్ట్ బెంచ్ నుండి లేచి వచ్చారు. బిక్కచచ్చిన నన్ను 'వెరీ గుడ్' అంటూ కదిలిపోయారు. ఇంకోసారి ఇంగ్లీష్ సర్ దివాకర్ గారు బోర్డు వైపు తిరిగి క్లాస్ చెప్తుంటే ఏదో చిన్నతనపు అల్లరి చేశాం. ఆయన చూడలేదనుకున్నాం. కానీ ముద్దాయిలందరినీ లేపారు. నన్నులేపి 'చేసిందంతా చేసి, ఎంత అమాయకపు మొహం పెట్టావు రా నాయనా' అని నవ్వేశారు.

చాలా చిక్కని స్నేహాలు. అరమరికలు లేనివి. ఇంట్లోంచి తెచ్చుకున్న ఊరగాయలు, జంతికలు ఉమ్మడి ఆస్తి. కలిసి పోటీగా చదువుకోవడం, ఒకరి డౌట్లు ఒకరు తీర్చుకోవడం మాత్రమే కాదు... ఆటలైనా, పాటలైనా, షికార్లయినా, జట్లుగానే! రష్యా, ఉక్రెయిన్ స్థాయిలో గొడవపడినా రెండో రోజుకి సంధి కుదిరిపోవాల్సిందే. ఒకసారి సెలవులు ఇచ్చిన టైమ్‌కి వరదలు. ట్రైన్లు లేక బస్సుల్లో బయలుదేరాం. అవి కూడా డైరెక్ట్‌గా లేవు. ఉత్తరాంధ్ర వాళ్ళం నలుగురం కలిసి రాజమండ్రి చేరుకున్నాం. ఎవరి దగ్గరా డబ్బులు మిగల్లేదు. అయినా భయం లేదు. అందులో రవిది వైజాగ్. ధైర్యం చెప్పాడు. 'నా చేతికి వాచీ ఉందిరా, ఏం ఫరవాలేదు' అని. బస్టాండ్‌లో ఒకాయన్ని పరిచయం చేసుకుని, పరిస్థితి చెప్పి మా నలుగురికీ టికెట్స్ తీయమని చెప్పాడు. తన వాచీ ఉంచుకుంటే, తర్వాత రోజు కలిసి డబ్బులిచ్చి రిటర్న్ తీసుకుంటానన్నాడు. ఆయన 'అదేమీ వద్దులే ' అని చెప్పి మాకు టికెట్స్ తీసి ఇచ్చాడు. మేం వైజాగ్‌లో రవి ఇంటికి చేరిపోయి, వారి ఆతిథ్యం పొంది, మరుసటిరోజు మా ఇళ్లకు చేరాం.

ఇలా చెప్తూ పోతే బోలెడు. నా పేరు అచ్చులో చూసుకోవడం మొదటిసారి అక్కడే. 'ఆశాజీవులు' అని కవిత రాస్తే ఆ సంవత్సరం మేగజైన్‌లో అచ్చయింది. చదువుతో బాటు అందమైన అనుభవాలు, స్నేహాలు, జీవిత పాఠాలు మిగిల్చిన మా 'ఏపీ గురుకుల జూనియర్ కళాశాల' మా అందరికీ ఉన్నతి కలుగ జేసిన మేధా తయారీ శాల.

– డా॥ డి.వి.జి. శంకరరావు । పార్వతీపురం మాజీ ఎంపీ
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాల ఆరంభమై రేపటికి 50 ఏళ్ళు)

జన కవితా జ్వాల

ఇన్ బాక్స్

దిగంబర కవిగా, విప్లవ కవిగా, మహావక్తగా దేశం పట్టనంత పేరు సాధించిన వ్యక్తి 'జ్వాలాముఖి'గా ప్రసిద్ధులైన వీరవెల్లి రాఘవాచారి. 1938 ఏప్రిల్ 12న హైదరాబాద్ సీతారాంబాగ్ ఆలయంలో జన్మించారు. వృత్తిరీత్యా హైస్కూల్ ఉపాధ్యాయునిగా, కళాశాల లెక్చరర్‌గా పనిచేశారు. 'విరసం', 'జనసాహితి' వ్యవస్థాపక నాయకులలో ఒకరిగా, 'ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ', 'గ్రామీణ పేదల సంఘం'లో చురుకైన కార్యశీలిగా, 'భారత–చైనా మిత్రమండలి' కేంద్ర నాయకునిగా సాహితీ రంగంలోనూ సామాజిక కార్యాచరణలోనూ జీవితాంతం కృషిచేశారు.

జ్వాలాముఖి

జన విప్లవాల జయం పట్ల విశ్వాసం, మానవాళి మహాప్రస్థానంలో మరో మంచి ప్రపంచాన్ని నిర్మించుకోగలదనే అపారమైన నమ్మకం ఆయన సాహిత్యానికి ఆయువు పట్టు. 'ప్రపంచ తమస్సుల హతమార్చే /ప్రచండ జాజ్వల్య తేజస్సువుగా/కరాళ శతాబ్దాల కర్కశ ఫాలంపై కాంతిపూరిత అమృతోషస్సువుగా' మారమని మనిషికి ఆయన ఇచ్చిన కవితా సందేశం. ఒక రకమైన నిర్వేదం, నిరాశ సమాజాన్ని కమ్ముకుంటున్న వేళ ఆయన సాహిత్యాన్ని తిరిగి చదువుకోవటం అవసరం. ''వంచితులున్నారు, ఒక్కటై హెచ్చరిస్తారు/ పీడితులున్నారు పిడికిలి బిగిస్తారు'' అని ఆయన కవిత్వం మనలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది.

వర్గ పోరాట విక్రమంలో, దీర్ఘకాలిక సాయుధ విప్లవ బాటలో వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే భారత జనతా ప్రజాతంత్ర విప్లవ మార్గంలో, ఆ చైతన్యాన్ని మేల్కొలుపుతూ ఆయన దేవులపల్లి వేంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి రూపొందించిన భారత విప్లవ పంథా పట్ల నిబద్ధులై జీవించారు. ఆ సామాజిక విప్లవానికి తోడుగా, భూమికగా సాహితీ సాంస్కృతిక విప్లవ ఉద్దీపనకు నిరంతరం కృషిచేశారు.

జ్వాల తన కవితాయానపు తొలి రోజుల్లో–1958 జనవరి 30 నుండి రాసిన 'మనిషీ' దీర్ఘకవితకు పెద్దల ప్రశంసలు లభించాయి. 'నీ కవిత్వం మానవత్వంలో నవత్వం/ నీ నవత్వం మానవత్వంలో కవిత్వం / ఫలిస్తుంది బాలమునీ నీ తపస్సు' అని కరుణశ్రీ ఆశీస్సులు అందజేశారు. వైరుధ్యాల మధ్య సంఘర్షణల ద్వారా పొందిన భావపరిణామ వికాస ప్రతిఫలనం, జ్వాలాముఖి సుదీర్ఘ కవితాయానం 'కవితాజ్వాల'. ఆయన కవిత విముక్తి పోరాటం. అందుకే ఈనాడు ఆయన కవితలు విప్లవాభిమానుల తలపులలో కొస్తున్నవి. కాబట్టే 'జ్వాల ప్రచురణలు' ఆ కవితా సంకలనాన్ని మరోమారు ముద్రించి కొత్తతరం పాఠకులకు అందిస్తున్నది.

– డా॥ యస్. జతిన్ కుమార్ (రేపు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జ్వాలాముఖి వర్ధంతి సభ, 'కవితాజ్వాల' మలి ముద్రణ ఆవిష్కరణ)

సురక్షితంగా మన దేశానికి...

డేటా పాయింట్

కేంద్ర ప్రభుత్వం సంక్షోభ పరిస్థితులు నెలకొన్న ఉక్రెయిన్, ఇజ్రాయెల్ దేశాల నుంచి గత మూడేళ్లలో 28,169 మందిని సురక్షితంగా భారతదేశానికి తీసుకు వచ్చింది.

ప్రధాన ఆపరేషన్లు:

సంవత్సరం, నెల	దేశం	ఆపరేషన్ పేరు	తీసుకొచ్చినవారు
2022 ఫిబ్రవరి	ఉక్రెయిన్	గంగ	18,282
2023 మే	సూడాన్	కావేరి	4,097
2023 అక్టోబర్	ఇజ్రాయెల్	అజయ్	1,343
2025 జూన్	ఇరాన్, ఇజ్రాయెల్	సింధు	4,415

ఆధారం: లోక్‌సభలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ

సాన్నిధ్యం

జ్యోతిర్మయం

సాన్నిధ్యం అంటే సమీపం అని అర్థం. దీని భావం, భావన ఎంతో లోతైనది. విశాలమైనది. సాన్నిధ్యం అంటే దగ్గరగా ఉండటం అనేది సాధారణ అర్థం. ఒక వ్యక్తి ప్రభావం, ఒక ఆలోచన, ఒక దైవ భావన, ఒక ప్రకృతి శోభ మనసుకు గాఢంగా తాకినపుడు కలిగే అనుభూతి సాన్నిధ్యం. వెలుగు... చీకటికి సాన్నిధ్యం. అలాగే మనలను ఇష్టపడే వ్యక్తి మన పక్కన ఉంటే కలిగే భద్రతాభావం సాన్నిధ్యం. అలాగే కష్టాలలో, సమస్యలలో దైవం మన పక్కనే ఉన్నారనే భరోసా మనను భద్రతా భావంలో ఉంచుతుంది. ఒక నిశ్చింత కలిగి, ఆయన రక్షణ ఉందనే ఊరట కలుగుతుంది. ఉపవాసమంటే భగవంతుని సమీపంలో ఉండటం అని అర్థం. అలా ఉండటం వల్ల మన ఆలోచనలు ఆయన చుట్టూ తిరుగుతూ ఉంటాయి. భగవంతుని సన్నిధిలో మనకు ఒక ప్రశాంతత ఏర్పడుతుంది. అది ఒక నిశ్చింత నిస్తుంది. మన భక్తి వెల్లివిరుస్తుంది.

కొందరు భౌతికంగా మన దగ్గర లేకపోయినా మనసులో వారి ఆలోచన, వారి జ్ఞాపకాలు, వారి మాటల ప్రతిధ్వని సదా మనతో ఉంటుంది. ఇది కూడా వారి సాన్నిధ్యమే. సాహిత్య సాన్నిధ్యం చాలా గొప్పది. ఒక కథ లేదా కావ్యంలోని పాత్ర మనలను ప్రభావితం చేసినపుడు, ఒక కవితలో పాదం మన హృదయాన్ని తాకినపుడు రచయితకు, మనకు ఒక సాన్నిధ్యం ఏర్పడుతుంది. తెర మీద నాటకాన్ని చూస్తున్నప్పుడు ఆ పాత్ర ఏడిస్తే ఏడుస్తాం. నవ్వితే నవ్వుతాం. సీతమ్మ కష్టాలు చూసి కన్నీళ్లు పెట్టుకుని చలించిపోయినవాళ్లెందరో! నాటకాన్ని వీక్షిస్తున్నప్పుడు పాత్రలతో ఆ సాన్నిధ్యాన్ని అనుభవిస్తారు. ఎవరి అస్తిత్వం మనలో ఆత్మీయతను కలిగిస్తుందో, ఎవరితో ఉన్నపుడు మన హృదయం ప్రశాంతంగా, ఆహ్లాదంగా మారుతుందో ఆ పరిచయమూ సాన్నిధ్యమే!

దైవ సాన్నిధ్యం మనసును నిలబెట్టి, మనోబలాన్నిచ్చే నిశ్శబ్ద శక్తి. మంచివారి సాన్నిధ్యం అనేది మన భావాలను నిర్మలం చేస్తుంది. మనలను మంచి మార్గంలో ఉంచేందుకు ప్రయత్నిస్తుంది. మన భయాలను పారదోలుతుంది. మనిషి జీవితాన్ని అర్థవంతం చేసే గొప్ప అనుభూతి, ఊతం... సాన్నిధ్యం!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

తెలుగు భాషకు నూతన జీవం పోసిన అక్షర యోగి సీపీ బ్రౌన్

సీపీ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: భాషోద్యమానికి భౌతిక పాదులు వేసిన, తన మాతృ భాషకంటే మన తెలుగును ఎక్కువగా ప్రేమించి భాషకు నూతన జీవం పోసిన అక్షర యోగి సీపీ బ్రౌన్ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. 'వేమన శతకాలు, పోతన భాగవతం, పలు పాత కావ్యాలు కాలగర్భంలో కలిసిపోతున్న సమయంలో తన సొంత డబ్బుతో వందలాది తెలుగు గ్రంథాలను ముద్రించి మనకు అందించిన మహనీయుడు ఆయన. శుక్రవారం సీపీ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా నివాళులు' అని వైఎస్ జగన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

నకిలీ మద్యం కుంభకోణంపై స్వతంత్ర ఆడిట్ చేయాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ హయాంలో కుటీర పరిశ్రమలా మారిన నకిలీ మద్యం తయారీ దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులు టీడీపీ నేతలేనని తేల్చి చెప్పారు. సీఎం చంద్రబాబుకి నిజంగా చిత్తశుద్ధి, ప్రజల ఆరోగ్యం మీద శ్రద్ధ ఉంటే.. మద్యం కుంభకోణంపై స్వతంత్ర ఆడిట్ చేయడంతో పాటు, జయచంద్రారెడ్డి సహా మద్యం కేసులో ప్రమేయమున్న టీడీపీ నేతలపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... 'ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలో నకిలీ మద్యం తయారు చేసి, పాలవ్యాన్లలో సరఫరా చేసినా పోలీసులు ఎందుకు పట్టుకోలేకపోయారు. ప్రజలే నకిలీ లిక్కర్ దందాను బయటపెట్టగా, పోలీసులు విధిలేక కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రజలే విజిల్ బ్లోయర్లు. నకిలీ మద్యం వ్యవహారంలో తమ పార్టీ నేతలే అడ్డంగా బుక్కవడంతో.. డైవర్షన్ కోసం ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమంగా ఈ కేసులో ఇరికిస్తోంది. ఈ నకిలీ మద్యం తయారీలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరధర్ రెడ్డి, మిత్రుడు కట్టా సురేందర్‌లే ప్రధాన పాత్రధారులు. మద్యం కుంభకోణం అక్టోబర్ 3న వెలుగుచూస్తే.. ఎక్కడో దక్షిణాఫ్రికాలో ఉన్న అద్దేపల్లి జనార్ధనరావును 10వ తేదీనే గన్నవరం విమానాశ్రయానికి రప్పించి, పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు మద్యంషాపుల్లో అమ్ముతున్న ప్రతి మూడు మద్యం బాటిళ్లలోనూ ఒకటి నకిలీ మద్యం అని ప్రజలందరికీ తెలిసిపోవడంతో దీన్ని డైవర్షన్ చేయడానికి.. జనార్ధనరావును పిలిపించుకుని, ఆయనను పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఆయనతో వీడియో రికార్డు చేయించి.. నకిలీ మద్యం తయారీ వెనుక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జోగి రమేష్ ఉన్నాడని చెప్పించారు. తద్వారా ఇష్యూ డైవర్ట్ చేయడానికి ప్రయత్నించారు'' అని ఆయన వివరించారు.

నవ దంపతుల బలవన్మరణం

ఏడాదిన్నర క్రితం వివాహం • ఒకే చీరతో ఉరేసుకొని ఆత్మహత్య

తోటపల్లిగూడూరు: నవ దంపతులు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి దళిత కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈదూరు నరేష్(34) మండలంలోని అనంతపురంలో ఉన్న సెంబ్‌కార్ప్ విద్యుత్ ప్రాజెక్ట్‌లో లేబర్ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం మనుబోలు మండలం పిడూరుకి చెందిన ప్రమీల(28)తో నరేష్‌కు వివాహం జరిగింది. ప్రస్తుతం ప్రమీల ఆరు నెలల గర్భిణి. గురువారం అర్ధరాత్రి దంపతులు [illegible] ఇంట్లో ఫ్యాన్‌కు ఒకే చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై వీరేంద్రబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా, దంపతుల బలవన్మరణానికి కారణాలు తెలియడం లేదని, ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నిట్ నెం.17 నుండి 21/2025-26/EE/TW/RW&S&EI works/DB, తేది:06-12-2025
ఏలూరు జిల్లా గిరిజన సంక్షేమము ఇంజినీరింగ్ విభాగము, కె.ఆర్.పురం ఏలూరు జిల్లా పరిధిలో 5 పనులకు గాను (New Bathrooms & Toilets) అంచనా విలువ: రూ.121.00 లక్షలకు గాను ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు ప్రారంభ తేది: 15-12-2025, సా.4.00 గం.ల తరువాత. మిగిలిన వివరాలను **www.apeprocurement.gov.in** నందు చూడవచ్చును. ఫోన్: 9441992131.
సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, గిరిజన సంక్షేమము, కె.ఆర్.పురం
DIPR RO No.18372/CL/Advt/1/1/2021-22, Dt: 12-12-2025

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
e-Procurement TENDER NOTICE
APTRANSCO invites bids online for the work: Spec.No.APT-VJA-e-47/2025-26 for "Replacement of existing ACSR Panther conductor with HTLS Equivalent Panther Conductor (ACSS (RW)) to the existing 132KV Nellore-NV Gardens SC line in S.P.S.R. Nellore District under RMI 24-25". Date & availability of tenders in **www.apeprocurement.gov.in** on 13.12.2025 at 05:00 PM. Phone No.9490154714.
Sd/- Chief Engineer, AP TRANSCO, VIJAYAWADA ZONE
DIPR RO No.4666PP/CL/Advt/1/1/2021-22, Dt:12-12-2025

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No. 38/VMC/CDB/2025-26, Dt. 12-12-2025
Roads, Drain, Culvert, Water supply, repairs & maintenance works (Total 91 Works) - Est. Amount Rs. **2196.69 Lakhs.**
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @ **www.tender.apeprocurement.gov.in.**
Sd/- For COMMISSIONER

గుంటూరు నగరపాలక సంస్థ
"ఇ" - ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇ.టి. నెం. 66/2025-2026 తేది: 11-12-2025
గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్ మెంట్ ప్లాట్ ఫారం ద్వారా షార్ట్ టెండర్ పద్ధతిన రిజిస్టరు కాంట్రాక్టు దారుల నుండి టెండర్ కోరబడుచున్నవి. ఇతర వివరములకు **www.apeprocurement.gov.in (e procurement platform)** వద్ద చూడవచ్చును.
(A) "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఇ.టి. నెం. 66/2025-2026
షార్టు టెండర్ నోటీసు
మొత్తం పనుల సంఖ్య : 11
అంచనా మొత్తం : రూ. 5,68,25,000/-
పనుల వివరములు : పార్కులు
టెండరు బిడ్ రసుటు తేది : 11 12 2025
టెండరు బిడ్లను వేయుటకు ఆఖరుతేది : 18-12-2025
టెండరు బిడ్లను తెరచు తేది : 18-12-2025
Sd/- **Superintending Engineer (FAC)**
Guntur Municipal Corporation

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
'ఇ' ఆక్షన్ లీజింగ్ ద్వారా కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టులు ఇచ్చేందుకు గుంటూరు డివిజన్‌లో కంబైన్డ్ మంత్లీ కేటలాగ్
PUB/1598
భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు IREPS వెబ్ పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-బిడ్లు కోరుతున్నారు. కేటలాగ్స్ వివరాలు దిగువ విధంగా ప్రచురించబడినవి.
సైకిల్/స్కూటర్/కార్ పార్కింగ్ స్టాండ్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ.

క్ర. సం.	కాంట్రాక్ట్ రకం	స్టేషన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	సాధారణ సైకిల్ / స్కూటర్ కం కార్ పార్కింగ్ స్టాండ్	మంగళగిరి(MAG) వెస్ట్	3 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	24-12-2025న 11.00 గం.లు

ఇ-టెండర్లలో పాల్గొనుటకు ireps ఇ-వేలం లీజింగ్‌లో డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుటకు మరియు తమంతటతాము నమోదు చేసుకొనుట టెండరుదారుదే బాధ్యతగా ఉంటుంది. ireps పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో నమోదు చేసుకొనుటకు మరియు పాల్గొనుటకు ముందస్తు ఆవశ్యకతలు **www.ireps.gov.in** పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. దిగువ సంతకందారు కోరినపుడు టెండరుదారు అవసరమైన డాక్యుమెంట్లను కార్యాలయంలో దాఖలు చేయాలి. టెండరుకు సంబంధించి చెల్లింపు సమయంలో లేదా అవసరమైన డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ సమయంలో IREPS పోర్టల్‌లో సంభవించే ఏదేని అవాంతరానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించిన నిబంధనలన్నింటినీ నెరవేర్చకుండా స్వీకరించిన టెండర్లు కచ్చితంగా తిరస్కరించబడును. పైన తెలిపిన టెండరు యొక్క పూర్తి వివరాలు **www.ireps.gov.in** పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి.
A2029 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌ను ఇలా ఇంటింటికీ చేర్చేందుకు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) కీలకపాత్ర పోషించాయి. ప్రజలకు రేషన్ సమయానికి ఇంటికి చేరడంతో పాటు, ఎండీయూ వాహన డ్రైవర్‌లకు గౌరవ వేతనమూ దక్కేది. కుటుంబం హాయిగా బతికేది.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికీ రేషన్ ఇచ్చేందుకు ఎండీయూలు అనవసరమని, ప్రజలే డిపోలకు వచ్చి రేషన్ తీసుకుంటారని ఎండీయూ వాహనాలను ఎత్తేసింది. దీంతో ఆ వాహన డ్రైవర్లు రోడ్డున పడ్డారు. పొట్టకూటి కోసం ఇదిగో... ఇలా వాహనాల్లో చెప్పులు విక్రయిస్తూ జీవించాల్సిన దుస్థితి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

హార్బర్‌లోనూ ప్రైవేట్ పాగా

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ప్రైవేట్ షిప్‌యార్డ్‌కు చంద్రబాబు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మత్స్యకారులు వేట కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లి ఇబ్బంది పడకూడదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఫిషింగ్ హార్బర్‌లోనూ ప్రైవేట్ సంస్థ పాగా వేసేందుకు చంద్రబాబు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వైఎస్ జగన్ నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పేరిట ప్రైవేట్‌కు కట్టబెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం... ఇప్పుడు షిప్‌యార్డ్ నిర్మాణం పేరిట ఫిషింగ్ హార్బర్‌లోకి సైతం ప్రైవేట్ సంస్థకు రెడ్‌కార్పెట్ వేసింది. మత్స్యకారుల పొట్ట కొట్టేందుకు రంగం సిద్ధం చేసింది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 29.58 ఎకరాలను సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చేపలవేట కోసం నిర్దేశించిన ఫిషింగ్ హార్బర్ల వద్ద షిప్‌యార్డు నిర్మిస్తే మత్స్య సంపదకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జగన్ నిర్మించారు.. చంద్రబాబు ప్రైవేట్‌కు ఇస్తున్నారు

రాష్ట్రంలోని మత్స్యకారుల కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టింది. తొలి దశలో రూ.1,522.8 కోట్లతో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేసింది. జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది ఆగస్టు 30న వర్చువల్‌గా ప్రారంభించారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం అప్పటి నుంచి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఇప్పుడు అక్కడ షిప్‌యార్డ్ నిర్మించేందుకు సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అనే ప్రైవేట్ సంస్థకు 29.58 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 7.58 ఎకరాలు వాటర్ ఫ్రంట్ ల్యాండ్, 22 ఎకరాలు హార్బర్ ల్యాండ్ ఉందని పేర్కొన్నారు. ఇక్కడ సాగర్ డిఫెన్స్ సంస్థ ఆటానమస్ మారిటైమ్ షిప్‌యార్డ్, సిస్టమ్స్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. మార్కెట్ విలువలో 6 శాతం అద్దె చెల్లించే విధంగా ఈ భూమిని కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటా 5 శాతం చొప్పున లీజు ధరను పెంచుతామని తెలిపారు. అదే 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్‌పై 50 శాతం అదనపు ప్రీమియం విధిస్తామని, ఈ మేరకు ఏపీ మారిటైం బోర్డు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పొందూరు ఖాదీకి జీఐ గుర్తింపు

పొందూరు: ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ పరిశ్రమకు విశేష గుర్తింపు లభించింది. పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) ప్రకటిస్తూ వాణిజ్య, పరిశ్రమలశాఖ పరిధిలోని భౌగోళిక సూచికల రిజిస్ట్రీ శుక్రవారం అధికారిక పత్రాన్ని జారీచేసింది. 2020 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొందూరు ఖాదీ ఉన్నతికి విశేషంగా కృషి చేసింది. ఒక్కో ప్రాంతంలో తయారయ్యే లేదా ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల వస్తువులకు సహజంగా ఒక నాణ్యత ఉంటుంది. అదే వాటి ప్రత్యేకతగా నిలుస్తుంది. ఆ విశిష్టతను దృష్టిలో ఉంచుకుని వాటికి మరింత ప్రాధాన్యత ఇచ్చేవిధంగా జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ (రిజిస్ట్రేషన్ అండ్ ప్రొటెక్షన్) యాక్ట్ 1999ను రూపొందించారు. ఈ చట్టం కింద ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతం నుంచి వచ్చే ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు వర్తిస్తుంది. ఇందుకోసం భౌగోళిక సూచికల రిజిస్ట్రీ అనేక దఫాలుగా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేస్తుంది. నాణ్యతని అన్నిదశల్లో పరీక్షిస్తుంది. ప్రజల్లో ఉన్న ఆదరణను సైతం పరిగణనలోకి తీసుకుంటుంది. పొందూరు ఖాదీకి జీఐ టాగ్ లభించడం వెనుక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో విశేష కృషిచేసింది.

జీఐ టాగ్ నంబర్ 1049: పొందూరు ఖాదీకి జీఐ టాగ్ నంబర్ 1049 కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చెన్నై కేంద్రంగా ఉన్న భౌగోళిక సూచికల రిజిస్ట్రీ ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని వెలువరించింది. ఇంతవరకు బాస్మతి బియ్యం, డార్జిలింగ్ తేయాకు, కాంచీపురం పట్టుచీరలు, పోచంపల్లి చీరలు, మైసూరు పట్టు, నిర్మల్ బొమ్మలు, మైసూరు శాండిల్ సబ్బుతో పాటు పొందూరు ఖాదీ కూడా ఆ జాబితాలో చేరింది.

కోర్-5 సూపర్ క్లబ్

ఐదు దేశాల సరికొత్త పవర్ గ్రూప్

- భారత్, అమెరికా, రష్యా, చైనా, జపాన్
- జీ7 గ్రూప్‌నకు ప్రత్యామ్నాయంగా తెరపైకి
- పొలిటికో సంచలనాత్మక కథనం
- పశ్చిమాసియానే తొలి అసైన్ మెంట్?

వరల్డ్ ఆర్డర్. ఒక్క వాక్యంలో చెప్పాలంటే బలం, సామర్థ్యం ఆధారంగా వరుస క్రమంలో దేశాల అమరిక. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన దేశాలే శాసించే ఈ వరల్డ్ ఆర్డర్ త్వరలో పెను మార్పులను చవిచూడనుందా? ఇప్పటిదాకా అత్యంత బలోపేతమైన కూటమిగా ఉన్న జీ7 వైభవం గతించనుందా? దాన్ని తోసిరాజనేలా అతి శక్తిమంతమైన సరికొత్త కూటమి ఒకటి శరవేగంగా పురుడు పోసుకుంటోందా? అన్ని రంగాల్లోనూ నిర్నిరోధంగా దూసుకుపోతున్న నయా భారత్ ది అందులో అతి కీలక పాత్ర కానుందా? అంటే, అవుననే అంటున్నారు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు. ముఖ్యంగా కొద్దిరోజులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటలు, చేతలు, చాప కింద నీరులా ఆయన చకచకా సాగిస్తున్న ప్రయత్నాలు ఇందుకు ప్రబల సంకేతాలేనని చెబుతున్నారు. కోర్-5 పేరిట కొత్త కూటమికి ప్రాణప్రతిష్ఠ చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్టు అమెరికాకు చెందిన ప్రఖ్యాత డిజిటల్ వార్తా పత్రిక పొలిటికో రాసి కథనం అంతర్జాతీయంగా పెను సంచలనమే సృష్టిస్తోంది. అమెరికా, భారత్, మరో రెండు ఆసియా దిగ్గజాలైన చైనా, జపాన్ తో పాటు ఆశ్చర్యకరంగా రష్యా కూడా ఇందులో భాగస్వామి కానుందని పొలిటికో కథనం సారాంశం. అమెరికాకు సంబంధించిన రక్షణ, జాతీయ భద్రతా వ్యవహారాలను అత్యంత కచ్చితత్వంతో నివేదించే డిఫెన్స్ వన్ సైట్ ను ఉటంకిస్తూ అది ఈ మేరకు పేర్కొంది. ఈ కోర్ గ్రూప్‌నకు ముద్దుగా 'సీ5 సూపర్ క్లబ్' గా నామకరణం కూడా చేసింది! నిజంగా గనుక అదే జరిగితే చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన కూటమి ఇదే అవుతుందని అంతర్జాతీయ నిపుణులు ముక్తకంఠంతో చెబుతున్నారు. అమెరికా జాతీయ భద్రతా వ్యూహంలో ప్రచురించకుండా రహస్యంగా ఉంచిన భాగంలో సీ5 గురించి వివరంగా ఉన్నట్టు వాషింగ్టన్, వైట్ హౌస్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి! ట్రంప్ తీసుకువస్తున్న సరికొత్త సీ 5 ప్రతిపాదనలపై భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్, జపాన్ ప్రధాని తకాయిచీ స్పందనలేమిటో తెలియాల్సి ఉంది.

యూరప్ దేశాలకు చెక్?

జీ7 కూటమిలో అమెరికా, కెనడా , జపాన్ ను మినహాయిస్తే బ్రిటన్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ రూపంలో నాలుగు యూరప్ దేశాలే ఉన్నాయి. పలు అంశాల్లో వాటి దూకుడు పట్ల ట్రంప్ కొద్ది కాలం గుర్రుగా ఉన్నారు. చీటికిమాటికి అన్ని విషయాల్లోనూ తమ మాటే నెగ్గాలనే ఒంటెత్తు పోకడతో అవి శిరోభారంగా మారాయని భావిస్తున్నారు. వాటికి చెక్ పెట్టేందుకే ఈ కొత్త కూటమికి ఆయన తెర తీస్తున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే అమెరికా విదేశాంగ విధానంలోనే ఇది పెను మార్పు కానుంది! అమెరికా అంతర్జాతీయ వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించడం మొదలుపెట్టిన గత 80 ఏళ్లలో నిత్యం యూరప్ ను తన అతి సన్నిహిత భాగస్వామిగానే పరిగణిస్తూ రావడం తెలిసిందే.

ట్రంప్ సంకేతాలు

సీ 5 గ్రూప్ గురించి నిజానికి ట్రంప్ కొంతకాలంగా స్పష్టమైన సంకేతాలే ఇస్తూ వస్తున్నారు. గత జూన్ లో జరిగిన జీ7 శిఖరాగ్రాన్నే ఇందుకు ఆయన వేదికగా మలచుకోవడం విశేషం. జీ7 కూటమిలో రష్యా కొనసాగి ఉండాల్సిందని, ఆ మాటకొస్తే చైనాకూ ఎన్నడో చోటు దక్కాల్సిందని ఆయన కుండబద్ధలు కొట్టారు. తొలుత జీ8గా ఉన్న ఈ కూటమి కాస్తా, 2014లో క్రిమియాను ఆక్రమించిన కారణంగా రష్యాకు ఉద్వాసన పలకడంతో జీ7గా మారింది. 'నిజానికి అతి పెద్ద తప్పిదమది. అలా చేయకుంటే నేడు ఇంత భారీ యుద్ధమే జరుగుతుండేది కాదు' అని ఉక్రెయిన్ పై రష్యా దాడిని ఉద్దేశించి జీ7 వేదికగానే ట్రంప్ కుండబద్దలు కొట్టారు. సి5 మరీ సత్యదూరం ఏమీ కాకపోవచ్చని బైడెన్ హయాంలో అమెరికా జాతీయ భద్రతా మండలిలో కీలకపాత్ర పోషించిన టోరీ తౌసిగ్ చెప్పడం విశేషం. 'ట్రంప్ కు సిద్ధాంతాలపై పెద్దగా నమ్మకం లేదు. తన ఆలోచనలకు, వ్యూహాలకు, ప్రణాళికలకు ఏది పనికొస్తే అదే అప్పటికి ఆయన సిద్ధాంతం! ఆ లెక్కన కొంతకాలంగా తనకు శిరోభారంగానే గాక అమెరికాకు ఆర్థికంగానూ, ఇతరత్రా కూడా భారంగానే పరిణమిస్తున్న యూరప్ దేశాలను వదిలించుకునేందుకే ట్రంప్ ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది' అని ఆయన వివరించారు.

అప్పుడే ఎజెండా రెడీ?

అవుననే అంటోంది పొలిటికో. జీ7 మాదిరిగా తరచూ భేటీ కావాలని, అంతర్జాతీయ అంశాలపై లోతుగా చర్చించాలని ట్రంప్ భావిస్తున్నట్టు అది వివరించింది. అంతే కాదు, పశ్చిమాసియా భద్రతే సీ5 తొలి ఎజెండా అని కూడా డిఫెన్స్ వన్ ను ఉటంకిస్తూ చెప్పేసింది! ముఖ్యంగా ఇజ్రాయెల్, సౌదీ అరేబియా మధ్య ఉప్పూ నిప్పుగా ఉన్న సంబంధాలను సరిదిద్దడం సీ5 'తొలి అసైన్ మెంట్' అని చెప్పుకొచ్చింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఉన్నత విద్యకు ఒకే నియంత్రణ వ్యవస్థ

యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ స్థానంలో ఒకే రెగ్యులేటరీ

- 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు'కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు
- 2027లో రెండు దశల్లో డిజిటల్ జన గణన
- బీమా రంగంలో ఎఫ్‌డీఐలు 74 శాతం నుంచి 100 శాతానికి పెంపు
- 2026 సీజన్‌లో ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర పెంపు
- కాలం చెల్లిన చట్టాల రద్దు బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: దేశంలో ఉన్నత విద్యకు సంబంధించి ఒకే నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ), జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) వంటి సంస్థల స్థానంలో ఏకైక వ్యవస్థను తీసుకురాబోతున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్ఈసీఐ) బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ బిల్లు పేరును 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు'గా మార్చారు. సింగిల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని నూతన జాతీయ విద్యా విధానంలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం శుక్రవారం సమావేశమైంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జన గణన, పంటలకు కనీస మద్దతు ధర, బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కాలం చెల్లిన చట్టాల రద్దు సహా పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలియజేశారు.

మూడు ప్రధాన బాధ్యతలు

ఉన్నత విద్య నియంత్రణను ఒకే ఒక్క వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించడం ముఖ్యమైన సంస్కరణ అని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యవస్థకు మూడు ప్రధాన బాధ్యతలు అప్పగిస్తారు. రెగ్యులేషన్, అక్రెడిటేషన్, ప్రమాణాలు నిర్దేశించడం. విద్యా సంస్థలకు నిధులు కేటాయించే అధికారం మాత్రం ఉండదని తెలుస్తోంది. నిధుల బాధ్యత ప్రభుత్వానిదే. అలాగే వైద్య, న్యాయ కళాశాలలు ఈ సింగిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ పరిధిలోకి వచ్చే అవకాశం లేనట్లు సమాచారం. హెచ్ఈసీఐ ముసాయిదా బిల్లు ఇప్పటికే సిద్ధమైంది. 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు' పార్లమెంట్‌లో ఆమోదం పొందితే ఈ కమిషన్ సాకారం కానుంది.

'ఉపాధి' పని దినాలు ఇకపై 125 రోజులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన'గా మార్చడానికి ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద పనిదినాల సంఖ్యను ఏటా 100 నుంచి 125కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కూలీలకు ప్రతి సంవత్సరం కనీసం 125 పని దినాలు కల్పించాల్సి ఉంటుంది.

జన గణనకు రూ.11,718 కోట్లు

దేశవ్యాప్తంగా జన గణన కోసం రూ.11,718 కోట్లు కేటాయించడానికి మంత్రివర్గం అంగీకారం తెలియజేసింది. ఈసారి డిజిటల్ రూపంలో జన గణన నిర్వహించబోతున్నారు. దాదాపు 30 లక్షల మంది ఎన్యుమరేటర్లు ఈ క్రతువులో పాల్గొంటారు. జన గణనతోపాటు కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. రెండు దశలో కులగణన నిర్వహిస్తారు. మొదటి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ చేపడతారు. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి జన గణన ప్రారంభిస్తారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉండే జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మాత్రం 2026 సెప్టెంబర్ లోనే జన గణన ప్రారంభమవుతుంది. ప్రజల డేటా సేకరణ కోసం మొబైల్ యాప్‌ను ఉపయోగించబోతున్నారు. ఇది దేశ చరిత్రలోనే మొట్టమొదటి డిజిటల్ సెన్సెస్ అని చెప్పొచ్చు.

బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐలు

దేశంలో బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు(ఎఫ్‌డీఐ) అనుమతించే బీమా చట్టాల(సవరణ) బిల్లు–2025ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ బిల్లును ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పెద్దపీట వేయడం ద్వారా దేశంలో బీమా రంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం బీమా రంగంలో 74 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. దీన్ని 100 శాతానికి పెంచబోతున్నారు

బొగ్గు గనుల వేలానికి 'కోల్‌సేతు'

పారిశ్రామిక అవసరాల కోసం బొగ్గు గనుల వేలం, ఎగుమతులకు అనుమతులు ఇచ్చే విషయంలో 'కోల్‌సేతు' వేదిక ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వేలంలో పారదర్శకతతోపాటు వనరుల సద్వినియోగానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశీయ వినియోగదారులు బొగ్గు కావాలంటే 'కోల్‌సేతు' ద్వారా వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది. తవ్విన బొగ్గులో 50 శాతాన్ని విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు. మిగతా 50 శాతం ఇక్కడే ఉపయోగించాలి.

ఎండు కొబ్బరికి మరో రూ.445

మిల్లింగ్ చేసిన ఎండు కొబ్బరికి కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేంద్ర మంత్రివర్గం క్వింటాల్‌కు మరో రూ.445 పెంచింది. దీంతో 2026 సీజన్‌లో క్వింటాల్ ధర రూ.12,027కు చేరింది. ఇక మిల్లింగ్ చేయని ఎండు కొబ్బరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు మరో రూ.400 పెంచింది. ఈ రకం కొబ్బరికి క్వింటాల్ ధర రూ.12,500కు చేరుకుంది. కొబ్బరి రైతులను ప్రోత్సహించడానికి, వారికి మరింత ఆదాయం దక్కేలా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

71 చట్టాలు రద్దు

కాలం చెల్లిపోయిన 71 చట్టాల రద్దు బిల్లును కేబినెట్ ఆమోదించింది. ఇందులో 65 చట్టాలు సవరణ చట్టాలు, ఆరు అసలైన చట్టాలు ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టం కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా 1,562 పాత చట్టాలను రద్దు చేసింది. ప్రతిపాదిత రిపీల్ అండ్ అమెండ్‌మెంట్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే.. రద్దయిన చట్టాల సంఖ్య 1,633కు చేరుకోనుంది.

ప్రభుత్వ వాదనను విజయవంతంగా తిప్పికొట్టాం

పార్లమెంట్ ఉభయసభల్లో చర్చలపై పార్టీ ఎంపీలతో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై ఉభయ సభల్లో ఇటీవల జరిగిన చర్చల సమయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వాదనల్లో పస లేదని నిరూపించామని రాహుల్ గాంధీ తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత కూడా అయిన రాహుల్ శుక్రవారం పార్టీ ఎంపీలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాల నుంచి ఎదురైన దాడితో ప్రభుత్వం ఒత్తిడికి గురైనట్లుగా కనిపించిందన్నారు. 'వందేమాతరం, ఎస్ఐఆర్ అంశాలపై ఉభయసభల్లో తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఆ రెండు చర్చలలోనూ, మేము ప్రభుత్వ వాదనలను తిప్పికొట్టినందుకు సంతోషంగా ఉంది. ఎస్ఐఆర్ చర్చ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలవర పడ్డారని, పార్లమెంటులో దుర్భాషను కూడా ఉపయోగించారు'అని ఎంపీలతో భేటీ అనంతరం రాహుల్ మీడియాతో అన్నారు. ఓటు చోరీ అంశంపై ప్రభుత్వానికి ప్రమేయం ఉందన్న విషయం యావత్ దేశానికే తెలుసన్నారు. ఇండిగో సంక్షోభం, వాయు కాలుష్యం, కార్మిక చట్టాలు వంటి ప్రజా సమస్యలను ప్రస్తావించడంలో కాంగ్రెస్ పార్టీ విజయవంతమైందన్నారు.

మృత్యువు అంచునుంచి..

- విమానం తోకకు చిక్కిన స్కైడైవర్ పారాచూట్
- 15,000 అడుగుల ఎత్తులో మృత్యువుతో పోరాటం
- జీవన్మరణ పోరాటంలో అద్భుత విజయం

అది ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్, టల్లీ ఎయిర్‌పోర్ట్.. ఆకాశం నిర్మలంగా ఉంది.. సాధారణ స్కైడైవింగ్ విన్యాసం కోసం సిద్ధమైన ప్రత్యేక రోజది. 17 మంది పారాచూటిస్టులతో కూడిన 'సెస్నా కారవాన్' విమానం 15,000 అడుగుల (సుమారు 4,500 మీటర్లు) ఎత్తుకు చేరుకుంది. 16 మంది స్కైడైవర్లు కలిసి ఒక అద్భుతమైన ఫార్మేషన్ జంప్ చేయబోతున్నారు. అంతా సిద్ధంగా ఉంది.. విమానం తలుపు వద్ద నిల్చున్న స్కైడైవర్ ఆడ్రియన్ ఫెర్గూసన్ గుండె వేగం పెరిగింది. విమానం నుంచి బయటికి దూకడానికి సెకన్ మాత్రమే ఉంది.. కానీ, ఆ క్షణంలోనే ఊహించని విపత్తు సంభవించింది. ఆడ్రియన్ ఫెర్గూసన్ గాల్లోకి దూకే ప్రయత్నంలో ఉండగా, అతని రిజర్వ్ పారాచూట్ తాడు విమానం రెక్క ఫ్లాప్‌ను తాకింది. అంతే.. కళ్లు మూసి తెరిచేలోపే, పారాచూట్ ఒక్కసారిగా విచ్ఛిన్నమైపోయింది. ఆ ఉధృతి ఫెర్గూసన్‌ను వెనక్కి లాగేసింది. నియంత్రణ కోల్పోయిన అతను.. విమానం వద్దే వీడియో తీయడానికి సిద్ధంగా ఉన్న కెమెరా ఆపరేటర్‌ను ఢీకొట్టాడు. ఆ ఆపరేటర్ వెంటనే విమానం నుంచి బయటకు దూకి, అదుపులేని ఫ్రీ-ఫాల్‌లో పడిపోయాడు.

అసాధారణ ధైర్యశాలి

కళ్లు మూసి తెరిచేలోపే, ఫెర్గూసన్ కాళ్లు విమానం తోక భాగంలోని 'హారిజాంటల్ స్టెబిలైజర్'కు బలంగా తగిలాయి. అంతలో, తెరుచుకున్న పారాచూట్ మొత్తం తోకకు చుట్టుకుపోయింది! ప్రపంచం మొత్తం ఒక్కసారిగా స్తంభించినట్టు అనిపించింది. 15,000 అడుగుల ఎత్తులో.. ఆడ్రియన్ ఫెర్గూసన్ విమానం తోకకు వేలాడుతూ, చావు అంచున చిక్కుకుపోయాడు. అతని ముఖంలో మృత్యుభయం స్పష్టంగా కనిపించింది. కింద అగాధం.. పైన మృత్యుపాశం.. పట్టు తప్పితే ప్రాణాలు దక్కవు. ఆ ప్రమాదకర స్థితిలో, ఆడ్రియన్ ఫెర్గూసన్ భయంతో వణికిపోకుండా, అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించాడు. ఇప్పుడు అతని వద్ద ఉన్న ఒకే ఒక్క ఆయుధం.. చేతిలో ఉన్న చిన్న హుక్ కత్తి. ఆ చిన్న కత్తితోనే ఆడ్రియన్ మృత్యువుతో పోరాడాలి.

ప్రాణం కాపాడిన కత్తి

ఆడ్రియన్ తన వద్ద ఉన్న చిన్న 'హుక్ కత్తి' తీశాడు. వేలాడుతూనే.. విమానం తోకకు గట్టిగా చిక్కుకుపోయిన తన రిజర్వ్ పారాచూట్ లైన్లను ఒక్కొక్కటిగా కోయడం మొదలుపెట్టాడు. ఇది సాహసం కాదు, ఆత్మరక్షణ! ఆఖరికి 11 లైన్లను తెగ్గొట్టగలిగాడు. చివరికి, చిరిగిన పారాచూట్‌లోని కొంత భాగంతో సహా విమానం నుంచి పూర్తిగా విడిపోయి కిందకు పడిపోవడం మొదలుపెట్టాడు. వెంటనే, ఆడ్రియన్ తన ప్రధాన పారాచూట్‌ను తెరిచాడు. రిజర్వ్ పారాచూట్ అవశేషాలు అడ్డుపడినా, అది పూర్తిస్థాయిలో విచ్చుకుంది. చివరకు, ఫెర్గూసన్ కేవలం స్వల్ప కాలి గాయాలతో సురక్షితంగా భూమిపై ల్యాండ్ అయ్యాడు.

విమానం తోకకు పారాచూట్‌తో వేలాడుతున్న ఫెర్గూసన్

ప్రమాదంలో విమానం..

ఇంతలో పైన విమానం కూడా ప్రమాదంలో చిక్కుకుంది. పారాచూట్ లైన్లు తోకకు గట్టిగా చుట్టుకోవడంతో, పైలట్ కొంతవరకు విమానంపై నియంత్రణ కోల్పోయాడు. వెంటనే, ఆయన 'మేడే' అత్యవసర సంకేతాన్ని పంపారు. తోకకు చిక్కుకున్న పారాచూట్‌తో విమానాన్ని నియంత్రించడం కష్టమని భావించినా, బ్రిస్బేన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సాయంతో, పైలట్ అత్యంత చాకచక్యంగా ఆ విమానాన్ని టల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేయగలిగాడు. కానీ తోక భాగానికి గణనీయమైన నష్టం వాటిల్లింది.

శభాష్ ఫెర్గూసన్!

ఈ ఏడాది సెప్టెంబర్ 20న జరిగిన ఈ అసాధారణ ఘటనపై ఆస్ట్రేలియన్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బ్యూరో (ఏటీసీబీ) దర్యాప్తు జరిపి, ఈ ఉత్కంఠభరితమైన వీడియోను విడుదల చేసింది. ఏటీసీబీ ముఖ్య కమిషనర్ ఆంగస్ మిచెల్ మాట్లాడుతూ, 'హుక్ కత్తిని వెంట తెచ్చుకోవడం తప్పనిసరి నియమం కానప్పటికీ, రిజర్వ్ పారాచూట్ విచ్ఛిన్నమైనప్పుడు అదే ప్రాణాలు కాపాడింది'.. అని ఫెర్గూసన్ సమయస్ఫూర్తిని ప్రశంసించారు. పదిహేను వేల అడుగుల ఎత్తులో చావు అంచుల వరకు వెళ్లొచ్చిన ఫెర్గూసన్ సాహసం, ఆత్మవిశ్వాసం ప్రపంచ స్కైడైవింగ్ చరిత్రలో ఒక పాఠ్యాంశంగా నిలిచిపోయింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

చైనీయులకు సులువుగా బిజినెస్ వీసాలు

నిబంధనలు సడలించిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ: భారత్‌ను సందర్శించే చైనా వృత్తి నిపుణులకు సులువుగా బిజినెస్ వీసాలు జారీ చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిబంధనలను సడలించింది. వీసా దరఖాస్తులను ఇకపై వేగంగా ఆమోదించబోతున్నారు. లద్దాఖ్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్–చైనా సంబంధాలు ఇటీవల మళ్లీ గాడిన పడుతున్న సంగతి తెలిసిందే. అమెరికా ఆంక్షలు, టారిఫ్‌ల నేపథ్యంలో చైనాతో వాణిజ్య సంబంధాలకు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే బిజినెస్ వీసా నిబంధనల్లో తాజాగా మార్పులు చేసింది. తక్కువ కాలంపాటు భారత్‌ను సందర్శించే చైనా వృత్తి నిపుణులకు సులువుగా వీసాలు ఇవ్వడం ద్వారా వారి సేవలు ఉపయోగించుకోవచ్చని, చైనాతో సంబంధాలు మరింత మెరుగుపడతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే, వీసా దరఖాస్తుదారుల తనిఖీ ప్రక్రియలో ఎలాంటి మార్పు లేదని అధికార వర్గాలు వెల్లడించాయి. చైనా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే ఆమోదంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపాయి. చైనా వృత్తి నిపుణులకు గతంలో ఎంప్లాయ్‌మెంట్ వీసాలు(ఈ వీసాలు) జారీ చేస్తుండేవారు. వీటి కాలపరిమితి ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ. బిజినెస్ వీసాలకు సంబంధించి మార్పు చేసిన నిబంధనలు అన్ని దేశాల దరఖాస్తుదారులకు వర్తిస్తాయి. అయితే, ఈ నిర్ణయం వల్ల చైనీయులు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు. ఈ వీసాల జారీ ప్రక్రియను నాలుగు వారాల్లోపే పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చైనా పరికరాలు, యంత్రాలతో ఉత్పత్తి కార్యకలాపాలు సాగించే భారతీయ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో లాభం చేకూరనుంది. చైనా నిపుణులు బిజినెస్ వీసాలపై ఇండియాకు వచ్చి, సదరు కంపెనీలకు సహకరించే వీలుంది. చైనా పౌరులకు టూరిస్టు వీసాలను జారీ చేసే ప్రక్రియను ఈ ఏడాది జూన్‌లో ప్రభుత్వం పునఃప్రారంభించిన సంగతి తెలిసిందే.

స్వాగతించిన చైనా విదేశాంగ శాఖ

చైనా నిపుణులకు బిజినెస్ వీసాలను సులువుగా, వేగంగా జారీ చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ శుక్రవారం స్వాగతించారు. ఇదొక సానుకూలమైన ముందడుగుగా అభివర్ణించారు. ప్రయాణాలను సులభతరం చేస్తే ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరుతాయని అభిప్రాయపడ్డారు. భారత్, చైనా ప్రజల మధ్య అనుబంధం బలోపేతం కావాలన్నదే తమ ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఇరుదేశాలు పరస్పరం సహకరించుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు.

శివరాజ్ పాటిల్ కన్నుమూత

రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నివాళి

లాతూర్: కాంగ్రెస్ కురువృద్ధ నేత శివరాజ్ పాటిల్(90) శుక్రవారం ఉదయం మహారాష్ట్రలోని లాతూర్‌లోని సొంతింట్లో కన్నుమూశారు. లోక్‌సభ మాజీ స్పీకర్, కేంద్ర మాజీ హోం మంత్రి కూడా అయిన శివరాజ్ పాటిల్ కొంతకాలంగా అస్వస్థతతో ఉన్నారని కుమారుడు శైలేశ్ పాటిల్ తెలిపారు. కోడలు అర్చన గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌పై కాంగ్రెస్ అభ్యర్థిపై పోటీకి దిగి ఓడిపోయారు. తుదికంటా నెహ్రూ–గాంధీ కుటుంబానికి విధేయుడిగా, కాంగ్రెస్‌లోనే కొనసాగిన శివరాజ్ పాటిల్ ఐదు దశాబ్దాల కాలంలో పలు కీలకమైన పదవులను అలంకరించారు. ముఖ్యంగా, 2008లో ముంబై దాడుల సమయంలో హోం శాఖ మంత్రిగా శివరాజ్ పాటిల్ పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఘటన జరిగిన రాత్రి మూడు డ్రెస్‌లను మార్చారంటూ వ్యాఖ్యానాలు వచ్చాయి. అంతిమంగా, అప్పటి హింసాకాండ ఆయన పదవికి ఎసరుతెచ్చింది. 1935లో జన్మించిన పాటిల్ లాతూర్ మున్సిపల్ చైర్మన్‌గా 1960ల్లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1966, 1970లలో రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం లాతూర్ ఎంపీగా ఏడు పర్యాయాలు విజయం సాధించారు. 10వ లోక్‌సభ స్పీకర్‌గా 1991–96 మధ్య కొనసాగారు. రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. కేంద్రంలో హోం, రక్షణ, వాణిజ్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను నిర్వహించారు. పంజాబ్ గవర్నర్‌గానూ ఉన్నారు. జిహాద్ అనే భావన ఇస్లాంలోనే కాదు, భగవద్గీత, క్రైస్తవంలోనూ ఉందంటూ 2022లో ఓ కార్యక్రమంలో పాటిల్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ ఏడాది మార్చిలో కుటుంబంతో కలిసి ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా పాటిల్ గొప్ప పరిపాలనావేత్త అంటూ ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. కాగా, శివరాజ్ పాటిల్ మరణంపై పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాటిల్‌కు నివాళులర్పించారు.

ఇండిగో సీఈవోపై ప్రశ్నల వర్షం

ముంబై/న్యూఢిల్లీ: ఇండిగో విమానాల రద్దుతో తలెత్తిన సంక్షోభంపై సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ విచారణ కొనసాగుతోంది. డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అధికారులు శుక్రవారం వరుసగా రెండో రోజూ పీటర్ ఎల్బర్స్‌ను దాదాపు ఏడుగంటలపాటు ప్రశ్నించారు. ఇండిగో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఇసిడ్రోను కూడా ఐదుగంటలపాటు విచారణ జరిపారు. అదేవిధంగా, విమానాల రాకపోకలను పర్యవేక్షించడంలో లోపాలను గుర్తించిన డీజీసీఏ అధికారులు అందుకు బాధ్యులైన నలుగురు ఫ్లయిట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లను తొలగించారు. ప్రయాణికులకు పరిహారంగా రూ.10వేల చొప్పున ట్రావెల్ వోచర్లు ఇస్తే, సంస్థపై రూ.500 కోట్ల వరకు భారం పడుతుందని ఇండిగో శుక్రవారం తెలిపింది. అంతేకాదు, విమాన రాకపోకల్లో మూల కారణాన్ని తెలుసుకునేందుకు వైమానిక రంగ నిపుణుడిని నియమిస్తున్నట్లు తెలిపింది. రివైజ్డు తగ్గింపు షెడ్యూల్ ప్రకారం శుక్రవారం 2 వేలకు పైగా విమానాలను నడిపినట్లు తెలిపింది.

ఆ 8 మందిలో ఐదుగురు అణగారిన వర్గాల వారే

రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: కేంద్రం సమాచార కమిషన్‌లో నియామకాల కోసం ప్రతిపాదించిన వారిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ఒక్కరూ లేరంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శపై కేంద్రం స్పందించింది. ఉన్నత స్థాయి కమిటీ పరిశీలించిన 8 మందిలో ఐదుగురు అణగారిన వర్గాలకు చెందిన వారేనని పేర్కొంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన అత్యున్నత స్థాయి త్రిసభ్య కమిటీ బుధవారం ప్రధాన సమాచార కమిషనర్, ఎనిమిది మంది సమాచార కమిషనర్ల ఎంపిక కోసం సమావేశమవడం తెల్సిందే. ఈ జాబితాలో ఒక్కరు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారు లేరంటూ ఈ సందర్భంగా రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)లోని ఖాళీల భర్తీకి పరిశీలించిన 8 మందిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున అదేవిధంగా ఒక మహిళ కూడా ఉన్నారని కేంద్రం వివరించి మొత్తమ్మీద జాబితాలోని ఎనిమిది మందిలో ఐదుగురు అణగారిన వర్గాల వారేనని వివరించింది.

క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా ప్రకటించాలి

కేంద్రం, రాష్ట్రాల స్పందన కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: క్యాన్సర్ వ్యాధిని గుర్తించదగిన వ్యాధి(నోటిఫయబుల్ డిసీజ్)గా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రముఖ వైద్యుడొకరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనివల్ల వ్యాధిని ముందుగానే గుర్తించి, బాధితులకు సరైన వైద్యం అందించేందుకు వీలవుతుందని అందులో తెలిపారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం శుక్రవారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన కోరింది.

అందర్నీ చంద్రుడిపైకి తరలించమంటారా?

భూకంపాలపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలోని 75 శాతం జనాభా భూకంపాలు సంభవించే ప్రమాదకర జోన్‌లోనే ఉన్నారని, భూకంప నష్టం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. అంటే, ఇక్కడున్న అందరిని చంద్రుడిపై తరలించమంటారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఎదుట పిటిషనర్ స్వయంగా వాదనలు వినిపించారు. రాజధాని ఢిల్లీ మాత్రమే భూకంప ప్రమాదమున్న చోట ఉందని ఇప్పటి వరకు అంతా భావించేవారని, దేశంలోని 75 శాతం ప్రజలకు భూకంపాల ప్రమాదం ఉందని ఇటీవలి అధ్యయనంలో తేలిందని ఆయన చెప్పారు. అయితే, చంద్రమండలంపైకి వీళ్లందర్నీ పంపించాలంటారా అని ధర్మాసనం ప్రశ్నించింది. నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని పిటిషనర్ కోరగా 'విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సింది ప్రభుత్వాలే. అది కోర్టుల పని కాదు'అంటూ ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. భూకంప ప్రమాదాలకు సంబంధించిన వార్తా కథనాలను చూపించగా, తాము వాటిని పట్టించుకోమని వ్యాఖ్యానించింది.

2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

సాక్షి, అమరావతి: ఈ విడత గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 తేదీల మధ్య 12 రోజులు జరపనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ అభిప్రాయం మేరకు పరిశీలనల అనంతరం పుష్కరాల నిర్వహణకు తేదీలను ఖరారు చేస్తున్నట్టు దేవదాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏడో తరగతి విద్యార్థికి స్క్రబ్ టైఫస్

సంబేపల్లె: అన్నమయ్య జిల్లా పెద్దబిడికిలో చెందిన ఓ బాలుడికి స్క్రబ్ టైఫస్ సోకింది. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు శశిధర్ నాయక్ గ్యారంపల్లి ఎస్సీ హాస్టల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. నవంబర్ 28న జ్వరం, దగ్గు, జలుబుతో ఇబ్బంది పడుతూ అక్కడే చికిత్స తీసుకున్నాడు. మరుసటి రోజు గ్రామానికి వచ్చాడు. డిసెంబర్ 9న తిరుపతి ఆస్పత్రికి తరలించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అధికారులు శుక్రవారం పెద్దబిడికిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురి రక్తనమూనాలు సేకరించారు.

24న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం నిర్వహిస్తారని సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం వెల్లడించారు. ఈ సమావేశానికి తీసుకెళ్లాల్సిన ప్రతిపాదనలను 22వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగానికి) పంపాలని అన్ని శాఖలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

రాజధాని కోసం
మరో.7,387.70 కోట్లు అప్పు

నాబార్డు నుంచి తీసుకునే ఈ అప్పునకు ప్రభుత్వం గ్యారెంటీ

- హామీ ఇచ్చిన మొత్తంపై 5 శాతం గ్యారెంటీ ఫీజు సీఆర్‌డీఏ చెల్లించాలి
- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి
- దీంతో రాజధాని అప్పులు రూ.47,387.70 కోట్లకు చేరిక



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి కోసం చంద్రబాబు సర్కారు చేస్తున్న అప్పులు 'ఇంతింతై వటుడింతై..' అన్నట్లు పెరిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రాజధాని కోసం మరో రూ.7,387.70 కోట్లు అప్పు చేస్తున్నారు. నాబార్డు నుంచి ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్‌డీఏ) తీసుకునే రూ.7,387.70 కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్‌డీఏ రుణ సంస్థకు అప్పు చెల్లించడంలో విఫలమైనప్పుడు ప్రభుత్వ హామీ అమలులోకి వస్తుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వ హామీ, లెటర్ ఆఫ్ కంఫర్ట్ పొందేందుకు అనుమతించింది. హామీ ఇచ్చిన మొత్తంపై 5 శాతం గ్యారెంటీ ఫీజును సీఆర్‌డీఏ చెల్లించాలి. ఇందుకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం సూచించింది. దీంతో రాజధాని కోసం చేసిన మొత్తం అప్పులు రూ.47,387.70 కోట్లకు చేరాయి.

సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూ చంద్రబాబు ప్రచారం...

రాజధాని అమరావతి అనేది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అయితే అందుకు పూర్తి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రాజధాని కోసం భారీగా అప్పులు తెస్తున్నారు. మరోపక్క బడ్జెట్ నుంచి నిధులు కూడా విడుదల చేస్తున్నారు. అప్పులు తేవడంతోపాటు బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేస్తున్నప్పుడు సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెల్ ఎలా అవుతుందో సీఎం చంద్రబాబుకే తెలియాలని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఇప్పటి వరకు రాజధాని కోసం ఏ సంస్థ నుంచి ఎంత అప్పు అంటే... (రూ.కోట్లలో)

ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు	15,000
హడ్కో	11,000
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	5,000
ఎన్‌ఏబీఎఫ్ఐడీ నుంచి	7,500
ఏపీపీఎఫ్‌సీఎల్ నుంచి	1500
నాబార్డు	7,387.70
మొత్తం	47,387.70

తిరువూరులో మళ్లీ మాటల యుద్ధం

- ఎమ్మెల్యే కొలికపూడి వర్సెస్ మండల టీడీపీ అధ్యక్షుడు
- పేకాట క్లబ్బుకా లేక పార్టీకా నువ్వు అధ్యక్షుడివి అంటూ ఎమ్మెల్యే పోస్టు
- ఆరోపణలు నిరూపించేందుకు ప్రమాణం చేస్తారా అంటూ ప్రత్యర్థి వర్గం కౌంటర్

తిరువూరు : 'నువ్వు దేనికి అధ్యక్షుడివి? పేకాట క్లబ్బుకా, పార్టీకా?'.. అంటూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నియోజకవర్గంలో తన పార్టీ నేతలపై మరోమారు మాటల దాడికి దిగారు. పార్టీ మండల స్థాయి నేతను ఉద్దేశించి సోషల్ మీడియాలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి.గత కొద్దికాలంగా విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుల మధ్య నెలకొన్న విభేదాలతో నియోజకవర్గంలో పార్టీ ఇరువర్గాలుగా చీలిపోయింది. దీంతో పార్టీ అధిష్టానం ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు తంటాలు పడుతున్న సమయంలో కొలికపూడి మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పార్టీలో చర్చనీయాంశమైంది. విస్సన్నపేట మండలానికి చెందిన ముఖ్యనేతను ఉద్దేశించి కొలికపూడి.. 'పేకాట కోసం ఆఫీసు పెట్టావంటే నువ్వు నిజంగా రాయల్' అంటూ సోషల్ మీడియాలో ఎమ్మెల్యే పోస్టు చేయడంతో ప్రత్యర్థి వర్గం దీనికి కౌంటర్‌గా శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. ఎమ్మెల్యే తనను‌ద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని, తాను సాయిబాబా సాక్షిగా ప్రమాణం చేసి తాను పేకాట శిబిరాలు నిర్వహించట్లేదని చెబుతానని, ఎమ్మెల్యే కూడా తనపై చేసిన ఆరోపణల నిరూపణకు ప్రమాణం చేస్తారా అని విస్సన్నపేట మండల టీడీపీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు ప్రశ్నించారు. తిరువూరులో బెల్టుషాపులను అడ్డుకుంటానని చెప్పి మద్యం సిండికేట్ల వద్ద డబ్బు దండుకోవడం, ఎ.కొండూరు మండలం గోపాలపురంలో మట్టి తవ్వకాలకు యత్నించి గ్రామస్తులు ప్రతిఘటించడంతో తోక ముడవడం ఎమ్మెల్యేకే చెల్లిందని ప్రత్యారోపణ చేశారు. ఇక కొలికపూడి తమ ఎమ్మెల్యే అని చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నామన్నారు.

కుక్క కాటుతో చిన్నారికి తీవ్ర గాయాలు

హర్షియ

ఆత్మకూరు: నాలుగేళ్ల చిన్నారిని శునకం అతి తీవ్రంగా గాయపరిచిన ఘటన నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ఇస్లాంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. బాషా కుమార్తె హర్షియ మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు వస్తుండగా వీధికుక్క వేగంగా వచ్చి బాలికపై దాడి చేసింది. ఈ ఘటనలో చిన్నారి చెవి పూర్తిగా తెగిపడింది. తల్లిదండ్రులు బయటకు వచ్చేలోపు చిన్నారిని కుక్క తీవ్రంగా గాయపరిచింది. వెంటనే కుమార్తెను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వైద్యులు చిన్నారికి ప్రాథమిక చికిత్స చేసి, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. ఇటీవల ఆత్మకూరు పట్టణంలో కుక్కలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్తా పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

● తెలంగాణ

తొలివిడత 'పంచాయతీ' సంతృప్తి

- పల్లె పోరు తొలి ఫలితాలపై ప్రధాన పార్టీల్లో జోష్
- గ్రామాల్లో పరిస్థితి తమకు అనుకూలంగానే ఉందంటూ విశ్లేషణలు
- మరిన్ని సర్పంచ్ స్థానాలు రావాల్సిందనే భావనలో కాంగ్రెస్
- అధికార పార్టీని దీటుగా ఎదుర్కొన్నామంటున్న బీఆర్‌ఎస్
- మరింత బలం పెంచుకునే యోచనలో కమల దళం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తొలి విడత పంచాయతీ సమరం ముగిసింది. ఫలితాలు శుక్రవారం ఉదయానికి పూర్తి స్థాయిలో వచ్చేశాయి. ఈ నేపథ్యంలో తొలి విడత పోరుపై రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పక్షాల్లో అంతర్గత విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. అత్యధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలు గెలుపొందడంపై కాంగ్రెస్ పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌లో పంచాయతీ ఫలితాలు జోష్‌ను నింపాయి. మరోవైపు బీజేపీ కూడా పల్లెపోరు ఫలితాలను సానుకూలంగా చూస్తుండటం గమనార్హం. అధికార పార్టీ విషయానికొస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఫలితాలు నిదర్శనమని ఆ పార్టీ నేతలు చెబుతున్నా, ప్రజాపాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మాత్రం ఫలితాలు రాలేదన్న భావన అంతర్గతంగా వ్యక్తం అవుతోంది. క్షేత్ర స్థాయిలో ఆశించిన మేరకు పని చేయక పోవడం వల్ల ఇలాంటి ఫలితాలు వచ్చాయా అన్న సందేహాలు కూడా నేతల్లో వ్యక్తం అవుతున్నాయి. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సాధించిన స్థానాలపై దృష్టి సారించిన కాంగ్రెస్ నాయకత్వం.. జిల్లాల వారీగా గులాబీ పార్టీ గట్టి పోటీ ఇచ్చిన ప్రాంతాల్లో ఓట్ల గణాంకాలను పరిశీలించే పనిలో పడింది. రెండు, మూడు విడతల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కసరత్తు చేస్తోంది. బీఆర్‌ఎస్‌కు తొలి విడత సర్పంచ్ ఎన్నికలు ఊపిరి పోశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పాటు ఉప ఎన్నికల్లోనూ ఓటమి పాలై నైరాశ్యంలో ఉన్న పార్టీకి గ్రామీణ ప్రాంత ప్రజలు మానసిక స్థైర్యాన్ని ఇచ్చారని, కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇవ్వడం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీ బలంగానే ఉందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. ఇదే ఒరవడి కొనసాగించే యోచనలో ఉన్నారు. బీజేపీ కూడా ఫలితాలపై అంతర్గత లెక్కలు వేస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీలో ఉన్న బలంతో పోలిస్తే పంచాయతీలు తక్కువగా వచ్చాయని, అయితే గత పంచాయతీ ఎన్నికలతో పోలిస్తే తమ బలం పెరిగిందని కమలనాథులు భావిస్తున్నారు. తొలి విడత కాంగ్రెస్ మద్దతుదారులు 2,700 స్థానాల్లో, బీఆర్‌ఎస్ మద్దతుదారులు 1,000కి పైగా స్థానాల్లో గెలుపొందడం పట్ల ఆయా పార్టీల్లో జోష్ నింపింది. మొత్తంగా 500 కంటే ఎక్కువ పంచాయతీలు గెలుచుకోవడం ద్వారా తెలంగాణలో రికార్డు సృష్టిస్తామని బీజేపీ చెబుతోంది. రెండంకెల స్థానాలు దక్కించుకోవడం ద్వారా గ్రామాల్లో తమ ఉనికి చాటుకున్నామని లెఫ్ట్ పార్టీలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

పిల్లల స్కూల్ బ్యాగుల్లోనూ భారీ అవినీతి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర ఆగ్రహం

సాక్షి, అమరావతి : పిల్లల స్కూల్ బ్యాగులను కూడా వదలకుండా చంద్రబాబు కూటమి నాయకులు అవినీతి దాహార్తిని తీర్చుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాగుకు రూ. 2,279 వెచ్చించామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారని, కానీ, విద్యార్థులకు ఇచ్చిన 20 రోజులకే అవి చినిగిపోతున్నాయని, అంత ఖర్చుతో తయారు చేయించిన బ్యాగులు ఇంత నాసిరకంగా ఉంటాయా అని నిలదీశారు. ఈ బ్యాగుల్లో పెద్ద ఎత్తున కమీషన్లు చేతులు మారాయనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. విద్యా శాఖలో అడుగడుగునా వెలుగులోకి వస్తున్న అవినీతికి బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రవిచంద్ర శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఇచ్చిన బ్యాగులు చినిగిపోవడంతో పిల్లలు ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న విద్యా కానుక కింద పంపిణీ చేసిన బ్యాగులనే స్కూళ్లకు తీసుకెళ్తున్నారని వివరించారు. షూలు కూడా విద్యార్థుల సైజుకి సరిపోక వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చినవే వాడుకుంటున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రూ. 3,366 కోట్ల ఖర్చుతో 43 లక్షల మందికి జగనన్న విద్యా కానుక కిట్‌లు పంపిణీ చేశారని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు 8 లక్షల మంది విద్యార్థులను తగ్గించి, కేవలం 35 లక్షల మందికే కిట్‌లు ఇచ్చారని, అవీ నాసిరకమేనని అన్నారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఐటీ ఎకో సిస్టం అభివృద్ధిలో..
విశాఖ దూసుకుపోతోంది

- ఏఐ, డేటా సెంటర్లతో ఐటీ డెస్టినేషన్‌గా, నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా విశాఖ
- ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ
- 'కాగ్నిజెంట్' శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- 2033 నాటికి మూడు దశల్లో పూర్తి : కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్
- వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష



సాక్షి, విశాఖపట్నం : ఐటీ ఎకో సిస్టమ్‌ని అభివృద్ధి చేసే విషయంలో విశాఖపట్నం దూసుకుపోతోందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి శుక్రవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్‌హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తోందన్నారు. గతంలో హైదరాబాద్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఎకో సిస్టంతో ఐటీ నిపుణులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించారని.. మూడు దశాబ్దాల క్రితం రూపొందించిన విజన్‌తోనే దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్‌గా, నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా తయారవుతోందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటోందన్నారు. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఐటీ కంపెనీలకు ఎకరా భూమి 99 పైసలకే ఇవ్వటం ఓ గేమ్ ఛేంజర్ అన్నారు.

వచ్చే ఏడాదికల్లా మొదటి దశ పూర్తి..

కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ మాట్లాడుతూ.. విశాఖ కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి మూడు దశల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ పూర్తి కానుందన్నారు. 2026 నాటికి మొదటి దశ నిర్మాణాన్ని కాగ్నిజెంట్ పూర్తిచేసుకోనుందని తెలిపారు. మరోవైపు.. ఐటీ మంత్రి లోకేశ్ కూడా పలు సంస్థలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డీబీవీ స్వామి, సీఎస్ విజయానంద్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, ఐటీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, ఇతర పనుల పురోగతిని చంద్రబాబు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అంతకుముందు.. ఐటీ సెజ్ హిల్ నెంబర్-3పై ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి కారులో కాగ్నిజెంట్ శంకుస్థాపన ప్రదేశానికి చంద్రబాబు చేరుకుంటున్న క్రమంలో మారికవలస-తిమ్మాపురం-ఐటీ సెజ్ జంక్షన్ వద్ద కాన్వాయ్‌లో ఓ కారు బందోబస్తు కోసం వచ్చిన సీఐ పాదం మీదుగా వెళ్లింది. దీంతో.. ఆయన పడిపోతుండగా సహచర పోలీసులు పట్టుకున్నారు.

వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్ష..

అనంతరం.. రుషికొండలోని కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్న చంద్రబాబు, వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. తొమ్మిది జిల్లాల్లోని వీఈఆర్ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలు, లక్ష్యాలు, పెట్టుబడుల ఆకర్షణపై యాక్షన్ ప్లాన్ గురించి అడిగి తెలుసుకున్నారు.

ఏపీకి విశాఖ గ్రోత్ ఇంజిన్ అని
జగన్ ఏనాడో చెప్పారు

విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తానంటే మునిగిపోతుందని విషపు రాతలు రాశారు

- జగన్ హయాంలోనే విశాఖకు ఇన్ఫోసిస్ వచ్చింది
- టీసీఎస్ విశాఖకు రావడంలోనూ జగన్ కృషి ఉంది
- అంత పెద్ద ఐటీ పరిశ్రమలు రావడం వల్లే ఇప్పుడు కాగ్నిజెంట్ వంటివి ఆసక్తి కనబరిచాయి
- పేరూ ఊరూ లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములను ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం
- లోకేశ్‌ను ప్రమోట్ చేయడానికి ప్రజా ధనం దుర్వినియోగం
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విశాఖ నగరం గ్రోత్ ఇంజిన్ అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడో చెప్పారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. నాడు వైఎస్ జగన్ చెప్పిందే చంద్రబాబు ఇప్పుడు చెబుతున్నారని అన్నారు. వైఎస్ జగన్ విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తానంటే.. సునామీ వచ్చి మునిగిపోతుందంటూ ఆంధ్రజ్యోతి, ఈనాడు పేపర్లలో విషపు రాతలు రాయించిన చంద్రబాబు.. ఇప్పుడు విశాఖపై ఆహా ఓహో అంటూ వార్తలు రాయిస్తున్నారన్నారు. అమర్‌నాథ్ శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే ఇన్ఫోసిస్ లాంటి ఎంఎన్‌సీ ఐటీ సంస్థ వచ్చిందని, అందువల్లే ఇప్పుడు కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖకు రావడానికి ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. విశాఖకు టీసీఎస్ రావడంలోనూ వైఎస్ జగన్ కృషి చాలా ఉందన్నారు. పెట్టుబడులు పెట్టే పెద్ద సంస్థలకు భూములివ్వడంలో తప్పులేదని, అయితే ఆ ముసుగులో పేరూ ఊరూ లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు, లులూ, ఉర్సు వంటి సంస్థలకు విలువైన భూములను కారుచౌకగా కట్టబెడుతున్నారని చంద్రబాబుపై మండిపడ్డారు. లులు గుజరాత్ రాష్ట్రంలో ఎకరా భూమి కోట్లాది రూపాయలతో కొంటుందని, అదే లులుకు ఏపీలో చంద్రబాబు రూపాయికే ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. వారికి నచ్చిన వారికి అత్యంత విలువైన భూములను కారు చౌకగా కట్టబెట్టడాన్ని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తుందని చెప్పారు. సత్వా, కపిల్ వంటి సంస్థలకు ఇచ్చిన భూముల్లో 50 శాతం రెసిడెన్షియల్ కాంపెన్సేషన్ కింద ఇచ్చారని, ఏపీఐఐసీ భూములను కేటాయించే జీఓల్లో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదని దుయ్యబట్టారు.

ప్రజా ధనంతో కొడుక్కు పబ్లిసిటీ

కుమారుడు లోకేశ్‌ను ప్రమోట్ చేయడం కోసం చంద్రబాబు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అమర్‌నాథ్ అన్నారు. విశాఖ పర్యటన కోసం పేపర్‌లో ఫుల్ పేజీ ప్రకటనలు ఇచ్చినా, వాటిలో కనీసం పరిశ్రమల శాఖ మంత్రి ఫొటో కూడా వేయలేదన్నారు. పోనీ ఎన్నికలకు ముందు చంద్రబాబుతో సహా పవన్ కళ్యాణ్ ఫొటోలతో ప్రచారం చేసుకున్నారని, ఏడాదిన్నరలోనే ప్రకటనల్లో పీఎం మోదీ, పవన్ ఫొటోలు చుక్కలా మారాయని విమర్శించారు. అన్ని ప్రకటనల్లోనూ తండ్రీ కొడుకుల ఫొటోలే తప్ప మరెవ్వరివీ లేవన్నారు. కేసుల మాఫీకి, విశాఖలో భూములు కాజేసేందుకు, కొడుకు పబ్లిసిటీకే ప్రజాధనాన్ని చంద్రబాబు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాదు.. ప్రపంచంలో ఏ వింత జరిగినా దానికి కారణం తన కొడుకు లోకేశ్ అని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నాడన్నారు.

అప్పుడెందుకు విశాఖను గుర్తించలేదు?

2014–19లో చంద్రబాబు విశాఖను ఎందుకు గుర్తించలేదని నిలదీశారు. అప్పట్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు అని చెప్పుకున్నారని, అందులో 2 శాతం మాత్రమే వచ్చాయని తెలిపారు. చంద్రబాబు ఎన్నిసార్లు సీఎంగా పనిచేసినా ప్రచారం తప్ప ఒక్కటీ అమలుకు నోచుకోవన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని ఊదరగొట్టిన తండ్రీకొడుకు ఈ రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు.

క్లుప్తంగా...

సీఐపీఎస్‌ఏకి భారీ డిస్కౌంట్‌తో భూ కేటాయింపు

సాక్షి, అమరావతి: సీఐపీఎస్‌ఏ టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు 75 శాతం డిస్కౌంట్‌తో భూములను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద ఎంపీ సెజ్‌లో ప్లాట్ నంబర్లు 117 నుంచి 130 వరకు విస్తరించి ఉన్న 20 ఎకరాల భూమిని 75 శాతం తక్కువ ధరకు కేటాయిస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదికాకుండా ఏపీ ఎలక్ట్రానిక్ పాలసీ ద్వారా ఈ ప్రతిపాదనకు ఎర్లీ బర్డ్ (మొదట వచ్చిన ప్రతిపాదనలు) కింద అదనపు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా హై, మీడియం, ప్రోటో వాల్యూమ్ ఆఫ్ హై స్పీడ్ ఆర్‌ఎఫ్ పీసీబీ, ఫ్లెక్సిబుల్ సీసీబీలు, రిగ్గిడ్ ఫ్లెక్సి పీసీబీలను ఉత్పత్తి చేస్తాయి. విశాఖపట్నం మధురవాడ హిల్ నంబర్–2లో నాన్రెల్ టెక్నాలజీస్‌కు రూ.4 కోట్లు రాయితీ ధర కింద ఒక ఎకరం, ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 1.07 ఎకరాలు, శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు 0.81 ఎకరాల చొప్పున కేటాయిస్తూ వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు.

రామాయపట్నం వద్ద కార్గో రైల్ టెర్మినల్

సాక్షి, అమరావతి: రామాయపట్నం పోర్టు వద్ద రూ.1615 కోట్ల పెట్టుబడితో మల్టీకార్గో రైల్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం తెట్టు వద్ద 153.77 ఎకరాలను న్యూఢిల్లీకి చెందిన రామాయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్ అనే సంస్థకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇందుకోసం చేవూరు వద్ద ఏపీ మారిటైమ్ బోర్డు సేకరించిన 153.77 ఎకరాలను ఏపీఐసీకి బదలాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోటి సంతకాల పత్రాల వాహనాల ర్యాలీకి అనుమతివ్వండి

డీజీపీకి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపట్టామని, అన్ని నియోజకవర్గాల నుంచి మొత్తం కోటి సంతకాలు సేకరించామని డీజీపీకి రాసిన లేఖలో వైఎస్సార్‌సీపీ వెల్లడించింది. ఆ కోటి సంతకాల పత్రాలు ఈనెల 10న జిల్లా కేంద్రాలకు చేరుకోగా, వాటిని ఈనెల 15న పార్టీ కేంద్ర కార్యాలయం ఉన్న తాడేపల్లికి తరలించాల్సి ఉందని తెలిపింది. అందుకే ఆ రోజున (డిసెంబరు 15) అన్ని జిల్లా కేంద్రాల్లో కోటి సంతకాల పత్రాలతో కూడిన వాహనాల ర్యాలీ, వాటి రవాణాకు అనుమతించాలని, ఆ మేరకు అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేయాలని డీజీపీకి విజ్ఞప్తి చేసింది. ట్రాఫిక్‌కు ఏ ఇబ్బంది కలగకుండా పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందజేస్తామని వెల్లడించింది. సంతకాల పత్రాలు విజయవాడ చేరుకున్న తర్వాత, మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18న రాష్ట్ర గవర్నర్‌ను కలిసి, ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణపై నివేదించి, ఆ సంతకాల పత్రాలు ఆయనకు సమర్పిస్తారని పార్టీ ఆ లేఖలో వివరించింది. ఆ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు.

'స్థానిక' ఎన్నికల ముందస్తు కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయి?

అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సమావేశం

సాక్షి, అమరావతి: పదవీకాలం ముగుస్తున్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన ముందస్తు కార్యక్రమాల తీరుతెన్నులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఆరా తీశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖాధిపతులతో సమావేశమయ్యారు. ఐదేళ్ల క్రితం ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల చైర్మన్లు, మేయర్ల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 17తో ముగియనుండగా, గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియనుంది.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న మోదీ

రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె.చంద్రు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగంలో ఉన్న హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయని మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె.చంద్రు చెప్పారు. తిరుపతిలో మూడురోజులు నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రు మాట్లాడుతూ.. సంపన్నుల కోసమే బీజేపీ దేశాన్ని పాలిస్తోంది తప్ప పేదల కోసం కాదని చెప్పారు. మోదీ, అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం.సాజీ విద్యారంగం పట్ల బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు.

ఖాకీలా.. కిడ్నాపర్లా!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీలో ఇమడలేక.. అధికార పార్టీని ఎదురించి తిరిగి సొంత గూటికి చేరేందుకు సిద్ధపడిన కార్పొరేటర్లపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులను పురమాయించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆ కార్పొరేటర్లు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరుతున్నారనే సమాచారంతో మంత్రి, ఎమ్మెల్యే ఆదేశాలతో ఖాకీలు నెల్లూరు నుంచి తాడేపల్లికి చేరుకున్నారు. వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయం నుంచి వారు బయటకు రాగానే కిరాయి కిడ్నాపర్ల మాదిరిగా ప్రైవేట్ వాహనాలను అడ్డుపెట్టి, బలవంతంగా వారి వాహనంలో ఎక్కించుకుని వెళ్లారు. వారి వద్ద ఉన్న ఫోన్లను లాక్కొని, ఎక్కడికి తీసుకెళ్తున్నారో వారి కుటుంబ సభ్యులకు సైతం సమాచారం అందకుండా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పోలీస్‌స్టేషన్లు తిప్పుతూ చిత్ర హింసలకు గురిచేశారు. చివరకు తాము టీడీపీలోనే కొనసాగుతున్నామంటూ వీడియోలు రిలీజ్ చేయించి, వారిని టీడీపీ నేతలకు అప్పగించి వచ్చారు.

కేసుల పేరుతో అదుపులోకి..

నెల్లూరు పోలీసుల ముందు ప్రొఫెషనల్ కిడ్నాపర్లు, గూండాలు కూడా దిగదుడుపేనని ఈ ఘటన రుజువు చేస్తోంది. అధికార పార్టీ నేతలు చెబితే పోలీసులు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీ నేతలను హింసించడంలో కిరాయి గూండాల్లా వ్యవహరిస్తున్నారు. ఎంపీపీలు, మున్సిపాలిటీ చైర్మన్లు, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులను బెదిరించి, అధికార పార్టీ

వైఎస్ జగన్ సమక్షంలో చేరిన నెల్లూరు 5వ డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర (ఫైల్)

అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు వేయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో మాట వినని వారిని కేసుల పేరుతో అదుపులోకి తీసుకోవడం.. గంజాయి కేసులు, నకిలీ మద్యం కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

తాడేపల్లి నుంచి అదృశ్యం

నెల్లూరు కార్పొరేషన్‌లోని మొత్తం 54 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. టీడీపీ ఒక్క డివిజన్‌లో కూడా గెలవలేదు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే కార్పొరేటర్లను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి పచ్చ కండువాలు కప్పారు. అయినప్పటికీ వారు సాంకేతికంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లుగానే చెలామణి అవుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిపై టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమైంది. దీంతో వైఎస్సార్‌సీపీ బీఫారంతో గెలిచి టీడీపీలోకి జంప్ అయిన ఐదుగురు కార్పొరేటర్లు తాడేపల్లిలోని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తిరిగి గురువారం వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. దీంతో మంత్రి నారాయణ ఆదేశాలతో నెల్లూరు నవాబుపేట పోలీసులు తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం సమీపంలో మాటు వేసి.. నెల్లూరు 5వ డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, 6వ డివిజన్ కార్పొరేటర్ మస్తానమ్మ కుమారుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని ప్రత్యేక వాహనంలో అదృశ్యమయ్యారు. రాత్రంతా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో తిప్పుతూ వారిని మంత్రి నారాయణ అనుచరులు, వేమిరెడ్డి సోదరులకు అప్పగించారు. తద్వారా టీడీపీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ల క్యాంప్‌లోకి తరలించే వరకు కీలక పాత్ర పోషించారు.

కేసులు.. అరెస్ట్ అన్నారు.. తీరా టీడీపీ క్యాంప్‌నకు చేర్చారు

వైఎస్సార్‌సీపీకి చెందిన గిరిజన కార్పొరేటర్ రవిచంద్రతోపాటు మరో కార్పొరేటర్ తనయుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నది వాస్తవమేనని నవాబుపేట పోలీసులు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో ఒప్పుకున్నారు. అదుపులో ఉన్న ఆ ఇద్దరిని చూపించాలని గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు ఆ ఇద్దరు నేతలు చేరుకుని పోలీసులను ప్రశ్నించడంతో వారిపై కేసులు ఉన్నాయని, అరెస్ట్ చేశామని, శుక్రవారం కోర్టుకు హాజరు పరుస్తామని చెప్పారు. కానీ తెల్లారే సరికి పోలీసులు రూటు మార్చి, నోటీసు ఇచ్చి పంపేశామంటూ చెబుతున్నారు. నోటీసులు ఇచ్చే కేసులో వారిని తాడేపల్లికి వెళ్లి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముందని, గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం తెల్లారే వరకు రహస్యంగా ఉంచడం ఏమిటని, వారిని టీడీపీ క్యాంప్‌నకు అప్పగించడం ఏమిటని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు నిలదీస్తున్నారు. కాగా, పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆ ఇద్దరిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల క్యాంప్‌లోకి వెళ్లాలని తీవ్రంగా ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఓ కార్పొరేటర్ తనయుడు తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతూ పోలీసులతోపాటు అధికార పార్టీ నాయకులు కూడా తనపై చేయి చేసుకున్నారని.. మంత్రి నారాయణ, మరికొందరు పచ్చి బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. పోలీసుల తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

నెల్లూరు 34వ వార్డు కార్పొరేటర్ తండ్రి కిడ్నాప్

- ఓ ఖాకీ సహా కారులో వచ్చిన నలుగురు
- బలవంతంగా ఎత్తుకెళ్లిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు



నజీర్

చిల్లకూరు: నెల్లూరు జిల్లాలో అధికార టీడీపీ నేతల అరాచకం, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. సొంత గూటికి వెళ్లారన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపులు మితిమీరాయి. టీడీపీలోనే కొనసాగాలంటూ తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ 34వ వార్డు కార్పొరేటర్ ఫమీదా గురువారం వైఎస్ జగన్ చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న నేపథ్యంలో కొందరు ఆమె తండ్రి సయ్యద్ నజీర్‌ను కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. తిరుపతి జిల్లా వాకాడు బీసీ కాలనీకి చెందిన సయ్యద్ నజీర్ వైఎస్సార్‌సీపీలో చురుగ్గా వ్యవహరించడంతో పాటు బతుకుదెరువు కోసం పొట్టేళ్ల వ్యాపారం చేస్తున్నాడు. కుమారుడు బెంగళూరులో ఉండగా, కుమార్తె ఫమీదాకు పెళ్లి చేసి నెల్లూరు పంపారు. అక్కడ ఆమె వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌గా విజయం సాధించింది. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత అక్కడి నాయకుల ఒత్తిడితో ఆమె పార్టీ మారారు. అయితే ఆ పార్టీలో ఇమడలేక రెండు రోజుల క్రితం ఆమె వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో అధికార పార్టీ నాయకులు ఆమెను ఒత్తిడికి గురిచేసే క్రమంలో గురువారం సాయంత్రం మసీద్ నుంచి ఆమె తండ్రి ఇంటికి తిరిగి వస్తుండగా బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. కారులో నలుగురు వచ్చారని, వారిలో ఒకరు పోలీసు దుస్తుల్లో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు వారు నజీర్ అనే టీ కొట్టు వ్యక్తిని పట్టుకుని కారులో ఎక్కించుకొని కొన్ని వివరాలు అడిగారు. తాను మీరనుకుంటున్న నజీర్‌ను కాదని చెప్పడంతో అతడ్ని వదిలేసి.. ఫమీదా తండ్రి నజీర్ ఎక్కడున్నాడో కనుక్కుని బలవంతంగా తీసుకెళ్లారు. చీకటి పడినప్పటికీ నజీర్ ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన శుక్రవారం వాకాడుకు చేరుకుని అన్ని రకాలుగా విచారించాక, నజీర్ కిడ్నాప్‌నకు గురయ్యారని సీఐ హుస్సేన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి వరకు ఆయన ఆచూకీ తెలియలేదు.

రైతులను మళ్లీ నట్టేట ముంచిన

చంద్రబాబు సర్కారు

- ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీ వర్షాలు, వరదలకు 3.77 లక్షల ఎకరాల్లో పంటనష్టం
- ఖరీఫ్‌లో ఏపీలో కేవలం 5.3 లక్షల మంది రైతుల పంటలకే బీమా
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు పంటల బీమా వర్తింపజేయకుండా నిండా ముంచేశారు. దీంతో పంటలు కోల్పోయిన రైతులకు బీమా రాలేదు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఇచ్చిన సమాధానంలో ఈ విషయం స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 3.77 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు రాష్ట్రం నుంచి నివేదిక అందినట్లు మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద రాష్ట్రంలో రైతులకు ఎటువంటి బీమా పరిహారం చెల్లించలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎంఎఫ్‌బీవై కింద తన వాటాను చెల్లించలేదని తెలిపారు. పైగా ఈ ఏడాది ఖరీఫ్‌లో పీఎంఎఫ్‌బీవై–పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఏపీలో కేవలం 5.3 లక్షలమంది రైతులు మాత్రమే నమోదైనట్లు చెప్పారు. ఈ నమోదైన రైతులకు కూడా ఎటువంటి బీమా క్లెయిమ్‌లను చెల్లించలేదని స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కోసం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేశారు. రైతులే తమ పంటలకు బీమా చేసుకోవాలనే ధోరణిలో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో రాష్ట్రంలో కేవలం 5.3 లక్షల మంది రైతులే బీమా కింద నమోదయ్యారు. అదే 2023–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్‌లోనే ఏకంగా 30.09 లక్షలమంది రైతులకు చెందిన 50.63 లక్షల ఎకరాల్లోని పంటలకు బీమా సౌకర్యం కల్పించింది. చంద్రబాబు నిర్వాకం కారణంగా కేవలం 5.3 లక్షలమంది రైతులకే బీమా పరిమితం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం బీమా ప్రీమియం వాటా చెల్లించకపోవడంతో వారి పంటలకు కేంద్ర బీమా పరిహారం చెల్లించలేదు.

పీఎంఎఫ్‌బీవై-పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదైన రైతుల సంఖ్య ఇలా..

రాష్ట్రం	బీమా కింద నమోదైన రైతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	5.3 లక్షలు
ఛత్తీస్‌గఢ్	68.2 లక్షలు
హరియాణ	74.2 లక్షలు
కర్ణాటక	30.7 లక్షలు
మధ్యప్రదేశ్	1.01 కోట్లు
మహారాష్ట్ర	63.9 లక్షలు
ఒడిశా	1.14 కోట్లు
రాజస్థాన్	2.05 కోట్లు
ఉత్తరప్రదేశ్	61.6 లక్షలు

వైఎస్సార్‌సీపీని చూస్తే టీడీపీకి వణుకు

కేసులు పెడతామంటూ లొంగని వారి భార్యా, బిడ్డలకు ఫోన్లలో బెదిరింపులు

- కార్పొరేషన్‌లో బలముందంటూనే కార్పొరేటర్లకు వేధింపులా?
- కార్పొరేటర్లతో పాండిచ్చేరిలో క్యాంప్ రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీలోకి తిరిగి వెళ్లారని పోలీసుల ద్వారా కిడ్నాపులు
- 8 నెలల మేయర్ పదవి కోసం ఇన్ని దుర్మార్గాలు చేయాలా?
- మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు మేయర్‌పై ఈ నెల 18న అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో తమకు బలం ఉందని చెప్పుకుంటున్న టీడీపీ ఎందుకో భయపడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. పాండిచ్చేరికి కార్పొరేటర్లను తరలించి క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడం చూస్తుంటే, వైఎస్సార్‌సీపీ నైతికంగా విజయం సాధించినట్లే అన్నారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదుగురు కార్పొరేటర్లు వైఎస్ జగన్ సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వస్తే వణికిపోతున్నారన్నారు. తాడేపల్లికి పోలీసులను పంపించి ఒక కార్పొరేటర్‌ను, మరో కార్పొరేటర్ కుమారుడ్ని అరెస్ట్ చేయించి తిరుపతి తీసుకెళ్లిపోయారని చెప్పారు.

శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి అధికార పార్టీ నేతల ఇళ్లకు డెలివరీ చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ భార్య, పిల్లలకు ఫోన్లు చేసి బూతులు తిడుతూ, గంజాయి కేసులు పెడతామని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారన్నారు. 8 నెలల మేయర్ పదవి కోసం ఇంతలా దిగజారడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.10 కోట్ల కాంట్రాక్ట్ వర్కులు ఇస్తామన్నా.. కార్పొరేటర్లు టీడీపీలో ఉండటానికి ఇష్టపడటం లేదని చెప్పారు. వారికి అక్కడ గౌరవం లేదని, పైగా ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతను గుర్తించి వెనక్కు వచ్చేస్తున్నారని వివరించారు. టీడీపీ నేతలు క్యాంప్‌లు, కిడ్నాప్‌లు, సోషల్ మీడియా.. ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ ఒక్క కార్పొరేటర్ స్థానాన్ని కూడా గెలుచుకోలేదన్నారు. 54కు 54 స్థానాలను వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసిందన్నారు. సాంకేతికంగా ఆ పార్టీకి ఒక్క కార్పొరేటర్ కూడా లేదని, అయినా టీడీపీ కార్పొరేటర్లు అంటూ చెప్పుకోవడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు.

కిడ్నాప్‌లు చేయడం పోలీసుల పనా?

కూటమి ప్రభుత్వం వచ్చాక నెల్లూరులో రౌడీయిజం, డ్రగ్స్, గంజాయి మాఫియా రాజ్యమేలుతుంటే వాటిని అరికట్టలేని పోలీసులు, కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి అధికార పార్టీకి డోర్ డెలివరీ చేసే స్థాయికి చేరారని అనిల్ కుమార్ మండిపడ్డారు. అందువల్లే రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ దేశంలోనే అట్టడుగు స్థాయికి పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. 'తాడేపల్లిలో కార్పొరేటర్‌ను, మరో కార్పొరేటర్ కుమారుడిని బలవంతంగా తీసుకెళ్లిన పోలీసులు వారిని తెల్లవార్లూ వేధించారు. కార్పొరేటర్‌పై కేసులున్నాయని చెప్పిన పోలీసులు కోర్టులో హాజరు పరచకుండా ఉదయానికి బలవంతంగా ఒక వీడియో రిలీజ్ చేయించారు. సీఐ వేణుగోపాల్ రెడ్డి కార్పొరేటర్లను అరెస్ట్ చేస్తే కనీసం స్టేషన్‌కు కూడా తీసుకెళ్లకుండా ఒంగోలులో వేమిరెడ్డి పట్టాభి, విజయ్‌భాస్కర్ రెడ్డికి అర్ధరాత్రి తర్వాత 3.30 గంటలకు అప్పగించి వేధిస్తున్నట్టు కార్పొరేటర్ కొడుకు నాకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడ్నుంచి తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసుల ఫోన్ లొకేషన్ వెలికి తీస్తే కిడ్నాప్ వ్యవహారం మొత్తం బయటకొస్తుంది. వైఎస్ జగన్ యానాదులకు ఇచ్చిన అవకాశాన్ని (మేయర్ పదవి) దూరం చేస్తున్నారు. మంత్రి నారాయణ ఇలాంటి సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తారనుకోలేదు' అని అన్నారు. పల్నాడులో ఏమాత్రం సంబంధం లేని హత్య కేసులో పిన్నెల్లి సోదరులను ఇరికించడం దుర్మార్గం అని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కిలోమీటర్‌కు రూ.180.35 కోట్లు

ఇదీ యాక్సిస్ రోడ్డును ఎన్‌హెచ్‌-16తో అనుసంధానించే పనుల కాంట్రాక్టు విలువ

- రూ.511.84 కోట్లతో టెండర్ నోటిఫికేషన్ జారీ
- 4.05 శాతం ఎక్సెస్‌తో రూ.532.57 కోట్లకు కోట్ చేసి ఎల్‌-1గా నిలిచిన ఎన్‌సీసీ
- ఆ సంస్థకే పనులు అప్పగిస్తూ కేబినెట్ ఆమోద ముద్ర
- దాంతో ఖజానాపై అదనంగా రూ.20.73 కోట్ల భారం
- పన్నుల రూపంలో మరో రూ.98.66 కోట్లు రీయింబర్స్
- దాంతో కాంట్రాక్టు విలువ రూ.631.23 కోట్లు
- 3.5 కి.మీ. పొడవునా 6 వరుసలతో రోడ్డు నిర్మాణం
- ఇందులో 2.4 కి.మీ. మేర ఆర్వోబీ ఎలివేటెడ్ కారిడార్



విజయవాడ దుర్గ గుడి ఫ్లై ఓవర్

బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్

సాక్షి, అమరావతి: అమరావతిలో భవనాలు, రోడ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టులను అడ్డగోలు వ్యయాలకు కట్టబెట్టడంలో సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ), ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) తాము నెలకొల్పిన రికార్డులను తామే బద్దలుకొడుతున్నాయి. తాజాగా సీడ్ యాక్సిస్ (ఈ3) రోడ్డును ఎన్‌హెచ్‌–16 (కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారి)తో అనుసంధానించే మూడో దశ పనులను కిలోమీటరుకు రూ.180.35 కోట్లకు అప్పగించేందుకు ఏడీసీఎల్‌కు చంద్రబాబు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శుక్రవారం ఈ మేరకు జీవో ఆర్‌టీ నం.1471 జారీ చేసింది.

- కొండవీటి వాగు నుంచి రైల్వే ట్రాక్‌పైన మణిపాల్ ఆస్పత్రి మీదుగా వారధి వరకు 3.5 కి.మీ. పొడవు (18.270 కి.మీ.–21.770 కి.మీ.), 60 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.511.84 కోట్ల కాంట్రాక్టు విలువతో అక్టోబర్ 27న ఏడీసీఎల్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. లంప్సమ్ విధానంలో రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్దేశించింది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.98.66 కోట్లను తిరిగి చెల్లిస్తామని (రీయింబర్స్) పేర్కొంది. దీంతో కాంట్రాక్టు విలువ రూ.610.5 కోట్లకు చేరుతుంది.
- 2.464 కి.మీ. ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) ఎలివేటెడ్ కారిడార్... 99.6 మీటర్లు ఆర్వోబీ, రెండు అండర్ పాస్‌లు, ఒక ఇంటర్‌చేంజ్ (ట్రంపెట్), మైనర్ బ్రిడ్జి కమ్ పప్, 3 ర్యాంప్‌లు (విజయవాడ–అమరావతి 232 మీటర్లు, గుంటూరు–అమరావతి 280 మీటర్లు, విజయవాడ–అమరావతి 115 మీటర్లు) నిర్మించాలి. ఈ ప్రకారం కి.మీ. రోడ్డు, ఆర్వోబీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.174.43 కోట్లను కాంట్రాక్టు విలువగా (రీయింబర్స్‌మెంట్ మినహా) నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించినా..

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) దేశంలో అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయ రహదారులను నిర్మిస్తోంది. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌–65)లో అంతర్భాగంగా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అత్యద్భుత డిజైన్‌తో కనకదుర్గమ్మ ఫ్లైఓవర్‌ను 2.6 కి.మీ. మేర ఆరు వరుసలతో రూ.282.4 కోట్లతో 2020లో పూర్తి చేసింది. అంటే.. కిలోమీటరుకు వ్యయం రూ.108.61 కోట్లు. కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారిలో అంతర్భాగంగా విజయవాడలో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు బెంజ్ సర్కిల్ వద్ద మూడు వరుసలతో 2020 నాటికి 2.35 కి.మీ. మొదటి ఫ్లైఓవర్‌ను రూ.80 కోట్లతో, 2.47 కి.మీ. రెండో ఫ్లైఓవర్‌ను మూడు వరుసలతో 2021లో రూ.88 కోట్లతో పూర్తి చేసింది. ఈ ప్రకారం ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ విధానంలో రహదారి నిర్మాణానికి కి.మీ.కు రూ.69.70 కోట్లను ఎన్‌హెచ్‌ఏఐ ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. కానీ, అచ్చం ఇదే పద్ధతిలో నిర్మిస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డును కాంట్రాక్టు సంస్థకు కి.మీ.కు రూ.180.35 కోట్ల చొప్పున అప్పగిస్తుండడం గమనార్హం.

రివర్స్ టెండరింగ్ నిర్వహించి ఉంటే..

రాష్ట్రంలో 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ అంచనా వ్యయాలను పెంచేస్తూ.. అస్మదీయులకే పనులు దక్కేలా నిబంధనలతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తూ అధిక ధరకు కాంట్రాక్టు పనులు కట్టబెట్టింది. ఖజానాను కొల్లగొడుతూ నీకింత నాకింత అంటూ పంచుకునేలా టెండర్ల వ్యవస్థను నీరుగార్చింది. కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ విధానం, మొబిలైజేషన్ అడ్వాన్సు రద్దు వంటి విప్లవాత్మక సంస్కరణలతో టెండర్ల వ్యవస్థకు మళ్లీ జీవం పోసింది. అయితే, 2024లో చంద్రబాబు సర్కార్ వచ్చాక 2014–19 మధ్య తరహాలోనే అస్మదీయులకు అధిక ధరలకు పనులు కట్టబెట్టేందుకు జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్‌ను రద్దు చేసింది. మొబిలైజేషన్ అడ్వాన్సులను మళ్లీ తెచ్చింది. జ్యుడిషియల్ ప్రివ్యూ అమల్లో ఉంటే.. సీడ్ యాక్సిస్(ఈ3) రోడ్డును ఎన్‌హెచ్‌–16తో అనుసంధానించే పనుల కాంట్రాక్టు విలువపై ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, మేధావులు, సాధారణ ప్రజలు ఆన్‌లైన్‌లో ఆధారాలతో అభ్యంతరాలను లేవనెత్తే అవకాశం ఉండేది. వీటిని పరిగణనలోకి తీసుకుని కాంట్రాక్టు విలువను సవరించి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని జ్యుడీషియల్ ప్రివ్యూ జడ్జి ఆదేశించే వీలుండేది. రివర్స్ టెండరింగ్ అమల్లో ఉంటే... ఏడీసీఎల్ నిర్దేశించిన కాంట్రాక్టు విలువ కంటే కనీసం 9–10 శాతం తక్కువ ధరకే పనులు చేయడానికి ముందుకొచ్చేవారు. తద్వారా ఖజానాకు భారీఎత్తున ఆదా అయ్యేది. కానీ, చంద్రబాబు సర్కార్ ఆ విధానాలను రద్దు చేయడంతో సీడ్ యాక్సిస్ (ఈ3) రోడ్డును ఎన్‌హెచ్‌–16తో అనుసంధానించే పనుల కాంట్రాక్టు విలువ భారీగా ఉంది. రివర్స్ టెండరింగ్ రద్దుతో... 4.05 శాతం అధిక ధరకు రూ.532.57 కోట్లకు కోట్ చేసిన ఎన్‌సీసీ సంస్థ ఎల్‌–1గా నిలిచింది. దీనికే పనులు అప్పగించడానికి గురువారం కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం ఏడీసీఎల్‌కు అనుమతి ఇస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరకు పనులు కేటాయించడంతో ఖజానాపై అదనంగా రూ.20.73 కోట్లు భారం పడింది. సీడ్ యాక్సిస్ రోడ్డును ఎన్‌హెచ్‌–16తో అనుసంధానించే రహదారి పనుల కాంట్రాక్టు విలువ కి.మీ.కు రూ.180.35 కోట్లకు చేరింది. నిర్మాణం పూర్తయ్యేసరికి ఇంకెన్ని కోట్లకు చేరుతుందోనని ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్ నిపుణుల విస్మయం

జాతీయ రహదారుల నిర్మాణం.. కనకదుర్గమ్మ, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ నిర్మాణ వ్యయాలతో సీడ్ యాక్సిస్ రోడ్డును ఎన్‌హెచ్‌–16తో అనుసంధానం చేసే రహదారి పనుల కాంట్రాక్టు విలువను పోల్చిచూస్తూ ఇంజనీరింగ్ నిపుణులు నివ్వెరపోతున్నారు. నేషనల్ హైవేలు, అంతర్భాగమైన భారీ ఫ్లైఓవర్ల కాంట్రాక్టు విలువను ప్రస్తావిస్తూ... ''సీడ్ యాక్సిస్ రోడ్డును తారు, కాంక్రీట్‌తో కాకుండా బంగారపు పూతతో వేస్తున్నారా?'' అని ఇంజనీర్లు, జాతీయ రహదారుల నిర్మాణంలో అపార అనుభవం ఉన్న కాంట్రాక్టర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నీకింత.. నాకింత పంచుకోవడానికే

కాంట్రాక్టు విలువను భారీగా పెంచడం వెనుక... ఆ అంచనా వ్యయాన్ని కాంట్రాక్టర్‌తో కలిసి నీకింత నాకింత అంటూ ముఖ్య నేత, కాంట్రాక్టు సంస్థలు పంచుకుతినడానికేనని ఇంజనీరింగ్ నిపుణులు ఆరోపిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ (ఆసియా అభివృద్ధి బ్యాంకు), కేఎఫ్‌డబ్ల్యూ(జర్మనీ), హడ్కో వంటి అంతర్జాతీయ, జాతీయ ఆర్థిక సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పుగా తెచ్చిన నిధులను దోచుకుతింటూ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి గుంటూరు

శనివారం, 13 డిసెంబర్ 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 574.70 అడుగులకు చేరింది. శ్రీ శైలం నుంచి 50,665 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 100 క్యూసెక్కులొచ్చి చేరుతుండగా, దిగువకు 3,400 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 42.4733 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1600, మోడల్ ధర రూ.1300 వరకు పలికింది.

న్యూస్‌రీల్

కాల భైరవస్వామికి పూజలు

పెదపులివర్రు (భట్టిప్రోలు): వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ వారి దేవాలయంలో కొలువైన శ్రీ కాల భైరవ స్వామి వారికి మార్గశిర బహుళాష్టమి శుక్రవారం ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ దేవత అమ్మవారి దేవాలయంలో నిత్యపూజ కైంకర్యాలు విరజిల్లుతూ భక్తుల కోర్కెలు తీర్చే బంగారు కల్పవల్లి అమ్మవారిని భక్తులు సందర్శించారు.

వైభవంగా తెప్పోత్సవం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో నిర్వహిస్తున్న 99వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్లకు పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు, అలంకరణ జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి ఉత్సవ మూర్తులను తెప్ప తిరునాళ్లతో మహోత్సవం నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి చేయగా, వసంత సేవ, అవబదోత్సవం, చక్రతీర్థం కార్యక్రమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరు కాగా, కార్యక్రమాలను ఆలయ ట్రస్ట్ రాగం వెంకట లీలా సుందరి బెల్లంకొండ మస్తానరావు పర్యవేక్షించారు.

మిరప పంటలో సస్యరక్షణ చేపట్టాలి

నరసరావుపేట రూరల్: మిరప పంటలో తెగుళ్లు, చీడపీడలను అరికట్టేందుకు సస్యరక్షణ చేపట్టాలని పల్నాడు జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, నరసరావుపేట ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్‌లతో కలిసి ఆయన శుక్రవారం మిరప తోటలను పరిశీలించారు. పోషక లోప నివారణకు పైపాటుగా 19-19-19, ఫార్ములా-6, మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారి చేయాలని తెలిపారు. తెల్లనల్లి నివారణకు డైఫెన్థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరో మైసిఫెన్ ఒక మి.లీ.ను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. తెల్లదోమ నివారణకు ఎకరాకు 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటుచేసి, ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా థాయోమిథాగ్జం 0.4 గ్రాములు లేదా స్పైరోమైసిఫెన్ ఒక మీ.లీను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. నల్లతామర నివారణకు సైయాన్ట్రనిలిప్రోల్ 240 మి.లీ ఎకరానికి లేదా ఇమిడా క్లోప్రిడ్, ఫెఫ్రోనిల్ 50 గ్రాములు రెండు కలిపి ఎకరాకు పిచికారి చేయాలని తెలిపారు.

వైభవంగా కాలభైరవ జయంతి ఆరాధన

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మహా కాల భైరవాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం గుంటూరు నల్ల చెరువు ఒకటో వీధిలో శ్రీభవానీ శంకర శివసేన పూజ్య గురువులు శ్రీ సూర్యచంద్రేశ్వరానంద స్వామీజీ ఆధ్వర్యంలో కాల భైరవ జయంతి ఆరాధన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాకాల భైరవాష్టమి విశిష్టతను భక్తులకు స్వామీజీ వివరించారు. అనంతరం భక్తులకు భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

ప్రైవేటుపై పోరు.. సంతకాల జోరు!

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ ఉద్యమం
- తాడికొండ నియోజకవర్గంలో 64 వేలు దాటిన సంతకాలు
- చంద్రబాబు సర్కారు తీరుపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత

తాడికొండ నియోజకవర్గంలో అక్టోబర్ 16న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

తాడికొండ మండలం దామరపల్లిలో కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నాయకులు

తాడికొండ: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తూ, పేదలకు వైద్య సేవలను అందకుండా చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తాడికొండ నియోజకవర్గంలో జోరుగా సాగింది. అక్టోబర్ 16వ తేదీన ఉద్యమాన్ని నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకర్తలు, నాయకులను ఉత్సాహపరుస్తూ నియోజకవర్గంలోని 4 మండలాల్లో కార్యక్రమం చురుగ్గా సాగింది. ప్రణాళికాబద్ధంగా మండల, గ్రామ కమిటీలతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జుల నియామకంతో సేకరణ ఉత్సాహంగా కొనసాగింది. 4 మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివ రామిరెడ్డి, తాళ్ళూరి వంశీకృష్ణ, మైనేని నాగమల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, మండల, గ్రామ అనుబంధ కమిటీ సభ్యులు ఇంటింటికీ తిరిగి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో నష్టాలను తెలియజేసి సంతకాలను సేకరించారు. అన్నివర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రైవేటు వారితో లాలూచీ పడిన చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

అనూహ్య మద్దతు

తాడికొండ నియోజకవర్గంలో 64 వేలకుపైగా సంతకాలు సేకరించారు. ప్రజల నుంచి అనూహ్య మద్దతు తోడవడంతో సంతకాల సేకరణ జోరుగా సాగింది. చంద్రబాబు సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, సూపర్ సిక్స్ పేరుతో ఓట్లు దండుకొని హామీల అమలుపై మొండిచేయి చూపించిన వైనంపై ప్రజలు ఇప్పటికే మండిపడుతున్నారు. గ్రామాల్లో సంతకాల సేకరణకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలు... చంద్రబాబు చేసిన మోసం గురించి ప్రజలకు వివరించినప్పుడు సర్కారుపై వ్యతిరేకత స్పష్టం కనిపించింది. పేదల కోసం ఉన్నత ఆశయంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

తుళ్ళూరు మండలంలో కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజల నుంచి మంచి స్పందన



చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదు. ప్రజలను మోసం చేసేలా పనులకు శ్రీకారం చుడుతూ నిత్యం పేదలను అణగదొక్కుతున్నారనేందుకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయమే నిదర్శనం. గ్రామాల్లోకి వెళుతుంటే ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మహిళలు తమకు జరిగిన అన్యాయంపై మండిపడుతున్నారు. బాబు తీరుపై ప్రజల్లో ఇంత వ్యతిరేకత వచ్చిందనేది సంతకాల సేకరణలో బయటపడింది.

– వంగా పోలారెడ్డి, తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు

పేదలకు వైద్యం, వైద్య విద్య దూరం

చంద్రబాబు పేదవాడికి అన్ని విధాలా అన్యాయం చేస్తున్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు వైద్య విద్య దూరం కావడంతో పేదలకు మెరుగైన వైద్యాన్ని దూరం చేసి ప్రైవేటు కళాశాలలకు ఊతమిచ్చి పేదలను మరింత అణగదొక్కాలని చూడటం అన్యాయం. ఇకనైనా తప్పుడు నిర్ణయాలు పక్కనబెట్టి పేదలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వంపై వచ్చే వ్యతిరేకతతో జన సునామీలో బాబు కొట్టుకుపోవడం ఖాయం. తగిన సమయంలో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడం మరిచిపోరు.

– పరుచూరి నారాయణ, పాములపాడు

అయినవారికి దోచిపెట్టేందుకే నిర్ణయాలు

ప్రైవేటీకరణ పేరుతో మెడికల్ కళాశాలలను అప్పనంగా తన వారికి కట్టబెట్టేందుకు బాబు చేస్తున్న కుట్రలు ప్రజలకు అర్థమైనందునే నేడు కోటి సంతకాల ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ప్రైవేటు రంగంలో ఉన్న తన మద్దతుదారులకు దోచిపెట్టేందుకే సీఎం చంద్రబాబు ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పేదవాడికి ఉచితంగా వైద్యం, వైద్య విద్య అందాలంటే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిలిపివేయాలి.

– దాసరి రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు

నేడు జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: నాలుగో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్-కమ్- ప్రిన్సిపల్ జిల్లా జడ్జి బి. సాయి కల్యాణ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. లోక్ అదాలత్ శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు ఆవరణలో జరుగుతుందన్నారు. ఈ అదాలత్‌లో జిల్లా పరిధిలోని సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, వైవాహిక వివాదాలు, ప్రీ లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలు తదితర కేసులు పరిష్కారం కోసం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని గుర్తుచేశారు. గుంటూరు నగరంలోని న్యాయ అధికారులు, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు ప్రారంభ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి పలువురిని పలు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాల్లో నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భీమినేని వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా మన్నెం లక్ష్మి, వైఎస్సార్ టీయూసీ సహాయ కార్యదర్శిగా బోరుగడ్డ రజినీకాంత్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

చంద్రబాబు ఒక దొంగ దోపిడీదారుడు

15న నిర్వహించనున్న కోటి సంతకాల ర్యాలీ సన్నాహక సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి, వేదికపై అంబటి రాంబాబు, మోదుగుల, మురుగుడు, వేమారెడ్డి, అంబటి మురళీ కృష్ణ, నూరిఫాతిమా, బాలవజ్రబాబు తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : చంద్రబాబు ఒక దొంగ అని, దోపిడీదారుడని అన్నీ దోచుకోవడమే ఆయన పని అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కష్టపడి 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకొస్తే వాటిని కనీసం పట్టించుకోలేని పరిస్థితుల్లో చంద్రబాబు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 15న జరగనున్న కోటి సంతకాల సేకరణ ర్యాలీకి సంబంధించి శుక్రవారం గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు.

- లక్ష్మీపార్వతి మాట్లాడుతూ వై.ఎస్.జగన్ మెడికల్ కళాశాలలు కట్టుకుంటూ వస్తే... చంద్రబాబు అమ్ముకుంటూ పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు మేలు చేసేలా 30 ఏళ్ల ముందుకు ఆలోచించి జగన్ విద్య, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారన్నారు.
- అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 15న జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి భారీ ఊరేగింపు నడుమ లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన కొనసాగుతోందన్నారు. జిల్లాలో మొత్తం కలిపి 4,78,589 సంతకాలు పూర్తయినట్లు వివరించారు. పార్టీ అనుబంధ విభాగాల నేతలు, జిల్లా, నగర, గ్రామ, మండల, డివిజన్ నుంచి ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ ర్యాలీలో భాగస్వాములు కావాలని కోరారు.
- మాజీ ఎంపీ, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 1.32 కోట్ల ఓట్లు వస్తే కోటి సంతకాల కార్యక్రమానికి 1.40 కోట్లకు పైగా రావడం ద్వారానే ప్రభుత్వంపై వ్యతిరేకత అర్థమవుతోందన్నారు. పేదవాడి ఆర్తనాదాన్ని తెలియజేసేదే ఈ సంతకమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భవిష్యత్తులో భరోసా నింపడమే ధ్యేయంగా జగన్ 2.0 లక్ష్యమన్నారు.
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రాధాన్యత గుర్తించిన వై.ఎస్.జగన్ వాటిని ప్రజలకు చేరువ చేశారన్నారు. ఇది కేవలం వైఎస్సార్‌సీపీ పోరాటం కాదని, ఇది ప్రజా ఉద్యమమని స్పష్టం చేశారు.
- వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రజలు తిరగబడితే ప్రభుత్వాలే కుప్పకూలి పోయిన పరిస్థితులు ఎన్నో ఉన్నాయన్నారు. చంద్రబాబుకు అదేగతి పట్టనుందన్నారు.
- పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని, అందుకే కోటి సంతకాలు కాకుండా ఏకంగా 1.40 కోట్ల సంతకాలు పూర్తయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీకి పోరాటం కొత్తకాదన్నారు.
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ టీడీపీ వారే సంతకాలు చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. చంద్రబాబు విధానాలు నచ్చని ఆ పార్టీ వారే పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు.
- తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ వై.ఎస్. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఏ విధంగా పేదలకు వైద్యం, విద్య అందిందో అది ఇప్పుడు కూడా వారికి అందించేందుకు పోరాడుతున్నారన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, గులాం రసూల్, వలి వీరారెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, మండేపూడి పురుషోత్తం, పఠాన్ అబ్దుల్లా ఖాన్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు తాడిబోయిన వేణుగోపాల్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, యేటి కోటేశ్వరరావు యాదవ్, పఠాన్ సైదా ఖాన్, నందేటి రాజేష్, సీడీ భగవాన్, ఉడుముల పిచ్చిరెడ్డి, సుబ్బులు, రూత్‌రాణి, అవినాష్, ప్రభు, వాసిమళ్ల విజయ్, కొండా రవి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కబడిగా పచ్చదనం పెంపు

- మిషన్ గ్రీన్ గుంటూరు కింద 5 లక్షల మొక్కలు నాటాలని జీఎంసీ నిర్ణయం
- ఇప్పటికే లక్షన్నర మొక్కలు నాటినట్లు చెబుతున్న అధికారులు
- ఏపీ గ్రీన్ కార్పొరేషన్, అటవీశాఖ ద్వారా మిగతా మొక్కలు నాటడానికి చర్యలు
- ఇప్పటికే నాటిన మొక్కల లెక్కల్లో తేడాలు
- మొక్కలు తెప్పించే పనిలో అన్నీ తానై వ్యవహరిస్తున్న ఓ 'డీఈఈ'
- పార్కు ఏడీహెచ్ ఉన్నప్పటికీ ప్రేక్షకపాత్ర వహించలేక రిలీవ్ అయిన వైనం

గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మిషన్ గ్రీన్ గుంటూరు కింద 5 లక్షల మొక్కలు నాటాలని జీఎంసీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 1.50 లక్షలు మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన మొక్కలు ఏపీ గ్రీన్ కార్పొరేషన్, అటవీ శాఖ ద్వారా తెప్పించి నాటడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే ఈ మొక్కలు తెప్పించడంలో ఓ డీఈఈ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

గుంటూరు నగరంలోని డివైడర్ల మధ్య నాటిన మొక్కలు

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపాలిటీకి ఇటీవల రెండు లారీల మొక్కలు తెప్పించినప్పటికీ అసలు ఆ మొక్కలు ఎక్కడ నుంచి వచ్చాయో.. ఎన్ని వచ్చాయో అనే సమాచారం మిగతా అధికారులకు కూడా తెలియదంటే అతిశయోక్తి లేదు. గతంలో ఈ మొక్కల వ్యవహారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ (ఏడీహెచ్) చూసేవారు. కానీ ఇప్పుడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ)కు నేరుగా బాధ్యతలు అప్పగించడంతో మొక్కల లెక్కల్లో గోల్‌మాల్ జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మొక్కలు తెప్పించడంలో డీఈఈ చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. మొక్కలు తెచ్చేవి గోరంత.. బిల్లు పెట్టేది కొండంత.. అన్నట్లుగా వ్యవహారం ఉందని తెలిసింది. తెచ్చిన మొక్కలు ఏమైపోయాయి అని అడిగితే ఎండిపోయాయని చెప్పడం పరిపాటిగా మారింది. మొక్కల వ్యవహారం అంతా ఆ డీఈఈయే చూసుకోవడంతో ప్రస్తుతం ఇక్కడ పార్కు ఏడీహెచ్‌గా పనిచేస్తున్న శాంతి ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మొక్కలు ఏమైనా పాడైపోతే వెంటనే పార్కు సిబ్బందిని పిలిచి అధికారులు మందలిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇక్కడ పనిచేయలేనని ఏడీహెచ్ శాంతి రిలీవ్ అయి వెళ్లిపోయారు. ఈ మధ్య కాలంలో ముగ్గురు ఏడీహెచ్‌లు రిలీవ్ అయ్యారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

సొంత నర్సరీ ఉంటే మేలు...

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన స్థలాలు నగర పరిధిలో చాలానే ఉన్నాయి. ఆయా స్థలాల్లో మొక్కల పెంపకం, గ్రాస్ పెంచడం వంటి కార్యక్రమాలు చేయడం ద్వారా కార్పొరేషన్ ఆదాయం గండి పడకుండా ఉంటుందని నగరపాలక సంస్థ ఉద్యోగులు చెబుతున్నారు. నర్సరీలు లేకపోవడంతో ఎప్పుడైనా బయటి నుంచి మొక్కలు తెప్పించినప్పుడు వాటిని రిజర్వాయర్ల వద్ద గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు. తర్వాత అటువైపు చూసేవారే లేకపోవడంతో అవి పూర్తిగా ఎండిపోతున్న పరిస్థితులు ఉన్నాయి.

పాడైపోతున్న మొక్కలు

నగరం సుందరీకరణలో భాగంగా పలు డివైడర్లలో ఉన్న పాత మట్టినంత తీసేసి కొత్త మట్టిని నింపారు. అదే విధంగా సదరు డివైడర్లలో మొక్కలు నాటుతున్నారు. అయితే వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మొక్కలు పాడైపోతున్నాయి. నిర్వహణ చూసుకోవాల్సిన సిబ్బంది సుమారు 80 మంది ఉంటే కేవలం 30 మంది లోపే విధులు నిర్వహిస్తున్నారని సమాచారం. మిగిలిన వారంతా పార్కుల కింద జీతాలు రాయించుకుంటూనే నగరపాలక సంస్థ కార్యాలయంలో డెప్యూటేషన్లపై విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిని అడిగే వారు లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లక్ష్మీపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు గెలిచిన తర్వాత ఇచ్చిన పహామీలు గాలికి వదిలేశారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి సంక్షేమ పథకాలు అమలు చేయబోమని చెప్పడం తగదన్నారు. అంగన్వాడీలకు యాప్‌ల భారాన్ని రద్దు చేయాలన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో హెల్పర్లకు ప్రమోషన్లు ఆపటం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనలక్ష్మి, ఏవీఎన్ కుమారి గౌరవాధ్యక్షుడు జి రమణ, ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణమూర్తి, రత్న మంజుల, ప్రేమ్ కుమారి, సీఐటీయూ నాయకులు దుర్గారావు హుస్సేన్ వలి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	31,613
అమ్ముకాలు	36,275
నిల్వ	6,263

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-17,000
నంబరు-5	11,500-15,400
273	10,500-14,000
341	10,500-16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-16,800
నంబరు-5	11,000-15,300
341	11,000-16,500
4884	11,000-14,300
సూపర్-10	12,000-16,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,400
బాడిగ-355	10,500 - 16,500
దేవనూరు డీలక్స్	11,000 - 16,600
ఆర్మూర్	10,000 - 12,600
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000-14,800
బాడిగ - 355	10,000-16,500
దేవనూరు డీలక్స్	10,500-16,000
తాలు	5,200 - 6,700

-కొరిటిపాడు (గుంటూరు)

వరి గడ్డి ఖర్చు 'తడిసి మోపెడు'!

- మోపు రూ. 200... ఎకరం రూ. 20 వేలకుపైనే
- రవాణా, కూలీల ఖర్చు మరింత అదనం
- పశువులను మేపేదెలా అంటూ రైతుల వేదన

తాడేపల్లి రూరల్: పాడి రైతులు ఇప్పటికే పాల ధర గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నారు. దాణా, ఇతర ఖర్చులు భారీగా పెరగడంతో పశువుల పెంపకం భారంగా మారింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు వరి గడ్డి ధర గత సంవత్సరం కన్నా పెరగడంతో పశువులను ఎలా మేపాలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఎకరం వరిగడ్డి రూ. 18 వేలు ఉండగా, ఈ సంవత్సరం ఒక మోపు ఖరీదు రూ. 200 తీసుకుంటున్నారు. ఎకరానికి 110 నుండి 120 కట్టలు వస్తాయి. ఈ లెక్కన ఎకరం గడ్డి రూ.20 వేలు దాటింది. ఒక్కొక్క గేదెకు సంవత్సరానికి ఎకరం ఎండుగడ్డి తప్పని సరి. ఇది కాకుండా పచ్చగడ్డి, దాణా అదనం. వరిగడ్డి ఎకరం కొంటే దాన్ని మోపులు కట్టడానికి రూ.2 వేలు, రవాణా ఖర్చులు దూర భారాన్ని బట్టి రూ.2 వేల నుంచి రూ. 5 వేలు అవుతోందని రైతులు తెలిపారు. తుపానులు, వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఎక్కువ శాతం యంత్రాలతో వరి కోత కోయించారు. ఇలా వచ్చే గడ్డి కూడా నాణ్యతగా ఉండదని, మిషన్ కోత వల్ల గడ్డి గుల్లగా మారి ఆరు నెలల వరకు మాత్రమే గేదెలకు ఉపయోగించవచ్చని రైతులు తెలిపారు. తరువాత ఆ గడ్డి వాసన వచ్చి వాములు సరిగా లేక కుళ్లిపోతుందని చెబుతున్నారు.

పాల నాణ్యతపై ప్రభావం

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు కేంద్రాలకు పాలు అమ్ముతుంటారు. పచ్చిగడ్డి, దాణా ఉన్నప్పటికీ పాలల్లో వెన్నశాతం రావాలంటే తప్పని సరిగా ఎండుగడ్డి పెట్టాల్సిందే. ఎండుగడ్డి వేయకపోతే పాలలో వెన్నశాతం తగ్గి కేంద్రంలో రేటు కూడా తగ్గిస్తారు. పట్టణ ప్రాంతాల్లో వెన్నశాతం ఎలా ఉన్నా లీటరు రూ.90కి అమ్ముతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెన్నశాతాన్ని బట్టి రూ.80 - రూ.60కి కొనుగోలు చేస్తున్నారు. ఎండుగడ్డి వేయకపోతే ఆ డబ్బులు కూడా రావని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.50 లక్షలకుపైగా ఖర్చు

గేదెలను పెంచుతున్నా. వాటి ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నాను. పదేళ్లుగా దాణా, తవుడు రేట్లు పెరుగుతున్నాయి. వరిగడ్డి మొదట్లో రూ.5 వేలు ఇచ్చి ఎండిన వచ్చి వాము వేసి వెళ్లేవారు. ప్రస్తుతం ఎకరం గడ్డి రూ. 25 వేలు లేనిదే రావడం లేదు. గేదెకు ఎకరం గడ్డికొనాల్సిందే. 10 గేదెలకు 10 ఎకరాలు అంటే రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఇది చాలా భారంగా ఉంది.

– కందుల శ్రీనివాసరావు, పోలకంపాడు

ఇంకా మూడు ఎకరాలు కొనాలి

ఐదు గేదెలను పెంచుతున్నా. రెండు ఎకరాలు మా సొంత గడ్డి ఉంది. ఇంకా మూడు ఎకరాలు కొనాలి. దాదాపు రూ. 75 వేల వరకు అవుతుంది. గేదెలను రోజూ గడ్డి కోసం బయటకు తోలుకు వెళ్లినా సాయంత్రం తప్పని సరిగా ఎండుగడ్డి వేయాలి. వర్షాకాలం, చలికాలం ఎండుగడ్డి వేయకపోతే గేదెల ఆరోగ్యం దెబ్బతింటుంది. తిన్నా.. తినకపోయినా.. వరిగడ్డి కొనాల్సిందే.

– కనకయ్య, పోలకంపాడు

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

రేపల్లె: పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఆలయ ఈవో డి.వెంకటప్పలాచార్యులు తెలిపారు. స్థానిక ఆలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ సర్వశ్రేయోనిధి నిధుల నుంచి రూ.40లక్షలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేశారన్నారు.త్వరలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170).
విజయవాడ, లొకేషన్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత(లు), సహ-దరఖాస్తుదారు(లు)/ తాకట్టుదారు(లు)/హామీదారు(లు): 1. మెస్సర్స్ మంజూ భార్గవ కాట్ ఫైబర్స్ ప్రైవేట్ లిమిటెడ్,** చల్లా విశ్వనాథ భార్గవ రెడ్డి (మేనేజింగ్ డైరెక్టర్), చల్లా శివ వెంకట రెడ్డి (జి.పి.ఎ. హోల్డర్), డి.నెం. 26-46-64/బి, 2వ లైన్, ఎన్.జి.ఓ. కాలనీ, గుంటూరు-522007. **2. చల్లా శివ వెంకట రెడ్డి (జి.పి.ఎ. హోల్డర్ & తాకట్టుదారు),** డి.నెం. 26-46-64/బి, 2వ లైన్, ఎన్.జి.ఓ. కాలనీ, గుంటూరు-522007. **3. భీమసపాటి వరలక్ష్మి (కో-ఆబ్లిగెంట్/హామీదారులు),** భర్త: చంద్రశేఖర్ రెడ్డి, డి.నెం. 26-46-64/బి, 2వ లైన్, ఎన్.జి.ఓ. కాలనీ, గుంటూరు-522007. **4. ఉమ్మడిరెడ్డి శ్రీలత (కో-ఆబ్లిగెంట్/హామీదారులు),** భర్త: హరనాథ రెడ్డి, చిరునామా: డి.నెం. 26-46-64/బి, 2వ లైన్, ఎన్.జి.ఓ. కాలనీ, గుంటూరు-522007. **5. కందికోటి రెడ్డి (కో-ఆబ్లిగెంట్/హామీదారులు),** తండ్రి: సుబ్బారెడ్డి, నెల్లటూరు గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా. **6. చల్లా మంజూష (కో-ఆబ్లిగెంట్/హామీదారులు),** భర్త: వాక మురళీ కృష్ణ, డి.నెం. 26-46-64/బి, 2వ లైన్, ఎన్.జి.ఓ. కాలనీ, గుంటూరు-522007. వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 11,10,03,202.60** (అక్షరాలా పదకొండు కోట్ల పది లక్షల మూడు వేల రెండు వందల రెండు రూపాయల అరవై పైసలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 15.09.2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **తేదీ. 10-12-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయనైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 11,10,03,202.60** (అక్షరాలా పదకొండు కోట్ల పది లక్షల మూడు వేల రెండు వందల రెండు రూపాయల అరవై పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుండురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఐటమ్ నెం-1: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు రిజిస్ట్రార్ కార్యాలయం, కర్నూతల గ్రామ పంచాయతీ, డి.నెం. 168 లోని మొత్తం ఎకరా 16.60 సెంట్ల విస్తీర్ణంలో ఎకరా 1.09 సెంట్లలలో ఉన్న 2988.88 చదరపు గజాల స్థలం మరియు దానిపై ఉన్న సివిల్ నిర్మాణాలను మెస్సర్స్ మంజు భార్గవ కాట్ ఫైబర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున కలవు. సేల్ డాక్యుమెంట్ నెం. 4147/2016, తేదీ 17.09.2016. **హద్దులు: తూర్పు:** చల్లా మంజూష గారి ఆస్తి, **పడమర:** సర్కార్ రోడ్డు, **దక్షిణం:** పోతురాజు రాజ్యలక్ష్మి గారి ఆస్తి, **ఉత్తరం:** చల్లా మంజూష గారి ఆస్తి.

ఐటమ్ నెం-2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు రిజిస్ట్రార్ కార్యాలయం, కర్నూతల గ్రామ పంచాయతీ, డి.నెం. 168 లోని మొత్తం ఎకరా 16.60 సెంట్ల విస్తీర్ణంలో ఎకరా 1.09 సెంట్లలలో ఉన్న 2286.72 చదరపు గజాల స్థలం మరియు దానిపై ఉన్న సివిల్ నిర్మాణాలను శ్రీమతి చల్లా మంజూష గారి పేరున కలవు. సేల్ డాక్యుమెంట్ నెం. 4146/2016, తేదీ 17.09.2016. **హద్దులు: తూర్పు:** కర్నూతల వీరస్వామి గారి ఇనాం స్థలం, **పడమర:** మంజు భార్గవ కాట్ ఫైబర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆస్తి, **దక్షిణం:** పోతురాజు రాజ్యలక్ష్మి గారి ఆస్తి, **మళ్ళీ దక్షిణం:** మంజు భార్గవ కాట్ ఫైబర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆస్తి, **మళ్ళీ పడమర:** సర్కార్ రోడ్డు, **ఉత్తరం:** తోట శంకర రావు మొదలైన వారి ఆస్తి.

తేదీ: 10-12-2025 అధీకృత అధికారి
ప్రదేశము: విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఓవరాల్ చాంపియన్ అంగలకుదురు జెడ్పీ హైస్కూల్

ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ అఫ్రోజ్ ఖాన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా క్రాస్ కంట్రీ పోటీల్లో అంగలకుదురు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ టైటిల్ సాధించిన టీంకు ట్రోఫీతోపాటు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 24న కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా టీం పాల్గొంటుందని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ క్రీడాకారులకు స్పాన్సర్ కొరత ఉందని, కంపెనీలు ముందుకు వచ్చి క్రీడాకారులను దత్తత తీసుకుంటే రాబోవు రోజుల్లో గుంటూరు నుంచి అంతర్జాతీయ చూడగలమని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఏవీ ఆంజనేయులు, అరుణ్‌కుమార్, శాప్ కోచ్‌లు శివారెడ్డి, వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు వి.శరత్‌బాబు, అంజి, నాగరాజు పాల్గొన్నారు.

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 653

కొమ్ములు : 253 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,675	12,500	10,675

కాయలు : 366 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,675	12,350	11,825

మొత్తం అమ్మకాలు : 489.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ఆలయంలో చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

రూ.70 వేల నగదు, వెండి వస్తువులు స్వాధీనం

తాడికొండ: బండారుపల్లి పోలేరమ్మ ఆలయంలో చోరీ చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడికొండ సీఐ కె. వాసు తెలిపారు. ఆగస్టు 8వ తేదీన బండారుపల్లి పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జైత్యానాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఐదుగురిని నిందితులుగా గుర్తించారు. వీరిలో ఎమ్మెల దావీదు, దొడ్డా యోహోషువా, సయ్యద్ మస్తాన్ బాబు తాడికొండ అడ్డరోడ్డు వద్ద సంచరిస్తుండగా శుక్రవారం అరెస్టు చేసి విచారించగా వీరిపై మొత్తం 10 కేసులు ఉన్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 632 గ్రాముల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించగా ఇద్దరికి జ్యుడీషియల్ రిమాండ్, మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రతి రోజూ ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు సందర్శించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీమ్ బాషా, రాష్ట్ర పరిశీలకురాలు పయ్యావుల పార్వతి ఆదేశించారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షాభవన్‌లో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో డీఈవో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పర్చాలని సూచించారు. సమావేశంలో సమగ్రశిక్ష సమన్వయకర్త ఐ.పద్మావతి, డీసీఈబీ కార్యదర్శి ఏ.తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

నేడు తుళ్లూరులో నయీ చేతన 4.0 కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: నయీ చేతన 4.0 కార్యక్రమం (లింగ సమానత్వ ప్రచార కార్యక్రమం) శనివారం తుళ్లూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలపై జరిగే హింస, వివక్ష, మహిళల ఆర్థిక సాధికారత మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని ఈ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తామన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఇ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. తుళ్లూరులో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, సి.ఆర్.డి.ఎ సివిల్ హబ్ వద్ద జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అనంతరం స్థానిక పాఠశాల గ్రౌండ్‌లో లింగ సమానత్వ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఏ - వెలుగు అధికారులు సమన్వయం చేయడం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, నయీ చేతన 4.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ద్వారక హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రతికూల తీర్పు

గుంటూరు లీగల్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ద్వారక హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రతికూలంగా గుంటూరు వినియోగదారుల ఫోరం శుక్రవారం తీర్పు చెప్పింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లంకి బాలభాస్కరరావు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వి.వి.పురం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 278, 279, 280, 284లో సాయి విహార్ మెగా సిటీ పేరుతో వెంచర్ వేశారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చీడిపూడి కృష్ణారెడ్డి రెండు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఒక్కొక్కటి 289 చదరపు గజాల విస్తీర్ణం. ప్లాట్లు కొనుగోలు నిమిత్తం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లంకి బాల భాస్కరరావుతో ఒప్పందం చేసుకొని ఒప్పంద పత్రాలు రాసుకున్నారు. రూ.8 లక్షలను 2014, 2015వ సంవత్సరాలలో అడ్వాన్స్ ఇచ్చి మిగిలిన బ్యాలెన్స్ ఉడా అప్రూవల్ పొందిన పది రోజుల్లోగా చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. అప్పటినుండి ఉడా అప్రూవల్ పొందకుండా ఎంతోమంది కస్టమర్లను నమ్మించి మోసం చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తున్న ద్వారక హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై గుంటూరు వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు. కేసు విచారణ జరిపిన ఫోరం ద్వారక హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సేవల లోపంగా భావించి వారికి ప్రతికూలంగా తీర్పు చెప్పింది. చీడిపూడి కృష్ణారెడ్డి ముందస్తుగా చెల్లించిన రూ.8 లక్షలకు 9 శాతం వడ్డీతో డబ్బులు కట్టినప్పటి నుండి తిరిగి చెల్లించే వరకు, రూ.50వేలు మానసిక క్షోభకు గురి చేసినందుకు గాను, రూ.3వేలు కోర్టు ఖర్చులు కింద చెల్లించాలని తీర్పు వెలువరించింది. ఇవన్నీ ఆరు వారాల్లోగా అమలు చేయాలని గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరం అఫిషియేటింగ్ ప్రెసిడెంట్ ఏ.విజయలక్ష్మి, సభ్యులు ఎ.పున్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వజ్రాల రాజశేఖర్‌రెడ్డి తన వాదనలు వినిపించారు.

విజ్ఞాన్, ఇప్పెటీ మధ్య అవగాహన ఒప్పందం

ఒప్పందం పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ, ఇప్పెటీ లీఫ్ మెడికల్ ఆఫీసర్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, గుంటూరులోని ఇప్పెటీ డయాగ్నస్టిక్స్ రీసెర్చ్ సెంటర్‌ల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఇప్పెటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి కొంగటి, సీఈవో-సీఎస్ఓ డాక్టర్ సందీప్ కుమార్ నాదెండ్ల విజ్ఞాన్ వైస్ చాన్సలర్ పి నాగభూషణ్‌లు అవగాహన పత్రాలను మార్చుకున్నారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, ప్రెసిషన్ మెడిసిన్, ఆధునిక జీవసాంకేతిక రంగాలలో శాస్త్రీయ, సాంకేతిక సహకారాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం రెండు సంస్థలు కలిసి నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్, డ్రగ్ ఇంటరాక్షన్ విశ్లేషణ, మాలిక్యులర్ రీసెర్చ్, లో-కాస్ట్ పీసీఆర్ టెక్నాలజీ అభివృద్ధి, సెప్సిస్ ట్రాన్స్‌క్రిప్టోమిక్స్, బయోఇన్ఫర్మేటిక్స్ అనాలిటిక్స్ వంటి ఆధునిక పరిశోధనలలో కలిసి పనిచేయనున్నట్టు తెలిపారు. ఇప్పెటీ సంస్థ స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ ప్రయోగశాలలు, హైఎండ్ పరికరాలు, బయోఇన్ఫర్మేటిక్స్ సపోర్ట్, క్లినికల్ డేటా ఇంటిగ్రేషన్ వంటి సౌకర్యాలను అందిస్తుందన్నారు. వీటితోపాటు యూజీ -పీజీ విద్యార్థులకు పరిశోధన ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త పరిశోధన ప్రతిపాదనలను జాతీయ-అంతర్జాతీయ ఫండింగ్ ఏజెన్సీలకు సమర్పించడం, ఇప్పెటీ సంస్థ వైద్యులకు విజ్ఞాన్‌లో ఉన్నత చదువులకు అవకాశాలు, అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ సదస్సులు, సింపోజియాలు, సంయుక్త శాస్త్రీయ పత్రాల ప్రచురణ, ఇన్నోవేషన్, స్టార్టప్-ఇంక్యుబేషన్ పై సంయుక్త కార్యక్రమాలు, హెల్త్‌కేర్-ఇంజినీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ వంటి రంగాల్లో ఇండస్ట్రీ-అకాడమియా బ్రిడ్జ్ బలోపేతం చేస్తామన్నారు. రెండు సంస్థల సహకారం వలన ఆధునిక వైద్య సేవల మెరుగుదల, అభివృద్ధిచెందే రోగ నిర్ధారణ, ప్రెసిషన్ థెరపీ అభివృద్ధి, తక్కువ ఖర్చుతో అధునాతన పరీక్షలు అందించడంలో కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని వీసీ తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్స్, అధ్యాపక సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE
■ మాచర్ల, శ్రీశైలం రోడ్, అఖిల టవర్స్ 3వ ఫ్లోర్‌లో 1250 చ.అ.ల డబుల్‌బెడ్ రూమ్ ఫ్లాట్ SBI వేలం ద్వారా అమ్మకం రిజర్వు ధర: 25 లక్షలు. 99663 93649

SERVICES

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED
■ Wanted Accountants to Work in Audit Office having Knowledge in Tally. GST Contact Numbers: 89780 21054
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33372
■ గుంటూరు శ్యామలనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో పనిచేయుటకు భార్య భర్తలు కావలెను. ఉచిత వసతి కలదు. సం: 8019559657, 9398281363, 9133430333.
■ Web designing, మల్టీమీడియా, యూట్యూబ్ వీడియో వర్క్ పనిచేయుటకు ఎడిటింగ్ తెలిసిన వ్యక్తి హాస్పిటల్లో కావలెను. యర్రాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట, గుంటూరు. సం : 8019559657, 9949125425, 9133430333.
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ మరియు పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429
■ SHO కు MLT, DMLT, BSc-MLT, ANM, GNM లు కావలెను. జీతం: 8-10వేలు, సం॥ SHO 2/1 బ్రాడీపేట, గుంటూరు. 9848391212
■ గుంటూరులోని ప్రముఖ హోటల్ వారికి డిగ్రీ అర్హత కలిగిన ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హౌస్ కీపింగ్, రూమ్ సర్వీస్ బాయ్స్ కావలెను. అర్హత: అనుభవమును బట్టి జీతం. సంప్ర॥ 9704300575 email:rcrorchid@gmail.com
■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అర్హత: 10th, వయస్సు 40సం॥లోపు, 12గం డ్యూటీ, జీతం 11k-13k సం॥ 9704060536
■ Wanted Experienced Lady Tele caller cum Computer Operater for Education Consultancy in Guntur, Lakshmipuram. Sal: 15k to 20K, Qua: Degree. 9052975353
■ శ్రీ ఇన్‌ఫ్రా రియల్‌ఎస్టేట్ గుంటూరు నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. అర్హత: 7th-10th, జీతం: పార్ట్‌టైమ్- 6000/-, ఫుల్‌టైమ్-13000/-+ఇన్సెంటివ్. 9908886363
■ తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి ✆ 80961 61777, 70939 24466
■ ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్ & ఔట్‌సోర్సింగ్ జాబ్స్ అటెండర్స్, క్లర్క్, డేటా ఎంట్రీ, ఆఫీసు అసిస్టెంట్స్. Cell : 9703602687

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు మా॥ 8 రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167663
7075167541

గమనిక

ఘనంగా ప్రారంభమైన క్రెడాయి ప్రాపర్టీ షో

జ్యోతి ప్రజ్వలనలో డీజీఎం సయ్యద్ జవహర్, డీజీఎం బి.కృష్ణకుమార్ ప్రభు, చిత్రంలో మేయర్ రవీంద్ర

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు నగరంలో ప్రముఖ స్థిరాస్థి సంస్థ క్రెడాయి ప్రాపర్టీ షోను గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం సయ్యద్ జవహర్, స్టేట్ బ్యాంక్ డీజీఎం బి.కృష్ణకుమార్ ప్రభు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ది-గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్ఎం కిరణ్ రెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, క్రెడాయి మాజీ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

■ మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ క్రెడాయి ప్రతి సంవత్సరం ప్రాపర్టీషో విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాలకు చెందిన అన్ని కంపెనీల ఉత్పత్తులు ఒకేచోట లభించడం శుభ పరిణామమన్నారు.

■ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ క్రెడాయి ప్రాపర్టీషో ఇంత భారీ స్థాయిలో నిర్వహించడం సంతోషకరమన్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల అభివృద్ధికి బిల్డర్స్ పాత్ర కీలకమన్నారు.

■ క్రెడాయి మాజీ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయి 8వ ప్రాపర్టీ షో వినియోగదారులకు అనువుగా నిర్వహించడం జరుగుతోందన్నారు. బ్యాంకులు ఒకేచోట రుణ సౌకర్యం కల్పించడం శుభ పరిణామమన్నారు. ఈ ప్రాపర్టీ షో మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటలకు వరకు జరుగుతుందన్నారు.

■ క్రెడాయి ప్రెసిడెంట్ మామిడి రాము మాట్లాడుతూ ప్రతిరోజూ 10 బంపర్ లక్కీ డ్రాలు తీయనున్నామన్నారు. శుక్రవారం జరిగిన లక్కీడ్రాను గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తీశారని వెల్లడించారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

గుంటూరు క్రెడాయి చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, సెక్రటరీ మెట్టు సాంబశివారెడ్డి, ట్రెజరర్ ఎ.వి.నాగార్జునరెడ్డి, ప్రాపర్టీ షో 2025 కన్వీనర్ తియ్యగూర వినోద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివనాగేశ్వరరావు, క్రెడాయి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు పాల్గొన్నారు.

భార్య, అత్తను వేధించిన ఘటనపై కేసు నమోదు

చినగంజాం: తాగి వచ్చి భార్యను, అత్తను వేధిస్తున్న సంఘటనకు సంబంధించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన శీలం పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. కుమార్తెను ముత్యాల రాకేష్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేసిన కొన్ని రోజులు తరువాత వారిద్దరికి మనస్పర్థలు వచ్చాయి. దాంతో ఆమె చీరాల కోర్టులో విడాకులు కేసు పెట్టింది. అప్పటి నుంచి రాకేష్ అప్పుడప్పుడు తాగి వచ్చి భార్యను, అత్త శీలం పద్మను వేధిస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాకేష్ మద్యం తాగి వచ్చి ఫిర్యాది పద్మను ఇష్టం వచినట్లు బూతులు తిట్టి చంపుతానని బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్, 3వ అంతస్తు, కెప్టెన్ మేడపీఠ, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777
ఆస్తి తనిఖీ కొరకు : 98856 03086

Appendix – II –A
[See Proviso to Rule 6(2)]

చరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద చరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible] శ్రీ లక్ష్మీ జెనింగ్స్ [illegible] ప్రొప్రైటర్ : శ్రీమతి సనా లతిక, [illegible] 11-96, [illegible] గోరంట్ల, గుంటూరు - 522034. 3. శ్రీ సనా శ్రీనివాసరావు [illegible] 4. [illegible] 5. [illegible] నగరంపాలెం, గుంటూరు జిల్లా - 522004, ఆంధ్రప్రదేశ్. [illegible] డిమాండ్ నోటీసు తేది. 29-06-2018 ప్రకారం తేది. 29-06-2018 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ. 2,12,82,649/- [illegible] + తేది.30.06.2018 నుండి తదుపరి వడ్డీ, [illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై తేది. 29-12-2025న విక్రయించబడునని [illegible]

షెడ్యూలు ఆస్తి వివరములు

మెషినరీ & ఎక్విప్‌మెంట్ యొక్క వివరములు : గుంటూరు జిల్లా - 522019, [illegible] 1. Lint Cleaners - 3 No's, 2. Seed Cleaners - 2 No's, 3. Hull Cleaners - 1 No, 4. Seed Blowers - 3 No's, 5. Lint Cleaner Blowers - 3 No's, 6. Elevators - 2 No's, 7. Rotor Lifts - 2 No's, 8. Delinters with motors - 21 No's, 9. Gummers - 3 No's, 10. G.I. Pipelines - 1 Set, 11. Screw Conveyors : 600 - 1 Set, 12. Cyclones - 1 Set.

రిజర్వు ధర : రూ.30,00,000/- ధరావత్తు : రూ.3,00,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 29-12-2025, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది: 15-12-2025 నుండి 28-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) [illegible] www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices [illegible] M/s. PSB Alliance & M/s. Baanknet [illegible] https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & [illegible] 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com [illegible] 2) [illegible] GST, [illegible]
గమనిక : [illegible] PSB Alliance [illegible] (Pre-Bid EMD) [illegible]

తేది: 12-12-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మంగళగిరిలో వరుస బైక్ చోరీలు!

ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు

మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ (ఫైల్)

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొంతకాలంగా వరుసగా బైక్ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే మూడు ద్విచక్రవాహనాలు అపహరణకు గురి అయ్యాయి. వీటిపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి పట్టణం షరాఫ్ బజార్‌కు చెందిన గోలి నాగనిరంజన్ పొగాకు షాపులో పనిచేస్తున్నారు. ఈనెల 7వ తేదీ రాత్రి 7 గంటలకు ఇంటి ముందు తన ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేశారు. మరుసటి రోజు 8వ తేదీ ఉదయం 6 గంటలకు బయటకు వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఒకే రోజు రెండు వాహనాలు..

నవంబరు 27వ తేదీన ఒకే రోజు రెండు ద్విచక్రవాహనాలు పట్టణంలో అపహరణకు గురయ్యాయి. మంగళగిరి పట్టణ పరిధిలోని భార్గవపేటకు చెందిన కలకోటి మోషే గేదెల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తన సొంత అవసరాల నిమిత్తం 2018లో బైక్‌ను కొనుగోలు చేశారు. గత నెల 27వ తేదీ రాత్రి 11 గంటలకు ఇంటి ముందు పార్క్ చేసిన వాహనం మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేరోజు మంగళగిరి పట్టణం భార్గవ్‌పేటకు చెందిన గొర్లె మోహనరావు ద్విచక్రవాహనం కూడా చోరీకి గురయ్యింది. వీటిపై మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ క్రైమ్ సిబ్బంది బైక్‌లు అపహరణకు గురైన ప్రాంతాల్లో సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

మూడు నెలలలో పదుల సంఖ్యలో..

మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత మూడు నెలలుగా పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయని సమాచారం. అయితే పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాధితుల్లో కొంత మందివి మాత్రమే కేసు నమోదు అయ్యాయి. ఇకనైనా పోలీస్ అధికారులు బైక్ చోరీలపై ప్రత్యేక దృషి పెట్టి బైక్‌లు చోరీకి గురికాకుండా చూడాలని మంగళగిరి ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

దుగ్గిరాల: అనుకున్న స్థాయి ఫలితాలు, నిర్దేశించిన లక్ష్యాలుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయా.. రికార్డుల వివరాలు సక్రమంగా నమోదు అవుతున్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని అడిషనల్ డైరెక్టర్ కమిషనర్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారి కొర్రపాటి అనిల్‌కుమార్ తెలిపారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నమోదైన రికార్డుల ప్రకారం లబ్ధిదారులకు ప్రసవం అనంతరం జననీ సురక్ష యోజన పథకం నగదు బదిలీ పనితీరు ఏ విధంగా ఉందో పరిశీలించామన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల తీసుకుంటున్న చర్యల గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా బిల్లు ప్రవేశపెట్టాలి

నేషనల్ దళిత జేపీపీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు

తాడేపల్లి రూరల్: పార్లమెంట్ సమావేశాల్లో దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా బిల్లును ప్రవేశపెట్టాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయం నుంచి వరప్రసాదరావు మాట్లాడారు. అసెంబ్లీలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఏకగ్రీవ తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని కోరుతున్నామన్నారు. దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని.. రంగనాథ మిశ్రా కమిషన్ ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా తీర్మానం చేయాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రంగనాథ మిశ్రా కమిషన్‌ను ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నామన్నారు. తమిళనాడు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం

తాడికొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన తాడికొండ మండలం లాం గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. లాం గ్రామానికి చెందిన షేక్ జహీర్ బాషా కూలీ పనుల నిమిత్తం ఉదయం గుంటూరుకు వెళ్లారు. భార్య కూడా గుంటూరులో బట్టల షాపులో ఉద్యోగ బాధ్యతల నిమిత్తం వెళ్లారు. సాయంత్రం సమయంలో ఇంటి నుంచి మంటలు రావడంతో స్థానికులు మంటలార్పి చూడగా ఇంటిలోని సామాగ్రి అగ్నికి ఆహుతయ్యింది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. బాషా నిరుపేద కుటుంబం కావడంతో దాతలు స్పందించి బాధితులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై అవగాహన

తెనాలి రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్), లేఅవుట్ పీనలైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)లపై రూరల్ పరిధిలోని అంగలకుదురు, సంగం జాగర్లమూడి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏపీ సీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూదన్‌రావు నేతృత్వంలో జరిగిన సదస్సులలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం వివరాలను టీపీఓ సుబ్బారావు వివరించారు. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాలు కావడంతో లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో సీఆర్‌డీఏ నిబంధనలు అమలు కావాలని, కొనుగోలుదారులు కూడా వాటిని దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు అనుగుణంగా ఉన్న లేఅవుట్ లోనే కొనుగోలు చేయాలని చెప్పారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి బి.అనిల్ కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పొన్నూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. హేమలత తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల వివాహ ముక్త్ భారత్ నినాదంతో శుక్రవారం స్థానిక పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం హేమలత బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాల లోపు, మగపిల్లలకు 21 సంవత్సరాలు దాటకముందే వివాహం చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. చట్టాన్ని వ్యతిరేకించి వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించబడతాయని తెలిపారు.

నిమ్మగడ్డ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

నిమ్మగడ్డ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పలువురు సీపీఎం నాయకులు కోరారు. నిమ్మగడ్డ రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా మంగళగిరి పట్టణ పరిధిలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిమ్మగడ్డ పేద ప్రజల కోసం నిరంతరం పాటు పడిన మహనీయుడని కొనియాడారు. మంగళగిరి అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని, ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉండే వారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్పొరేట్ ప్రభుత్వం రాజ్యమేలుతోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ జవహర్‌లాల్, జేవీ రాఘవులు, చెంగయ్య, ఎం.రవి, పిల్లలమర్రి బాలకృష్ణ, కమలాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి యర్రబాలెంలో మనస్తాపానికి గురై బావిలోకి దూకిన యువకుడి మృతదేహం లభ్యమయ్యింది. సేకరించిన వివరాల ప్రకారం.. యర్రబాలెం బసవతారక నగర్‌కు చెందిన షేక్ మున్నీ భర్త అనారోగ్యంతో మరణించగా ఆమె మరో వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఇదేమిటని అడిగినందుకు తన కుమారుడు అబ్బాస్(24)పై ఇద్దరు వ్యక్తులతో తల్లి దాడి చేయించారు. దీంతో మనస్తాపానికి గురైన అబ్బాస్ గురువారం సాయంత్రం బావిలోకి దూకి గల్లంతయ్యారు. మంగళగిరి రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది బావిలో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం అబ్బాస్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

జయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏ సంఘం డిమాండ్ చేసింది. మంగళగిరి పట్టణ పరిధిలోని ఏపీఐఐసీ భవనంలో గల సీసీఎల్ఏ కార్యాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. వీఆర్ఏలకు 8 ఏళ్లుగా జీతాలు పెంచలేదని, దీని వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే వీఆర్ఏలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేలు జీతాలు పెంచాలని కోరారు. గతంలో అనేక వినతిపత్రాలు ఇచ్చామని.. వాటి ఆధారంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెప్పారని అన్నారు. జీతాల పెంపుదల ప్రతిపాదనను మరొకసారి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తెలిపినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవరావు, పల్నాడు జిల్లా నాయకులు షేక్ అబ్దుల్ మునఫ్ తదితరులు ఉన్నారు.

గుంత.. ప్రయాణానికి చింత!

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఆచార్యుల బావి సెంటర్ బొడ్రాయి పక్కన గల రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రోజూ ఇటుగా ప్రయాణించే ప్రయాణికులు ఈ గుంత కారణంగా తీవ్ర ఇబ్బందుల పడుతున్నామని వాపోతున్నారు. గుంతలో పడి క్షతగాత్రులం అవుతున్నామిన పలువురు ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో గుంత కనిపించక తీవ్ర ఇబ్బందులు పడిన వాహనచోదకులు మండలంలో కోకొల్లలు. దీంతో స్థానికులు గుంతపై పెద్ద రాయిని ఏర్పాటు చేసినా వాహనాల రాకపోకలకు అది పగిలిపోయింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యం రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు ఊతం!

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

మేడికొండూరు: చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన.. వాటి నిర్వహణలో ఉన్న వారికి 'ఉద్యం' రిజిస్ట్రేషన్ ఒక వరం లాంటిదని గుంటూరు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'ర్యాంప్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపారస్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ సంస్థలను 'ఉద్యం' పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక రాయితీలను సులభంగా పొందవచ్చని వివరించారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. ఎంపీడీవో కె.డేవిడ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. స్థానిక యువత, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.పూర్ణ శంకరరావు, సచివాలయ సిబ్బంది, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాడికొండ: మోతడక చలపతి సీఈసీ ఇంజినీరింగ్ విభాగం టెక్నోకాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గుంటూరు పట్టణంలోని జీజీహెచ్, రైల్వేస్టేషన్, బస్టాండ్, మార్కెట్, శంకర్ విలాస్ పరిసరాల్లో 250 దుప్పట్లను శీతాకాలం నేపథ్యంలో అనాథలు, వృద్ధులకు విద్యార్థులు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతగా ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను విభాగాధిపతులు జి.రామచంద్రరావు, డీన్‌లు డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ బాల మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

శానిటేషన్ వర్కర్స్‌తో మాట్లాడుతున్న వసంత

తాడేపల్లి రూరల్: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి మన చుట్టుపక్కల జరిగే సంఘటనలను పరిశీలిస్తూ ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ వసంత అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధి అంజిరెడ్డి కాలనీలో శానిటేషన్ వర్కర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. మన చుట్టూ ఉన్న పిల్లలను మనం గమనిస్తూ ఉండాలని.. వారు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో పరిశీలించాలని ఆమె తెలిపారు. పిల్లలకు ఉన్న కష్టాలు మనం తెలుసుకోవాలని.. ఒకవేళ వారు అనాథలైతే డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇస్తే వారి సంరక్షణ కోసం బాల భవన్‌కు తరలిస్తారని వివరించారు. శానిటేషన్ వర్కర్స్‌గా పనిచేసే వారికి ఎక్కువగా ఇలాంటి సంఘటనలు ఎదురవుతాయని.. వాటిని నిశితంగా పరిశీలించి అటువంటి పిల్లలను గుర్తించి వారి భవిష్యత్తును కాపాడాలని వసంత కోరారు. కార్యక్రమంలో ఎస్టీ కాలనీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గౌస్, రవి, డాన్ బాస్కో లెర్నింగ్ సెంటర్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫెన్సింగ్, కలైపట్టు పోటీలు

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నుంచి కలైపట్టు, ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం సెక్రటరీ చుక్కా కొండయ్య తెలిపారు. అండర్ 17 బాలబాలికల విభాగాల్లో కలైపట్టు పోటీలు శనివారం మాత్రమే జరుగుతాయన్నారు. ఫెన్సింగ్ పోటీలు అండర్- 17, అండర్- 19 విభాగాల్లో మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో రాష్ట్రస్థాయిలో 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చుక్కా కొండయ్య తెలిపారు.

తెగుళ్ల నివారణపై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పంటల్లో తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని రైతులతో శాస్త్రవేత్తలు చర్చాగోష్టి నిర్వహించారు. శాస్త్రవేత్త ఎం.రమాదేవి సాగులో సమస్యలను రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. సేద్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం గ్రామరైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మినుము పొలంలో పల్లాకు, బూడిద తెగులును గమనించి, నివారణ చర్యలను గురించి రైతులకు తెలిపారు. తెల్లదోమ, తామర పురుగు నివారణకు పసుపు నీలి రంగు అట్టలను ఏకరాకు 15-20 వరకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకం ద్వారా 25 మంది రైతులకు టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని: చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పెదకాకాని శివారులో చోటు చేసుకుంది. కొత్త సగరపాలేనికి సమీపంలోని భ్రమరాంబ కాలనీలో వేప చెట్టుకు లుంగీతో వ్యక్తి ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుంది. చేతిపై పి. లక్ష్మి, శ్రావణి పేర్లు పచ్చబొట్టుతో రాసి ఉన్నాయి. కాళ్లు, చేతులపై రక్త గాయాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోలీసులు గుంటూరు మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణలో ఎన్‌సీసీ విద్యార్థుల భాగస్వామ్యం

తెనాలి రూరల్: పట్టణంలోని ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులతో పాటు ఎన్‌సీసీ విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఇటీవల ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ట్రాఫిక్ నియంత్రణలో సిబ్బంది కొరత ప్రస్తావనకు రావడంతో ఎన్‌సీసీ విద్యార్థులను ఎందుకు ఉపయోగించకూడదు అని సబ్ కలెక్టర్ సంజనా సింహ ప్రశ్నించారు. దానిని దృష్టిలో ఉంచుకొని త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు నేతృత్వంలో శుక్రవారం స్థానిక చెంచుపేట ప్రాంతంలో చేపట్టిన వాహనాల తనిఖీలో వివిధ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులను పోలీసులు భాగస్వాములను చేశారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్‌ను అడ్డుకోవడంతో పాటు వాహనాలను నియంత్రించారు. పట్టుబడిన వారిలో కొంతమందికి లైసెన్సులు లేకపోవడాన్ని పోలీసులు గుర్తించారు. సీఐ మాట్లాడుతూ మైనర్ల డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ విద్యార్థులలోనే అధికంగా ఉందని, ఆ పరిణామాలను స్వయంగా గమనించటం ద్వారా కొంత మార్పు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎన్. ప్రకాశ రావు, షేక్ కరిముల్లా, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వనమాకు వైస్ ఎంపీపీ అనురాధ కృతజ్ఞతలు

బాల వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైస్ ఎంపీపీ అనురాధ

తాడికొండ: ఫిరంగిపురం మండలం వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అమర్లపూడి అనురాధ శుక్రవారం వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్)ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి పలువురు నాయకులు ఇన్‌చార్జిని పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. తమపై నమ్మకంతో వైస్ ఎంపీపీగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధి, విజయానికి కృషి చేస్తానని అనురాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ హబీబుల్లా వివిధ విభాగాల నాయకులు చేవూరి రామ్మోహనరెడ్డి, దాసరి సురేష్, పెరికల చిన్నా, గాంధీ బుడే, ఇస్రాయేలు, కొరివి ఆనంద్, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, సుభానీ, మెరంరెడ్డి, అమర్లపూడి రత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానియేలు

మంగళగిరి టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక విద్యుత్ అదాలత్ అని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధి చిల్లపల్లి కల్యాణ మండపంలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన పరిష్కార వేదిక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఇక్కడే ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే న్యాయం చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాలకు చెందిన 22 మంది విద్యుత్ వినియోగదారులు వారి ఫిర్యాదులను సమర్పించారు. అందులో 16 ఫిర్యాదులను అక్కడే పరిష్కరించినట్లు ఆయన తెలియజేశారు. మిగిలిన ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆయా ప్రాంతాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు కృష్ణానాయక్, అకౌంట్స్ సభ్యులు శ్రీకృష్ణ, సీఆర్డీయే సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకొచ్చిన లారీ

మద్యం మత్తులో లారీ డ్రైవర్

ఘటనా స్థలంలో లారీ

తాడేపల్లి రూరల్: సీతానగరంలో ఓ లారీ డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా లారీని నడిపి ఒక షాపు, రెండు నివాసాలను ఢీకొట్టాడు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున తాడేపల్లి బైపాస్ నుంచి ఎన్టీఆర్ కరకట్ట మీదుగా ఉండవల్లి సెంటర్ వైపునకు వస్తున్న లారీ సీతానగరం బోటుయార్డు వద్ద మలుపు తిరిగింది. తరువాత బోటుయార్డు గేటు ముందు గల ఎక్సెల్ 100 వాహనం, పక్కనే ఉన్న పచ్చళ్ల వ్యాపారి దుకాణాన్ని ఢీకొట్టి అనంతరం గోకుల పద్మ, బత్తుల నాగమణి ఇళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోకుల పద్మ ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా.. నాగమణి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. తాడిలంక శ్రీనివాసరావు ద్విచక్రవాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. తాడిలంక పద్మజ పచ్చళ్ల దుకాణం పూర్తిగా ధ్వంసమై రూ.50 వేలు విలువైన పచ్చళ్లు నేలపాలయ్యాయి. లారీ డ్రైవర్ పూర్తిగా మద్యం తాగి అతివేగంగా లారీ నడిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మంగళగిరి టౌన్: మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని గండాలయ్యపేట, కొత్తపేట, ఆర్అండ్‌బీ బంగ్లా రోడ్డు, హాస్పిటల్ రోడ్డు, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్క్, నాంచారమ్మ చెరువు, తెనాలి రోడ్డు, పెదకోనేరు, హుస్సేన్ కట్ట, జీఆర్‌స్కూల్, ఆటోనగర్, ఎన్ఆర్ఐ వెనుక గల అపార్ట్‌మెంట్, పాత మంగళగిరి ప్రాంతాలతో పాటు మంగళగిరి రూరల్ పరిధి ఆత్మకూరు, చినకాకాని, కాజా, బేతపూడి గ్రామాలు.. తాడేపల్లి మండల పరిధిలోని భారతీనగర్, ప్రాతూరు, చిర్రావూరు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దుగ్గిరాల: స్థానిక 33-11 కేవీ పెదపాలెం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.గోపి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 08.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పెదపాలెం, గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, శృంగారపురం, రేవేంద్రపాడు, తుమ్మపూడి, పేరుకలపూడి, చినపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

బీపీఎస్‌ను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: బీపీఎస్ పథకాన్ని అర్హులైన వారందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30వ తేదీ లోపు అనాధికారికంగా ఇళ్ళ నిర్మాణాలు చేసిన వారు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు జరిపిన వారికి క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని బీపీఎస్ పథకం ద్వారా ప్రభుత్వం కల్పించదన్నారు. తెనాలి పట్టణంలో అలాంటి భవన నిర్మాణాలు జరిపిన వారందరిని గుర్తించాలని సూచించారు. వారందరికి బీపీఎస్‌పై అవగాహన కలిపించి ఎక్కువ మంది పథకాన్ని ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. బిల్డర్స్, ఇంటి యాజమానులకు ఆన్‌లైన్‌లో చేసే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురు అయితే అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ వాణి పాల్గొన్నారు.

చుక్కపల్లి సురేష్‌బాబు మృతి

తెనాలిటౌన్: పట్టణానికి చెందిన టీడీపీ నేత చుక్కపల్లి సురేష్‌బాబు మృతిచెందారు. ఆయన భౌతికకాయానికి టీడీపీ నాయకులతో సహా పలువురు నివాళులర్పించారు. పట్టణ గంగానమ్మపేటలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు చుక్కపల్లి సురేష్ బాబు అనారోగ్యం కారణంతో శుక్రవారం తన స్వగృహంలో మృతిచెందారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సాయంత్రం గంగానమ్మపేటకు చేరుకున్నారు. సురేష్‌బాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు, సురేష్‌బాబు సోదరుడు పెదబాబుకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

కొబ్బరి బొండాల ఆటో బోల్తా.. ముగ్గురు మృతి

కొల్లూరు: బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని దోనేపూడి–కోటిపల్లి మధ్యలో కొబ్బరి బొండాల వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు కూలీలు మృత్యువాత పడ్డారు. తెనాలి–రేపల్లె రహదారిపై కొబ్బరిబొండాల లోడుతో అతివేగంగా వెళుతున్న టాటాఏస్ వాహనాన్ని డ్రైవర్ గణేశ్ అదుపు చేయలేకపోయాడు. దీంతో రోడ్డు కుడివైపున ఉన్న పంట కాలువలోకి వాహనం దూసుకుపోయి పల్టీ కొట్టడంతో కొబ్బరి బొండాల లోడ్‌పై కూర్చున్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాదంలో భట్టిప్రోలు మండలం చింతమోటుకు చెందిన చాత్రగడ్డ కాంతారావు (55), పెసర్లంక శ్రీనివాసరావు (55), భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన షేక్ ఇస్మాయిల్ (60) ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. క్యాబిన్‌లో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు గాయపడటంతో తెనాలి వైద్యశాలకు తరలించారు.

1న వేతనాలు చెల్లించాలి: ఏపీజేఏసీ అమరావతి

సాక్షి,అమరావతి: అన్ని శాఖల ఉద్యోగులతోపాటు పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు కోరారు. సచివాలయంలో శుక్రవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్, జాయింట్ సెక్రటరీ అల్లాడి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెన్షన్, జీఎఎఫ్ చెల్లింపులకు ప్రస్తుతం ఉన్న నిబంధనలు సడలించి నిధి యాప్ ద్వారా రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీపీఎఫ్ చెల్లించాలని నిర్ణయించినట్టు వినయ్‌చంద్ తెలిపారు. దీనిపై ఉద్యోగ సంఘాల సూచనలు, సలహాలు తెలియజేయాలని కోరారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఆన్‌లైన్ విధానంపై ఉద్యోగ సంఘాలతో చర్చించి అభిప్రాయాలు, సలహాలను త్వరలో ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. ఉద్యోగుల జీతాలు చెల్లింపులకు ప్రభుత్వం ఇటీవల కొన్ని బ్యాంకులతో చేసుకున్న ఒప్పందంపై ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ విద్యాశాఖలో విలీనమైన మున్సిపల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్ గ్రాట్యుటీ, కమ్యూటేషన్, సత్వరమే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ల ధరలు పెంచాలని అడగవద్దు

నల్లగొండ/తిప్పర్తి: భవిష్యత్‌లో సినిమా టికెట్ల ధరలు పెంచాలని సినిమా నిర్మాతలు, హీరోలు తమ దగ్గరకు రావద్దని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండలో మాట్లాడుతూ.. తమ అధికారులు అఖండ–2 సినిమా విషయంలో తొందరపాటుతో మెమో ఇచ్చారన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పులకనుగుణంగా టికెట్ ధరలపై నిర్ణయాలు ఉంటాయన్నారు. సినిమాల బెనిఫిట్ షోల పేరుతో రూ.600 నుంచి వెయ్యి రూపాయల వరకు టికెట్ల ధరలు పెంచడం వల్ల మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. ఒక చిరుద్యోగి తన కుటుంబంతో సినిమా థియేటర్‌కు వెళితే.. అధిక ధర టికెట్‌తో పాటు పిల్లలకు కూల్‌డ్రింక్స్, చిప్స్ కొనిస్తే దాదాపు రూ.4 వేల వరకు జీతంలో ఖర్చవుతుందని పేర్కొన్నారు. టికెట్ ధరల విషయంలో కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తామన్నారు.

10మంది మావోల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఆరుగురు మహిళలతో సహా 10 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరందరిపై రూ.33 లక్షల రివార్డు ఉందని అక్కడి అధికారులు తెలిపారు.

మృత్యులోయ!

సంఘటనా స్థలంలో మృతదేహాలు

మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో లోయలోకి ప్రైవేటు బస్సు బోల్తా.. 9మంది దుర్మరణం

తులసిపాక వద్ద ఘోర ప్రమాదం

- 22 మందికి తీవ్ర గాయాలు
- మరో ఆరుగురికి స్వల్ప గాయాలు
- చిత్తూరు నుంచి ఈ నెల 6న 37 మందితో తీర్థయాత్రలకు బయల్దేరిన బస్సు
- అరకు నుంచి భద్రాచలం వెళ్తుండగా ఘటన
- డ్రైవర్ అతివేగం, దట్టమైన పొగమంచు కారణంగా కనిపించని రోడ్డు
- మలుపులో బస్సు వేగాన్ని అదుపు చేయలేకపోయిన డ్రైవర్
- ఒక్కసారిగా లోయలోకి దూసుకుపోయిన బస్సు
- నిద్రలోనే మృత్యు ఒడికి చేరుకున్న యాత్రికులు

శివశంకర్‌రెడ్డి

సునందన

శ్రీకళాదేవి

నాగేశ్వరరావు

దొరబాబు

కృష్ణకుమారి

శైలజారాణి

శ్యామల

కావేరి కృష్ణ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: దుర్గమ్మ.. చినవెంకన్న.. శివయ్య.. దత్తాత్రేయుడు.. సూర్యనారాయణుడు.. సింహాద్రి అప్పన్న.. అందరి దర్శనం చేసుకున్నారు. భద్రాచలం సీతారాముల్ని దర్శించుకునేందుకు బయల్దేరారు. అంతలోనే పొగమంచు పగబట్టింది. రోడ్డు మలుపు మృత్యువుగా మారి 9 మందిని పొట్టనపెట్టుకుంది. తీర్థయాత్ర చివరి ఘట్టానికి చేరుకుంటున్న సమయంలో మృత్యులోకానికి చేరుకున్నారు. నిన్నటివరకూ తమతో ప్రయాణించిన వారు.. ఇప్పుడు విగతజీవులుగా మారిపోయారని తెలిసి కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. చిత్తూరులో మొదలైన ప్రయాణం.. చింతూరు సమీపంలో శాశ్వతంగా ఆగిపోయింది. తులసిపాక ఘాట్ రోడ్డులో బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడంతో 9 మంది మృతి చెందగా.. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారికి చింతూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. సాయంత్రం మృతదేహాలను, తీవ్రంగా గాయపడిన నలుగురు క్షతగాత్రులను అంబులెన్సులలో చిత్తూరు పంపించారు. మిగతా క్షతగాత్రులను మినీ బస్సుల్లో వారి స్వగ్రామాలకు పంపించారు.

రాజుగారి మెట్ట వద్ద..

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు–మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో తులసిపాకలోని రాజుగారి మెట్ట వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బస్సు అరకు నుంచి భద్రాచలం వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదం సంభవించింది. మొత్తం 37 మంది ప్రయాణిస్తున్న బస్సులో 32 మంది తీర్థయాత్రలకు వచ్చిన వారు కాగా.. ఒకరు ఆర్గనైజర్, ఇద్దరు వంట మనుషులు ఉన్నారు. ఇద్దరు డ్రైవర్లు కలిపి మొత్తం 37 మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. ఇందులో డ్రైవింగ్ చేస్తున్న మొదటి డ్రైవర్‌కు గాయాలు కాగా.. పక్కనే ఉన్న మరో డ్రైవర్‌కు చేయి విరిగింది. వీరిలో 9 మంది మృతి చెందారు. 22 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఆరుగురు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. మృతులంతా చిత్తూరు జిల్లా వారే. ఘటనా స్థలంలో 3 అంబులెన్స్‌లు, 5 పోలీసు వాహనాలతో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన 22 మందికి చింతూరు ఆస్పత్రిలో చికిత్స అందించారు. గాయపడిన వారిలో ఒకరికి తలకు గాయం కావడంతో.. మొదట్లో భద్రాచలం ఆస్పత్రికి తరలిద్దామనుకున్నారు. అయితే, ఇబ్బందేమీ లేదని తేలడంతో చింతూరు ఆస్పత్రిలోనే చికిత్స అందించారు.

పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చి..

చిత్తూరు నగర చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 32 మంది పుణ్యక్షేత్రాల దర్శనం కోసం టూర్ వేసుకున్నారు. వీరిలో 20 మంది మహిళలున్నారు. ఈ నెల 6న మిట్టూరులోని విఘ్నేశ్వర ట్రావెల్స్‌కు చెందిన ఏపీ 39 యూఎం 6543 నంబర్ బస్సులో బయలుదేరారు. మురకం బట్టుకు చెందిన రామ్మూర్తి అనే ప్రైవేట్ ఏజెంట్ ద్వారా బస్ బుక్ చేసుకున్నారు. తొలుత కోటప్పకొండ, అమరావతి, మంగళగిరి, విజయవాడ కనకదుర్గమ్మ, ద్వారకాతిరుమల, భీమవరం, పాలకొల్లు, అంతర్వేది, ద్రాక్షారామం, పెనుగొండ, సామర్లకోట, పిఠాపురం, కోటిపల్లి, అన్నవరం, అరసవల్లి, శ్రీకూర్మం చూసుకొని గురువారం విశాఖ చేరుకున్నారు. ఇక్కడ సింహాచలం దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత నేరుగా అరకు లోయకు వెళ్లారు. అక్కడ నుంచి గురువారం సాయంత్రం 5 గంటలకు అరకు నుంచి భద్రాచలం వెళుతున్న క్రమంలో దుర్ఘటన జరిగింది. కాగా, హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఘటనాస్థలాన్ని, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలను పరిశీలించారు. క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ 2 లక్షలు పరిహారంగా ఇవ్వనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. తీవ్రగాయాలైన వారికి రూ.2 లక్షలు, సాధారణ గాయాలైన వారికి రూ. 50 వేలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మృతుల వివరాలు

మృతుల్లో చిత్తూరు నగరానికి చెందిన నాగేశ్వరరావు(68), శ్రీకళాదేవి (64), కావేరి కృష్ణ(70), శ్యామల(67), తవణంపల్లె మండలానికి చెందిన దొరబాబు(37), పలమనేరుకు చెందిన దంపతులు శివశంకరరెడ్డి(47), సునంద (45), పెనుమూరుకు చెందిన కృష్ణకుమారి(47), తెనాలి శైలజారాణి(64) ఉన్నారు.

బస్సులో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసు అధికారులు

అతివేగం.. పొగమంచే కారణం

బస్సులో ప్రసాద్, మధు అనే ఇద్దరు డ్రైవర్లుండగా.. మధు బస్సు నడుపుతున్నట్టు క్షతగాత్రులు చెప్పారు. మలుపుల వద్ద కూడా వేగంగా వెళ్తుండగా.. నెమ్మదిగా వెళ్లాలని చెప్పినట్టు బాధితులు తెలిపారు. చాలామంది గాఢ నిద్రలో ఉండగా.. దట్టంగా కురుస్తున్న పొగమంచుతో రోడ్డు కనిపించకపోయినా.. వేగంగా మలుపు తిప్పడంతో తులసిపాక వద్ద మరో మలుపు ఉన్నట్టు డ్రైవర్ గుర్తించలేకపోయాడు. దీంతో బస్సు వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి లోయలో పడిపోయింది. ప్రయాణికులు నిద్ర నుంచి తేరుకునేలోపే 9 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మృతుల్లో ఐదుగురు మహిళలు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికుల హాహాకారాలతో ఘాట్‌రోడ్డు విషాదకరంగా మారిపోయింది. కిటికీ పక్కన కూర్చున్న ప్రయాణికులు మాత్రం చిన్న గాయాలతో బయటపడగలిగారు. నడిచేందుకు వీలుగా ఉన్న దారికి అటుఇటుగా ఉన్న సీట్లల్లో కూర్చున్న ప్రయాణికులు మాత్రం వెంటనే కిందపడిపోయారు. బస్సు ఏటవాలుగా బోల్తాపడటంతో ఒక్కసారిగా నిద్ర మత్తులోనే కిందపడి జారుకుంటూ వెనక్కి వెళ్లి గుద్దుకోవడంతో కనీసం ప్రాణాలు కాపాడుకునేందుకు కూడా ప్రయత్నించే అవకాశం లేకుండా పోయిందని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి భద్రాచలానికి ఇంకో 2 గంటల్లోగా చేరుకుంటారనేలోగా ఘోర ప్రమాదం జరిగింది.

తీరిగ్గా.. తాపీగా..

ఈ ఘాట్‌రోడ్డులో ప్రయాణం భయంగానే ఉంటుంది. చురుకైన మలుపులతో పాటు రోడ్డు మధ్య గుంతలతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పాడైపోయిన ఈ రోడ్లను బాగు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని స్థానికులు పదేపదే కోరుతున్నా కనీసం గుంతలు కూడా పూడ్చిన పాపాన పోలేదు. గతంలోనూ ఈ ఘాట్‌రోడ్డులో పలు ప్రమాదాలు జరిగాయి. 15 అక్టోబర్ 2019లో కర్ణాటకకు చెందిన ప్రయాణికులు ఇక్కడి రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. మారేడుమిల్లి ప్రాంతం పర్యాటకులను బాగా ఆకర్షిస్తోంది. ఇప్పుడు సీజను కూడా. వచ్చే మార్చి నెలాఖరు వరకూ ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయానికి ముందే రోడ్లను బాగు చేయాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. గత సంక్రాంతి సీజన్‌కే గుంతలు లేని రోడ్లను అభివృద్ధి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏడాది దాటి మరో సంక్రాంతి వస్తున్నప్పటికీ రోడ్లను మాత్రం పట్టించుకోవడం లేదు. తాజా ప్రమాదంతో తీరిగ్గా స్పందించిన ప్రభుత్వం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ భారీ వాహనాలకు ఘాట్ రోడ్డులో అనుమతి నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు యాత్రికులు మరణించడం అత్యంత విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని, తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీఎం చంద్రబాబు విచారం

బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తంచేశారు. బస్సు ప్రమాదం గురించి అధికారులను అడిగి సీఎం తెలుసుకున్నారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారని, పలువురు మృతిచెందగా, గాయపడిన వారిని చింతూరు ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

మృతుల్లో 8 మంది చిత్తూరు జిల్లా వాసులే

చిత్తూరు అర్బన్: మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో బస్సు లోయలో పడిన దుర్ఘటన పదుల కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. దుర్మరణం పాలైన వారిలో 8 మంది చిత్తూరు జిల్లాకు చెందిన వారు కాగా.. తిరుపతి జిల్లాకు చెందిన మరో మహిళ ఉన్నారు. మరో 24 గంటలు దాటితే ఎవరి ఇళ్లకు వారు చేరుకునేవారు. మృతుల్లో ఒకరైన శ్రీకళాదేవి విశ్రాంత ప్రధానోపాధ్యాయిని. ఆరేళ్ల క్రితం భర్త చనిపోగా.. కొడుకు బసవంత్‌రెడ్డి యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను వస్తే తప్ప శ్రీకళాదేవి మృతదేహాన్ని చిత్తూరుకు తీసుకొచ్చేవాళ్లు లేరు. మరో మృతుడు నాగేశ్వరరావు చిత్తూరు న్యూట్రిన్ సంస్థలో పనిచేసి రిటైరయ్యారు. భార్య అమ్ములు, బాయ్‌తో కలిసి ఉంటున్నారు. పిల్లలు లేకపోయినా ఈ దంపతులు అన్యోన్యంగా ఉంటూ నాగేశ్వరరావుకు వచ్చే పింఛన్ డబ్బుతో కాలం గడుపుతున్నారు. చిత్తూరు నగరం గిరింపేటకు చెందిన శ్యామల విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. భర్త చనిపోవడంతో హైదరాబాద్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు. చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన కావేరి కృష్ణ సైతం ప్రమాదంలో మృతి చెందారు. ఇతడి కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. తవణంపల్లెకు చెందిన దొరబాబు దాదాపు 20 ఏళ్లుగా వంట పనిచేస్తున్నాడు. పెళ్లయ్యి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పూరిగుడిసెలో కాపురముంటున్న ఈ కుటుంబానికి రెక్కాడితేగానీ డొక్కాడదు. మృతుడి భార్య సుమలత సున్నిత మనస్కురాలు కావడంతో ఆమె భర్త చనిపోయిన విషయం ఇప్పటివరకు చెప్పలేదు. పలమనేరుకు చెందిన శివశంకర్‌రెడ్డి, సునంద దంపతుల ఒక్కగానొక్క కుమారుడు వెంకటసాయి బీడీఎస్ చదువుతున్నాడు. బెంగళూరు కేఆర్ పురంలో స్థిరపడ్డ మరో మహిళ కృష్ణకుమారి స్వగ్రామం పెనుమూరు మండలం బలిజపల్లె. ఈమె భర్త హరినాథరెడ్డి హిటాచీలతో వివిధ పనులు చేయిస్తుంటారు. భార్య మరణవార్త విన్నాక కన్నీటి పర్యంతమైన హరినాథరెడ్డి హుటాహుటిన చింతూరు బయలుదేరాడు. తిరుచానూరు పంచాయతీ టెలిఫోన్ కాలనీకి చెందిన విశ్రాంత అధికారిణి తెనాలి శైలజారాణి ఐదేళ్ల క్రితం గ్రంథాలయ అధికారిణిగా రిటైరయ్యారు. అప్పటి నుంచి టెలిఫోన్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. తరచూ ఆధ్యాత్మిక యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్తూ వచ్చేది. వీరంతా ఈ నెల 6న రాత్రి 9 గంటలకు చిత్తూరు నుంచి ట్రావెల్ బస్సులో బయలుదేరారు. వీరంతా 13వ తేదీన మహానంది, అహోబిలం, బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం, తాళ్లపాక అన్నమయ్య ప్రాంగణం చూసుకుని చిత్తూరు చేరుకోవాల్సి ఉంది. ఇంతలో రోడ్డు ప్రమాదం జరగడంతో విహార యాత్ర విషాదంగా ముగిసింది.

టూర్‌లో అరకు లేకపోయినా..

ఈ యాత్రలో అరకు వెళ్లాలని ఎవరూ అనుకోలేదు. గురువారం ఉన్నట్టుండి అరకు వెళ్లాలని పలువురు పట్టుబట్టారు. దీంతో ఒక్కొక్కరి నుంచి రూ.500 అదనంగా వసూలు చేసి అరకు వెళ్లడం, అటు నుంచి భద్రాచలం వస్తుండగా ప్రమాదం జరిగిందని ప్రయాణికురాలు పద్మజ తెలిపారు.

బస్సు ఒకరిది.. ఆపరేటర్ మరొకరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చింతూరు–మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో రాజుగారి మెట్ట వద్ద లోయలో పడిన బస్సు చిత్తూరు నగరం మురకంబట్టుకు చెందిన రామ్మూర్తికి చెందినది. ఇతడు 30 ఏళ్లుగా బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఇతనికి ప్రస్తుతం రెండు బస్సులున్నాయి. అందులో ఏపీ 39యూఎం 6543అనే బస్సు అదుపు తప్పింది. ఘోర ప్రమాదానికి కారణమైంది. ఈ బస్సును రెండేళ్ల క్రితం విఘ్నేశ్వర ట్రావెల్స్ సంస్థ రామ్మూర్తి నుంచి అద్దెకు తీసుకుని టూర్స్ నిర్వహిస్తోంది. పన్నీర్ సెల్వం అనే వ్యక్తి విఘ్నేశ్వర ట్రావెల్స్‌ను నడిపిస్తున్నారు. ఇతని ద్వారా దొడ్డిపల్లికి చెందిన వజ్రమణి అనే వ్యక్తి టూరిస్టు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతని ద్వారా విహార యాత్రలకు వెళ్లే వారి పూర్తి వివరాలు ట్రావెల్స్ నిర్వాహకుల వద్ద ఉండటం లేదు. దీనిపై ట్రావెల్స్ నిర్వాహకులు దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.

‘ఫిట్‌నెస్ ఎలా ఇచ్చారో’

ప్రమాదానికి గురైన బస్సు 2012లో రిజిస్ట్రేషన్ అయింది. గత నెల 6న ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) చేయించారు. ఈ గడువు 2026 నవంబర్ 7 వరకు ఉంది. చిత్తూరు నగర బంగారుపాళ్యం సమీపంలోని ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్‌లో ఎఫ్‌సీ చేయించారు. అక్కడికి బండి వెళ్లకుండానే ఎఫ్‌సీ చేయించారా, లేకుంటే బండి లోపాలను చూడకుండా ఎఫ్‌సీ ఇచ్చారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బండి కండిషన్ ఆధారంగానే ఇచ్చారా అనే అనుమానాలు ఉన్నాయి.

డ్రైవర్ల వివరాలు ఇలా..

బస్సులో మధు, ప్రసాద్ అనే ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. మధు 2014లో హెవీ లైసెన్స్ తీసుకున్నాడు. ఈ లైసెన్స్ కాలపరిమితి 2030 వరకు ఉంది. ఇతనిపై ఇంతవరకు ఎలాంటి కేసులు, ప్రమాద సమస్యలు లేవని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రసాద్ మరో డ్రైవర్ కూడా 2006లో హెవీ లైసెన్స్ పొందాడు. ఈ లైసెన్స్ గడువు 2026 జూన్ 26తో ముగియనుంది. ఇతడి హయాంలో కూడా ప్రమాదాలు జరగలేదని అధికారులు చెబుతున్నారు.

ఫైబర్‌నెట్ స్కాంపై హైకోర్టుకెళ్తాం

వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: ఫైబర్‌నెట్ స్కాం కేసు మూసివేత సీఎం చంద్రబాబు తీవ్ర అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటికే అసైన్డ్ భూములు, మద్యం స్కామ్ కేసులను క్లోజ్ చేయించుకున్నారని ఆక్షేపించారు. ఇంతకుమించిన దారుణం ఇంకోటి ఉండదని పేర్కొన్నారు. చంద్రబాబుపై నమోదైన ఫైబర్ నెట్ స్కామ్ కేసును మూసివేయొద్దంటూ ఏసీబీ కోర్టులో తాను వేసిన ప్రొటెస్ట్ పిటిషన్ తిరస్కరణ గురైందని, దానిపై హైకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘‘సీఐడీని అదుపులో పెట్టుకున్న చంద్రబాబు... కొందరు అధికారులను బెదిరించి మరీ ఆయనపై నమోదైన కేసుల్లో దర్యాప్తు ద్వారా సేకరించిన కీలక సాక్ష్యాధారాలు అన్నింటినీ మూలనపడేశారు. పలు కేసుల్లో చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారు. సీఎం కాగానే అధికారులపై ఒత్తిడి తెచ్చి, సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా కేసులను ఒక్కోటిగా క్లోజ్ చేయించుకుంటున్నారు. ఫైబర్‌నెట్ స్కామ్‌లో స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నా పూర్తిగా పక్కనపెట్టేశారు’’ అని వ్యాఖ్యానించారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ

కూతురు, అల్లుడిని కోల్పోయిన వృద్ధురాలు • భర్తను కోల్పోయిన రిటైర్డ్ టీచర్ • దుర్ఘటనలో కదిలించే ఉదంతాలు

నేను పోయి వాళ్లు బతికినా బాగుండేది...

‘‘కూతురు సునందన, అల్లుడు శివశంకర్‌రెడ్డి, సమీప బంధువు శ్రీకళ (భర్త మేనకోడలు)తో కలిసి తీర్థయాత్రకు బయల్దేరా. ప్రమాదంలో వీరంతా ప్రాణాలు కోల్పోయారు. ఎంతో జీవితం ఉన్న వారి బదులు నేను చనిపోయినా బాగుండేది. నా భర్త రామచంద్రారెడ్డి వృద్ధాప్యంతో బాధపడుతున్నాడు.

–వరిగపల్లి కుమారి

హెల్పర్‌గా తెచ్చిన వంట మనిషి ప్రాణాలు కోల్పోయాడు

మాంసం దుకాణం నడిపే నన్ను వంట మనిషి దొరబాబు రోజు కూలీకి హెల్పర్‌గా రమ్మన్నాడు. ప్రమాదంలో దొరబాబు మృతి చెందగా నా కాలికి గాయాలయ్యాయి. మృతదేహాలు నా మీద పడడంతో ఊపిరి ఆడలేదు. ఎలాగోలా కిటికీ నుంచి బయటకు వచ్చా

–చిత్తూరుకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్

బ్రేక్ పడడం లేదని డ్రైవర్ చెప్పాడు...

బస్సు ప్రమాదానికి ముందు నాకు మెలకువ వచ్చింది. బ్రేక్ పడడం లేదని డ్రైవర్ మధు చెప్పాడు. ఈ లోగానే బస్సు ప్రమాదానికి గురైంది. బోల్తా పడడంతో నా చేయి విరిగింది. బస్సు కిందకు దిగి నేను రెండు మృతదేహాలను బయటకు తీశా.

–రెండో డ్రైవర్ పోగల ప్రసాద్

తుపానుతో ఆగాం.. ప్రమాదం బారినపడ్డాం

తీర్థయాత్రలకు గత నెల 23న బయలుదేరాలని భావించాం. ఆ సమయంలో తుపాను రావడంతో ప్రయాణం వాయిదా పడింది. దీంతో ఈ నెల 6న బయల్దేరాం. దుర్ఘటనలో నా తలకు తీవ్ర గాయమైంది.

–చిత్తూరుకు చెందిన పద్మజ

మమ్మల్ని రమ్మన్న స్నేహితులు చనిపోయారు

మా వీధిలో ఉంటున్న స్నేహితులు సరదాగా ఆంధ్రా చూసి వద్దాం రమ్మంటే వారితో బయల్దేరా. ప్రమాదంలో మా తలలకు తీవ్ర గాయాలయ్యాయి. విషాదం ఏమంటే.. మమ్మల్ని రమ్మని చెప్పిన నాగేశ్వరరావు, శ్రీకళ మృత్యువాత పడ్డారు.

–చిత్తూరుకు చెందిన అక్కాచెల్లెళ్లు షేక్ అష్రఫ్, ముంతాజ్

– చింతూరు/మోతుగూడెం

భర్త నాగేశ్వరరావు మృతదేహంపై పడి రోదిస్తున్న అమ్ములుబాయి

మనశ్శాంతి కోసం వస్తే నా స్వామి చనిపోయాడు

మేం ఇద్దరం రిటైర్డ్ టీచర్లం. కొంతకాలం క్రితం గుండె ఆపరేషన్ చేయించుకున్నా. పిల్లలు లేరనే బాధలో ఉన్న మేము మనశ్శాంతి కోసం తీర్థయాత్రలకు బయల్దేరాం. ఇప్పుడు ప్రమాదంలో భర్తను కోల్పోయా. ఆయన లేని జీవితాన్ని ఊహించుకోలేను.

–చిత్తూరుకు చెందిన నాగేశ్వరరావు భార్య అమ్ములుబాయి

సాక్షి బిజినెస్
శనివారం
13-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
450	148
85,268	26,047

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,261	▽	333
డోజోన్స్	48,547	▽	157
ఎఫ్‌టీఎస్ఈ 100	9,651	▽	52
డాక్స్	24,189	▽	106
షాంఘై	3,889	▽	16
నికాయ్	50,837	▲	688

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.58	91.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.53	122.87
€	యూరో	ఎస్‌బీఐ	103.83	107.78
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.87	61.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.68	71.39
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.72
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.94	13.76

ఉద్యోగాలకు స్పేస్ టెక్ దన్ను

- 2 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన
- పరిశ్రమ అయిదు రెట్లు వృద్ధి
- 2033 నాటికి అంచనాలు

ముంబై: దేశీ ఏరోస్పేస్, డ్రోన్స్, స్పేస్ టెక్ పరిశ్రమ 2033 నాటికి అయిదు రెట్లు వృద్ధి చెందనుంది. 44 బిలియన్ డాలర్లకు చేరనుంది. అదే సమయంలో 2 లక్షలకు పైగా ఇంజనీర్లు, పరిశోధకులు, డేటా సైంటిస్టులకు ఉద్యోగావకాశాలు సృష్టించనుంది. వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా ఒక నివేదికలో ఈ అంచనాలను వెలువరించింది. 100కు పైగా క్లయింట్ల నుంచి సేకరించిన గణాంకాలకు మార్కెట్‌పై పరిశోధనల ఫలితాలను జోడించడం ద్వారా అడెకో దీన్ని రూపొందించింది. దీని ప్రకారం ప్రభుత్వ సంస్కరణలు, ప్రైవేట్ రంగం, అంతర్జాతీయ భాగస్వామ్యాల దన్నుతో పరిశోధనల ఆధారిత ధోరణి నుంచి ఏరోస్పేస్, డ్రోన్స్, స్పేస్ టెక్ పూర్తి స్థాయి పరిశ్రమగా ఎదిగింది. ఈ నేపథ్యంలో స్పేస్ పాలసీ అనలిస్టులు, రోబోటిక్స్ ఇంజనీర్లు, ఏవియోనిక్స్



స్పెషలిస్టులు, జీఎన్‌సీ (గైడెన్స్, నేవిగేషన్, కంట్రోల్) నిపుణుల్లాంటి కొత్త రకం ఉద్యోగాలు వస్తున్నాయని నివేదిక తెలిపింది. వీరంతా అంతరిక్ష రంగంలో దేశ లక్ష్యాల సాధనలో కీలకంగా నిలుస్తున్నారని వివరించింది. 'ప్రభుత్వ దార్శనికత, క్రియాశీలకమైన స్టార్టప్ వ్యవస్థ దన్నుతో భారత్ అంతర్జాతీయ స్పేస్ హబ్‌గా ఎదగనుంది. దీనితో ఇంజనీరింగ్, రీసెర్చ్, డేటా, బిజినెస్ తదితర విభాగాల్లో భారీ స్థాయిలో ఉద్యోగాలు రానున్నాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్ దీపేష్ గుప్తా తెలిపారు. నివేదికలో మరిన్ని విశేషాలు..

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణెలాంటి ప్రాంతాల్లో అత్యధికంగా అవకాశాలు రానున్నాయి.
- ఏవియోనిక్స్, క్రయోజెనిక్స్, ఏటీడీసీ (యాటిట్యూడ్ డిటర్మినేషన్, కంట్రోల్ సిస్టమ్స్), రిమోట్ సెన్సింగ్ నిపుణులు, స్పేస్ హ్యాబిటాట్ ఇంజనీర్లకు భారీ వేతనాలు లభించనున్నాయి. సాధారణ టెక్నికల్ ఉద్యోగులతో పోలిస్తే 20–30% అధికంగా ఉండనున్నాయి.
- భారతీయ అంతరిక్ష పాలసీ 2023 లాంటి సంస్కరణలు, 250 పైచిలుకు స్పేస్ స్టార్టప్‌లు, ఇన్–స్పేస్ కింద రూ. 1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ మొదలైనవి ఈ పరిశ్రమ వృద్ధికి దన్నుగా నిలుస్తాయి. కొత్త ఆవిష్కరణలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు తోడ్పడనున్నాయి.
- అంతరిక్ష రంగంలో సిబ్బందిపరంగా వైవిధ్యం పెరగనుంది. ఇస్రో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం (యువికా), విజ్ఞాన్ జ్యోతి ప్రోగ్రాం, సమృద్ధ్ లాంటి స్కీములతో ఎంట్రప్రెన్యూర్‌షిప్, సాంకేతిక, పరిశోధన విభాగాల్లోకి వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.
- గగన్‌యాన్ మిషన్, యాక్సియోమ్–4 ఐఎస్ఎస్ ప్రోగ్రాంలో భారత్ భాగం కావడం, సొంత స్పేస్ స్టేషన్ నిర్మాణంపై కసరత్తు చేస్తుండటం మొదలైన వాటి వల్ల ఆయా రంగాల్లో ప్రతిభావంతులకు డిమాండ్ మరింతగా పెరగనుంది.
- ప్రస్తుతం అంతర్జాతీయ స్పేస్ ఎకానమీలో భారత్ వాటా సుమారు 2 శాతంగా ఉంది. 2033 నాటికి 11 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పాటు తన మార్కెట్‌ను 44 బిలియన్ డాలర్లకు పెంచుకోవడంపై భారత్ దృష్టి పెడుతోంది. తద్వారా గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 7–8% వాటాను సాధించాలని నిర్దేశించుకుంది.

చిన్న సంస్థలకు వివిపై రుణాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ వివిఫై ఇండియా ఫైనాన్స్ తాజాగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణ కార్యకలాపాల విభాగంలోకి ప్రవేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 500 కోట్ల వరకు వితరణను

లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, ఎండీ అనిల్ కుమార్ పినపాల తెలిపారు. వచ్చే 3–5 ఏళ్లలో రుణాల పోర్ట్‌ఫోలియోలో ఈ విభాగం వాటాను 40 శాతం వరకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. ఉద్యమ్ ఫ్లెక్స్ లోన్ పథకం కింద సంస్థ స్థాయిని బట్టి రూ. 10 కోట్ల వరకు రుణాలిస్తున్నట్లు అనిల్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది రూ. 250 కోట్ల వరకు నిధులు సమకూర్చుకున్నట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 450 కోట్లు సమీకరించనున్నట్లు ఆయన వివరించారు. అలాగే వచ్చే నెలలో మైక్రో ఎల్ఏపీ (ప్రాపర్టీపై సూక్ష్మ రుణాలు) విభాగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు చెప్పారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 293 కోట్ల ఆదాయంపై రూ. 16 కోట్ల లాభం నమోదు చేసింది. వేతనజీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి వివిఫై రుణాలు అందిస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎస్‌బీఐ రుణ రేట్లు తగ్గాయ్	ఈవీ బ్యాటరీలకు భారీ డిమాండ్

మెరిసిన మెటల్ షేర్లు

మళ్లీ 26,000 దాటిన నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో దేశీయ స్టాక్ మార్కెట్ లాభపడింది. ఇటీవల దిద్దుబాటు దశ తర్వాత విస్తృత స్థాయిలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 450 పాయింట్లు పెరిగి 85,268 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148 పాయింట్లు లాభపడి 26,047 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలో కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే వెంటనే పుంజుకొని తిరిగి లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 503 పాయింట్లు బలపడి 85,321 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు ఎగసి 26,058 వద్ద గరిష్టాలు నమోదు చేశాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుతో వ్యవస్థలో ద్రవ్యలభ్యత అధికంగా ఉండొచ్చనే ఆశావహ అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి. ఆసియా మార్కెట్లు 2% ర్యాలీ చేశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి.

రూపాయి విలవిల

17 పైసలు తగ్గి 90.49 వద్ద ముగింపు

రూపాయి బలహీనపడుతూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డాలర్ మారకంలో 17 పైసలు క్షీణించి కొత్త ఆల్‌టైమ్ కనిష్టం 90.49 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ 90.43 వద్ద మొదలైంది. ఒక దశలో 24 పైసలు క్షీణించి 90.56 వద్ద ఇంట్రాడే రికార్డు కనిష్టాన్ని నమోదు చేసింది.

ఎగుమతులకు మెక్సికో టారిఫ్‌ల దెబ్బ

ఆటో, మెటల్, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ప్రభావం

న్యూఢిల్లీ: దేశీ ఎగుమతులపై మెక్సికో ప్రకటించిన టారిఫ్‌ల పెంపు ప్రధానంగా ఆటో, ఆటో విడిభాగాలు, మెటల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్స్ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. దక్షిణ అమెరికా దేశమైన మెక్సికో తాజాగా భారత్ దిగుమతులపై సుంకాల పెంపును చేపట్టింది. ఇవి 2026 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మెక్సికోతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం పరిధిలోలేని దేశాలపై 5 నుంచి 50 శాతం వరకూ దిగుమతి సుంకాలు వర్తించనున్నాయి. భారత్‌సహా చైనా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాలలోని వివిధ రంగాలు, పరిశ్రమలపై ఈ టారిఫ్‌లు ప్రభావం చూపను

న్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. గతేడాది(2024–25) మెక్సికోకు 5.75 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను భారత్ చేపట్టింది. అయితే తాజా టారిఫ్‌ల పెంపు కారణంగా మెక్సికోకు ఎగుమతులు వ్యయభరితమయ్యే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. గతేడాది ప్రయాణికుల వాహన ఎగుమతులు 938.35 మిలియన్ డాలర్లుకాగా.. 20 శాతం నుంచి 35 శాతం మధ్య టారిఫ్ పెంపు వర్తించనున్నట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) తెలియజేసింది. దీంతో ధరల పోటీతత్వం నీరసించవచ్చని అభిప్రాయపడింది. ఆటో విడిభాగాలపై ఇది మరింత అధికంగా కనిపించనున్నట్లు పేర్కొంది. ఆటో విడిభాగాల ఎగుమతులు 507.26 మిలియన్ డాలర్లుకాగా.. 10–15% సుంకాలు 35 శాతానికి పెరగనున్నట్లు జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలియజేశారు. ఇదేవిధంగా 390.25 మిలియన్ డాలర్ల విలువైన మోటార్‌సైకిళ్ల ఎగుమతులు సైతం సవాళ్లను ఎదుర్కోనున్నట్లు తెలియజేశారు. వీటిపై సుంకాలు 20% నుంచి 35 శాతానికి పెరగనున్నట్లు వెల్లడించారు.

ఆటో విడిభాగాలపై ఎఫెక్ట్

దేశీ ఆటో విడిభాగాల పరిశ్రమపై తాజాగా మెక్సికో చేపట్టిన దిగుమతి సుంకాల పెంపు ప్రతికూల ప్రభావం చూపనున్నట్లు పరిశ్రమల సమాఖ్య ఏసీఎంఏ పేర్కొంది. భారత్ నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి అర్ధభాగంలో 37 కోట్ల డాలర్ల విలువైన ఆటో విడిభాగాలను మెక్సికోకు ఎగుమతి చేసింది. సుంకాలు భారత్ ఎగుమతులపై 35–50% స్థాయిలో పెరగనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రస్తుతం రెండు దేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలు వృద్ధిలో ఉన్న ఆటోమోటివ్ వాణిజ్యానికి నిలకడను తీసుకురాగలదని విశ్వసిస్తున్నట్లు దేశీ ఆటోమోటివ్ విడిభాగ తయారీదారుల అసోసియేషన్(ఏసీఎంఏ) డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా చెప్పారు.

రూ.2,00,000 చేరువలో వెండి

రూ. 5,100 రయ్ ..

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా డిమాండ్ నెలకొనడంతో వెండి ధర వరుసగా మూడో రోజు బలపడి, రూ. 2 లక్షల మార్కుకు మరింత చేరువలోకి వచ్చింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం శుక్రవారం న్యూఢిల్లీ మార్కెట్లో కిలోకి ఏకంగా రూ.5,100 మేర పెరిగి రూ. 1,99,500 వద్ద క్లోజయ్యింది. ఇది సరికొత్త రికార్డు స్థాయి. 'దేశీ మార్కెట్లో స్పాట్ వెండి ధరలు మరో కొత్త గరిష్టానికి ఎగిశాయి. అటు బంగారం కూడా భారీగా పెరిగి, రికార్డు స్థాయికి దగ్గర్లో ట్రేడవుతోంది. గత కొద్ది రోజులుగా కన్సాలిడేట్ అవుతున్న పసిడి రేటు, రూపాయి బలహీనంగా ఉండటం లాంటి అంశాల కారణంగా, మళ్లీ పెరగడం మొదలైంది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్టు దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక బులియన్ స్పాట్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,100 పెరిగి రూ. 1,33,600 వద్ద క్లోజయ్యింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో పసిడి రేటు ఔన్సుకి (31.1 గ్రాములు) 58.61 డాలర్లు (1.37 శాతం) పెరిగింది. 4,338.40 డాలర్లకు చేరింది. అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో వెండి రేటు 64.95 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. అమెరికా ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) తగ్గించడంతో పసిడి, వెండి ధరలు తదనుగుణంగా స్పందిస్తున్నట్లు కోటక్ సెక్యూరిటీస్ హెడ్ (కరెన్సీ, కమోడిటీ) అనింద్య బెనర్జీ పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్

ముంబైకు హైదరాబాద్ షాక్

3 వికెట్లతో మెరిసిన సిరాజ్ ● అమన్, తన్మయ్ అర్ధ సెంచరీలు

పుణే: భారత స్టార్ పేసర్ సిరాజ్ (3/21) హడలెత్తించడంతో... ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ 'సూపర్ లీగ్'లో హైదరాబాద్ శుభారంభం చేసింది. గ్రూప్'బి'లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్, స్టార్ ఆటగాళ్లతో నిండిన ముంబై జట్టును చిత్తు చేసింది. మొదట ముంబై 18.5 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌటైంది. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ (29; 6 ఫోర్లు) తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. కెప్టెన్ అజింక్య రహానే (13), సర్ఫరాజ్ ఖాన్ (5), శార్దుల్ ఠాకూర్ (0) విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిరాజ్ 3 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ సీవీ మిలింద్, తనయ్ త్యాగరాజన్ చెరో 2 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం హైదరాబాద్ 11.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 132 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (40 బంతుల్లో 75; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), అమన్ రావు (29 బంతుల్లో 52 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు.

నితీశ్ రెడ్డి 'హ్యాట్రిక్' వృథా

టీమిండియా పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (3/17) 'హ్యాట్రిక్'తో చెలరేగినా... ఆంధ్ర జట్టుకు పరాజయం తప్పలేదు. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 4 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్ చేతిలో ఓడింది. మొదట ఆంధ్ర జట్టు 19.1 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌటైంది. శ్రీకర్ భరత్ (31 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. అనంతరం మధ్యప్రదేశ్ 17.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసి గెలిచింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్ చివరి మూడు బంతులకు నితీశ్ రెడ్డి వరుసగా హర్ష్ గావ్లి (5), హర్‌ప్రీత్ (0), కెప్టెన్ రజత్ పాటీదార్ (0)లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో... మధ్యప్రదేశ్ జట్టు అలవోకగా విజయం సాధించింది.

వైభవ్ విధ్వంసం

- 95 బంతుల్లో 9 ఫోర్లు, 14 సిక్స్‌లతో 171
- యూఏఈపై 234 పరుగులతో గెలిచిన యువ భారత్

దుబాయ్: భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (95 బంతుల్లో 171; 9 ఫోర్లు, 14 సిక్స్‌లు) భారీ సెంచరీతో విధ్వంసం సృష్టించడంతో... అండర్–19 ఆసియా కప్ టోర్నీలో భారత జట్టు ఘనవిజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో యువ భారత జట్టు 234 పరుగుల తేడాతో యూఏఈపై నెగ్గింది. మొదట భారత్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 433 పరుగులు చేసింది. అండర్–19 వన్డేల్లో భారత జట్టుకు ఇదే అత్యధిక స్కోరు. హైదరాబాద్ ప్లేయర్ ఆరోన్ జార్జ్ (69; 7 ఫోర్లు, 1 సిక్స్), విహాన్ (69; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈ క్రమంలో 14 ఏళ్ల వైభవ్... భారత అండర్–19 జట్టు తరఫున ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. లక్ష్యఛేదనలో యూఏఈ 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 199 పరుగులే చేసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హైదరాబాద్‌కు మెస్సీ 'కిక్'

'గోట్' టూర్ షురూ నేడు

ముందుగా కోల్‌కతాలో ● సాయంత్రం హైదరాబాద్‌కు

ఓ మారడోనా... ఓ పీలే... ఓ డుంగా... ఓ రొనాల్డిన్హో... వీళ్ల సరసన నిలిచేందుకు తాజాగా అర్జెంటీనా సూపర్‌స్టార్ మెస్సీ 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (జీఓఏటీ) టూర్ ఆఫ్ ఇండియా'లో ఓ పండుగలా దిగి వస్తున్నాడు. అభిమానుల్ని 'కిక్' ఎక్కించనున్నాడు. అతి కొద్దిమంది ఎంపిక చేసిన వారితో కలిసి విందు కూడా చేయబోతున్నాడు. ఫొటోలు దిగబోతున్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ స్టార్ ఇంత తీరిగ్గా భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. గతంలో 14 ఏళ్ల క్రితం వచ్చాడు. కానీ వచ్చిన పని మాత్రమే చూసుకొని (అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి) వెళ్లాడు. కానీ ఇప్పుడలా కాదు... పని గట్టుకొని మరీ తన భారతీయ అభిమాన గణాన్ని అలరించేందుకే వస్తున్నాడు.

సాక్షి, హైదరాబాద్: మెస్సీ... మెస్సీ... మెస్సీ... కొన్ని రోజులుగా బంగారం ధరల కంటే, స్టాక్ మార్కెట్ సూచీల కంటే, రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన కంటే కూడా పతాక శీర్షికల్లో ఎక్కుతున్న పేరిది. అందరి నోటా ఇదే మాట. ఏ నలుగురు క్రీడాభిమానులు కలిసినా ఇదే ముచ్చట. అధికార వర్గాలు, పోలీస్ బందోబస్తు (4 నగరాలకు సంబంధించి) ఏర్పాట్లు కూడా అతని కోసమే! అయితే ఎవరీ మెస్సీ! ఎందుకంత క్రేజ్? క్రికెట్ మతమైన భారత్‌లో ఓ ఫుట్‌బాల్ స్టార్‌ను ఇంతలా తలకెక్కించుకుంటారా! అంటే... అవును మరి... అతను ఆడే ఆట ఫుట్‌బాల్‌కు మన దేశంలో ప్రాచుర్యం లేకపోవచ్చు. కానీ అతను ఆడే మ్యాచ్‌లకు మాత్రం దేశం, రాష్ట్రం, మతంతో సంబంధం లేకుండా అభిమాన హారతులిస్తారు. నిజానికి అతను ఆడితే లోకమే చూస్తుంది. ఆ లోకంలో మనమూ ఉన్నాం. అందుకే ఆ క్రేజ్!

గతంలో వచ్చి ఏం చేశాడు



జగద్విఖ్యాత ఫుట్‌బాలర్ మెస్సీ 2011లోనూ భారత్‌కు వచ్చాడు. కానీ ఇది ప్రైవేట్ లేదంటే స్పాన్సర్, చారిటీ కోసం కాదు. క్రికెట్ క్రేజీ భారత్‌లో ఫుట్‌బాల్‌కు ప్రాచుర్యం కల్పించేందుకు 'ఫిఫా' ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేందుకు లయోనల్ వచ్చాడు. కోల్‌కతాలో సాల్ట్‌లేక్ మైదానంలో వెనుజులాతో జరిగిన ఈ మ్యాచ్‌లో మెస్సీ టీమ్ అర్జెంటీనా 1–0తో జయభేరి మోగించింది. ఈ అంతర్జాతీయ 'ఫిఫా' మ్యాచ్ ముగిసిన వెంటనే మరే కార్యక్రమం పెట్టుకోకుండానే అక్కడి (కోల్‌కతా) నుంచే స్వదేశానికి పయనమయ్యాడు. అప్పటికి, ఇప్పటికీ తేడా ఏంటంటే అప్పుడు జట్టులో ఒకడు. ఇప్పుడు అతడొక్కడే ఆకాశమంత ఆనందం!

డే-1 ఫస్ట్ హాఫ్ కోల్‌కతా



మెస్సీ ఈవెంట్‌కు పెట్టిన పేరు 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'. నాలుగు నగరాల్లో ముందుగా అడుగు పెట్టేది కోల్‌కతాలో. అక్కడ తన 70 అడుగుల విగ్రహాన్ని తానే ఆవిష్కరిస్తాడు. భద్రతా కారణాల రీత్యా మెస్సీ ప్రత్యక్షంగా వెళ్లి రిబ్బన్ కట్ లాంటివి కాకుండా... వర్చువల్‌గా బస చేసిన హోటల్ నుంచే తన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటాడు. తర్వాత 10 గంటల నుంచి దాదాపు 1 గంట వరకు జరిగే 'యువభారతి క్రీడాంగణ్' సత్కారానికి వెళ్తాడు. ఆ రాష్ట్ర వివిధ జిల్లాల నుంచి వచ్చిన చిన్నారులతోనూ కాసేపు ముచ్చటిస్తాడు.

ఎవరిని కలుస్తాడు: 'బాలీవుడ్ బాద్‌షా' షారుఖ్ ఖాన్, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ, సీఎం మమతా బెనర్జీలతోపాటు పలువురు సెలబ్రిటీలను మెస్సీ కలుసుకుంటాడు. తర్వాత మధ్యాహ్నం 2 గంటల దాకా సాల్ట్‌లేక్ మైదానాన్ని మోతెక్కిస్తాడు.

డే-1 సెకండ్ హాఫ్ హైదరాబాద్

మొదటి రోజే అక్కడి నుంచి సాయంత్రం 4 కల్లా మెస్సీ నేరుగా హైదరాబాద్‌కు చేరుకుంటాడు. విరామం లేకుండా బిజీబిజీగా షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్ని పూర్తి చేసుకొని రాత్రి 7 గంటలకు ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులతో కలిసి 'గోట్ కప్' ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడతాడు.

ఎవరిని కలుస్తాడు: ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే విందులో మెస్సీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ సినీ ప్రముఖులు, సీనియర్ రాజకీయ నాయకులు హాజరవుతారు.

60 మంది రూ. 10 లక్షల చొప్పన చెల్లించి...

సింగరేణి ఆర్ఆర్9, అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ ఈ రెండు జట్ల మధ్య 15 నిమిషాల పాటు సరదా మ్యాచ్ జరుగుతుంది. 39 వేల సీటింగ్ సామర్థ్యమున్న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఇప్పటికే 27 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. నేటి ఉదయం కల్లా హౌజ్ ఫుల్ అవుతుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. మెస్సీతో ఫొటో సెషన్ కోసం ఇప్పటికే 60 మంది రూ. 10 లక్షల చొప్పన చెల్లించి రిజిస్టర్ చేయించుకున్నారని..., ఈ 60 మందితో మెస్సీ ఫొటోలు దిగుతారని హైదరాబాద్ గోట్ టూర్ సలహాదారు పార్వతి రెడ్డి తెలిపారు.

- **దేశంలో సాకర్** దిగ్గజం గడిపేది 72 గంటలే! **కానీ.... ఈ కాస్త** సమయంలోనే తూర్పు, దక్షిణ, **పడమర, ఉత్తర** దిక్కుల్ని కవర్ చేయడమే అతి **పెద్ద విశేషం.**
- **కోల్‌కతా (తూర్పు)**, హైదరాబాద్ (దక్షిణ), **ముంబై (పశ్చిమ)**, ఢిల్లీ (ఉత్తర) నగరాల్లో ఊపిరి **సలపని బిజీ బిజీ** షెడ్యూల్‌లో పాల్గొననున్నాడు.
- **నాలుగు రాష్ట్రాల** ముఖ్యమంత్రులతో మాటామంతీ **కలిపాక** ఆఖర్లో ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర **మోదీతో జరిగే భేటీతో** ఈ పర్యటన ముగుస్తుంది.
- **భారత టెస్టు,** వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్... **దర్మశాలలో 14న** మ్యాచ్ ముగిసిన వెంటనే తన **ఫేవరెట్ ఫుట్‌బాలర్‌ను** కలుసుకోనున్నాడు.
- **ఈ పర్యటన పూర్తిగా** భారత సాకర్ ప్రియుల్ని **అలరించడానికే** తప్ప సీరియస్ ఫుట్‌బాల్ **మ్యాచో, లేదంటే** ఫ్రెండ్లీ మ్యాచో ఆడేందుకు **మాత్రం కాదు.**
- **ఫ్యాన్స్‌కు ఇది** కాస్త లోటే అయినా... బోలెండత **వినోదాన్ని ఈ** నాలుగు నగరాల్లో పంచనున్నాడు.
- **కోల్‌కతాలో** 78 వేల సీటింగ్ సామర్థ్యమున్న **సాల్ట్‌లేక్ స్టేడియం** కిక్కిరిసిపోనుంది.
- 'గోట్ టూర్' మొదలవుతోందే బెంగాల్‌లో... శనివారం ఉదయమే స్టేడియమంతా నిండిపోతోంది. 45 నిమిషాల పాటు మెస్సీ స్టేడియంలో సరదాగా ఆడుతూ పాడుతూ చేసే కిక్స్, ఫ్రీ కిక్స్ ముమ్మాటికి సాకర్ క్రేజీ బెంగాలీలను ఊపేయనున్నాయి.

డే-2 ముంబై

పర్యటనలో రెండో రోజంతా వాణిజ్య రాజధాని ముంబైలో మెస్సీ బిజీబిజీగా గడుపుతాడు. వాంఖెడేలో చారిటీ మ్యాచ్ ఆడతాడు. ఇందులో క్రికెట్ స్టార్స్ తదితరులతో కలిసి చారిటీ మ్యాచ్ బరిలోకి దిగుతాడు. తర్వాత ఫ్యాషన్ షోలో స్వయంగా పాల్గొని ర్యాంప్ వాక్ చేయనున్నాడు. ఇది ముగిసిన వెంటనే ఖతర్–2022 ప్రపంచకప్ సాకర్‌కు సంబంధించిన వేలం జరుగుతుంది. ఇందులో మెస్సీ ఈ మెగా ఈవెంట్‌లో వేసుకున్న జెర్సీలు, కిట్‌లను వేలం వేయనున్నారు.

ఎవరిని కలుస్తాడు: సచిన్ టెండూల్కర్, మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లతో చారిటీ మ్యాచ్, బాలీవుడ్ స్టార్స్ జాన్ అబ్రహం, కరీనా కపూర్, జాకీ ష్రాఫ్ తదితరులతో ర్యాంప్ వాక్ చేస్తాడు.

డే-3 ఢిల్లీ

మూడో రోజు మెస్సీ దేశ రాజధానికి విచ్చేస్తాడు. ఇక్కడ అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించే ఫుట్‌బాల్ శిక్షణ కార్యక్రమంలో ప్రతిభావంతులైన భారత చిన్నారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగమవుతాడు. ఇతరత్రా కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకొని ఢిల్లీ వాసుల్ని అలరించనున్నాడు. పలువురు ప్రముఖులు, సెలబ్రిటీలతో కలిసి పెనాల్టీ కిక్ షోలో పాల్గొంటాడు. సాకర్ ప్రియుల్ని ఉత్సాహపరిచే ఈవెంట్‌లలో భాగమవుతాడు.

ఎవరిని కలుస్తాడు: ప్రముఖ సెలబ్రిటీలను కలిసాక... మెస్సీ ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని ఫుట్‌బాల్ ముచ్చటలో భాగమవుతాడు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

● మహనీయులు

తొలి తెలుగు గీత రచయిత...

కేశవదాసు

పిల్లలూ! మీరు సినిమాల్లో వచ్చే పాటలు వింటుంటారా? అవి మీలో ఆనందాన్ని కలిగిస్తాయా? వాటిని రాసేవారిని గీత రచయితలు అంటారు. తెలుగు సినిమాల్లో తొలి గీత రచయిత ఎవరో తెలుసా? చందాల కేశవదాసు. ఆయన గురించి తెలుసుకుందాం.

కేశవదాసు 1876 జూన్ 20న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, పాపమ్మ. కేశవదాసు అన్న వెంకటరామయ్య. చిన్ననాడే వారి తండ్రి మరణించడంతో కేశవదాసు అన్న సంరక్షణలోనే పెరిగారు. వీధిబడిలో చదువుకొని వ్యాకరణం, ఛందస్సు, పద్యరచన నేర్చుకున్నారు. అష్టావధానాలు చేయడంలో దిట్టగా మారి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అవధానాలు చేశారు. ఆ సమయంలో పరిచయమైన వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్య ఆయనకు సంగీతంపై అవగాహన కల్పించారు. దీంతో గేయరచన, పాటలు, హరికథలు రాయడంతో కేశవదాసు ప్రావీణ్యం సాధించారు. నాటకాలకు అనేక గీతాలు రాశారు. శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ప్రఖ్యాతి పొందిన 'భలే మంచి చౌకబేరము' అనే పాట ఆయన రాసిందే.

నాటకరంగంలో ఆయన పేరు మారిమోగిపోతున్న సమయంలో తెలుగు సినీరంగం పురుడు పోసుకుంది. 1931లొ వచ్చిన తొలి తెలుగు చిత్రం 'భక్త ప్రహ్లాద'లో పాటలు రాయమని ఆయనకు పిలుపు వచ్చింది. ఆ చిత్రంలో కేశవదాసు రాసిన 'పరితాప భారంబు భరియింప తరమా' అనేది తొలి తెలుగు సినీ గీతంగా ప్రసిద్ధి చెందింది. ఆ తర్వాత సతీ సక్కుబాయి(1935), బాలరాజు(1948) తదితర చిత్రాలకు మాటలు, పాటలు, పద్యాలు రాసి ప్రసిద్ధికెక్కారు. ఆయనకు 'ఆంధ్రసూత', 'కలియుగ దాశరథ' అనే బిరుదులు ఉండేవి. 1956 మే 14న ఆయన మరణించారు.

రన్ శాంటా రన్

క్రిస్మస్ సీజన్‌లో ప్రపంచమంతా శాంటా తాత జపం చేస్తుంది. శాంటాను చూస్తే ఎవరికైనా ఉత్సాహం, ఆనందమే కదా. శాంటా రావడం అంటే సంతోషాలు రావడమే. అందుకే పండుగ ముందు పండగ కళ రావడం కోసం చాలా దేశాలలో 'శాంటా రన్' నిర్వహిస్తారు. ఈ రన్‌లో పాల్గొనేవారందరూ శాంటాలా దుస్తులు వేసుకుని ఒక చోట నుంచి మరో చోటకు సరదాగా రన్ చేస్తారు. ఇక్కడ మీరు చూస్తున్నది బుడాపెస్ట్ (హంగరీ), బ్రాండెన్‌బర్గ్ (జర్మనీ)లో జరిగిన శాంటారన్‌లు. రోడ్డంతా ఎలా బోలెండమంది శాంటాలతో నిండిపోయిందో చూడండి.

● కథ

బంగారు కూజా

కాశీ నగరంలో ఓ అవ్వ, మనవరాలు నివసించేవారు. వారిద్దరూ బాటసారులకు భోజనాలు పెట్టి, వారు ఇచ్చే తృణమో, పణమో తీసుకొని జీవితాన్ని గడిపేవారు.

ఒకసారి వారి వద్దకు కొందరు బాటసారులు వచ్చారు. అందులో ఒక వర్తకుడు ఉన్నాడు. అతను పాత వస్తువులు కొని వాటిని అధిక ధరకు ఇతర ప్రాంతాల్లో అమ్మేవాడు. అవ్వ, మనవరాలి ఇంట్లో పాతకాలం నాటి లోహపు కూజా ఉండేది. అతనికి కూజా అమ్మి, ఎంతో కొంత డబ్బులు తీసుకుంటే తమ ఆదరువు గడిచిపోతుందని భావించారు అవ్వ, మనవరాలు. కూజాను తీసుకొచ్చి అతనికి చూపించారు. అతను ఆ కూజాను రకరకాలుగా పరిశీలించాడు. అది స్వచ్ఛమైన బంగారు కూజా అని అతనికి అర్థమైంది. ఆ విషయం అవ్వా, మనవరాళ్లకు తెలియదని, అందుకే ఇంత కాలం దాన్ని అమ్మకుండా ఉన్నారని గ్రహించాడు. ఎలాగైనా దాన్ని వారి నుంచి తక్కువ ధరకు తీసుకోవాలని భావించాడు.

'అబ్బే.. ఈ కూజా దేనికీ పనికిరాదు. దీని వల్ల ఏ లాభం లేదు. గుడ్డిగవ్వ కూడా చేయని ఈ కూజాను తీసుకొని నేనేం చేసుకోను?' అని డాంబికంగా పలికాడు. ఆ మాటలతో అవ్వ, మనవరాలు నిరాశ చెందారు. కాసింత డబ్బులైనా వస్తాయేమోనని ఆశపడితే తమ ఆశ ఇలా కరిగిపోయిందని బాధపడ్డారు. వర్తకుడు వారి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రానికి తిరిగొచ్చి ఎంతోకొంత ఇచ్చి వారి నుంచి ఆ కూజా తీసుకోవాలని అతని ఆశ. విలువ లేని ఆ కూజాను ఇంట్లో ఉంచుకోకూడదని అవ్వ, మనవరాలు భావించారు. మనవరాలు ఆ కూజాను తీసుకొని బయట పడేసి రావాలని బయర్దేరితే దారిలో ఒక బంగారు వ్యాపారి 'నీ చేతిలో ఏమిటి' అని అడిగాడు. 'పనికి రాని కూజా' అని మనవరాలు చెప్పింది. అయితే వ్యాపారికి అనుమానం కలిగి తన వెంట దుకాణానికి తీసుకెళ్లి ఆ కూజాను పరీక్షించాడు. అది స్వచ్ఛమైన బంగారు కూజా అని తేలడంతో ఆ విషయం ఆమెకు చెప్పాడు. మనవరాలి ఆనందానికి అవధి లేకుండా పోయింది. దానికి ధర కట్టి కొనుక్కోమని వ్యాపారిని కోరింది. అంత ధనం తన వద్దని లేదని అతను అన్నాడు.

'అయ్యా.. ఇన్నాళ్లూ ఈ కూజా పనికిరానిదని అనుకున్నాం. మీరు ఇవాళ దీని విలువ మాకు తెలియజెప్పారు. మీరు మనస్ఫూర్తిగా ఎంత ఇచ్చినా తీసుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని యువతి కోరింది. ఆమె మంచి మనసు ఆయన గ్రహించాడు. ఆ అమ్మాయితో కలిసి వారింటికి వెళ్లాడు. కూజా విషయం అవ్వకు చెప్పాడు. ఆ కూజాకు తగినంత విలువ తాను చెల్లించలేనని, అయితే అంత మంచి మనసు కలిగిన ఆ అమ్మాయిని తన ఇంటి కోడల్ని చేసుకుంటానని, అవ్వ కూడా తమతోపాటు తమ ఇంట్లో ఉండొచ్చని అన్నాడు. దీంతో అవ్వ, మనవరాలు సంతోషించారు. తమ జీవితాల్లో మార్పు వచ్చిందని వారు సంతోషించారు.

ఉదయం బయటకు వెళ్లిన వర్తకుడు సాయంత్రం చీకటి పడ్డాక వారింటికి వచ్చాడు. 'సరే..ఎంతో కొంత ఇచ్చి ఆ కూజా నేనే తీసుకుంటాను' అని అన్నాడు. ఆ మాటతో అవ్వ అగ్గిమీద గుగ్గిలమైంది. బంగారు కూజాను పనికిరానిదని చెప్పి, తమ వద్ద నుంచి కారుచవగ్గా కాజేయాలని చూసిన అతనికి చీవాట్లు పెట్టింది. అటు కూజా దక్కక, ఇటు చీవాట్లు తినాల్సి రావడంతో ఆ వర్తకుడు బాధతో తిరుగుప్రయాణమయ్యాడు.

థర్మామీటర్... ఎలా పుట్టిందో తెలుసా?

పిల్లలూ! మీకు జ్వరం వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్తారు. ఆయన థర్మామీటర్ మీ నోటిలో పెట్టి, మీకు ఎంత వేడి ఉందో పరీక్షించి, అందుకు తగ్గట్లు మందులు రాస్తారు. సన్నటి గొట్టంగా చిన్నగా ఉండే థర్మామీటర్ల స్థానంలో ప్రస్తుతం కొత్త రకమైన డిజిటల్ రీడింగ్ థర్మామీటర్లు వచ్చేశాయి. వీటి పుట్టుక ఎలా మొదలైందో తెలుసా?

థర్మామీటర్‌కు వేల ఏళ్ల చరిత్ర ఉంది. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలోనే థర్మామీటర్ వంటి పరికరాలు వైద్యానికి వాడినట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. అయితే 1593లో ప్రముఖ శాస్త్రవేత్త గెలీలియో గెలీలీ తొలిసారి ఈ థర్మామీటర్‌ను కనుగొన్నారు. ఇది నీటితో పని చేసేది. అనేక సంవత్సరాల పాటు ఆయన రూపొందించిన థర్మామీటర్‌నే వైద్యచికిత్సలో వాడేవారు. అనంతరం 18వ శతాబ్దంలో డేనియల్ గాబ్రియేల్ మొదటిసారి పాదరసంతో తయారైన థర్మామీటర్‌ను తయారు చేశారు. ఇందులో ఫారెన్ హీట్ స్కేల్ తొలిసారి ప్రవేశపెట్టారు. అనంతరం అండర్స్ సెల్సియస్ అనే శాస్త్రవేత్త థర్మామీటర్‌లో సెల్సియస్ స్కేల్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఈ థర్మామీటర్ రకరకాలుగా మార్పులు చెంది, ప్రస్తుతం మనం చూస్తున్న రూపంలోకి వచ్చింది. థర్మామీటర్‌ను కేవలం వైద్యచికిత్సకే కాకుండా, ఉష్ణోగ్రతల కొలతకూ, ఇతర ప్రయోగ అవసరాలకు కూడా వినియోగిస్తారు.

● పుస్తకాలు

ఎలుగుబంటి పియానో నేర్చుకుంటే?



అనగనగా ఓ అడవిలో ఎలుగుబంటికి ఎప్పుడూ కనబడని ఓ వింత వస్తువు కనిపించింది. దాన్ని నొక్కితే సంగీతం వస్తోంది. దాన్ని నొక్కి, అందులో నుంచి వచ్చే సంగీతం వింటూ సాధన చేసింది. సరికొత్త పాటలు కనిపెట్టింది. కొంతమంది మనుషులు అడవికి వచ్చి ఆ ఎలుగు బంటి వాయిస్తోంది పియానో అని గ్రహించారు. ఎలుగుబంటిని తమ వెంట నగరానికి తీసుకెళ్లి ప్రదర్శనలు ఇప్పించారు. ఆ తర్వాత ఏమైందన్నది మిగిలిన కథ. రచయిత డేవిడ్ లిచ్‌ఫీల్డ్ రాసిన ఈ పుస్తకం పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది.

తేలిగ్గా పిల్లలు తెలుగు నేర్చుకునేలా..

ప్రస్తుత కాలంలో చాలామంది పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రావడం లేదు. దీంతో వారు మాతృభాషను మర్చిపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాంటివారు తమ పిల్లల కోసం కొనాల్సిన పుస్తకం ఇది. తేలిగ్గా పిల్లలకు తెలుగు భాష నేర్పేందుకు ఈ పుస్తకాన్ని రూపొందించారు భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి. ఇందులోని అనేక అంశాలు పిల్లలకు భాష మీద పట్టునివ్వడంతోపాటు ప్రేమను పెంచుతాయి.

ఏనుగు సఫారీ వద్దు

ఇక్కడ మీరు చూస్తున్నది 'పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్' (పెటా) సభ్యులు ఢిల్లీలో చేస్తున్న ఆందోళన ఫొటో. ఏనుగు సఫారీలు వద్దు అని వీరు ఆందోళన చేస్తున్నారు. ఫారెస్ట్ టూరిజంలో పర్యాటకులను ఏనుగుల వీపు మీద కూచోబెట్టి షికారు చేయించడం మన దేశంలో ఆనవాయితీగా ఉంది. అయితే దీని వల్ల ఏనుగుల వెన్ను సమస్యలు వస్తాయని, అవి చాలా బాధ పడతాయని ఈ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను సంకెళ్లతో బంధించి ఉంచడం, వాటితో సేవలు చేయించుకోవడం కూడా మానేయాలని వీరు పిలుపునిస్తున్నారు. అందుకోసమే ఏనుగు దుస్తుల్లో ఇలా రోడ్డు మీద నిలుచున్నారు.

బుకారూ

ఇది పిల్లల సాహిత్య పండగ



పిల్లలూ! మన కోసమే జరిగే ఓ సాహిత్య పండగ ఉందన్న విషయం మీకు తెలుసా? దానిపేరు బుకారూ. ఇది పూర్తిగా బాలల సాహిత్యం, బాల కథకులు, బాల సాహిత్య రచయితల కోసం ఉద్దేశించిన పండగ.

పిల్లల కోసం ఓ సాహిత్య ఉత్సవం ఉండాలన్న ఉద్దేశంతో 'బుకారూ' అనే స్వచ్ఛంద సంస్థ 2008లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. చిన్నారుల కోసం పుస్తకాలు రాసేవారు, చిన్నారులు ఒక చోట చేరితే ఎంతో మేలు జరుగుతుందని, దీనివల్ల బాలలకూ, బాలసాహిత్యానికి ఎంతో మంచిదన్న ఉద్దేశంతో 17 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ మన దేశంలోని 15 నగరాలతోపాటు శ్రీలంక, మలేషియాల్లో బుకారూ చిల్డ్రన్స్ లిటరేచర్ ఫెస్టివల్ జరిగింది. సుమారు 1100 మందికి పైగా స్పీకర్లు ఈ ఉత్సవాల్లో పాల్గొని బాల సాహిత్యంపై తమ ఆలోచనలు పంచుకున్నారు. బాలసాహిత్యం పిల్లలకు మరింత చేరువయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఇక్కడికి చిన్నారులంతా వచ్చి తమ ఆలోచనలు వివరించవచ్చు. తాము ఎలాంటి పుస్తకాలు ఇష్టపడుతున్నారో, ఎలాంటి సాహిత్యం చదవాలనుకుంటున్నారో, ఎలాంటి బొమ్మలు నచ్చుతాయో అక్కడున్న రచయితలు, చిత్రకారులతో మాట్లాడొచ్చు. బొమ్మలు గీయడం నేర్చుకోవచ్చు. కథలు వినొచ్చు. నాటకాలు చూడొచ్చు. చిన్నారుల కోసం ఇక్కడ వర్క్‌షాప్స్, కాంపిటీషన్స్ కూడా నిర్వహిస్తారు. ఇందులో పిల్లలు పాల్గొంటారు. బుకారూ పిల్లల సాహిత్య ఉత్సవం చదివే పిల్లల మీద మాత్రమే దృష్టి పెట్టదు. చదువుకు దూరమైన నిరుపేద పిల్లలకు సైతం ఈ ఉత్సవం చేరువకావాలని ప్రయత్నించింది. అందుకే వారున్న ప్రాంతాల్లోనూ ఈ ఉత్సవానికి సంబంధించి పలు కార్యక్రమాలు చేపడుతుంది. ఆ చిన్నారులనూ ఇందులో భాగం చేస్తుంది. అందుకే ఈ ఉత్సవంలో పాల్గొనాలని చిన్నారులు ఎంతో ఉత్సాహం చూపిస్తుంటారు.

బిజినెస్ రీల్

ఎస్‌బీఐ రుణ రేట్లు తగ్గాయ్

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటు పావు శాతం తగ్గింపును ఎస్‌బీఐ తన కస్టమర్లకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. రుణ రేట్లను పావు శాతం తగ్గించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రేట్ (ఈబీఎల్ఆర్)ను పావు శాతం తగ్గించడంతో 7.90 శాతానికి దిగొచ్చింది. అలాగే, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను సైతం 0.05 శాతం తగ్గించి 8.75 శాతం చేసింది. బేస్ రేటును 10 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించింది.

పీఎన్‌బీ ప్రచారకర్తగా హర్మన్‌ప్రీత్ కౌర్

లగ్జురా క్రెడిట్ కార్డు ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నియమితులయ్యారు. పీఎన్‌బీకి మహిళా ప్రచారకర్తను నియమించుకోవడం ఇదే ప్రథమం. బ్రాండ్ పరివర్తన ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయని బ్యాంకు తెలిపింది. అలాగే, లగ్జురా పేరిట ప్రీమియం క్రెడిట్ కార్డును కూడా పీఎన్‌బీ ప్రవేశపెట్టింది. తీసుకున్న 90 రోజుల్లోగా రూ. 50,000 ఖర్చు చేస్తే 40,000 వెల్‌కమ్ రివార్డ్ పాయింట్లు (రూ. 10,000 విలువ) సహా పలు ప్రయోజనాలు అందించే విధంగా ఈ కార్డు ఉంటుందని బ్యాంక్ ఎండీ అశోక్ చంద్ర తెలిపారు. లగ్జురాతో పాటు పీఎన్‌బీ వన్ 2.0, డిజి సూర్య ఘర్ మొదలైన వాటిని కూడా ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు, అశోక్ చంద్ర, హర్మన్‌ప్రీత్ కౌర్ ఆవిష్కరించారు.

ఏఐసీ టీ-హబ్ ల్యాబ్ 2 మార్కెట్ ప్రోగ్రామ్ రెండో బ్యాచ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐసీ ల్యాబ్2 మార్కెట్ ప్రోగ్రాం రెండో బ్యాచ్‌ని ప్రారంభించినట్లు ఏఐసీ టీ-హబ్ వెల్లడించింది. ఆవిష్కరణలను మార్కెట్లో ప్రవేశపెట్టతగిన ఉత్పత్తులుగా మార్చడంలో పరిశోధకులు, ఆవిష్కర్తలకు సహాయపడే విధంగా ఈ 16 వారాల ప్రోగ్రాం ఉంటుంది. ఇందులో వివిధ రంగాలకు చెందిన 19 స్టార్టప్‌లు పాల్గొంటున్నాయి. మీట్ కొనెకీ, ట్రేడేలేవుట్, డేవిడ్ ఏఐ, కార్డియో పల్మో ఏఐ, ఆప్టివిజన్ టెక్నాలజీస్, ఆర్టిలీగల్ మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఐడియాలను మార్కెట్లో ప్రవేశపెట్టడానికి అనువైన సొల్యూషన్స్‌గా తీర్చిదిద్దడంలో తోడ్పడేలా బహుళజాతి సంస్థలు, ఇన్వెస్టర్లతో కలిసి పని చేస్తున్నట్లు ఏఐసీ టీ-హబ్ ఫౌండేషన్ సీఈవో ఎ. రాజేశ్ కుమార్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-12-2025

విశాఖ	660-00
చిత్తూరు	673-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	665-00
విజయవాడ	690-00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	656-00
వరంగల్	658-00
రిటైల్ ధర	7.16

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	172	3.38
HINDALCO	851.2	3.26
ETERNAL	297.85	2.37
ULTRACEMCO	11,730.00	2.25
LT	4,072.80	1.72

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,264.00	-1.8
MAXHEALTH	1,080.00	-0.73
SUNPHARMA	1,794.20	-0.72
ITC	400.7	-0.55
ASIANPAINT	2,765.00	-0.52

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,621
ఎన్ఎస్ఈ	86,390
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,45,118
ఎఫ్ఐఐ	- 1,114
డీఐఐ	+ 3,869

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.70	$	57.06
బ్రెంట్	61.32	$	61.28

ఈవీ బ్యాటరీలకు భారీ డిమాండ్

- 2032 నాటికి 256 గిగావాట్ హవర్
- ప్రస్తుతం ఇది 17.7 గిగావాట్లే
- కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీ (ఈవీ బ్యాటరీ) డిమాండ్ వచ్చే ఏడేళ్లలో గణనీయంగా పెరనుందని కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ (సీఈఎస్) సంస్థ అంచనా వేసింది. 2025లో ఈవీ బ్యాటరీ డిమాండ్ 17.7 గిగావాట్ హవర్ (జీడబ్ల్యూహెచ్) ఉండగా, 2032 నాటికి 256.3 గిగావాట్లకు చేరుకోనున్నట్టు తెలిపింది. ఏటా 35 శాతం కాంపౌండెడ్ వృద్ధి (సీఏజీఆర్) ఈ రంగంలో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇంధన ధరలు పెరుగుతుండడం, ఎలక్ట్రిఫికేషన్‌ను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడం, వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్, ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లు విడుదల అవుతుండడం, విధానపరమైన మద్దతు అన్నీ కలసి ఈవీ మార్కెట్ భారీ వృద్ధికి అనుకూలిస్తున్నట్టు తన నివేదికలో సీఈఎస్ వివరించింది. ''భారతదేశ ఎలక్ట్రిక్ వాహన విప్లవానికి బ్యాటరీ కెమిస్ట్రీ పురోగతులు కీలకమైనవి. ఎల్‌ఎఫ్‌పీ జెన్ 4, సోడియం అయాన్ టెక్నాలజీ ఆవిష్కరణలు కేవలం సాంకేతికపరమైన పురోగతులే కాదు. ఎలక్ట్రిక్ వాహనాలను మరింత అందుబాటు ధరలకు తీసుకొచ్చే సంచలనాలు. సురక్షితమైన, ఒక్కచార్జ్‌తో మరింత దూరం ప్రయాణించేందుకు వీలు కల్పిస్తాయి''అని సీఈఎస్ ఎండీ వినాయక్ వలింబే తెలిపారు. ఎల్‌ఎఫ్‌పీ జెన్4 సెల్స్ అన్నవి ఇప్పుడు 300 వాట్‌హవర్/కిలోని అధిగమించాయంటూ.. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు, ధరలు తగ్గేందుకు అనుకూలిస్తాయ ఈ నివేదిక తెలిపింది.

సవాళ్లను అధిగమించాలి..

భారత్ తన ఎలక్ట్రిఫికేషన్ (ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లడం) లక్ష్యాలను సాధించేందుకు వీలుగా పరిశ్రమతో సహకారం, బలమైన బ్యాటరీ ఎకోసిస్టమ్ ఏర్పాటు, వ్యూహాత్మక పెట్టుబడుల సవాళ్లను అధిగమించేందుకు విధానపరమైన జోక్యం అవసరమని సీఈఎస్ నివేదిక సూచించింది. బ్యాటరీల్లో వినియోగించే కీలక ముడి పదార్థాలను, ఖనిజాలపై చైనా నియంత్రణలు.. భారత్‌లో గిగా ఫ్యాక్టరీల నిర్మాణాన్ని నిదానింపజేయొచ్చని, సరఫరా వ్యవస్థ రిస్క్‌లకు దారితీయొచ్చని హెచ్చరించింది. అధిక ఆరంభ పెట్టుబడులకుతోడు, దేశీయంగా ఖనిజ నిల్వలు పరిమితంగా ఉండడం భారత స్వావలంబన లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని పేర్కొంది.

ఇండియా పోస్ట్‌తో బీఎస్ఈ జట్టు

మ్యూచువల్ ఫండ్స్ సేవల పంపిణీ

న్యూఢిల్లీ: ఇండియా పోస్ట్‌తో (తపాలా శాఖ) ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ భాగస్వామ్యం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా తపాలా శాఖకు ఉన్న విస్తృతమైన శాఖల ద్వారా మ్యూచువల్ ఫండ్స్ సేవలను పంపిణీ చేసేందుకు ఈ ఒప్పందం వీలు కల్పించనుంది. బీఎస్ఈ స్టార్ ఎంఎఫ్ అన్నది.. దేశంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ మ్యూచువల్ ఫండ్స్ పంపిణీ ప్లాట్‌ఫామ్‌గా ఉండడం గమనార్హం. దేశంలో 85 శాతం ఎక్స్ఛేంజ్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలకు స్టార్ ఎంఎఫ్ వీలు కల్పిస్తున్నట్టు బీఎస్ఈ తెలిపింది.

రిటైల్ ద్రవ్యోల్బణం 0.70 శాతం

- నవంబర్‌లో స్వల్ప పెరుగుదల
- కూరగాయలు, గుడ్ల ధరలు అప్

న్యూఢిల్లీ: నవంబర్‌లో నిత్యావసర ధరలు మళ్లీ ఎగిశాయి. రిటైల్ ధరల ఆధారిత సూచీ (రిటైల్ ద్రవ్యోల్బణం/సీపీఐ) నవంబర్‌లో 0.71 శాతానికి పెరిగింది. అక్టోబర్‌లో ఇది రికార్డు కనిష్ట స్థాయి అయిన 0.25 శాతానికి తగ్గడం గమనార్హం. 4 శాతానికి మించకుండా చూడాలన్న ఆర్‌బీఐ లక్షిత పరిధిలోనే వరుసగా పదో నెలలోనూ రిటైల్ ద్రవ్యోల్బణం కొనసాగింది. ముఖ్యంగా కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, దినుసులు, ఇంధనం ధరలు పెరగడం మొత్తం మీద ద్రవ్యోల్బణం ఎగిసేందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) విడుదల చేసిన తాజా గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. ఆహార వస్తు విభాగంలో ద్రవ్యోల్బణం మైనస్ 3.91 శాతంగా (ప్రతి ద్రవ్యోల్బణం) నమోదైంది. అక్టోబర్‌లో ఇది 5.02 శాతంగా ఉంది. ఇంధన విభాగంలో ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 1.98 శాతంగా ఉంటే, నవంబర్‌లో 2.32 శాతానికి పెరిగింది.

1.5 శాతం దాటొచ్చు..

కొన్ని కూరగాయల ధరలు పెరగడంతో డిసెంబర్ నెల ద్రవ్యోల్బణం 1.5 శాతం దాటొచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, వృద్ధి గమనం, వచ్చే బడ్జెట్‌లో ప్రకటించే ద్రవ్య విధాన చర్యలు ఆర్‌బీఐ ఎంపీసీ తదుపరి సమీక్ష (ఫిబ్రవరిలో) నిర్ణయాలను ప్రభావితం చేస్తాయన్నారు.

భారత్ నుంచి 14 వేల పేటెంట్లు

- వచ్చే దశాబ్దకాలంలో మరిన్ని ఆవిష్కరణలు
- శాంసంగ్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత్ నుంచి 14,000 పేటెంట్లను దాఖలు చేసినట్లు శాంసంగ్ వెల్లడించింది. అంతర్జాతీయంగా అర్థవంతమైన నవకల్పనలను ఆవిష్కరించడంలో కొత్త శకానికి భారత్ సారథ్యం వహిస్తుందని ఆశిస్తున్నట్లు దేశీయంగా కార్యకలాపాలు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కంపెనీ తెలిపింది. 'భారత్ నుంచి 14,000 పైగా పేటెంట్లు దాఖలయ్యాయి. తద్వారా గ్లోబల్ ఆవిష్కరణలకు కేంద్రంగా భారత్ స్థానం మరింత పటిష్టం అయింది. రాబోయే దశాబ్దకాలంలో ప్రపంచం కోసం భారత్‌లో డిజైన్ చేసిన, తయారు చేసిన మరిన్ని ఉత్పత్తులు రాబోతున్నాయి' అని శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈవో జేబీ పార్క్ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాల సాకారం దిశగా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. 1995లో టీవీలతో దేశీ మార్కెట్లోకి ప్రవేశించిన శాంసంగ్ క్రమంగా కార్యకలాపాలను విస్తరించింది. చెన్నై, నోయిడాలో రెండు ప్లాంట్లను, ఢిల్లీ, నోయిడా, బెంగళూరులో మూడు పరిశోధన.. అభివృద్ధి కేంద్రాలను, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో డిజైన్ సెంటర్‌ని ఏర్పాటు చేసింది.

బ్యాంక్‌లు, బీమా కంపెనీలకు ర్యాంక్‌లు

ఫిర్యాదుల పరిష్కార తీరు ఆధారంగా కేటాయింపు

న్యూఢిల్లీ: ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ఆర్థిక శాఖ కీలక చర్యకు ఉపక్రమించింది. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ప్రైవేటు బ్యాంక్‌లు, ప్రభుత్వరంగ బీమా సంస్థలకు ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, నాణ్యత ఆధారంగా వాటికి ర్యాంక్‌లు కేటాయించే విధానాన్ని చేపట్టింది. ఈ ప్రక్రియకు ఈ ఏడాది జూన్‌లోనే శ్రీకారం చుట్టగా, బ్యాంక్‌లు, బీమా సంస్థల పనితీరు గణనీయంగా మెరుగుపడినట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ఈ చర్య ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేసినట్టు.. సంస్థలు, కస్టమర్ల మధ్య పారదర్శకమైన సంభాషణలకు వీలు కల్పించినట్టు తెలిపింది. అలాగే, ప్రైవేటు బీమా కంపెనీలకు సైతం ఇదే మాదిరి ర్యాంక్‌లు కేటాయించనుంది. సీపీఆర్‌జీఏఎం పోర్టల్‌పై అందిన ఫిర్యాదుల ఆధారంగా ఎంపిక చేసిన సంస్థలతో సంప్రదింపుల కార్యక్రమాన్ని ఆర్థిక వ్యవహారాల విభాగం డిసెంబర్ నుంచి ప్రారంభించింది. తొలి విడత బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలతో (ఎన్‌బీఎఫ్‌సీలు) సంప్రదింపులను నిర్వహించనున్నట్టు.. ఆర్థిక సేవల రంగంలో ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నట్టు ఆర్థిక శాఖ ప్రకటించింది.

జనవరి నుంచి బెంజ్ కార్ల ధరల పెంపు

- యూరో మారకంలో రూపాయి క్షీణత ప్రభావం
- కొత్త ధరలు జనవరి నుంచి

న్యూఢిల్లీ: ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ తమ కార్ల ధరలు పెంచుతున్నట్టు ప్రకటించింది. యూరో మారకంతో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటంతో కార్ల సరఫరా ఖర్చులు పెరుగుతున్నాయని, దీన్ని భర్తీ చేసేందుకు 2026, జనవరి నుంచి అన్ని కార్లపై 2% ధరలు పెంచుతున్నట్లు ప్రకటనలో తెలిపింది. ''ఈ ఏడాది కరెన్సీ మారకంలో ప్రతికూల పవనాలు ఊహించిన దాని కంటే ఎక్కువ కాలం కొనసాగాయి. యూరో స్థిరంగా రూ.100 మార్కుకు పైనే ఉంది. స్థానిక ఉత్పత్తి కోసం దిగుమతి చేసుకున్న విడిభాగాలు మొదలు కొని, పూర్తిగా నిర్మించిన యూనిట్ల వరకు అన్ని కార్యకలాపాలపైనా దీని ప్రభావం కొనసాగుతోంది. ఫారెక్స్ ఒత్తిళ్లకు అనుగుణంగానే ధరలను 2 శాతానికి పరిమితం చేశాము'' అని మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. స్థానిక విడిభాగాలను కొనుగోలుతో పెరిగిన ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అయితే కార్యకలాపాల నిర్వహణ కోసం కొంత పెంపు తప్పనిసరి అయ్యిందన్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిడి, ఇన్‌పుట్ ఖర్చులు, కమోడిటీ ధరలు, పెరిగిన లాజిస్టిక్ ఖర్చులు కంపెనీ లాభాలపై ఒత్తిడి కలిగిస్తాయన్నారు. అందుకే ధరల భారాన్ని కొంతమేర కస్టమర్లకు బదలీ చేస్తున్నామని అయ్యర్ వివరణ ఇచ్చారు.

ఎంఅండ్ఏ రుణ వ్యాపారంలో ఆచితూచి వెళతాం: ఎస్‌బీఐ

- బహుళజాతి బ్యాంకులతో జట్టు కడతాం
- ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ: కంపెనీలు చేపట్టే విలీనాలు, కొనుగోళ్లకు (ఎంఅండ్ఏ) నిధులు సమకూర్చే వ్యాపారంలో దూకుడుగా కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. కొత్త రుణ విభాగంలోకి అడుగుపెట్టే ముందు జాగ్రత్తలతో, ఆచితూచి ముందుకు వెళుతామన్నారు. ఇందుకు గృహ రుణ వ్యాపారాన్ని ఆయన ప్రస్తావించారు. గృహ రుణాలు సెక్యూర్డ్ అయినప్పటికీ.. పోర్ట్‌ఫోలియో విస్తరణను ఎస్‌బీఐ క్రమబద్ధంగానే చేపట్టినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు రూ.9 లక్షల కోట్లతో గృహ రుణాల విభాగంలో ఎస్‌బీఐ అతి పెద్ద సంస్థగా మారినట్టు శెట్టి చెప్పారు. భారత కంపెనీలు చేపట్టే ఎంఅండ్ఏలకు నిధులు సమకూర్చే వ్యాపారంలోకి బ్యాంకులను అనుమతిస్తూ ఆర్‌బీఐ అక్టోబర్‌లో నిర్ణయం ప్రకటించడం తెలిసిందే. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనల కింద.. బ్యాంకులు కంపెనీల కొనుగోలు విలువలో 70 శాతం వరకు రుణంగా సమకూర్చొచ్చు. ఈ నిర్ణయాన్ని శెట్టి స్వాగతించారు. ఎంఅండ్ఏ రుణ వ్యాపారంలో పనిచేస్తున్న బహుళజాతి బ్యాంకులతో కలసి పనిచేస్తామని చెప్పారు. ఎస్‌బీఐ విదేశీ కార్యాలయాల ద్వారా కొనుగోళ్లకు రుణాలు సమకూర్చడంలో ఇప్పటికే కొంత అనుభవం తమకు ఉన్నట్టు తెలిపారు. కనుక ఈ విభాగంలో అవకాశాలను సొంతం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ధరల పెంపు యోచనలో బీఎమ్‌డబ్ల్యూ

- యూరోమారకంలో రూపాయి క్షీణత ప్రభావం
- సీఈవో హర్దీప్ సింగ్ బ్రార్ వెల్లడి

జైసల్మేర్: యూరో మారకంలో రూపాయి విలువ క్షీణత కారణంగా జనవరి నుంచి కార్ల ధరలు పెంచే యోచనలో ఉన్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. ''అంతర్జాతీయంగా ఫారెక్స్ ఒత్తిళ్లు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. యూరో మారకంలో రూపాయి విలువ ఈ ఏడాది 93-95 స్థాయిలో ఉంటుందని ఆశించాము. అయితే అంచనాలకు మించి ఏకంగా 10% క్షీణించి 103 -105 కి చేరింది. ఈ పరిణామం కంపెనీ లాభదాయకతపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే జనవరి నుంచి ధరలను పెంచే యోచనలో ఉన్నాము'' అని పేర్కొన్నారు. లగ్జరీ కార్లపై కొత్త జీఎస్టీ 40% ఉన్నప్పటికీ.., ధరల పెంపు అంశాన్ని పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఫారెక్స్ ఒత్తిళ్లు తప్ప, కార్ల ధరల పెంపునకు ఇతర కారణాలు లేవన్నారు. ఇప్పటికే ఈ ఏడాది సెప్టెంబర్‌లో తమ అన్ని మోడళ్లపై కార్లపై 3% మేర ధరలు పెంచింది. ఫారెక్స్ ఒత్తిళ్లు, అంతర్జాతీయ సప్లై సమస్యలు, ఉత్పత్తి వ్యయం, నిర్వహణ ఖర్చులు ధరల పెంపునకు కారణాలుగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం భారత మార్కెట్లో బీఎండబ్ల్యూ ప్రారంభ ధర రూ.45.3 లక్షల 2 సిరీస్ గ్రాన్ కూపే నుంచి ప్రీమియం ధర రూ.2.54 కోట్ల విలువైన ఎక్స్ఎం మోడల్ లగ్జరీ కార్లను విక్రయిస్తోంది.

రెట్టింపు కానున్న కార్పొరేట్ బాండ్ మార్కెట్

- 2030 నాటికి 100 లక్షల కోట్లు
- నీతి ఆయోగ్ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ బాండ్ మార్కెట్ 2030 నాటికి 100-120 లక్షల కోట్లకు చేరుకుంటుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది. గత దశాబ్ద కాలంలో ఇది గణనీయంగా వృద్ధి చెందినట్టు తెలిపింది. 2015 మార్చి నాటికి రూ.17.5 లక్షల కోట్లుగా ఉన్న కార్పొరేట్ బాండ్ మార్కెట్ 2025 మార్చి నాటికి రూ.53.6 లక్షల కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. ఏటా 12 శాతం చొప్పున పెరిగినట్టు వివరించింది. విధానపరమైన ప్రాధాన్యం, టెక్నాలజీ ఆవిష్కరణలు, సామరస్యంతో కూడిన నియంత్రణలతో భారత కార్పొరేట్ బాండ్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందగలదని, దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా మారుతుందని పేర్కొంది. గత దశాబ్ద కాలంలో భారత్ తన డెట్ మార్కెట్ సదుపాయాల విస్తరణ, నియంత్రిత కార్యాచరణ పరంగా చెప్పుకోతగ్గ కృషి చేసిందని.. అయినప్పటికీ పోటీ దేశాలతో పోల్చి చూస్తే భారత్ తన పూర్తి సామర్థ్యాలను ఇంకా చేరుకోవాల్సి ఉందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం తెలిపారు. జీడీపీలో కార్పొరేట్ బాండ్ మార్కెట్ ప్రస్తుతం 15-16 శాతంగా ఉందని, ఇక్కడి నుంచి గణనీయంగా పెరిగేందుకు అవకాశాలున్నట్టు చెప్పారు. మార్కెట్ సదుపాయాల పరంగా సంస్కరణలను కొనసాగించడం, రిస్క్ నిర్వహణ టూల్స్, ఇన్వెస్టర్లలో వైవిధ్యం, రుణ వితరణ పెంపు ద్వారా ప్రైవేటు పెట్టుబడులకు ప్రేరణనివ్వడమే కాకుండా.. జాతీయ వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని అభిప్రాయపడ్డారు.

తయారీ హబ్‌గా భారత్

- జీడీపీలో వాటా 25 శాతానికి చేరాలి
- ప్రస్తుతం ఇది 17 శాతం
- బీసీజీ, జెడ్47 నివేదిక



న్యూఢిల్లీ: భారత్ 2047 నాటికి తయారీ దిగ్గజంగా మారాలంటే జీడీపీలో ఈ రంగం వాటా ప్రస్తుతమున్న 17 శాతం నుంచి 25 శాతానికి చేర్చాలని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ), జెడ్47 సంయుక్త నివేదిక సూచించింది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన భారత్‌లో తయారీ, ఆత్మనిర్భర్‌భారత్, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)తో దేశీ సామర్థ్యాలు వేగంగా విస్తరిస్తున్నట్టు పేర్కొంది. ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఆటోమోటివ్-ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధనం, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో 2047 నాటికి 25 ట్రిలియన్ డాలర్ల అవకాశాలున్నట్టు తెలిపింది. రానున్న కాలంలో తయారీ రంగంలో భారత్ వృద్ధికి ఈ రంగాలు కీలకంగా మారనున్నట్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. వీటికితోడు బలమైన జీడీపీ వృద్ధి, పారిశ్రామిక మద్దతు, స్పష్టమైన విధానాలు/పెట్టుబడులతో తయారీ రంగాన్ని బలోపేతం చేసుకోవచ్చని పేర్కొంది. ఆవిష్కరణలను వేగవంతం చేయడం, పోటీతత్వాన్ని పెంచడం, టెక్నాలజీ అమలు ద్వారా సామర్థ్యాలను విస్తృతం చేయడం ద్వారా తయారీ రంగానికి బలమైన పునాదులు వేయాలని సూచించింది. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం కోసం.. రక్షణ, ఈవీ, సెమీకండక్టర్లకు సంబంధించి ప్రాంతీయ తయారీ క్లస్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ నివేదిక పేర్కొంది. నోయిడా-చెన్నై-హోసూర్, దొలెరా కారిడార్లు ఇప్పటికే ఫలితాలను చూపిస్తున్నట్టు తెలిపింది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తుది మార్కెట్ 2022లో 33 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2030 నాటికి 117 డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసింది. రక్షణ రంగానికి 2025-26లో కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉండగా, దేశీ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వచ్చే దశాబ్దంలో కేటాయింపులు రెట్టింపు కానున్నట్టు పేర్కొంది.

ఉద్యోగాలను ఏఐ లాక్కోదు

- పింక్ స్లిప్‌నకు నైపుణ్యాలేమే కారణం
- మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్

ముంబై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఉద్యోగాలను కొల్లగొట్టబోదని గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ పేర్కొన్నారు. నేర్చుకోవడానికి విముఖత చూపడం మాత్రమే ఇందుకు కారణమవుతుందని స్పష్టం చేశారు. ఆధునికతరం టెక్నాలజీని విస్తృతస్థాయిలో వినియోగించుకుంటే టాస్క్‌లను విడగొడుతుందని తెలియజేశారు. నిలకడైన, దీర్ఘకాలిక ఉద్యోగాల విషయంలో మనది చివరితరమని వ్యాఖ్యానించారు. ఏఐ ఉపాధికి విఘాతం కలిగిస్తుందని తాను భావించడం లేదని చెప్పారు. నిజానికి ఏఐ పనులను విభజిస్తుందని మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్ సందర్భంగా తెలియజేశారు. కొత్త ఏఐ శకంలో నిజమైన పింక్ స్లిప్‌కు అర్థం మనం ఆందోళన చెందుతున్న ఆటోమేషన్‌కాదని, నైపుణ్యాలను పెంచుకోవడానికి ఆసక్తి చూపకపోవడమేనని వివరించారు. కాగా.. ఏఐ మోడళ్లు కమోడిటీగా అవతరిస్తున్న నేపథ్యంలో డేటా అత్యంత వ్యూహాత్మక ఆస్తిగా మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల పేర్కొన్నారు. అన్నిటా ఏఐ విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో డేటాకు అత్యధిక ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. అయితే డేటాను ఏఐకు అనుగుణంగా వినియోగించుకోవలసి ఉంటుందని వివరించారు. తమ కంపెనీ ఏఐ టూల్స్‌ను సైబర్ సేఫ్టీ కోసం మహారాష్ట్ర వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

వినేశ్ మళ్లీ వస్తోంది!

- రిటైర్మెంట్‌ను పక్కన పెట్టిన భారత మహిళా స్టార్ రెజ్లర్
- 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన



న్యూఢిల్లీ: భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్... రిటైర్మెంట్‌ను పక్కనపెట్టి తిరిగి బరిలోకి దిగనున్నట్లు వెల్లడించింది. ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో పతకాలు సాధించిన 31 ఏళ్ల వినేశ్ ఫొగాట్... మూడు సార్లు విశ్వ క్రీడల బరిలోకి దిగినా... ఒక్కసారి కూడా పతకం సాధించలేకపోయింది. 2024 పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించిన వినేశ్ ఫొగాట్... 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హతకు గురైంది. తుదిపోరుకు చేరినందుకు రజత పతకం ఇవ్వాలని కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో వినేశ్ అప్పీల్ చేసుకున్నా... భారత రెజ్లర్‌కు ప్రతికూల ఫలితం దక్కింది. అయితే 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో తన చిరకాల స్వప్నం నెరవేర్చుకునేందుకు తిరిగి బరిలోకి దిగాలని వినేశ్ నిర్ణయించుకుంది. తనలో పోటీ పడాలనే తపన ఇంకా తగ్గలేదని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. పారిస్ ఒలింపిక్స్ అనంతరం నాటకీయ పరిణామాల మధ్య రెజ్లింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ ఫొగాట్... రాజకీయాల్లో చేరింది. హరియాణాలోని జులానా నియోజకవర్గం నుంచి పోటీ చేసి శాసనసభకు ఎన్నికైంది. 'పారిస్‌తోనే నీ ప్రయాణం ముగిసిందా... అని ప్రజలు నన్ను తరచూ అడుగుతున్నారు. వాటికి నా వద్ద సమాధానం లేదు. ఒత్తిడి, అంచనాల భారం కారణంగా... మ్యాట్‌కు, నా ఆశయానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇన్నేళ్లలో ఇప్పుడే కాస్త విరామం లభించింది. నా క్రీడా ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. ఎన్నో త్యాగాలు, ఎన్నో సంస్కరణలు వీటన్నిటి మధ్య నాకు ఒక విషయం అర్థమైంది. నేనింకా రెజ్లింగ్‌ను ప్రేమిస్తున్నాను. నేను మళ్లీ పోటీ పడాలనుకుంటున్నాను' అని వినేశ్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. భారత రెజ్లర్ సోమ్‌వీర్ రాఠీని వివాహమాడిన వినేశ్ ఫొగాట్... ఈ ఏడాది జులైలో బాబుకు జన్మనిచ్చింది. తనలో ఇంకా గెలవాలనే కసి తగ్గలేదని... అలసట, ఇతర అంశాల మధ్య దాన్ని తాను గుర్తించలేకపోయానని వినేశ్ చెప్పుకొచ్చింది. క్రమశిక్షణ, సాధన, పోరాటం తన జీవితంలో అంతర్భాగమని... వాటిని ఎప్పటికీ వదులుకోలేనని వినేశ్ వివరించింది. 2028లో లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ కోసం సాధన ప్రారంభించనున్నట్లు వినేశ్ తెలిపింది. 'ఈ ప్రయాణంలో నేను ఒంటరిని కాదు. నా జట్టులో నా కుమారుడు కూడా చేరుతున్నాడు. ఇది నాకు అతిపెద్ద ప్రేరణ. లాస్ ఏంజెలిస్ విశ్వ క్రీడల్లో నా మొదటి చీర్‌లీడర్ అతడే' అని వినేశ్ తన పోస్ట్‌లో పేర్కొంది.

సెమీఫైనల్లో భారత్

అనాహత్ సింగ్

చెన్నై: ఆతిథ్య భారత జట్టు స్క్వాష్ ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3–0తో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. జోష్నా చినప్ప 7–4, 7–4, 7–2తో టీజెన్ రసెల్‌పై గెలుపొందగా, అభయ్ సింగ్ 7–1, 7–6, 7–1తో డెవాల్స్ వాన్ నికెర్క్‌పై గెలిచాడు. అనాహత్ సింగ్ 7–3, 7–3, 7–4తో హేలీ వార్డ్‌ను చిత్తు చేసింది. సెమీస్‌లో ఈజిప్ట్‌తో భారత్ తలపడుతుంది. క్వార్టర్స్‌లో ఈజిప్ట్ 3–0తో ఆస్ట్రేలియాపై గెలుపొందింది. లీగ్ దశలో భారత జట్టు స్విట్జర్లాండ్, బ్రెజిల్‌లపై విజయంతో నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఇప్పటివరకు ప్రపంచకప్ చరిత్రలో భారత్ 2023లో గెలిచిన కాంస్య పతకమే అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది.

డఫీ పాంచ్ పటాకా

వెస్టిండీస్‌తో రెండో టెస్టులో న్యూజిలాండ్ ఘనవిజయం

వెల్లింగ్టన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న న్యూజిలాండ్ జట్టు వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ముగిసిన రెండో టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇరు జట్ల మధ్య తొలి టెస్టు 'డ్రా' కాగా... ప్రస్తుతం సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0తో ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 32/2తో శుక్రవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ జట్టు చివరకు 46.2 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. కవెమ్ హెడ్జ్ (75 బంతుల్లో 35; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... జస్టిన్ గ్రేవ్స్ (25; 3 ఫోర్లు), బ్రాండన్ కింగ్ (22; 4 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జాకబ్ డఫీ 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. మిచెల్ రే 3 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ టిక్నర్ రెండో ఇన్నింగ్స్‌లో అందుబాటులో లేకపోగా... డఫీ చక్కటి బౌలింగ్‌తో కట్టిపడేశాడు. పదునైన బంతులతో కరీబియన్‌ల ఆట కట్టించాడు. ఈ క్రమంలో కెరీర్‌లో రెండో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. కెప్టెన్ రోస్టన్ చేజ్ (2), షై హోప్ (5), అండర్సన్ ఫిలిప్ (0), జాన్ క్యాంప్‌బెల్ (14), ఇమ్లాచ్ (5) విఫలమవడంతో విండీస్ స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. తొలి టెస్టులో అద్వితీయమైన పోరాటంతో అందరి దృష్టిని ఆకర్షించిన విండీస్... ఈ మ్యాచ్‌లో దాన్ని కొనసాగించలేకపోయింది. తొలి ఇన్నింగ్స్ లో 73 పరుగుల ఆధిక్యాన్ని కోల్పోయిన కరీబియన్ జట్టు... ప్రత్యర్థి ముందు కేవలం 56 పరుగుల లక్ష్యాన్ని నిలపగలిగింది. ఛేదనలో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 57 పరుగులు చేసి నెగ్గింది. డెవాన్ కాన్వే (28 నాటౌట్; 6 ఫోర్లు), కేన్ విలియమ్సన్ (16 నాటౌట్; 4 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేయగా... న్యూజిలాండ్ 278/9 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్డ్ చేసింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 18 నుంచి మూడో టెస్టు ప్రారంభంకానుంది.

సలీల్ అరోరా సూపర్ సెంచరీ

45 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లతో 125 నాటౌట్

- అయినా పంజాబ్‌కు తప్పని ఓటమి
- 6 వికెట్ల తేడాతో జార్ఖండ్ గెలుపు
- మరో మ్యాచ్‌లో రాజస్తాన్‌పై హరియాణా విజయం
- ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నమెంట్ 'సూపర్ లీగ్'

సలీల్ అరోరా

అంబి (మహారాష్ట్ర): పంజాబ్ యువ బ్యాటర్ సలీల్ అరోరా (45 బంతుల్లో 125 నాటౌట్; 9 ఫోర్లు, 11 సిక్స్‌లు) సూపర్ సెంచరీతో చెలరేగినా... పంజాబ్ జట్టుకు పరాజయం తప్పలేదు. దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 'సూపర్ లీగ్' గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టు 6 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా... అతడు లేని లోటును అరోరా భర్తీ చేశాడు. బంతి ఎక్కడపడ్డా దాని గమ్యస్థానం బౌండరీనే అన్న చందంగా చెలరేగిపోయాడు. మిగిలిన వారి నుంచి చెప్పుకోదగ్గ తోడ్పాటు లభించకపోయినా... అరోరా ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో అతడు 39 బంతుల్లోనే సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (10), హర్‌నూర్ సింగ్ (13), సాన్‌వీర్ సింగ్ (10), రమణ్‌దీప్ సింగ్ (8) విఫలం కాగా... అన్‌మోల్ ప్రీత్ సింగ్ (23), నమన్ ధిర్ (27) ఫర్వాలేదనిపించారు. జార్ఖండ్ బౌలర్లలో సుశాంత్ మిశ్రా, బాలకృష్ణ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో జార్ఖండ్ జట్టు 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 237 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 47; 8 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ సింగ్ (18; 1 ఫోర్, 2 సిక్స్‌లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చారు. సాధించాల్సిన రన్‌రేట్ కొండంత ఉన్న జార్ఖండ్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' కుమార్ కుశాగ్ర (42 బంతుల్లో 86 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... చివర్లో అనుకూల్ రాయ్ (17 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), పంకజ్ కుమార్ (18 బంతుల్లో 39 నాటౌట్, 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. జార్ఖండ్ బ్యాటర్లలో రాబిన్ మింజ్ (2) మినహా తక్కిన వాళ్లంతా రెండొందల పైచిలుకు స్ట్రయిక్ రేట్‌తో పరుగులు రాబట్టడం విశేషం. ఐపీఎల్ మినీ వేలానికి ముందు యువ ఆటగాళ్లు తమ పవర్‌హిట్టింగ్‌తో ఫ్రాంచైజీల దృష్టిలో పడే ప్రయత్నంలో ఉన్నారు.

అంకిత్ కుమార్ అర్ధసెంచరీ

'సూపర్ లీగ్' గ్రూప్ 'బి'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో హరియాణా జట్టు 7 వికెట్ల తేడాతో రాజస్తాన్‌పై గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. మహిపాల్ లోమ్రర్ (39 బంతుల్లో 37 నాటౌట్; 1 ఫోర్), శుభమ్ గర్వాల్ (27 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. దీపక్ హుడా (0), కునాల్ సింగ్ రాథోడ్ (4), కరణ్ లాంబా (1), కెప్టెన్ మానవ్ సుతార్ (15) విఫలమయ్యారు. హరియాణా బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాంత్ భరద్వాజ్, అన్షుల్ కంబోజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో హరియాణా 16.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ (41 బంతుల్లో 60; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో మెరవగా... అర్ష్ రంగా (12 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), పార్థ్ వత్స్ (29 బంతుల్లో 27; 1 ఫోర్ 1 సిక్స్) రాణించారు. ఆదివారం జరగనున్న తదుపరి మ్యాచ్‌ల్లో ముంబైతో హరియాణా, ఆంధ్రతో పంజాబ్, హైదరాబాద్‌తో రాజస్తాన్, మధ్యప్రదేశ్‌తో జార్ఖండ్ తలపడతాయి.

భారత్‌కు పదో స్థానం

- వర్గీకరణ మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి
- మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ

సాంటియాగో (చిలీ): మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు పదో స్థానంతో ముగించింది. శుక్రవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో జ్యోతి సింగ్ సారథ్యంలోని భారత జట్టు 1–2 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున కనిక సివాచ్ (41వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... స్పెయిన్ తరఫున నటాలియా విలనోవా (16వ నిమిషంలో), ఎస్తెర్ కనాలెస్ (36వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. మ్యాచ్ తొలి క్వార్టర్‌లో ఇరు జట్ల ప్లేయర్లు హోరాహోరీగా పోరాడినా... ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. రెండో క్వార్టర్ ఆరంభంలోనే నటాలియా గోల్ చేయడంతో స్పెయిన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. భారత జట్టు నుంచి కొన్ని చక్కటి ప్రయత్నాలు కనిపించినా... ఫినిషింగ్ లోపం కారణంగా అవి గోల్స్‌గా మారలేకపోయాయి. మూడో క్వార్టర్‌లో సోనమ్ చక్కటి గోల్ సాధించినా... స్పెయిన్ వీడియో రిఫరల్ ద్వారా ఆ గోల్ నిబంధనలకు విరుద్ధమని తేల్చింది. ఈ క్రమంలోనే స్పెయిన్ మరో గోల్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచుకోగా... కాసేపటికి కనిక పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఖాతా తెరిచింది. ఇక ఆఖరి క్వార్టర్‌లో స్పెయిన్ ఆధిక్యాన్ని కాపాడుకోగా... భారత జట్టు మరో గోల్ సాధించలేక ఓటమి వైపు నిలిచింది.

హైదరాబాద్‌లో హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్

వచ్చే మార్చిలో మహిళల మెగా టోర్నీ

సాక్షి, హైదరాబాద్: మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే క్వాలిఫయింగ్ పోటీలకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఇందులో భాగంగా క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు హైదరాబాద్ సహా మూడు నగరాలు శాంటియాగో (చిలీ), ఇస్మాయిలియా (ఈజిప్ట్)లలో నిర్వహిస్తారు. ప్రపంచకప్‌కు అర్హత సంపాదించేందుకు భారత్‌కు ఇది ఆఖరి అవకాశం. ఇంగ్లండ్, స్కాట్లాండ్, కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆస్ట్రియాలతో భారత్ క్వాలిఫయింగ్ పోటీలు ఆడనుంది. హైదరాబాద్ అంచెలో ఎనిమిది జట్ల మధ్య క్వాలిఫయింగ్ పోటీలు మార్చి 8 నుంచి 14 వరకు జరుగుతాయి. ఈ క్వాలిఫయర్స్ నుంచి టాప్–3 జట్లు ప్రధాన ప్రపంచకప్‌కు అర్హత పొందుతాయి. బెల్జియం, నెదర్లాండ్స్ జట్లు ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యమిస్తాయి. పురుషుల విభాగంలో ఇదివరకే భారత్ ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. ఆసియా కప్‌లో విజేతగా నిలువడంతోనే భారత్‌కు ప్రపంచకప్ బెర్తు లభించింది.

తరుణ్ పరాజయం

కటక్: ఒడిశా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్, టాప్ సీడ్ తరుణ్ మన్నేపల్లి పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తరుణ్ 9–21, 20–22తో మొహమ్మద్ యూసుఫ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు. 49 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో తరుణ్ తొలి గేమ్‌లో తేలిపోయినా... రెండో గేమ్‌లో ప్రత్యర్థికి గట్టిపోటీ ఇచ్చాడు. భారత్‌కే చెందిన రౌనక్ చౌహాన్, కిరణ్ జార్జి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్స్‌లో రౌనక్ 21–19, 22–20తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై, కిరణ్ జార్జి 21–11, 21–17తో రిత్విక్ (భారత్)పై గెలుపొందారు.

మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు టైటిల్ ఖాయమైంది. భారత్‌కు చెందిన నలుగురు క్రీడాకారిణులు ఉన్నతి హుడా, ఇషారాణి బారువా, తాన్యా హేమంత్, తస్నిమ్ మీర్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

జర్మనీలోని హెర్న్ నగరంలో క్రిస్మస్ ఫన్‌ఫెయిర్‌లో ఏర్పాటైన మంచును విరజిమ్మే క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలోని ఓ వంతెనకు విద్యుద్దీపాలతో అలంకరణ

అలాంటి వాటిని మేం పట్టించుకోం

మీడియాలో వచ్చే అసత్య కథనాలపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులపై మీడియాలో వచ్చే అసమగ్ర, సత్యదూరమైన కథనాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటివి ప్రజాభిప్రాయంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. ప్రచారం కోసమో సొంత అభిప్రాయాన్ని తెలిపేందుకో వచ్చే ఇటువంటి కథనాల మాయలో తాము పడబోమని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌కు పంపించిన కొందరు వ్యక్తులను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చే కేసు విషయమై శుక్రవారం చేపట్టిన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విజయ్ మాల్యాబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిన మేరకు.. ఢిల్లీలోని రోహిణి ప్రాంతానికి చెందిన సునాలి ఖాతూన్ అనే గర్భిణీతోపాటు ఆమె 8 ఏళ్ల కుమారుడిని అధికారులు బంగ్లాదేశ్ నుంచి పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్‌లో ఉంటున్న తండ్రి వద్దకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా లాయర్లు ధర్మాసనానికి నివేదించారు. ఆమెకు వైద్యసాయం అందుతోందని కూడా తెలిపారు. సరైన విచారణ జరపకుండానే కొందరిని బంగ్లాదేశ్‌కు పంపించారంటూ కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సవాల్ చేస్తూ కేంద్రం వేసిన పిటిషన్‌పై జనవరి 6వ తేదీన విచారణ చేపడతామంది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. సరైన విచారణ చేపట్టకుండానే బంగ్లాదేశ్ పౌరులంటూ కేంద్రం కొందరిని బలవంతంగా పంపించి వేసిందంటూ ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేసే ఉద్దేశంతోనే ఇలాంటివి వస్తున్నాయని వ్యాఖ్యానించారు. అయితే, ఇలా ప్రచారం కోసం చేసే స్టంట్లకు తాము దూరంగా ఉంటామని స్పష్టం చేసిన ధర్మాసనం..వీటిని పట్టించుకోవద్దని తుషార్ మెహతాను కూడా కోరింది. 'వాస్తవానికి న్యాయ వ్యవస్థపై మీడియా ఇలా **వ్యాఖ్యానా**లను చేయరాదు. మీరు ఇటువం**టి అంశా**లను ప్రస్తావించడం మంచిదే. **సంబంధిత** కథనంతో మీకు ఆవేదన కలగ**డం పరిగణ**నలోకి తీసుకోవాల్సిన విషయం'**అని ధర్మా**సనం తెలిపింది. అమెరికా, **యూకేల్లో** వలసలకు వ్యతిరేకంగా **తీసుకున్న** చర్యలపై అంతర్జాతీయంగా **కథనాలు** వస్తున్నాయని, సోషల్ మీడియా, **ఇతర** వేదికలపై చర్చోపచర్చలు జరు**గుతు**న్నాయని సీనియర్ లాయర్ **కపిల్** సిబాల్ ధర్మాసనం ఎదుట **వ్యాఖ్యా**నించారు. ఢిల్లీలోని రోహిణి **ప్రాం**తంలో 20 ఏళ్లుగా ఉంటున్న **స్వీటీ** బీబీ, ఆమె భర్త, ఇద్దరు పిల్ల**లను** కూడా అధికారులు బంగ్లాదేశ్‌**లోకి** పంపించారని మరో లాయర్ సంజయ్ హెగ్డే ప్రస్తావించగా, ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దృష్టికి తీసుకెళ్లాలని ధర్మాసనం కోరింది.

ఇలాంటి కేసులతో పరువు తీయకండి

పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) పరిధి నుంచి మైనారిటీ స్కూళ్లను మినహాయిస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి కేసులతో న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చవద్దని హెచ్చరించింది. న్యాయవ్యవస్థను కూల్చివేద్దామనుకుంటున్నారా అంటూ దుయ్యబట్టింది. పిటిషనర్‌ను రూ.లక్ష జరిమానా విధించిన న్యాయస్థానం.. ఇలాంటి కేసులు వేయాలనుకునే వారికి ఇదో గుణపాఠం కావాలని వ్యాఖ్యానించింది. ఆర్టీఈ పరిధి నుంచి మైనారిటీ స్కూళ్లకు మినహాయింపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టీఈ లక్ష్యాలకు వ్యతిరేకమని పేర్కొంటూ యునైటెడ్ వాయిస్ ఫర్ ఎడ్యుకేషన్ ఫోరం అనే ఎన్జీవో వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'మీరు సుప్రీంకోర్టులో ఇలాంటి కేసును వేసి మాకు తీవ్ర ఆగ్రహం తెప్పించారు. ఇలాంటి కేసులు దేశ న్యాయ వ్యవస్థ స్థాయిని తగ్గించేవి. ఈ కేసు తీవ్రత ఏమిటో మీకు తెలియదు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రిట్ వేసినందుకు వాస్తవానికి ధిక్కారం కింద చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, ఇప్పటికి వదిలేస్తున్నాం. లక్ష రూపాయల జరిమానాతో సరిపెడుతున్నాం'అంటూ పిటిషనర్‌పై నిప్పులు చెరిగింది. ఇటువంటి కేసులు వేయాలని సలహాలిచ్చే లాయర్లపైనా జరిమానా విధించవలసి ఉంటుందంటూ తీవ్ర హెచ్చరికలు చేసింది. సుప్రీంకోర్టు 2014లో వెలువరించిన తీర్పు ప్రకారం ..విద్యా హక్కు చట్టం నిబంధనలు మైనారిటీ స్కూళ్లకు వర్తించవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 30(1) మత, భాషాపరమైన మైనారిటీలు సొంతంగా విద్యాసంస్థలను నెలకొల్పుకుని, వాటిని స్వయంగా నిర్వహించుకునేందుకు వీలు కల్పిస్తోంది.

మాట నిలబడింది.. మరణం ఓడింది!

అహ్మదాబాద్‌లోని కొత్త ఇంట్లో ప్రశాంతంగా కూర్చున్న 61 ఏళ్ల గిర్ధర్‌భాయ్ జిరావాలా కళ్ల ముందు.. విషాద జ్ఞాపకాలు ఒకేసారి మెదిలాయి. వజ్రాల పాలిషింగ్ కార్మికునిగా కష్టపడి జీవితాన్ని నెట్టుకొచ్చిన ఆయన, ప్రస్తుత సొంత ఇంటిని, కొత్త ఫర్నిచర్‌ను చూస్తున్న ప్రతిసారీ, గుండెలో ఏదో తెలియని భారం. ఎందుకంటే, ఇది ఆయన కష్టంతో కొనుక్కున్న ఇల్లు కాదు. అది.. మరణానంతరం ఆయన పెద్ద కొడుకు మహేష్ జిరావాలా నెరవేర్చిన వాగ్దానం. కొద్ది రోజుల ముందు, గిర్ధర్‌భాయ్‌కి గుండెపోటు వచ్చింది. అప్పటివరకు కుటుంబంపై ఉన్న కొంత అప్పుల భారం, నరోదా ప్రాంతంలో అద్దె ఇంట్లో ఆరుగురు సభ్యుల జీవితం.. ఇవన్నీ ఆయనకు నిద్ర పట్టనివ్వలేదు.

తండ్రి సొంతింటి కల నెరవేర్చిన బిడ్డ

- కొడుకు మరణానంతరం కార్యరూపం
- అహ్మదాబాద్ విమాన ప్రమాదం మిగిల్చిన జ్ఞాపకం

నేనున్నాను నాన్నా..

కానీ, 34 ఏళ్ల సినీ నిర్మాత మహేష్, అన్నీ తానై తండ్రిని చూసుకునేవాడు. తండ్రి బాధను చూసి తట్టుకోలేక, ఒక నిర్ణయం తీసుకున్నాడు. 'నాన్నా! మీరు ఇకపై పనికి వెళ్లొద్దు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకోండి. నా తాజా సినిమాల నుంచి మంచి ఆదాయం వస్తుంది, దీపావళి లోపు అప్పులన్నీ తీర్చేసి, కొత్త ఇంటిని కొనుగోలు చేస్తాను'.. అని గట్టిగా మాటిచ్చాడు.

ఆకాశం నుంచి దిగిన మృత్యువు

అప్పటికి మహేష్.. హేతల్‌ను వివాహం చేసుకుని కేవలం మూడు నెలలే అయింది. కొత్త జీవితం, పెద్ద కలలు.. కుటుంబమంతా ఆశగా దీపావళి పండుగ కోసం ఎదురుచూస్తోంది. కానీ, ఆశలకు ఆయుష్షు తక్కువైంది. జూన్ 12వ తేదీ.. విధి వక్రీకరించింది. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే మెడికల్ కాలేజ్ హాస్టల్ భవనంపై కుప్పకూలి, అగ్నికీలల్లో చిక్కుకుంది. ఆ భయంకరమైన విషాదంలో విమానంలోని ప్రయాణికులే కాక, నేల మీదున్న 19 మంది అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. హాస్టల్ పక్కన రోడ్డుపై నుంచి వెళ్తున్న మహేష్ జిరావాలా కూడా ఆ ప్రమాదంలో దుర్మరణం చెందాడు.

మరణం తర్వాత నెరవేరిన కల

మహేష్ మరణం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచినా, అతని వాగ్దానాన్ని మాత్రం మరిచిపోలేదు. విమాన ప్రమాదంలో పరిహారంగా ఎయిర్ ఇండియా, టాటా గ్రూప్ నుంచి మహేష్ కుటుంబానికి రూ.1.25 కోట్లు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా హేతల్‌కు పరిహారంగా రూ.4 లక్షలు లభించాయి. మొత్తంగా అందిన రూ.1.29 కోట్ల నుంచి, మహేష్ భార్య హేతల్ తన వాటా కింద రూ.54 లక్షలు తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మిగిలిన రూ.75 లక్షలు గిర్ధర్‌భాయ్ చేతికొచ్చాయి.

కొడుకు కల నెరవేర్చాను..

కళ్లలో వేదన సుడులు తిరుగుతున్నా, గిర్ధర్‌భాయ్ మనసులో తన కొడుకు కోరికను నెరవేర్చాలనే తపన బలంగా ఉంది. 'ఆ రూ.75 లక్షలతో, ముందుగా మహేష్ కలలు గన్నట్టు రూ.15 లక్షల అప్పును తీర్చేశాను. ఆ తర్వాత, రూ.45 లక్షలతో ఇంటిని కొనుగోలు చేశాను.. ఇలా నా కొడుకు కోరికను నెరవేర్చాను'.. అని గిర్ధర్‌భాయ్ చెప్పారు. కొత్త ఇంట్లో ఫర్నిచర్ కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసి, మిగిలిన రూ.5 లక్షలను తన మనవరాలి (తమ్ముడు కార్తీక్ కూతురు) భవిష్యత్తు కోసం పక్కన పెట్టారు. మహేష్ ఆ చిన్నారికి ఆరేళ్లు రాగానే దత్తత తీసుకోవాలని కలలు కనేవాడు. 'ఆ రూ.75 లక్షల్లో ఇప్పుడు నా దగ్గర ఏమీ మిగలకపోయినా, చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే నా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇకపై పనిచేయలేను. నా కొడుకు మరణం తర్వాత కూడా మా కుటుంబానికి గౌరవాన్ని అందించాడు'.. అని వణుకుతున్న గొంతుతో గిర్ధర్‌భాయ్ చెప్పారు. ఆకాశం నుంచి దిగిన మృత్యువు మహేష్‌ను దూరం చేసింది. కానీ, ఆ బిడ్డ త్యాగం ఒక తండ్రికి.. ఒక కుటుంబానికి ఆర్థిక ఆసరా కల్పించింది. సొంత ఇంటి కల నెరవేర్చి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. ఇది ప్రేమ.. వాగ్దానం ముందు మరణం కూడా ఓడిపోయిన విషాదగాథ.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆ ఎంపీపై చర్యలు తీసుకోవాల్సిందే

లోకసభ స్పీకర్‌కు అనురాగ్ ఠాకూర్ లిఖితపూర్వక ఫిర్యాదు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సౌగతా రాయ్ ఈ–సిగరెట్ తాగుతూ దొరికిపోవడం వివాదాస్పదంగా మారింది. దీనిపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సౌగతా రాయ్ పేరును నేరుగా ప్రస్తావించకుండా సదరు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సౌగతా రాయ్ గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో నిషేధిత ఈ–సిగరెట్ తాగుతూ కనిపించారు. అనురాగ్ ఠాకూర్ ఈ అంశాన్ని ఆదేరోజు లోక్‌సభలో ప్రస్తావించారు. పవిత్రమైన పార్లమెంట్‌లో సిగరెట్ తాగడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సౌగతా రాయ్‌పై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. దాంతో అనురాగ్ ఠాకూర్ శుక్రవారం లిఖిపూర్వక ఫిర్యాదు అందించారు. నిషేధిత సిగరెట్ తాగడం చట్టప్రకారం తీవ్రమైన నేరమని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్లమెంట్ గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరించారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీపై మండిపడ్డారు. యువతకు ప్రమాదకరమైన సందేశం ఇచ్చారని ధ్వజమెత్తారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నిందితుడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ఈ–సిగరెట్లను ప్రభుత్వం కొన్నేళ్ల క్రితమే నిషేధించింది. ఇదిలా ఉండగా, ఈ–సిగరెట్ తాగడం చిన్న విషయమని, దీనిపై రాద్ధాంతం అవసరం లేదని సౌగతా రాయ్ ఇప్పటికే తేల్చిచెప్పారు. మరోవైపు అనురాగ్ ఠాకూర్ తీరును తృణమూల్ కాంగ్రెస్ మరో ఎంపీ కీర్తి ఆజాద్ తప్పుపట్టారు. లిఖితపూర్వక ఫిర్యాదులో సౌగతా రాయ్ పేరు ఎందుకు ప్రస్తావించలేదని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు.

3-6 ఏళ్ల చిన్నారుల బాధ్యతను

ప్రభుత్వమే తీసుకోవాలి

రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టిన సుధా మూర్తి

న్యూఢిల్లీ: దేశంలోని 3–6 ఏళ్ల మధ్య చిన్నారుల సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని రాజ్యసభ నామినేటెడ్ సభ్యురాలు సుధా మూర్తి కోరారు. ఈ చిన్నారులకు ఉచిత విద్య, సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వాలే చేపట్టాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21బీ సవరించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రైవేట్ బిల్లును శుక్రవారం ఆమె రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 'చిన్నారులే మనందరి భవిష్యత్తు. వారు ఉదయించే సూర్యుని వంటి వారు. ప్రారంభ విద్య వారి జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతమున్న 6– 14 ఏళ్లకు బదులుగా 3– 14 ఏళ్లకు ప్రభుత్వమే ఉచితంగా విద్య, సంరక్షణను అందించేందుకు వీలు కల్పించేలా చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా'అని రాజ్యసభలో ఆమె తెలిపారు. చిన్నారులకు మంచి విద్యనందించడం ఎంతో కీలకమని నూతన విద్యా విధానం కూడా చెబుతోందన్నారు.

ఆరుగురికి 20 ఏళ్ల జైలు శిక్ష

మలయాళ నటిపై గ్యాంగ్ రేప్ కేసులో ఎర్నాకులం కోర్టు తీర్పు

కొచ్చి: కేరళలో 2017లో సంచలనం సృష్టించిన బహుభాషా నటిపై గ్యాంగ్ రేప్ ఘటనలో కోర్టు ఆరుగురికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో మరో నిందితుడ, మలయాళ నటుడు దిలీప్‌కు కోర్టు ఇటీవలే బయటపడటం తెల్సిందే. ఎర్నాకులం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి హనీ ఎం వర్గీస్ శుక్రవారం సునీల్ ఎన్ఎస్ అలియాస్ పల్సర్ సునీ, మార్టిన్ ఆంటోనీ, మణికందన్, విజేష్, సలీం, ప్రదీప్ అనే వారికి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడిన నేరానికి గాను 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. వీరికి వివిధ నేరాలకు పాల్పడినందుకు గాను అదనంగా జైలు శిక్షలు, వేర్వేరు జరిమానాలు సైతం విధించారు. అశ్లీల వీడియోను ఇతరులకు షేర్ చేసిన నేరానికి గాను సునీకి అదనంగా మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా, సాక్ష్యాన్ని నాశనం చేసిన నేరానికి మార్టిన్‌కు మూడేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా విధించారు. ఈ శిక్షలను ఏకకాలంలో అనుభవించాల్సి ఉంటుందని, బెయిల్‌కు ముందు రిమాండ్‌లో కలిపిన కాలాన్ని కూడా శిక్షలో భాగంగానే పరిగణించాలని స్పష్టం చేశారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారమివ్వాలని, లైంగికదాడి దృశ్యాలున్న పెన్ డ్రైవ్‌ను విచారణాధికారి కస్టడీలో ఉంచాలని జడ్జి తెలిపారు. నిర్భయ కేసులో సుప్రీం కోర్టు తెలిపిన అంశాలనే ఈ కేసుకు కూడా వర్తింప జేసినట్లు చెప్పారు. ఈ తీర్పు తమకు నిరుత్సాహం కలిగించిందని, దోషులందరికీ కోర్టు యావజ్జీవ కారాగారం విధిస్తుందని భావించామని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజా కుమార్ చెప్పారు. దీనిపై త్వరలో కేరళ హైకోర్టుకు వెళతామన్నారు. ఈ నెల 8వ తేదీన ఇదే కేసులో నటుడు దిలీప్ సహా నలుగురిని కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే.

1984 అల్లర్ల బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు

న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు 36 మందికి ఢిల్లీ సీఎం రేఖా గుప్తా శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జీవితంలో మర్చిపోలేని విషాదానికి గురైన వీరంతా నాలుగు దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని సీఎం గుప్తా పేర్కొన్నారు. ఇది కేవలం ఉద్యోగ కల్పనే కాదు, వారి ఆత్మగౌరవాన్ని, హక్కులను, గుర్తింపును పునరుద్ధరించడమేనని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితాన్ని ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బాధిత కుటుంబాలకు పారదర్శక, సత్వర ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రధాని మోదీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 1984లో అంగరక్షకుల కాల్పుల్లో చనిపోవడం తెల్సిందే. అనంతరం ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో సిక్కులపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో కుటుంబసభ్యులను కోల్పోయిన 19 మందికి ప్రభుత్వ ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. తాజాగా నియామక పత్రాలిచ్చిన వారితో కలిపితే ఇప్పటి వరకు 55 మందికి ఉద్యోగా లిచ్చినట్లయింది.

పరస్పర ఆరోపణలు పక్కనపెట్టి కాలుష్యంపై చర్చిద్దాం

- అధికార, విపక్షాలు కలిసి పనిచేస్తాయన్న సందేశం ఇద్దాం
- లోక్‌సభ జీరో అవర్‌లో రాహుల్ గాంధీ ప్రస్తావన

న్యూఢిల్లీ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికార, విపక్షాలు కలిసికట్టుగా కృషి చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విన్నవించారు. పరస్పరం ఆరోపణలు చేసుకోవడం పక్కనపెట్టి.. వాయు కాలుష్యంపై అధికార, విపక్ష సభ్యులు కలిసి సభలో సమగ్ర చర్చ జరపాలని కోరారు. ప్రజల ఇక్కట్లు తీర్చడానికి ఇరుపక్షాలు కలిసి పని చేస్తాయన్న సందేశాన్ని ఇద్దామన్నారు. దేశవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న కాలుష్యంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధాన నగరాల్లో ప్రజలు విష వాయువు దుప్పటి కింద నివసిస్తున్నారని చెప్పారు. లక్షలాది మంది చిన్నారులు ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడుతున్నారని, వారి భవిష్యత్తు దెబ్బతింటోందని అన్నారు. ప్రజలు క్యాన్సర్ పీడితులుగా మారుతున్నారని, వృద్ధులు శ్వాస సంబంధిత వ్యాధులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలుష్య సమస్యపై లోక్‌సభలో చర్చ చేపట్టాలని కోరారు. శుక్రవారం జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారిన కాలుష్యం రాజకీయ సిద్ధాంతపరమైన అంశం కాదని అన్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కార మార్గం కనిపెట్టాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పారు.

చర్చకు సిద్ధం: కిరణ్ రిజిజు

రాహుల్ విజ్ఞప్తిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సానుకూలంగా స్పందించారు. కాలుష్యంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. దీనిపై లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమయం కేటాయిస్తుందన్నారు.

రామమందిర వార్షికోత్సవాలు 31నుంచి

అయోధ్య: ఏళ్ల కిందటి హిందువుల కలను నెరవేరుస్తూ నిర్మితమైన రామమందిరం రెండో వార్షికోత్సవానికి సిద్ధమవుతోంది. ఈనెల 31నుంచి పవిత్రోత్సవాలు జరుగుతాయని రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ శుక్రవారం తెలిపింది. ఈ సంవత్సరం వార్షికోత్సవాన్ని 'ప్రతిష్ట ద్వాదశి'గా జరుపుకోనుంటామని వెల్లడించింది. ఆలయ సముదాయంలోని ఏడు ఉప ఆలయాల శిఖరాలపై ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ వేడుకకు సంబంధించిన ముసాయిదాను నేడు జరగనున్న సమావేశంలో ఖరారు చేస్తారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ డిసెంబర్ 31న జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యే అవకాశం ఉందని ట్రస్ట్ అధికారులు తెలిపారు. ఏడు ఉప ఆలయాల శిఖరాలపై ఇద్దరు నాయకులు సంయుక్తంగా జెండాలను ఎగురవేస్తారన్నారు. నవంబర్ 25న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలయ పర్యటన సందర్భంగా, ఆలయ ప్రధాన శిఖరంపై జెండాను ఎగురవేసినప్పుడు, ఈ ఏడు ఆలయాల శిఖరాలపై జెండాలను ఎగురవేయడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు, ఆలయాల పనులు పెండింగ్‌లో ఉండటం, అనివార్య కారణాల వల్ల ఈ ప్రణాళిక వాయిదా పడిందని ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. అలంకరణతో సహా ఏడు దేవాలయాల పనులు ఇప్పుడు పూర్తయ్యాయని, 'ప్రతిష్ట ద్వాదశి' వేడుక సందర్భంగా జెండాలను ఎగురవేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ వేడుకకు సంబంధించిన ఆచారాలు ఈ నెల 27న ప్రారంభం కానున్నాయి.

థాయ్‌లాండ్ పార్లమెంటు రద్దు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ పార్లమెంటు శుక్రవారం రద్దయింది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు, కాంబోడియాతో ఘర్షణల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని అనుతిన్ చార్న్‌విరకుల్ పార్లమెంటును రద్దు చేశారు. రాజు మహా వజిరాలాంగ్‌కార్న్ అనుమతి మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నట్లు అనుతిన్ ప్రకటించారు. అయితే 'అధికారాన్ని తిరిగి ప్రజలకు ఇవ్వాలనుకుంటున్నా' అని గురువారం రాత్రి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన అనుతిన్ రద్దుపై ముందే సంకేతాలిచ్చారు. పార్లమెంటు రద్దు తరువాత 45 రోజుల నుంచి రెండు నెలలలోపు ఎన్నికలు జరగాలి. ఈలోపు పరిమిత అధికారాలతో అనుతిన్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారు. థాయ్‌లాండ్, కంబోడియాతో సరిహద్దు ఘర్షణలు ఏడో రోజూ కొనసాగుతోంది. రెండు వైపులా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఘర్షణల్లో ఈ వారమే 20 మందికి పైగా మరణించారు. ఈ ఉద్రిక్తతల సమయంలో పార్లమెంటు రద్దు నిర్ణయం కీలకంగా మారింది. సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా రాజీనామా చేసిన షినవ్రతా స్థానంలో అనుతిన్ బాధ్యతలు తీసుకున్నారు. మూడు నెలలు మాత్రమే ప్రధానమంత్రిగా ఉన్నారు.

మంత్రి గైర్హాజరు.. రాజ్యసభ స్వల్ప వాయిదా

న్యూఢిల్లీ: రాజ్యసభలో శుక్రవారం ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. కనీసం ఒక్క కేబినెట్ మంత్రి కూడా లేకపోవడంతో సభను 10 నిమిషాల వాయిదా వేశారు. కార్యకలాపాలు స్వల్పకాలంపాటు నిలిచిపోయాయి. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రవాద దాడిని తిప్పికొట్టి అమరులైన జవాన్లకు సభలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో కేబినెట్ మంత్రులెవరూ లేరని విపక్ష ఎంపీలు గుర్తించారు. ఈ విషయాన్ని రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ దృష్టికి తీసుకెళ్లారు. కేబినెట్ మంత్రి ఎవరైనా సభకు రావాలని సూచించారు. కేబినెట్ మంత్రి సభకు వచ్చేలా చూడాలని సభలో ఉన్న జూనియర్ మంత్రిని ఆదేశించారు. అయితే, దీనిపై విపక్షాలు సంతృప్తి చెందలేదు. కేబినెట్ మంత్రి వచ్చేదాకా సభను వాయిదా వేయాలని పట్టుబట్టారు. మంత్రి రాకపోవడం సభను అవమానించినట్లే అవుతుందని కాంగ్రెస్ సభ్యుడు జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. దీంతో చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఐదు నిమిషాలపాటు వేచి చూశారు. అప్పటికీ మంత్రి రాకపోవడంతో సభను పది నిమిషాలపాటు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్ ప్రత్యక్షమయ్యారు. రాజ్యసభకు కేబినెట్ మంత్రి ఒక్కరు కూడా రాకపోవడం పట్ల కిరణ్ రిజిజు క్షమాపణ కోరారు. లోక్‌సభలో శివరాజ్ పాటిల్ నివాళి కార్యక్రమం ఉండడంతో రాజ్యసభకు హాజరు కాలేకపోయానంటూ విచారం వ్యక్తంచేశారు.

సోషల్ మీడియా నిషేధంపై కోర్టుకు

మెల్‌బోర్న్: పిల్లల సోషల్ మీడియా వాడకాన్ని నిషేధిస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆన్‌లైన్ వేదిక రెడ్డిట్ సవాలు చేసింది. ఈ అమెరికన్ ఆన్‌లైన్ ఫోరమ్ శుక్రవారం హైకోర్టులో దావా వేసింది. యువతను రక్షించాలనుకుంటే ప్రభుత్వానికి మరింత మెరుగైన మార్గాలున్నాయని, కానీ సోషల్ మీడియా కనీస వయసు చట్టం వల్ల రాజకీయ చర్చల నుంచి వేరుచేయడం అవుతుందని, ధ్రువీకరణ ప్రక్రియ కూడా అంత సురక్షితం కాదని రెడ్డిట్ తెలిపింది.

16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడటాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిషేధం విధించింది. పిల్లల ఆన్‌లైన్ భద్రతరీత్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న ఆస్ట్రేలియా పిల్లల ఖాతాలను తొలగించకపోతే రెడ్డిట్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, కిక్, స్నాప్‌చాట్, థ్రెడ్స్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్, ట్విచ్‌లకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఈ కొత్త నిబంధనలు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే.. దీనిపై ఇప్పటికే ఇద్దరు బాలికల తరపున సిడ్నీకి చెందిన హక్కుల వేదిక డిజిటల్ ఫ్రీడమ్ ప్రాజెక్టు గత నెలలో కేసు వేసింది. కాలిఫోర్నియాకు చెందిన రెడ్డిట్ దానిని అనుసరించింది. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని రెండు వాజ్యాలు పేర్కొన్నాయి.

జుబీన్ గార్గ్ మరణంపై చార్జిషీట్

ఆర్గనైజర్, సెక్రటరీ సహా నలుగురిపై అభియోగాలు

గౌహతి: ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ అనుమానాస్పద మృతిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఆర్గనైజర్, వ్యక్తిగత సెక్రటరీ సహా నలుగురు నిందితులపై హత్య అభియోగాలు మోపింది. నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్‌కు కల్చరల్ బ్రాండ్ అంబాసిడర్‌గా హాజరయ్యేందుకు సింగపూర్ వెళ్లిన జుబీన్ గార్గ్.. సెప్టెంబర్ 19న అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన మృతిపై కుటుంబసభ్యులు, అభిమానులు అనుమానం వ్యక్తం చేశారు. అస్సాంలో 60కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అభిమానుల ఆందోళనల నేపథ్యంలో ఈకేసును దర్యాప్తు చేయడానికి అస్సాం ప్రభుత్వం స్పెషల్ డీజీపీ ఎంపీ గుప్తా నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. దర్యాప్తు, అనేక అరెస్టులు, ఫోరెన్సిక్ పరీక్షల అనంతరం శుక్రవారం ఉదయం సిట్.. 3500పేజీల చార్జిషీటును కోర్టుకు సమర్పించింది. ఈకేసులో 300 మందికి పైగా విచారించినట్లు, ఏడుగురిని అరెస్టు చేసినట్లు సిట్ పేర్కొంది.

ఈ చార్జిషీట్‌ను నాలుగు పెద్ద ట్రంక్ పెట్టెల్లో కోర్టుకు తీసుకొచ్చారు. ఈ సమయంలో జుబీన్ అభిమానులు కోర్టు బయట పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'జస్టిస్ ఫర్ జుబీన్' అంటూ నినాదాలు చేశారు.

రిటైరయ్యే రోజున

పోలీసులకు గౌరవ ప్రమోషన్లు

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం ● 88వేల మంది పోలీసు సిబ్బందికి లబ్ధి

న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసు విభాగంలోని 88 వేల మందికి పైగా అధికారులకు ప్రయోజనం చేకూర్చే కీలక నిర్ణయాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తీసుకున్నారు. దీని ప్రకారం..రిటైరయ్యే రోజున అధికారులు తమకంటే ఒక స్థాయి ఎక్కువ పోస్టులో రిటైరవుతారు. అయితే, దీనివల్ల అదనంగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూరే అవకాశాలు లేవని రాజ్ నివాస్ శుక్రవారం స్పష్టం చేసింది. ఢిల్లీ పోలీసు విభాగంలోని నాన్ గెజిటెడ్ స్థాయి అధికారులు, ప్రస్తుత ర్యాంకులో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, గత ఐదేళ్లలో విధి నిర్వహణ విషయంలో ఎలాంటి శిక్షలకు గురికాని వారు గౌరవ ప్రమోషన్లకు అర్హులని రాజ్‌నివాస్ అధికారి ఒకరు వివరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్లయితే, వారు రిటైరయ్యే రోజున ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉంటారు. అదే అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అయితే సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రిటైరవుతారు. హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్ఐ ర్యాంకు, కానిస్టేబుల్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వస్తుందన్నారు. తాజా నిర్ణయంతో 88వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి లబ్ధి కలుగుతుందన్నారు. కేంద్ర సాయుధ బలగాలు, అస్సాం రైఫిల్స్ జవాన్లకు కూడా పదవీ విరమణ రోజున గౌరవ ప్రమోషన్లు ఇచ్చే విధానాన్ని హోం శాఖ ఈ ఏడాది మేలో ప్రకటించడం తెల్సిందే.

బాహుబలి విగ్రహం కర్ణాటకలోని ఏ ప్రాంతంలో ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మతోద్యమాలు

1. భారతదేశంలో నూతన మతోద్యమాల కాలం ఏది?
ఎ) క్రీ.పూ. ఆరో శతాబ్దం
బి) క్రీ.పూ. అయిదో శతాబ్దం
సి) క్రీ.పూ. నాలుగో శతాబ్దం
డి) క్రీ.పూ. రెండో శతాబ్దం
2. అజీవక మత స్థాపకుడు ఎవరు?
ఎ) గోసాలపుత్త బి) అలరకలామ
సి) ఉద్దక రామపుత్త డి) పార్శ్వనాథ
3. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జైనమతంలో మొత్తం తీర్థంకరుల సంఖ్య 24
బి) మొదటి తీర్థంకరుడు రుషభనాథుడు
సి) చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు
డి) పైవన్నీ
4. చార్వాక మత స్థాపకుడు ఎవరు?
ఎ) అలరకలామ బి) నేమినాథ
సి) అజితకేశకంబళిన్ డి) ఆదినాథ
5. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. సల్లేఖన	i. జైనులు ఆచరించే వ్రతం
2. శాద్వాదం	ii. జైనతత్వం
3. విద్యాదేవి	iii. జైనులు ఆరాధించే స్త్రీ దేవత
4. అంగాలు	iv. జైనుల పవిత్ర గ్రంథాలు
5. దిగంబర, శ్వేతాంబర	v. జైనమత శాఖలు

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-iv, 2-v, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-i, 3-v, 4-iii, 5-iv
డి) 1-v, 2-iv, 3-i, 4-iii, 5-ii
6. బౌద్ధమతంలో తాంత్రిక శాఖ ఏది?
ఎ) హీనయానం బి) వజ్రయానం
సి) మహాయానం డి) ఏదీకాదు
7. బుద్ధుడి తొలి గురువు ఎవరు?
ఎ) అలరకలామ బి) ఉద్దక రామపుత్త
సి) ఎ, బి డి) ఎవరూకాదు
8. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) బుద్ధుడు ప్రతిపాదించిన సిద్ధాంతం – ప్రతీత్య సముత్పాద
బి) బౌద్ధమతం ఆచరించేవారు – ఉపాసికులు, బిక్షువులు
సి) బౌద్ధమత ముఖ్య శాఖలు – హీనయానం, మహాయానం
డి) పైవన్నీ
9. చారిత్రకంగా జైన మతాన్ని స్థాపించినవారు ఎవరు?
ఎ) పార్శ్వనాథ బి) సంభవనాథ
సి) రుషభనాథ డి) వర్ధమాన మహావీర
10. 'తీర్థంకరుడు' అంటే అర్థం ఏమిటి?
ఎ) మోక్షం ప్రసాదించేవాడు
బి) సంసార నావ దాటించేవాడు
సి) మార్గం చూపేవాడు డి) బి, సి
11. క్రీ.పూ. ఆరో శతాబ్దంలో నూతన మతాలు ఏర్పడటానికి కారణం?
ఎ) హిందూ మతం పవిత్రత కోల్పోవడం
బి) బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణి
సి) కర్మకాండలకు ప్రాముఖ్యం ఇవ్వడం
డి) పైవన్నీ
12. మొదటి తీర్థంకరుడైన రుషభనాథుడిని నారాయణుడి అవతారంగా పేర్కొన్న పురాణం ఏది?
ఎ) విష్ణు పురాణం
బి) భాగవత పురాణం
సి) బ్రహ్మవైవర్త పురాణం డి) ఎ, బి
13. జైనులను ప్రారంభంలో 'నిగ్రంధులు' అని పిలిచేవారు. నిగ్రంధులు అంటే అర్థం?
ఎ) మార్గం చూపేవారు
బి) మోక్షాన్ని ప్రసాదించేవారు
సి) బంధాల నుంచి బయటపడిన వారు
డి) ఏదీకాదు
14. తీర్థంకరులు, వారి చిహ్నాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. రుషభనాథ	i. సింహం
2. అజితనాథ	ii. పాము
3. అరిష్టనేమి	iii. శంఖం
4. పార్శ్వనాథ	iv. ఏనుగు
5. వర్ధమాన మహావీర	v. వృషభం

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-iv, 2-v, 3-i, 4-iii, 5-ii
డి) 1-iii, 2-ii, 3-v, 4-i, 5-iv
15. పార్శ్వనాథుడికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) కాశీ రాజ్యానికి చెందినవాడు
బి) వర్ధమానుడి కంటే 250 ఏళ్ల ముందు జీవించాడు
సి) పార్శ్వనాథుడి తల్లిదండ్రులు – అశ్వసేనుడు, వామలాదేవి
డి) పైవన్నీ
16. జైనమత పంచ సూత్రాల్లో నాలిగింటిని పార్శ్వనాథుడు రూపొందించగా, వాటికి బ్రహ్మచర్య సూత్రాన్ని చేర్చింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) నేమినాథ
సి) సంభవనాథ డి) అరిష్టనేమి
17. మహావీరుడు ఎవరి అనుమతితో సన్యాసం స్వీకరించాడు?
ఎ) తల్లి – త్రిసల
బి) భార్య – యశోద
సి) అన్నయ్య – నందివర్ధన
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
18. వర్ధమానుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) బిరుదులు– జినుడు, మహావీర, కేవలి
బి) జ్ఞానోదయం పొందిన స్థలం– జృంభిక గ్రామం
సి) నిర్యాణం చెందిన ప్రాంతం– పావాపురి
డి) పైవన్నీ
19. జైన పంచ సూత్రాలను సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. అహింస
2. అసత్యం పలకరాదు
3. అనస్తేయ
4. అపరిగ్రహ
5. బ్రహ్మచర్యం
గ్రూప్ – బి
i. హింసకు పాల్పడవద్దు
ii. సత్యం పలకాలి
iii. దొంగతనం చేయకూడదు
iv. ఆస్తులు కలిగి ఉండకూడదు
v. వివాహం చేసుకోవద్దు
ఎ) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
బి) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
సి) 1-iv, 2-v, 3-ii, 4-iii, 5-i
డి) 1-v, 2-ii, 3-i, 4-iii, 5-iv
20. గణాధారులు అంటే..?
ఎ) వర్ధమానుడి ప్రత్యక్ష శిష్యులు
బి) గౌతమ బుద్ధుడి శిష్యులు
సి) అజీవక మతాన్ని అవలంబించేవారు
డి) చార్వాక సిద్ధాంతాన్ని నమ్మినవారు
21. జైన సంఘం మొదటి థేర (అధ్యక్షుడు) ఎవరు?
ఎ) భద్రబాహు బి) స్థూల భద్ర
సి) ఆర్య సుదర్శన్ డి) జామాలి
22. ఆరో థేర అయిన భద్రబాహు మగధలో క్షామం వల్ల దక్షిణ భారతదేశానికి వలస వచ్చినట్లు తెలియజేస్తున్న గ్రంథం ఏది?
ఎ) గాథాకోశ బి) పరిశిష్టపర్వన్
సి) యశఃస్థిలక డి) వైరాగ్య తరంగం
23. జైనుల ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) బసది బి) విహారం
సి) చైత్యం డి) పైవేవీకాదు
24. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) మొదటి జైన సంగీతి స్థూలభద్రుడి అధ్యక్షతన పాటలీపుత్రంలో జరిగింది
బి) మొదటి జైన సంగీతిలో మహావీరుడి బోధనలను 12 అంగాలుగా అర్ధమాగధి భాషలో రచించారు
సి) రెండో జైన సంగీతి వల్లభి (గుజరాత్)లో దేవర్షి క్షమశ్రమణుడి అధ్యక్షతన జరిగింది
డి) పైవన్నీ
25. దక్షిణ భారతదేశానికి వచ్చి సల్లేఖన వ్రతం ఆచరించిన ప్రముఖ మగధ పాలకుడు?
ఎ) అశోకుడు బి) చంద్రగుప్తమౌర్య
సి) ఉదయన డి) బిందుసార
26. జైన అశోకుడిగా పేరు పొందిన మౌర్య పాలకుడు ఎవరు?
ఎ) కునాల బి) బృహద్రధ
సి) సంప్రతి డి) తివర
27. చాముండరాయ నిర్మించిన గోమతేశ్వర/బాహుబలి విగ్రహం కర్ణాటకలోని ఏప్రాంతంలో ఉంది?
ఎ) ఐహోల్ బి) శ్రావణ బెళగొళ
సి) పట్టడకల్ డి) హంపి
28. జైన మతాభిమాని అయిన ప్రముఖ కళింగ పాలకుడు ఎవరు?
ఎ) ఖారవేలుడు బి) ప్రతాపరుద్రుడు
సి) నరసింహదేవ డి) అనంతచోడగాంగ
29. జైనమతాన్ని అవలంబించిన రాష్ట్రకూట రాజు?
ఎ) అమోఘవర్షుడు
బి) నాలుగో ఇంద్రుడు
సి) ఎ, బి డి) ఎవరూ కాదు
30. జతపరచండి.
గ్రూప్-ఎ
1. మాయావతి
2. ప్రజాపతి గౌతమి
3. యశోధర
4. కిసగౌతమి
5. సుజాత
గ్రూప్-బి
i. బుద్ధుడి తపస్సు సమయంలో అతడిని వృక్షదేవతగా ఆరాధించిన స్త్రీ
ii. బుద్ధుడి ద్వారా జనన మరణాల జ్ఞానం పొందిన మహిళ
iii. బుద్ధుడి భార్య
iv. బుద్ధుడిని పెంచిన తల్లి
v. బుద్ధుడికి జన్మనిచ్చిన తల్లి
ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iii, 3-iv, 4-i, 5-v
డి) 1-iii, 2-v, 3-ii, 4-i, 5-iv
31. బుద్ధుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జ్ఞానోదయం కలిగిన గ్రామం ఉరువేలా
బి) జ్ఞానోదయం పొందిన రోజు వైశాఖ శుద్ధ పూర్ణిమ
సి) మహాపరినిర్యాణం చెందిన ప్రాంతం కుశినగరం
డి) పైవన్నీ
32. బుద్ధుడి కర్మకాండలను ఏ రాజ్యంలో నిర్వహించారు?
ఎ) వైశాలి బి) మల్ల
సి) గాంధార డి) విజ్జి
33. బుద్ధుడి జీవితంలో 5 ప్రధాన ఘట్టాలను పంచకల్యాణాలు అంటారు. ఆ సంఘటన వాటికి సంబంధించిన చిహ్నాలను జతపరచండి.
గ్రూప్-ఎ
1. జననం
2. మహాభినిష్క్రమణం
3. జ్ఞానోదయం
4. ధర్మచక్ర పరివర్తనం
5. మహాపరినిర్యాణం
గ్రూప్-బి
i. తామర పువ్వు
ii. గుర్రం
iii. రావిచెట్టు
iv. చక్రం
v. స్తూపం
ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iv, 3-v, 4-i, 5-iii
డి) 1-iii, 2-i, 3-iv, 4-v, 5-ii
34. ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాలను బోధించింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) బుద్ధుడు సి) పార్శ్వనాథుడు
డి) అజితనాథుడు
35. సంస్కృతం స్వీకరించక పూర్వం బౌద్ధమతస్థులు ఉపయోగించిన భాష ఏది?
ఎ) ప్రాకృతం బి) అర్ధమాగధి
సి) పాళీ డి) దేశీ
36. కింది వాటిలో సరైన జత?
ఎ) వినయ పీఠిక – ఉపాలి
బి) సుత్త పీఠిక – ఆనందుడు
సి) అభిదమ్మ పీఠిక– వసుబంధు
డి) పైవన్నీ
37. బుద్ధుడి పూర్వ జన్మలు తెలియజేసే జాతక కథలు ఏ పీఠికలో ఉన్నాయి?
ఎ) సుత్త పీఠిక బి) వినయ పీఠిక
సి) అభిదమ్మ పీఠిక డి) పైవేవీ కావు
38. బౌద్ధమతాన్ని స్వీకరించిన మొదటి మహిళ?
ఎ) యశోధర బి) కిసగౌతమి
సి) ప్రజాపతి గౌతమి డి) సుజాత
39. బౌద్ధమత ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) విహారం బి) చైత్యం
సి) స్తూపం డి) బసది
40. బౌద్ధ సంగీతులు, అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. మొదటి బౌద్ధ సంగీతి
2. రెండో బౌద్ధ సంగీతి
3. మూడో బౌద్ధ సంగీతి
4. నాలుగో బౌద్ధ సంగీతి
గ్రూప్ – బి
i. మహాకశ్యప
ii. సభాకామి
iii. మొగలిపుత్త తిస్య
iv. వసుమిత్రుడు
ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
బి) 1-iv, 2-iii, 3-ii, 4-i
సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
డి) 1-iii, 2-iv, 3-i, 4-ii
41. శ్రీలంకకు చెందిన ప్రముఖ బౌద్ధ గ్రంథం?
ఎ) దీపవంశ బి) మహావంశ
సి) చుళువంశ డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) డి; 9) ఎ; 10) డి; 11) డి; 12) డి; 13) సి; 14) బి; 15) డి; 16) ఎ; 17) సి; 18) డి; 19) బి; 20) ఎ; 21) సి; 22) బి; 23) ఎ; 24) డి; 25) బి; 26) సి; 27) బి; 28) ఎ; 29) సి; 30) బి; 31) డి; 32) బి; 33) ఎ; 34) బి; 35) సి; 36) డి; 37) ఎ; 38) సి; 39) బి; 40) ఎ; 41) డి.

జనాభా వృద్ధిరేటు అధికంగా ఉన్న రాష్ట్రం?

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కలను సేకరించడం తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అంటారు. దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కల సేకరణ మొదలైంది. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

జనాభా

భారతదేశ జనాభాలో విభిన్న శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుంచి వివిధ దేశాలకు చెందినవారు భారతదేశంలోకి ప్రవేశించి సాంఘికంగా, సాంస్కృతికంగా ఇక్కడి సమాజంలో కలిసిపోయారు. వీరు స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఫలితంగా విభిన్న శారీరక లక్షణాలున్న సంతతి ఉద్భవించిందని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం.

'రిస్లే' అనే ఆంత్రోపాలజిస్టు శారీరక లక్షణాల ఆధారంగా ప్రపంచ జనాభాను ఆరు జాతులుగా విభజించారు. ఏ దేశ జనాభాలోనైనా ఒక జాతి లేదా రెండు జాతుల లక్షణాలు ఉంటాయి. కానీ భారతదేశంలో మాత్రమే ప్రపంచంలోని ఆరు జాతుల లక్షణాలు కనిపిస్తాయి. అవి...

ఎ నీగ్రిటోలు

దేశంలోకి మొదటిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే షోంపెన్స్, జార్వాస్, ఓంజెస్ లాంటి తెగలలో, కేరళలోని పులియాన్స్ తెగలలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

బి ప్రొటో ఆస్ట్రలాయిడ్స్

మధ్య భారతదేశంలో నివసించే గోండులు, ముండాలు, భిల్లులు, ఒరేన్‌లు, సంతాలులు, చెంచులు, కురుంబాలు లాంటి గిరిజన తెగలలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

సి మెడిటరేనియన్

వీరినే ద్రవిడులు అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో నివసించే ప్రజలను ఈ జాతి సంతతిగా పేర్కొంటారు. వీరినే సింధూ నాగరికత ప్రజల సంతతిగా పేర్కొనవచ్చు. ద్రవిడ ప్రజల జీవన విధానంలో సింధూ నాగరికత ప్రజల సాంస్కృతిక లక్షణాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

డి మంగోలాయిడ్స్

ఈశాన్య భారతదేశంలోని అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజల్లో, అండమాన్‌లోని 'సెంటినీలీస్' అనే తెగలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జాతి ప్రజల శరీరంలో 'ఎపికాంతిక్ ఐలిడ్' అనే ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది.

ఇ బ్రాకీ సెఫాలస్

వీరినే కాకసాయిడ్ జాతి ప్రజలుగా పేర్కొంటారు. ఈ జాతి వారిలో తల వెడల్పుగా ఉంటుంది. గుజరాత్, మహారాష్ట్రలోని మార్వాడీలు, పశ్చిమ బెంగాల్‌లోని నయనార్ క్షత్రియులు, నంబూద్రీ బ్రాహ్మణుల్లో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

ఎఫ్ నార్డిక్స్

వీరినే ఆర్యన్లు అని పిలుస్తారు. భారతదేశంలోకి చివరిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. ఈ జాతి లక్షణాలున్న సంతతి ప్రస్తుతం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రాజపుత్రులు, జాట్‌లలో కనిపిస్తుంది.

జనాభా లెక్కల సేకరణ (2011)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో తమలో తాము అంతః ప్రజననం జరుపుకునే, నిర్దిష్ట ఆవాసంలో నివసించే ప్రజా సమూహమే జనాభా. ఇంటింటి సర్వే ద్వారా శాస్త్రీయ పద్ధతిలో జనాభా, దాని అనుబంధ అంశాలను సేకరించే పద్ధతినే జనాభా లెక్కల సేకరణ అంటారు.

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కల సేకరణ తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అని అంటారు.

- ప్రపంచంలో మొదటిసారిగా 1841లో ఆధునిక జనాభా లెక్కల సేకరణ ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. 1872లో భారతదేశంలో జన గణన మొదలైంది. 1881 నుంచి పదేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా మన దేశంలో జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల సేకరణ 15వది, స్వాతంత్ర్యం వచ్చాక ఏడోది. 2011 సెన్సస్ కమిషనర్ డాక్టర్ చంద్రమౌళి. ఈ జనాభా లెక్కల సేకరణ 2010 ఏప్రిల్ 1న ప్రారంభమై 2011 మార్చిలో ముగిసింది. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.5 శాతం. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో చైనా తొలిస్థానంలో ఉండగా, మన దేశం రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరసగా అమెరికా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.
- 2011 మార్చి 1 నాటికి దేశ జనాభా 1.21 బిలియన్లు దాటింది. 2001 నాటికి దేశ జనాభా 1.02 బిలియన్లు ఉండేది. అంటే పదేళ్లలో దేశ జనాభా 18.196 కోట్లు పెరిగింది.
- 1991–2001 దశాబ్దంలో జనాభా వృద్ధిరేటు 21.54 శాతం. కాగా, 2001–11 మధ్యకాలంలో అది 17.7 శాతానికి తగ్గింది.
- 1991–2001 దశాబ్దంలో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.9 శాతం కాగా 2001–11లో 1.64 శాతానికి తగ్గింది.
- జనసాంద్రత 2001లో చ.కి.మీ.కు 325 ఉంటే, అది 2011లో 382కు పెరిగింది.
- అక్షరాస్యత 2001 మార్చి 1 నాటికి 64.38 శాతం కాగా, 2011 మార్చి నాటికి 74.04 శాతానికి పెరిగింది.
- లింగనిష్పత్తి 2001 మార్చి 1 నాటికి 933 ఉంటే, 2011 మార్చి 1 నాటికి 943కి పెరిగింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగనిష్పత్తి అంటారు. దేశంలోకెల్లా అత్యుత్తమంగా కేరళలో లింగనిష్పత్తి 1084:1000గా ఉంది.
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).
- దేశంలో తక్కువ జనాభా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా.
- అత్యధిక జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్.
- అత్యధిక జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు.. ఢిల్లీ, చండీగఢ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు... అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలి.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, జమ్మూ–కశ్మీర్.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు తక్కువగా ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... నాగాలాండ్, కేరళ, గోవా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... కేరళ, మిజోరాం.
- దేశంలో తక్కువ అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... బిహార్, అరుణాచల్‌ప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు జిల్లాలు మిజోరాంలో ఉన్నాయి. అవి.. సెర్‌చ్చిప్, ఐజ్వాల్.
- దేశంలో అక్షరాస్యత తక్కువ ఉన్న మొదటి రెండు జిల్లాలు... మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 10.43 కోట్ల(8.6 శాతం) మంది షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్, తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
- ఎస్టీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం మిజోరాం, తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా.
- 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) జనాభా శాతం 16.6. సంఖ్యాపరంగా 20.14 కోట్లు.
- ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
- ఎస్సీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్, తక్కువగా ఉన్నది మిజోరాం.
- ఎస్సీ జనాభా లేని రాష్ట్రం నాగాలాండ్.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి? 2011, A.S.O)
ఎ) మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
బి) కర్ణాటక, పశ్చిమబెంగాల్
సి) ఉత్తరప్రదేశ్, జార్ఖండ్
డి) జార్ఖండ్, పశ్చిమ బెంగాల్
2. మేఘాలయ ప్రత్యేకంగా గిరిజన రాష్ట్రం. ఆ రాష్ట్రంలో నివసించే గిరిజన తెగలేవి? s(2001, J.L.)
ఎ) ఖాసీలు, ఉషరీలు, లఖీర్లు
బి) ఖాసీలు, జయంతియాలు, గారోలు
సి) జయంతియాలు, గారోలు, కుర్కులు
డి) గారోలు, ఫాంగులు, హామ్రో
3. జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది? (2011, D.L.)
ఎ) నాగాలాండ్ బి) అసోం
సి) సిక్కిం డి) కేరళ
4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత ఉన్న జిల్లా ఏది? (2011, D.L.)
ఎ) సెర్‌చ్చిప్ బి) గుంటూరు
సి) మిడ్నాపూర్ డి) గాజామ్
5. 'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి? (2002, AEEs)
ఎ) రాజస్థాన్ బి) మధ్యప్రదేశ్
సి) అసోం డి) తమిళనాడు
6. భారతదేశంలోని గిరిజనుల్లో సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నవారు? (2011, Gr-II)
ఎ) సంతాలులు బి) భిల్లులు
సి) ముండాలు డి) నాగాలు

సమాధానాలు

1) డి; 2) బి; 3) సి; 4) ఎ; 5) డి; 6) బి.

మాదిరి ప్రశ్నలు

1. 'మీనా' జాతికి చెందిన తెగల వారు ఏ రాష్ట్రంలో అధికంగా నివసిస్తున్నారు?
ఎ) గుజరాత్ బి) అసోం
సి) రాజస్థాన్ డి) మధ్యప్రదేశ్
2. 2011లో జరిగిన జన గణన స్వాతంత్ర్యానంతరం ఎన్నోది?
ఎ) 15 బి) 7 సి) 8 డి) 9
3. కింది వాటిలో అధిక జనాభా ఉన్న రాష్ట్రాల అవరోహణ క్రమాన్ని గుర్తించండి?
ఎ) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్
బి) మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
సి) రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
డి) ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
4. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభావృద్ధిరేటు అధికంగా ఉన్న రాష్ట్రం?
ఎ) అరుణాచల్ ప్రదేశ్
బి) మేఘాలయ
సి) బిహార్
డి) జమ్మూ–కశ్మీర్
5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత ఎంత?
ఎ) 325 బి) 267
సి) 382 డి) 176
6. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
ఎ) దిబాంగ్ వ్యాలీ బి) యానాం
సి) అంజాన్ డి) నార్త్ ఈస్ట్ ఢిల్లీ
7. కిందివాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించని తెగ ఏది?
ఎ) షోంపైన్స్ బి) జార్వాస్
సి) సెంటినీలీస్ డి) మోప్లాలు
8. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఏ సంవత్సరాన్ని 'గొప్ప విభాజక సంవత్సరం'గా పేర్కొంటారు?
ఎ) 1911 బి) 1901
సి) 1921 డి) 1931
9. మానవ జనాభా 'గుణమధ్యమం' (జియోమెట్రిక్) రేటులో పెరుగుతుండగా, వనరులు మాత్రం 'అంకమధ్యమం' (అర్థమెటిక్) రేటులో పెరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త ఎవరు?
ఎ) మాల్థస్ బి) కీన్స్
సి) రికార్డో డి) రొనాల్డ్ రాస్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) బి; 5) సి; 6) డి; 7) డి; 8) సి; 9) ఎ.

పటిష్టమైన ప్రణాళికతోనే ఆశించిన పురోగతి

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ప్రణాళికా వ్యూహాలు

వ్యూహం అనే విస్తృత భావనలో అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన విధానపర చర్యలు ఇమిడి ఉంటాయి. భారతదేశంలో ప్రణాళికలకు సంబంధించిన వ్యూహాల్లో పేదరికం, అల్పాభివృద్ధి లాంటి సమస్యల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిమాణం, పెట్టుబడుల పంపిణీ ప్రక్రియ, వనరుల సమీకరణ, ప్రభుత్వ రంగ పాత్ర తదితర అంశాలకు చెందిన విధానాలను ప్రణాళికల్లో అవలంబించారు.

భారత్‌లో ఆర్థిక ప్రణాళికల వ్యూహాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) మహలనోబిస్ వృద్ధి నమూనా
2) భారీ పరిశ్రమల వ్యూహం
3) ఉపాధి లక్ష్యం
4) సామాజిక లక్ష్యాలు; వృద్ధి, అసంతులిత వృద్ధి మధ్య వ్యూహం.

మొదటి పంచవర్ష ప్రణాళిక

విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, సాంఘిక పరిస్థితులను మెరుగుపరచడం లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని ఖరారు చేశారు.

రెండో పంచవర్ష ప్రణాళిక

రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రజలకు సాంఘిక సేవల కల్పనపై దృష్టి సారించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ రష్యా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండో ప్రణాళికకు అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించారు.

రెండో ప్రణాళికలో అవలంబించిన వ్యూహంలోని ముఖ్యాంశాలు:

- మహలనోబిస్ ప్రకారం.. భారీ పరిశ్రమల్లో పెట్టుబడి పెంపు, సేవలపై వ్యయం పెంపు, కొనుగోలు శక్తి పెంపు ద్వారా నూతన డిమాండ్‌ను సృష్టించడం; చిన్న తరహా, గృహ పరిశ్రమల్లో పెట్టుబడి, ఉత్పత్తిని అధికం చేయడం ద్వారా నూతన డిమాండ్‌కు అనుగుణంగా వినియోగ వస్తువుల సరఫరా పెంచడం లాంటివి అభివృద్ధి వ్యూహంలో ప్రధాన అంశాలు.
- మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యమిచ్చారు.
- నెహ్రూ – మహలనోబిస్ అభివృద్ధి నమూనా రెండో ప్రణాళిక రూపకల్పన సమయంలో వెలువడింది. ఇందులో అభివృద్ధికి సంబంధించి దీర్ఘ కాలిక లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అధిక పెట్టుబడి రేటు సాధన కోసం పొదుపు రేటును పెంచడం, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం, నూతన పరిశ్రమల రక్షణకు 'రక్షిత విధానం' అవలంబించడం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ, లక్షిత వర్గాల ప్రజలకు అవకాశాలను విస్తృతం చేయడం లాంటి అంశాలకు నెహ్రూ – మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో ప్రాధాన్యం ఇచ్చారు.
- ఆధునిక యంత్రాలు, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి వినియోగ వస్తువులు రూపొందించే కుటీర, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి నెహ్రూ – మహలనోబిస్ నమూనాలో తగిన ప్రోత్సాహం ఇచ్చారు.

మూడో పంచవర్ష ప్రణాళిక

మూడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య ఇంటర్‌డిపెండెన్స్ (పరస్పర ఆధారం) వృద్ధి చేయడంపై దృష్టి సారించారు. జాతీయ, ప్రాంతీయ అభివృద్ధి, స్వదేశీ, బహిర్గత ఆధారాల నుంచి వనరుల సమీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో సాంకేతిక ప్రగతికి చర్యలు తీసుకోవడం, అధిక ఉత్పాదకత సాధించడం, జనాభా నియంత్రణ, ఉపాధి, సామాజిక మార్పు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు.

వార్షిక ప్రణాళికలు

వార్షిక ప్రణాళికల కాలం(1966–69)లో.. మూడో పంచవర్ష ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అనిశ్చిత పరిస్థితులను నివారించడంపై దృష్టి సారించారు. దీంతోపాటు ఏ విధమైన అదనపు ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా సహేతుక వృద్ధి రేటు సాధనకు ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరించారు. విద్య, కుటుంబ నియంత్రణ, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి సారించి వివిధ సాంఘిక సేవా పథకాలను ప్రవేశపెట్టారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969–74) వార్షిక ప్రణాళికల్లో అవలంబించిన వ్యూహాన్ని కొనసాగించారు. చిన్న రైతులకు ప్రోత్సాహం కల్పించేవిధంగా వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలను అమలు చేశారు. ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో.. చిన్న, పెద్ద తరహా పారిశ్రామిక యూనిట్ల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎగుమతులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు క్రమంగా విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడానికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సమతౌల్య ఆర్థికవృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుస్థిరత, స్వయం సమృద్ధి సాధనకు ఈ ప్రణాళికలో పెద్దపీట వేశారు.

అయిదో పంచవర్ష ప్రణాళిక

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వయం సాధనను దృష్టిలో ఉంచుకొని 5వ పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని రూపొందించారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, బహుళ పంటల కార్యక్రమం ద్వారా ఉత్పత్తి పెంపునకు ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో భాగంగా వినియోగ వస్తువులు, వ్యవసాయాధారిత పరిశ్రమల విస్తరణ, ప్రోత్సాహం లాంటివాటిపై దృష్టి సారించారు.

ఆరో పంచవర్ష ప్రణాళిక

